

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 312

సోమవారం 2-2-2026

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సిద్ధార్థ విద్యాసంస్థలు
(అటానమస్), పుత్తూరు, తిరుపతి జిల్లా.
Contact for Admissions :
9396904599 / 9704668399
www.sietk.org

SIDDHARTH INSTITUTIONS
(AUTONOMOUS)
PUTTUR, TIRUPATI (Dist.) ANDHRA PRADESH – 517583

NAAC GRADE A+ | UGC AUTONOMOUS | AICTE IDEALab

దేశ, రాష్ట్ర అభివృద్ధితోపాటు.. గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక విద్యాభివృద్ధి ప్రధాన లక్ష్యంగా గత 25 ఏళ్లుగా సిద్ధార్థ విద్యా సంస్థలు

28 JANUARY TO 08 FEBRUARY 2026

25 Silver Jubilee Celebrations 2k26

COUNSELLING CODE
SDTN

25 YEARS OF SHAPING ENGINEERS • BUILDING CAREERS • SERVING SOCIETY

మన సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల 2001లో స్థాపించి నేటి వరకు మొత్తం 21 బ్యాచులు పట్టాలు పొందారు. ప్రపంచ వ్యాప్తంగా 24 వేల మంది విద్యార్థులు దేశ విదేశాలలో స్థిరపడ్డారు. ఈ 25 సంవత్సరాల ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా అకాడమిక్ మరియు టెక్నాలజీ పరంగా వివిధ సమస్యలపై అనుభవాన్ని సంపాదించి విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్ళాలనే సేవాభావంతో ఈ విద్యా సంస్థను ప్రారంభించి నైతిక విలువలతో కూడిన విద్య మరియు కుటుంబ వ్యవస్థ, సాంప్రదాయ సంస్కృతి గురించి భారతదేశ విశిష్టత గురించి బోధిస్తూ జీవితానికి కావలసిన సమగ్ర బోధనను అందిస్తూ విద్యార్థులకు మొదటి ప్రాధాన్యతగా పనిచేసుకుంటూ ముందుకు సాగుతున్నాము. విద్యార్థులు కలవాలని సంకల్పించినపుడువాళ్లతో మాట్లాడి వారి సమస్య పరిష్కారానికి కృషి చేశాము. అలాగే ఫెయిలైన విద్యార్థులు క్రుంగిపోకుండా వారిని కౌన్సిలింగ్ ద్వారా ఆత్మస్తైర్యాన్ని నింపి ఆధ్యాత్మికంగా ఆలోచింపచేసే విధంగా ప్రయత్నించాం. అవసరమైనపుడు సమయాన్ని విద్యార్థుల కోసం కేటాయిస్తూ సేవాభావంతో అధ్యాపకులు, విభాగాధిపతులు, ప్రిన్సిపల్స్ సమిష్టి కృషితో పనిచేశాము. ఈ అంకిత భావమే ఈ రోజు సిద్ధార్థ సంస్థను 25 ఏళ్ల సిల్వర్ జూబిలీ శిఖరాలకు తీసుకొచ్చింది. ఈ సందర్భంగా, టీచింగ్, నాన్-టీచింగ్ మరియు యాజమాన్యం అందరం విద్యార్థులను ఎల్లప్పుడూ సిద్ధార్థ కుటుంబ సభ్యులుగా భావించి, వారిని సమర్థవంతులుగా తీర్చిదిద్దడంలో సఫలం అయ్యామని గర్వపడుతున్నాము,

గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి దగ్గర ఆనాడు వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేసినప్పుడు సంపాదించిన అనుభవం తో ఎన్నో రకాల కార్యక్రమాలను చేపడుతూ విద్యార్థులలో స్ఫూర్తిని నింపడానికి ప్రయత్నిస్తునేఉన్నాము. ఆనాడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ముందుచూపుతో ఒక వైపు ఐ.టి. పరిశ్రమలను నిర్మిస్తూ మరోవైపు ఇంజనీరింగ్ కళాశాలలను మంజూరు చేస్తూ లక్షలాది మందిని తెలుగు విద్యార్థులు అద్భుత అవకాశాలను అందిపుచ్చుకొని ప్రపంచ దేశాలకు విస్తరించి, తెలుగు కుటుంబాల ఆర్థిక వ్యవస్థను పెంచి అభివృద్ధి చేయడం ద్వారా కలిగిన సంపద అపారమైనది. వారిచ్చిన స్ఫూర్తితోనే ఎంతో మంది ఇంజనీరులు, సాఫ్ట్వేర్ ఇంజనీరులుగా మరియు వ్యాపార వేత్తలుగా ఎదిగి దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో రాణిస్తూ ఎన్నో లక్షల కుటుంబాలు సంతోషమైన జీవితాన్ని గడుపుతూ ఎన్నో కుటుంబాల తల్లిదండ్రుల కళ్ళలో ఆనందాన్ని చూడగలిగాం.

ఇంటర్నెట్ వచ్చిన తరువాత అతివేగంగా వస్తున్నటువంటి సాంకేతిక మార్పుల వల్ల మొబైల్ ఫోన్స్ వాడకం పెరిగి ఆ సాంకేతికను మంచికి ఉపయోగించి నవారు కొందరైతే అదే మొబైల్ ఫోన్ వల్ల వారి పవిత్రమైన సమయాన్ని కోల్పోవడం జరుగుతుంది. ఇక్కడే మా విద్యార్థుల తల్లిదండ్రులకు మనవి, ఈ ఇంజనీరింగ్ నాలుగు సంవత్సరాల కాలంలో సమయం చాలా విలువైనది. దాన్ని ఉపయోగించి ఏ విజ్ఞానాన్ని అయితే సంపాదిస్తారో అదే వాళ్ళ వంద సంవత్సరాల ఆనందమయ జీవితానికి బాటలు వేస్తుంది. అదే ఇంజనీరింగ్ చదివే వయసులో పక్కదారి పడకుండా వారిని తల్లిదండ్రులు గమనించి సరైన మార్గంలో పెట్టాలని, దశా దిశా నిర్దేశం చేయాలని మనవి. విద్యార్థులు మీరు కోరుకున్న విధంగా తయారై వారు ఉన్నత శిఖరాలను అధిరోహించి కీర్తి ప్రతిష్ఠితలు సంపాదించి ఈ దేశానికి ఉపయోగపడే విధంగా తయారైతే ఆనందపడి, ఆ ఆనందం లో మీ కళ్ళు చెమర్చుతాయో, అవేమాకు ఆశీర్వాదంగా భావిస్తాము. అలాగే మీరు కూడా మీ బాధ్యతను నెరవేరుస్తారని అన్యదా భావింపరని మనవి. విద్యార్థుల అభిమతం మేరకు ఈ సిల్వర్ జూబిలీ వేడుకలను 12 రోజుల పాటు వివిధ కార్యక్రమాలతో ఎంతో వేడుకగా జరుపుతున్న ఈ కార్యక్రమానికి అతిరథ మహారథులు మరియు సెలబ్రిటీలు మిమ్మల్ని అలరించడానికి విచ్చేస్తున్నారు.విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మరియు పూర్వ విద్యార్థులను ఆహ్వానిస్తున్నాం. పూర్వ విద్యార్థుల అనుభవాన్ని ప్రస్తుత విద్యార్థులకు అనుసంధానం చేసి, వారి ఎదుగుదలకి బాటలు వేస్తున్నాము.

ఈ ప్రాంతంలో పద్మావతి అమ్మవారు పుట్టి పెరిగి సంచరించి మరియు ఆ కలియుగ దైవం శ్రీనివాసుని (బాలాజీ) వివాహమాడిని స్థలం నారాయణవనంలోని మా కళాశాలలో 10,300 మంది విద్యార్థులు చదువుతూ అద్భుతమైన ప్రగతిని సాధిస్తూ వారి కుటుంబాలను ఆశీర్వదించిన శ్రీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామికి దివ్యమంగళ శాసనాలు తెలియజేస్తూ.

సదా మీ సేవలో...

డా॥ అశోక రాజు కొండూరు,
ఛైర్మన్, సిద్ధార్థ విద్యా సంస్థలు, పుత్తూరు

25 Years of Excellence in Education
- NBA & NAAC A+ Quality Standards
- Industry-Oriented UG & PG Programs
- Experienced & Qualified Faculty
- Modern Labs & Smart Classrooms
- Strong Industry Collaboration
- Focus on Skills, Innovation & Research
- Consistent Results & University Ranks
- Placements & Career Guidance
- Business Incubation Centre for Start-ups
- Microsoft, IBM & Vertusa Centers of Excellence
- AP State Skill Development Centre
- SEIMENS State-of-the-Art Laboratories
- QSpiders Industry Training Team
- Alumni Knowledge Transfer Centre
- Center for Interdisciplinary Research (CIDR)
- Research Guidance Center & Innovation Cell

DAY 1 28-01-2026 HOMAM — BEGINNING WITH DIVINE BLESSINGS	DAY 2 29-01-2026 STATUE/ MODELS FROM SCRAP — IGNITING THE SPARK OF INNOVATION IN EVERY STUDENT	DAY 3 30-01-2026 EXPERT TALKS WORKSHOPS — TRAINING TODAY SUCCESS TOMORROW	DAY 4 31-01-2026 PROJECT EXPO — ENGINEERING IDEAS INTO REALITY	DAY 5 01-02-2026 HACKATHON — 24 HOURS CODING FEST	DAY 6 02-02-2026 DEPARTMENT ASSOCIATIONS — COLLECTIVE WISDOM, BEYOND THE CLASSROOM
DAY 7 03-02-2026 QUEST 2K26, FAREWELL — A NATIONAL LEVEL TECHNICAL SYMPOSIUM	DAY 8 04-02-2026 TRADITIONAL DAY — A DAY DEDICATED TO TRADITION AND VALUES	DAY 9 05-02-2026 PARENTS DAY — EVERY PARENT IS A PART OF OUR SUCCESS	DAY 10 06-02-2026 SPORTS DAY — PLAY, LEARN, GROW BEYOND THE CLASSROOM	DAY 11 07-02-2026 ALUMNI DAY — SIDDHARTH HOME COMING	DAY 12 08-02-2026 SILVER JUBILEE CELEBRATIONS — DISTINGUISHED GUESTS GRACING THE CELEBRATIONS.

OUR EMPLOYABILITY SKILLS & TRAINING FRAMEWORK

- 1st YEAR — ENGLISH COMMUNICATION SKILLS
- 2nd YEAR — SOFT SKILLS & PROGRAMMING COURSES IN JAVA & PYTHON
- 3rd YEAR — CORPORATE TECHNICAL TRAINING ON (AI, IOT, ML, CLOUD COMPUTING, SAP CYBER SECURITY, ect...) & APTITUDE
- 4th YEAR — INTERNSHIPS, PROJECT WORK & INDUSTRY READINESS

SMALL STEPS BIG LEAP!

TRAINING DELIVERED BY SOFTWARE PROFESSIONALS

40 LAKHS LPA HIGHEST PACKAGE

JOB OFFERS

- 1901 — 2024 BATCH
- 1803 — 2023 BATCH
- 1714 — 2022 BATCH

tcs TATA CONSULTANCY SERVICES · Infosys · IBM · amazon.in · accenture · wipro · Tech Mahindra · HCL · TCL · Capgemini · AMARA RAJA

BYJU'S The Learning App · HDFC BANK We understand your world · cognizant · virtusa · INDO-MIM · Mindtree · apollo TYRES · BAJAJ Allianz · HEXAWARE · NELCAST LIMITED · TESTYANTRA

25 YEARS OF INSTITUTIONAL GROWTH

AICTE · NBA NATIONAL BOARD of ACCREDITATION · NAAC GRADE A+ · UGC AUTONOMOUS · AICTE IDEALab

25 Years of Academic Excellence:
A proud journey of delivering quality education with commitment and consistency.

Student-Centric Learning:
Thousands of students empowered with knowledge, skills, and values.

Expansion of Academic Programs:
Introduction of diverse undergraduate and postgraduate courses aligned with industry and societal needs.

Strong Faculty Foundation:
Experienced, dedicated, and continuously trained faculty contributing to academic excellence.

Infrastructure Development:
Steady growth in classrooms, laboratories, libraries, hostels, sports facilities, and digital learning resources.

Technological Advancement:
Adoption of ICT-enabled teaching, smart classrooms, e-learning platforms, and digital administration.

Research & Innovation:
Encouragement of research activities, projects, seminars, workshops, and publications.

Industry & Community Engagement:
Strong linkages with industry, internships, skill-development programs, and community outreach initiatives.

Student Achievements:
Consistent academic results, university ranks, competitive exam success, and extracurricular achievements.

FROM SCRAP TO SCULPTURE — STUDENTS TURNED WASTE INTO WONDERFUL CREATIONS.

The scrap models displayed by the students are a remarkable demonstration of engineering creativity, technical understanding, and environmental responsibility. Converting discarded materials into working and conceptual models reflects innovative thinking and strong problem-solving skills. These models effectively showcase the practical application of engineering principles while promoting sustainability and resource optimization. The clarity of design, functionality, and thoughtful use of scrap materials highlight the students' dedication and technical competence. Such initiatives encourage young engineers to think responsibly, innovate with limited resources, and contribute towards sustainable development. The efforts put forth by the students are truly appreciable and deserve sincere recognition.

- Dr. K. Ashok Raju, Chairman

సాక్షి గుంటూరు

సోమవారం ౹ 2 ౹ ఫిబ్రవరి ౹ 2026



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు 2900 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నీటి నిల్వ 36.6403 టీఎంసీలు.

తిరుపతమ్మ కళ్యాణం

మాచర్ల: 24వ వార్డు తిరుపతమ్మ ఆలయంలో మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని అమ్మవారు, గోపయ్యకి కల్యాణ మహోత్సవం నిర్వహించారు.

గోగులమ్మకు విశేష పూజలు

భట్టిప్రోలు: వ్యాఘ్రపుర క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామ దేవత గోగులమ్మకు మాఘ పౌర్ణమి సందర్భంగా ఆదివారం ప్రాతఃకాల విశేష పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

లలితాంబకు కుంకుమ పూజలు

మాచర్ల: స్థానిక సాయిబాబా ఆలయంలోని లలితాంబ అమ్మవారి 9వ వార్షికోత్సవ కార్యక్రమం ఆదివారం జరిగింది. మహిళలు కుంకుమ పూజలు జరిపారు.

భక్తి శ్రద్ధలతో గాయత్రీ మహాయజ్ఞం

పొన్నూరు: అఖిల విశ్వ గాయత్రీ పరివార్ పొన్నూరు శాఖ ఆధ్వర్యంలో స్థానిక సాక్షి భావనారాయణ స్వామి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం 24 కుండముల గాయత్రీ మహా యజ్ఞం నిర్వహించారు. గోపూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గాయత్రీ మహా యజ్ఞాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా అఖిల గాయత్రి పరివార్ సంఘ ప్రధాన్ డీవీఆర్ మూర్తి మాట్లాడుతూ ఆధ్యాత్మికతను కులమతాలకతీతంగా విశ్వవ్యాప్తి చేయడమే గాయత్రి పరివార్ ముఖ్య లక్ష్యమని చెప్పారు. గాయత్రి మహామంత్రం జపిస్తే గాయత్రీ మాత అనుగ్రహాన్ని పొందవచ్చని చెప్పారు. పరివార్ సభ్యులు దమ్మాల వెంకటేశ్వర్లు, పులిపాటి శ్రీనివాసరావు, పులిపాటి భవాని శంకర్, నారా కోడూరు గాయత్రి పీఠం నిర్వాహకులు చుండూరు వెంకట చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా ఆదికేశవస్వామి గరుడ సేవ

చేబ్రోలు: చారిత్రక ప్రసిద్ధి చెందిన చేబ్రోలులోని భూనీలా సమేత ఆదికేశవ స్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి పున్నమి గరుడ సేవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఫణిహారం శ్రీధర్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు జరిగాయి. మాఘపౌర్ణమి సందర్భంగా నిర్వహించిన గరుడ సేవ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆదికేశవ స్వామికి ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారి గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది.

వైభవంగా సత్యదేవుని రథోత్సవం



నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : స్థానిక పట్టాభిపురం సత్యనారాయణస్వామి ఆలయ 49వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రమాసమేత సత్యనారాయణ స్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. మూల విరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణ జరగ్గా, ఆంజనేయస్వామికి మన్యసూక్తంతో అభిషేకం, సిందూరార్చన చేపట్టారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై రమా సమేత సత్యనారాయణస్వామి ఉత్సవ మూర్తులకు రథోత్సవం పురవీధుల్లో నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, నామ సంకీర్తన బృందాలు, దేవత వేషధారణలో కళాకారులు, విద్యుత్ దీప కాంతుల నడుమ నగరోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామికి ఊంజల్ సేవ చేపట్టారు. ప్రముఖ సంగీత విద్వాంసరాలు శ్రోతస్విని (బెంగళూరు) నిర్వహించిన స్వరార్చన అలరించింది. ఆలయ కమిటీ చైర్మన్ చావలి గణపతి, ఉత్సవ కమిటీ కన్వీనర్ రాయపాటి సత్యనారాయణ భక్తులు పాల్గొన్నారు.

గుంటూరులో పార్టీ నేతలతో సమావేశమైన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి

టీడీపీ గూండాల దాడిలో ధ్వంసమైన అంబటి కార్యాలయాన్ని పరిశీలిస్తున్న సజ్జల

పచ్చమూకలు ధ్వంసం చేసిన కారును పరిశీలిస్తున్న సజ్జల, పార్టీ నేతలు

టీడీపీ మూకల విధ్వంసం

● వైఎస్సార్‌సీపీ శ్రేణులపై క్రూరంగా దాడి ● కార్లను ధ్వంసం చేసిన టీడీపీ గూండాలు ● ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి ఇంటిపై, కార్యాలయంపైకి శనివారం వేలాదిగా వచ్చిన టీడీపీ మూకలు పక్కా వ్యూహంతో విచక్షణ రహితంగా దాడికి పాల్పడ్డాయి. ఆ సమయంలో అడ్డుగా ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను, మహిళలపైనా దాడి చేశారు. దీంతో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

- లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్)

కోర్టు వద్ద అంబటి

విచక్షణరహితంగా దాడి

అంబటి ఇంటి వద్దకు పోలీసులు వచ్చారన్న సమాచారం తెలుసుకుని అక్కడకు చేరుకున్నాను. ఒక్కసారిగా కర్రలతో, రాళ్లతో, ఇనుప రాడ్లతో టీడీపీ గూండాలు అంబటి కార్యాలయంలోకి చొరబడ్డారు. అడ్డుగా ఉన్న నాపై కర్రలతో దాడి చేసి గాయపరిచారు. వారి నుంచి తప్పించుకుని రాత్రి 11.45 గంటల వరకు అంబటి రాంబాబు కార్యాలయంలో తలదాచుకున్నాను. నేను పల్నాడు జిల్లా నుంచి వచ్చి గుంటూరు పట్టాభిపురంలో నివాసం ఉంటున్నాను.

- గుంజి శివ, పల్నాడు జిల్లా

గాయాలపాలై జీజీహెచ్‌లో చేరా

అంబటి రాంబాబు ఇంటిపై దాడి చేస్తున్నారన్న సమాచారం తెలుసుకుని నాతోపాటు మా నాన్న, ప్రస్తుత వైఎస్సార్ సీపీ కో ఆప్షన్ సభ్యుడు పూనూరి నాగేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ తుమ్మేటి శ్రీను, మరికొంత మందితో వెళ్లాం. అక్కడ ఉన్న టీడీపీ గూండాలు అడ్డుకున్నారు. నాపై చేతులతో, కర్రలతో తీవ్రంగా దాడి చేసి గాయపరిచారు. అక్కడే ఉన్న పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం కూడా చేయలేదు. సొమ్మసిల్లి పడిపోవడంతో స్థానికులు జీజీహెచ్‌కు తరలించారు.

- పూనూరి చంద్ర ప్రకాష్

మహిళలని కూడా చూడలేదు..

అంబటి ఇంటిపై , కార్యాలయంపై దాడి చేస్తున్నారన్న విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్నా. టీడీపీ గూండాలు మమ్మల్ని మహిళలు అని కూడా చూడకుండా అసభ్యకరంగా ప్రవర్తించారు. దాడి చేయడంతో కింద పడిపోయాం. అక్కడే ఉన్న తోటి పార్టీ శ్రేణుల సహాయంతో వారి బారి నుంచి బయట పడ్డాం. ఇంతటి రాక్షసంగా వ్యవహరిస్తుంటే పోలీసులు మాత్రం ప్రేక్షకపాత్ర పోషించడం చాలా బాధగా ఉంది.

- భాగ్యలక్ష్మి, త్రివేణి

ప్రజాస్వామ్యంలో దాడులకు తావులేదు

నెహ్రూ నగర్: ప్రజాస్వామ్యంలో దాడులకు తావులేదని, భౌతిక దాడులతో వైఎస్సార్ సీపీ శ్రేణులను భయపెట్టలేరని ఆ పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా పేర్కొన్నారు. శనివారం రాత్రి మాజీ మంత్రి అంబటి రాంబాబు నివాసం వద్ద జరిగిన దురదృష్టకర ఘటనలో గాయపడిన మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ నాగేశ్వరరావు కుమారుడు పూనూరు చంద్రప్రకాష్‌ను జీజీహెచ్‌కు వెళ్లి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని అక్కడి వైద్యులను కోరారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీలో ఏ కార్యకర్తకూ అన్యాయం జరగనివ్వమని.. పార్టీ అధిష్టానం.. నాయకత్వం ప్రతి కార్యకర్తకు అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

చంద్ర ప్రకాష్‌ను పరామర్శిస్తున్న నూరిఫాతిమా

కార్యకర్తలకు అండగా ఉంటాం

గుంటూరు రూరల్: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ఇంటిపై శనివారం అర్ధరాత్రి టీడీపీ గుండాల దాడిలో గాయపడిన ప్రత్తిపాడు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు దారం అశోక్ కుమార్ యాదవ్, పార్టీ కార్యకర్త లక్ష్మణ్‌ని మాజీ మంత్రి, పార్టీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యురాలు మేకతోటి సుచరిత, ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ఆదివారం పరామర్శించారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి, అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం, సంబంధిత వైద్యాధికారులతో మాట్లాడి అశోక్‌కు అవసరమైన మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

అశోక్‌కుమార్‌ను పరామర్శిస్తున్న సుచరిత, బలసాని

కనుల పండువగా
నృసింహుని తెప్పోత్సవం

పట్టు వస్త్రాలు సమర్పించిన ఇంద్రకీలాద్రి వేదపండితులు

తెప్పోత్సవంలో నృసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

దేపల్లి రూరల్ : ప్రసిద్ధి గాంచిన మంగళగిరి లక్ష్మీ నరసింహస్వామి తెప్పోత్సవం ఆదివారం వేదమంత్రాల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున లక్ష్మీ నరసింహస్వామి వారిని సీతానగరంలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో ఉత్సవ విగ్రహాలు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయవాడ ఇంద్రకీలాద్రి పర్వతంపై వేంచేసి యున్న కనకదుర్గ ఆలయం నుంచి నరసింహస్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం నృసింహస్వామి ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు ప్రకాశం బ్యారేజ్ ఎగువ ప్రాంతానికి తీసుకువెళ్లి ప్రత్యేకంగా అలంకరించిన పంటు వాహనంలో స్వామివారిని ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి తెప్పోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ప్రత్యేక భద్రతా చర్యల మధ్య ఇ.వో. సునీల్‌కుమార్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

తెప్పోత్సవానికి బయలుదేరిన నృసింహస్వామి వారు

కోటప్పకొండలో భక్తుల రద్దీ

నరసరావుపేట రూరల్: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి త్రికోటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా అభిషేక మండపంలో ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణలో త్రికోటేశ్వరస్వామి

పోలీసుల పచ్చపాతం!

● అంబటి ఇంటి వద్ద పోలీసుల ఓవర్ యాక్షన్
● నివాసానికి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు
● నిన్న ఇదంతా ఏమైందంటూ వైఎస్సార్ సీపీ శ్రేణుల నిలదీత
● అంబటి కార్యాలయం, ఇంటి వద్ద పార్టీ నాయకులకు అడ్డంకులు

అంబటి ఇంటి వద్ద ఎగురుతున్న డ్రోన్

అంబటి రాంబాబు ఇంటి వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి వైఎస్సార్ సీపీ నాయకులను, కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటి వద్ద శనివారం పోలీసులు పూర్తిగా ప్రేక్షక పాత్ర పోషిస్తూ టీడీపీ గూండాలకు అండగా నిలిచారు. అంతులేని నిర్లక్ష్యంగా వ్యవహరించిన అదే పోలీసులు... ఆదివారం ఉదయం నుంచి అంబటి ఇంటి వద్ద ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేసి వైసీసీ శ్రేణులతోపాటు అంబటి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వచ్చే వారిని కూడా అడ్డుకుంటూ అనధికారిక ఆంక్షలు విధించారు. అంబటిపై, ఆయన కార్యాలయంపై, ఇంటిపై, కుటుంబ సభ్యులపై టీడీపీ గూండాలు దాడి చేసిన విషయం తెలుసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల రెడ్డి, మాజీ మంత్రి విడుదల రజిని, వివిధ నియోజకవర్గాల సమన్వయకర్తలు నూరి ఫాతిమా, వనమా బాల వజ్రబాబు, బలసాని కిరణ్, నాయకులు గుజ్జుల నాగార్జునరెడ్డి, పోతుల మహేష్, నాగార్జున యాదవ్, కారుమూరు వెంకటరెడ్డి, గులాం రసూల్, నిమ్మకాయల రాజనారాయణ, కార్పొరేటర్లు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అంబటి ఇంటి వద్దకు చేరుకున్నారు. పోలీసులు అంబటి ఇంటికి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేసి భారీ సంఖ్యలో పోలీసులు మోహరించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులను లోపలికి రానివ్వకుండా అడ్డుకునే యత్నం చేశారు. దీంతో పోలీసులను పార్టీ కార్యకర్తలు నిలదీశారు. శనివారం రాత్రి అంబటి ఇంటి వద్ద సుమారు 7 గంటలకుపైగా టీడీపీ మూకలు విధ్వంసం సృష్టిస్తూ ఉంటే పోలీసు శాఖ వారికి అండగా నిలబడి మరీ దాడులు చేయించిన విషయాన్ని గుర్తుచేశారు. కనీసం అడ్డుకునే యత్నం చేయకుండా వారికి పూర్తి మద్దతుగా నిలిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ బారికేడ్లు అప్పుడు ఏమయ్యాయని నిలదీశారు. పోలీసులు ఇలా శనివారం కూడా వ్యవహరించకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని పేర్కొన్నారు. పక్కా వ్యూహంతోనే ఇంతటి విధ్వంసం సృష్టించారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఇరువైపుల బారికేడ్ల వద్ద లేళ్ళ అప్పిరెడ్డి, నాగార్జున రెడ్డి, బలసాని కిరణ్, గులాం రసూల్‌లను అడ్డుకోవడంతో పార్టీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులు వెంటనే నిలదీయడంతో కార్యకర్తలను ఆపి, నేతలను మాత్రమే లోపలికి పంపించారు.

అంబటి ఇంటి వద్ద డ్రోన్ ఎగుర వేస్తూ పర్యవేక్షిస్తున్న కానిస్టేబుల్

అంబటిపై రాళ్ల వర్షం.....

అంబటిని అరెస్ట్ చేసేందుకు పోలీసులు వజ్ర వాహనాన్ని ఆయన ఇంటి ముందుకు తీసుకొచ్చారు. టీడీపీ గూండాలను తరిమి కొట్టకుండా రెండు గంటలపాటు అలాగే ఉన్నారు. అంబటిని వాహనంలోకి ఎక్కించలేకపోయారు. తర్వాత రాంబాబు చుట్టూ పోలీసులు రక్షణ వలయంగా ఏర్పడి తీసుకు వెళుతున్న సమయంలో టీడీపీ మూకలు రాళ్లు, సోడా బుడ్డులు విసురుతూ విధ్వంసం సృష్టించారు. వజ్ర వాహనంలోకి పోలీసులు అంబటిని ఎక్కించిన తరువాత కూడా వారు వాహనాన్ని వెంటాడారు. అప్పటికి కూడా పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేయలేదు.

ఇంటి ముందు ఏడున్నర గంటల హైడ్రామా

శనివారం సాయంత్రం 4 గంటల నుంచి తెలుగు దేశం పార్టీ గూండాలు అర్ధరాత్రి 11.45 గంటల వరకు గంటలకుపైగా విధ్వంసం సృష్టించారు. టీడీపీ మూకలు, పార్టీ సామాజిక వర్గ నాయకులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు ఇష్టానుసారంగా అంబటి కార్యాలయం ముందు అసభ్య పదాలతో విరుచుకుపడ్డారు. స్వయంగా దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ కోటేశ్వరరావు మైక్ సెట్‌తో, హిజ్రాలను తీసుకు వచ్చి పశ్చిమ ఎమ్మెల్యే... అంబటి ఇంటి ముందు తిష్ట వేశారు. మైక్‌లో అంబటిని, ఆయన కుటుంబ సభ్యులను అసభ్య పదజాలంతో సంభోదించారు. మరో వైపు టీడీపీ మూకలు గుణపాలు, రాళ్లు, కర్రలతో అంబటి ఇంటిపై, కార్యాలయంపై దాడి చేస్తుంటే పోలీసులు మాత్రం చోద్యం చూశారు. అంబటితోపాటు ఉన్న తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరి ఫాతిమా, రాష్ట్ర కార్యదర్శి గులాం రసూల్, నిమ్మకాయల రాజనారాయణలతోపాటు మరో 50 మంది లోపల బిక్కుబిక్కుమంటూ ఉన్నారు. పోలీసులు లోపలికి వచ్చి లైట్లు ఆపాలని, బయటకు కనిపించకుండా ఉండాలని చెప్పారేగానీ టీడీపీ మూకలను నిలురించేందుకు కనీస ప్రయత్నం కూడా చేయలేదు.

డ్రోన్‌లతో నిఘా

అంబటి ఇంటి వద్దకు భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు చేరుకోవడంతో పోలీసులు భారీ సంఖ్యలో మోహరించడంతో పాటు డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించడంపై పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ డ్రోన్ కెమెరాలో విజువల్స్ ఎవరికి చూపించడానికి లైవ్ కనెక్షన్ పెట్టారంటూ పార్టీ నాయకులు ప్రశ్నించారు. అంబటి ఇంటి ముందు నిలబడి ఓ పోలీస్ కానిస్టేబుల్ డ్రోన్‌ను ఎగురవేస్తూ ఎంతో శ్రద్ధగా వైఎస్సార్ సీపీ నాయకుల వీడియోను, ఫొటోలను తీయడంపై శనివారం ఎందుకు ఇలా కనిపించలేదని మండిపడ్డారు. పోలీసులు చోద్యం చూస్తూ ఉండటంపై ప్రజాసంఘాలు ఆగ్రహించాయి. రాష్ట్రంలో అసలు ఏం జరుగుతోందని నిలదీశారు. రెడ్ బుక్ పాలనను పోలీసులు అనుసరిస్తున్నారా.. అంటూ ప్రజా సంఘాలు పోలీసు శాఖపై మండిపడుతున్నాయి.

క్లుప్తంగా

ఉద్యోగ, ఉపాధ్యాయులను నిరాశపరిచిన కేంద్ర బడ్జెట్

ఏపీటీఎఫ్ నేతలు

గుంటూరు ఎడ్యుకేషన్: పార్లమెంటులో ఆదివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ఉద్యోగ, ఉపాధ్యాయులను నిరాశపర్చిందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్ ఒక ప్రకటనలో తెలిపారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలతో ఆదాయపు పన్ను పరిధి పెంపుతారని ఆశించిన మధ్యతరగతి, వేతన జీవులకు ఈ బడ్జెట్ పెద్ద షాక్ ఇచ్చిందన్నారు. పన్ను శ్లాబుల్లో ఎటువంటి మార్పు చేయకపోవడం, స్టాండర్డ్ డిడక్షన్ను పెంచకపోవడంతో ఆదనపు భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 8వ వేతన సవరణ సంఘం ఊసే లేకపోవడం, కేంద్ర ప్రభుత్వానికి ఉద్యోగులపై ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. విద్యారంగానికి బడ్జెట్లో ఆశించిన స్థాయిలో కేటాయింపులు జరగలేదని, రూ. 1.39 లక్షల కోట్లు నామమాత్రమేనని, జీడీపీలో కనీసం 6 శాతానికి పెంచాలన్న నిపుణుల సూచనలను తుంగలో తొక్కినట్లు ఉందని పేర్కొన్నారు. డిజిటల్ ఎడ్యుకేషన్ ప్రచారానికే ప్రాధాన్యమిచ్చి, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి నిధులు కరువయ్యాయన్నారు. అదే విధంగా బడ్జెట్లో ఉద్యోగులు, ఉపాధ్యాయుల తీవ్ర నిరాశ కలిగించిందని ఏపీటీఎఫ్ (1938) రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు విమర్శించారు.

మార్కెట్ కమిటీలు డీలా

- ఫీజు వసూలులో వెనుకంజ
- గడిచిన తొమ్మిది నెలల కాలానికి లక్ష్య సాధనలో 47.68 శాతంతో సరి
- ఆర్జేడీ, డీడీఎం, ఏడీఎంల ఉదాసీనతే కారణమని వినిపిస్తున్న విమర్శలు

గుంటూరు మార్కెట్ యార్డు (ఫైల్)

కొరిటెపాడు(గుంటూరు): వివిధ రకాల ఫీజు వసూలులో మార్కెట్ కమిటీలు డీలా పడ్డాయి. తెనాలి, దుగ్గిరాల, పొన్నూరు, మంగళగిరి, ప్రత్తిపాడు మార్కెట్ యార్డుల పరిస్థితి కొంత మేరకు మెరుగ్గానే ఉన్నా... మిగిలిన తాడికొండ, ఫిరంగిపురం, గుంటూరు మార్కెట్ కమిటీల్లో వసూళ్లు బాగా తగ్గాయి. గుంటూరు జిల్లాలో ఉన్న 8 మార్కెట్ కమిటీలు, వాటి పరిధిలో ఉన్న 15 చెక్ పోస్టుల ద్వారా ప్రస్తుత 2025–26 ఆర్థిక సంవత్సరానికి వివిధ రకాల ఫీజులు, అద్దెలు, సంతల ద్వారా రూ.146.31 కోట్లు వసూలు చేయాలని దిశానిర్దేశం చేశారు.

- డిసెంబర్ మాసం చివరి నాటికి అంటే తొమ్మిది నెలల కాలానికి 47.68 శాతంతో రూ.69.76 కోట్లు వసూలయ్యాయి. ఇందులో రూ.51.15 కోట్లు గుంటూరు మార్కెట్ కమిటీ నుంచి వసూలు కాగా మిగిలిన ఏడు మార్కెట్ కమిటీల ద్వారా కేవలం రూ.18.61 కోట్లు వసూలు కావడం విశేషం.
- గుంటూరు మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.115 కోట్లు కాగా, ఇప్పటి వరకు 44.48 శాతంతో రూ.51.15 కోట్లు సాధించారు.
- దుగ్గిరాల లక్ష్యం రూ.3.75 కోట్లు కాగా 74.23 శాతంతో రూ.2.78 కోట్లు వసూలు చేసి అగ్రస్థానంలో కొనసాగుతోంది.
- తెనాలి లక్ష్యం రూ.7.65 కోట్లు కాగా 72 శాతంతో రూ.5.54 కోట్లు, పొన్నూరు లక్ష్యం రూ.8.38 కోట్లు కాగా 62.51 శాతంతో రూ.5.24 కోట్లు, ప్రత్తిపాడు లక్ష్యం రూ.4.45 కోట్లు కాగా 57.87 శాతంతో రూ.2.58 కోట్లు, ఫిరంగిపురం లక్ష్యం రూ.1.88 కోట్లు కాగా 24.90 శాతంతో రూ.0.47 కోట్లు, మంగళగిరి లక్ష్యం రూ.3.03 కోట్లు కాగా 59.87 శాతంతో రూ.1.81 కోట్లు, తాడికొండ లక్ష్యం రూ.2.17 కోట్లు కాగా 8.98 శాతంతో రూ.0.19 కోట్లు వసూలు చేశాయి.
- గత ఏడాది ఇదే సమయానికి రూ.83.44 కోట్లు మార్కెట్ ఫీజు వసూలు చేస్తే ఈ ఏడాది రూ.69.76 కోట్లు మాత్రమే వసూలు కావడం గమనార్హం.
- గత ఆర్థిక సంవత్సరంలో కన్నా ఈ ఏడాది రూ.13.68 కోట్లు మార్కెట్ ఫీజు వసూలు తగ్గింది. ఈ నేపథ్యంలోనే లక్ష్య సాధన దిశగా నడిపించడంలో ఆర్జేడీ, డీడీఎం, ఏడీఎంలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గ్రామస్థాయి నుంచి రైతులు ఉద్యమించాలి

మాట్లాడుతున్న ఏఐకేఎస్ ఫైనాన్స్ సెక్రటరీ కృష్ణ ప్రసాద్, వేదికపై మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, రైతు సంఘ నాయకులు

ఏఐకేఎస్ ఫైనాన్స్ సెక్రటరీ కృష్ణ ప్రసాద్

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ విధానం తొలగిపోవాలంటే రైతులు గ్రామస్థాయి నుంచి ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అఖిలభారత కిసాన్ సభ ఫైనాన్స్ సెక్రటరీ కృష్ణ ప్రసాద్ చెప్పారు. ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం రాత్రి ఏపీ కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు అధ్యక్షతన 'కార్పొరేట్ వ్యవసాయం – రైతాంగం పై ప్రభావం' అనే అంశంపై జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. ఏ పంట వెయ్యాలో రైతులకు కార్పొరేట్లే దిశా నిర్దేశం చేస్తున్నారని తెలిపారు. ఎక్కువ విస్తీర్ణంలో ఒకే పంట పండించడం వల్ల ధరలు తగ్గి రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ఇందుకు గుంటూరులో గత రెండేళ్ల కాలంలో మిర్చి ధరల హెచ్చుతగ్గులే నిదర్శనం అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసనగా దేశవ్యాప్తంగా గ్రామస్థాయి నుంచి ఉద్యమాలు రావాలన్నారు. 'కేంద్ర బహుళ సహకార చట్టం – రైతాంగం పై ప్రభావం' అనే అంశంపై రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకుడు వై. కేశవరావు, 'వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి –సాగునీటి ప్రాజెక్టుల ఆవశ్యకత' అనే అంశంపై ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు డి.హరనాథ్ తదితరులు ప్రసంగించారు.

ఏఐ ఆలంబనగా సాయిశ్రీకర్ సృజన

అచ్యుతుని సాయిశ్రీకర్

SOMETHING SPECIAL

తెనాలి: కత్తితో కూరగాయలు కోసుకోవచ్చు...అదే కత్తితో పీకలు కోయొచ్చు...అంటారు! సోషల్మీడియా కూడా అటువంటిదే. ఎందరో దుర్వినియోగం చేసుకుంటూ జీవితాలను పాడు చేసుకుంటున్నారు. కొందరు ప్రాణాలను కోల్పోతున్నారు. సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకుంటే ఎన్నో సాధించవచ్చు...ఎందరి ప్రశంసలనో అందుకోవచ్చు...జీవితానికో బాట వేసుకోవచ్చు... అనేందుకు ఎన్నో ఉదాహరణలు. తెనాలి నాజరుపేటకు చెందిన అచ్యుతుని సాయిశ్రీకర్ ఇందుకో నిదర్శనం. బీకాం చదివి, షార్ట్హ్యాండ్ ఉత్తీర్ణుడైన సాయి శ్రీకర్ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఔట్సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. షార్ట్హ్యాండ్, కంప్యూటర్ పరిజ్ఞానం మెండుగా ఉన్న ఈ యువకుడి దృష్టి, ఇటీవల అత్యంత ప్రాచుర్యంలోకి వచ్చిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై పడింది. స్వయంగా అధ్యయనం చేశాడు. తెలుగు భాషా పరిజ్ఞానం, పదాలతో పట్టు కలిగిన సాయి శ్రీకర్ తెలుగులో కవితాగానం చేయగలడు. కమ్మని పాటలను రచించగలడు. తన భాషా ప్రావీణ్యానికి ఏఐని ఆలంబన చేసుకున్నాడు. చక్కని పాట రాయడం, ఏఐతో ఆ పాటకు గానం, సంగీతం సమకూర్చటం, వీడియో ఎడిటింగ్ ప్రవేశం కూడా ఉండటంతో ఆ పాటకు సందర్భోచితమైన వీడియోలను తానే జత చేస్తున్నాడు. సినిమా పాటలను పోలిన గీతాలతో ఇప్పుడు అందరినీ ఆకర్షిస్తున్నాడు. ఎవరి సాయం లేకుండా స్వయంసాధనతో చేసిన కృషికి అద్భుతమైన ప్రశంసలను అందుకుంటున్నాడు. తన తండ్రి జర్నలిస్టు కావటంతో తెలుగు పదాలతో చక్కని పాటలను రూపకల్పన చేయగలుగుతున్నానని తెలిపారు. నటన, సినిమా రంగంపై అభిలాష కలిగిన తాను, గీత రచయితగానూ అదృష్టాన్ని పరీక్షించుకోవాలనే భావనతో ఉన్నట్టు చెప్పాడు. ...మనమూ బెస్టాఫ్ లక్ చెబుదాం...

5న ఏఐ–జాక్టో ఆధ్వర్యంలో 'మార్చ్ టు పార్లమెంట్'

మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మల్లు రఘునాథరెడ్డి, పక్కన కత్తి నరసింహారెడ్డి, నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: దేశవ్యాప్తంగా ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ జాతీయస్థాయిలో ఏడు ప్రధాన ఉపాధ్యాయ సంఘాలతో ఆవిర్భవించిన ఏఐ – జాక్టో ఆధ్వర్యంలో ఈనెల 5న చేపడుతున్న మార్చ్ టు పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐఎస్టీఎఫ్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మల్లు రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం గుంటూరు కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్లో ఎస్టీయూ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యవర్గ సమావేశాన్ని సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు షేక్ బాజీ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఇరువురు నాయకులు మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత నుంచి మినహాయింపు ఇవ్వాలని, పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో చట్ట సవరణ దిశగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ జాతీయ స్థాయిలో ఉమ్మడి పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. దేశవ్యాప్తంగా ఏకోపాధ్యాయ పాఠశాలలు 1,04,125 ఉండగా, మన రాష్ట్రంలో 12,912 ఏకోపాధ్యాయ పాఠశాలలతో దేశంలో ప్రథమ స్థానంలో ఉందన్నారు. బోధన కోసమే నియమించబడిన ఉపాధ్యాయులతో బోధనేతర కార్యక్రమాల భారం పెంచటం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, 12వ పీఆర్సీ కమిటీ ఏర్పాటు, 30 శాతం మధ్యంతర భృతి మంజూరు చేయాలన్నారు. ఈనెల 10న జిల్లా కలెక్టరేట్ల దగ్గర చేపడుతున్న ధర్నాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసెఫ్ సుధీర్బాబు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు డి.పెదబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాకుమాను జోజప్ప, ఎం.శ్రీధర్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్యాంబాబు, ఉమ్మడి గుంటూరు జిల్లా, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో గుంటూరు వైద్యుడి ప్రతిభ

- అరుదైన రికార్డు సృష్టించిన స్పయిన్ సర్జన్ డాక్టర్ నరేష్బాబు
- ఒకేసారి రెండు జాతీయ అవార్డులు సొంతం

జాతీయ అవార్డులు అందుకుంటున్న డాక్టర్ జె.నరేష్బాబు

గుంటూరు మెడికల్: వెన్నుముక పరిశోధనల్లో జాతీయ స్థాయిలో గుంటూరు వైద్యుడు ప్రతిభ చూపించి రెండు జాతీయ అవార్డులు ఒకేసారి సొంతం చేసుకుని అరుదైన రికార్డు సృష్టించారు. గుంటూరుకు చెందిన సీనియర్ స్పయిన్ సర్జన్, మల్లిక సెంటర్ అధినేత డాక్టర్ జె.నరేష్బాబు వెన్నుపై చేసిన పరిశోధనలకు రెండు జాతీయ అవార్డులు సొంతం చేసుకున్నారు. ఆదివారం గుంటూరు కొత్తపేటలోని మల్లిక స్పయిన్ సెంటర్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు ఆయన మీడియాకు వెల్లడించారు.

ప్రతిష్ఠాత్మక అస్సి బేసిక్ స్పయిన్ రీసెర్చ్ అవార్డు ..

అసోసియేషన్ ఆఫ్ స్పయిన్ సర్జన్స్ ఆఫ్ ఇండియా గత వారం పూణేలో నిర్వహించిన స్పయిన్ సర్జన్స్ 2026 జాతీయ సదస్సులో మల్లిక స్పయిన్ సెంటర్ అరుదైన ఘనత సాధించింది. ఎంఆర్ఐలో కంటికి కనిపించని మార్పులను రేడియోమిక్స్అనే ఆర్టిఫి షల్ ఇంటెలిజెన్స్ విధానాన్ని వాడడం ద్వారా డిస్క్ అరుగుదలను ముందుగానే గుర్తించి నివారణోపాయాలను సూచించవచ్చు అని నిరూపించిన పరిశోధనకు అత్యంత ప్రతిష్ఠాత్మక అస్సి బేసిక్ స్పయిన్ రీసెర్చ్ అవార్డు 2026ను నరేష్ బాబు అందుకున్నారు. బేసిక్ స్పయిన్ రీసెర్చ్ అవార్డు తో పాటు క్లినికల్ స్పయిన్ రీసెర్చ్ అవార్డు కూడా మల్లిక స్పయిన్ సెంటర్ గెలుచుకోవడం విశేషం. ఒకే సమయంలో ఈ రెండింటినీ సొంతం చేసుకున్న తొలి స్పయిన్ సెంటర్గా గుంటూరు మల్లిక స్పయిన్ సెంటర్ రెండు తెలుగు రాష్ట్రాలలో చరిత్ర సృష్టించింది. సదస్సులో మల్లిక స్పయిన్ సెంటర్ నుంచి మొత్తం 11 పోడియం ప్రెజెంటేషన్లు జరగడం విశేషం. ఈ సందర్భంగా మల్లిక స్పయిన్ సెంటర్ చీఫ్ ఆఫ్ స్పయిన్ సర్వీసెస్ డాక్టర్ జె.నరేష్ బాబు మాట్లాడుతూ ఈ విజయాలు మొత్తం వైద్య బృందం, సహాయక సిబ్బంది అందరి కృషికి ప్రతిఫలమని పేర్కొన్నారు. అవార్డు గెలుచుకున్న తమ విద్యార్థి డాక్టర్ పృథ్వీకుమార్ రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

ఆర్ఓబీ స్థలసేకరణకు నోటిఫికేషన్ జారీ

గుంటూరు రూరల్: మండలంలోని చిన్నపలకలూరు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నంబరు 6 నిర్మాణానికి స్థల సేకరణకు రైల్వేశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. 1.2693 హెక్టార్ల భూమిని సేకరించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఇందులో ప్రభుత్వ భూమితో పాటు పట్టా భూములు కూడా ఉన్నాయి. సర్వే నంబర్ 98, 99, 100, 106, 107, 110, 117లోని పట్టా భూములు సేకరించనున్నారని సమాచారం. 108లోని 0.3133 హెక్టార్లు, 120 సర్వే నంబర్ 0.4668 హెక్టార్ల ప్రభుత్వ భూమి ఉంది. నోటిఫికేషన్ వెలువడిన నాటినుంచి 30 రోజుల్లోగా అభ్యంతరాలు తెలపవచ్చని అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కెనరా బ్యాంక్ Canara Bank
భారత ప్రభుత్వ రంగ సంస్థ
A Government of India Undertaking

ప్రాంతీయ కార్యాలయం : గుంటూరు
విజయపురి 5వ లేను ఎదురుగా, జెకెసి కాలేజ్ రోడ్డు, గుంటూరు-522006, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

స్థిరాస్తులు అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్మెంట్) రూల్సు, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్, తెనాలి-I బ్రాంచ్ (0774) వారికి ఋణగ్రహీత(లు): M/s సౌందర్య జ్యూయలర్స్, ప్రాతినిధ్యం వహిస్తున్నవారు ప్రొప్రయిటర్ : శ్రీ సీదా దేవి శివ సాయి ప్రకాష్ గారు చెల్లించవలిసిన బకాయి రూ. 5,84,635.28/- (అక్షరాల ఐదు లక్షల ఎనభై నాలుగు వేల ఆరు వందల ముప్పై ఐదు రూపాయల ఇరవై ఎనిమిది పైసలు) + తేది 31.12.2025 నుండి తదుపరి వడ్డీ మరియు ఛార్జీలు మొత్తమును రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్, తెనాలి-I బ్రాంచ్ (0774) అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్కు ఛార్జ్/తనఖాపెట్టిన దిగువ వివరించిన స్థిరాస్తిని తేది 10.03.2026 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని ప్రజానీకానికి మరియు ముఖ్యంగా పైన తెలిపిన ఋణగ్రహీతలు & హామీదారులకు తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది & సమయం: 10.03.2026, మ॥ 02.00 గం. నుండి సా॥ 4:00 గం. వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్లో నేరుగా గాని లేదా ధరావత్తును RTGS/NEFT ద్వారా చలాన్లోని ఖాతా వివరములుకు తేది: 10.03.2026, మ॥ 12.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

ఒకవేళ ఎన్కంబ్రెన్స్లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:

గుంటూరు జిల్లా, తెనాలి సబ్ జిల్లా, తెనాలి మున్సిపాలిటీ, 14వ బ్లాక్, 2వ వార్డు, తెనాలి టౌన్, సమీప డోర్ నెం.14-64-7/A, 1464-4/1/5, తెనాలి యొక్క డి నెం.449/5 సందు విస్తీర్ణం 205-2 చ॥గ॥లులోని రెసిడెన్షియల్ ఆర్సిసి రూఫ్ గ్రౌండ్ & మొదటి అంతస్తు భవనం. హద్దులు : తూర్పు : షేక్ అబ్దుల్ రెహమాన్ గారి ఆస్తి 38-09 అ॥లు, దక్షిణం : చల్లా సుబ్బారావు గారి ఆస్తి 46-0 అ॥లు, పడమర : వాసల సాంబయ్య గారి ఆస్తి 39-06 అ॥లు, ఉత్తరం : 3 అ॥ల రోడ్డు కొంతవరకు మరియు మొహమ్మద్ ముస్తాఫా మాల్ పాషా గారి ఆస్తి కొంతవరకు 48-04 అ॥లు.

రిజర్వు ధర: రూ. 72,00,000/- **ధరావత్తు సొమ్ము: రూ. 7,20,000/-**

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, తెనాలి-I బ్రాంచ్ (0774), మేనేజర్ గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 83310 15702.
ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్బి అలయన్స్ (Baanknet), వెబ్పోర్టల్ https://baanknet.com, హెల్ప్డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com.

తేది: 30.01.2026, ప్రదేశం: గుంటూరు | సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank
భారత ప్రభుత్వ రంగ సంస్థ
A Government of India Undertaking

ప్రాంతీయ కార్యాలయం : గుంటూరు
విజయపురి 5వ లేను ఎదురుగా, జెకెసి కాలేజ్ రోడ్డు, గుంటూరు-522006, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

స్థిరాస్తులు అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్మెంట్) రూల్సు, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్, బృందావన్ గార్డెన్స్ బ్రాంచ్ (13276) వారికి ఋణగ్రహీత(లు): శ్రీ షేక్ మోయినుద్దీన్ మరియు శ్రీమతి షేక్ నసీమ్ అరా చెల్లించవలిసిన బకాయి రూ. 33,12,829.96/- (అక్షరాల ముప్పై మూడు లక్షల పన్నెండు వేల ఎనిమిది వందల ఇరవై తొమ్మిది రూపాయల తొంభై ఆరు పైసలు) + తేది 31.12.2025 నుండి తదుపరి వడ్డీ మరియు ఛార్జీలు మొత్తమును రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్, బృందావన్ గార్డెన్స్ బ్రాంచ్ (13276) అధీకృత అధికారిచే నిర్మాణాత్మక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్కు ఛార్జ్/తనఖాపెట్టిన దిగువ వివరించిన స్థిరాస్తిని తేది 20.02.2026 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని ప్రజానీకానికి మరియు ముఖ్యంగా పైన తెలిపిన ఋణగ్రహీతలు & హామీదారులకు తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది & సమయం: 20.02.2026, మ॥ 02.00 గం. నుండి సా॥ 4:00 గం. వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్లో నేరుగా గాని లేదా ధరావత్తును RTGS/NEFT ద్వారా చలాన్లోని ఖాతా వివరములుకు తేది: 20.02.2026, మ॥ 12.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

ఒకవేళ ఎన్కంబ్రెన్స్లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:

ఎ షెడ్యూల్: గుంటూరు జిల్లా, గుంటూరు సబ్-జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, కంకరగుంట ఏరియా, మున్సిపల్ పాత వార్డ్ నెం. 17, బ్లాక్ నెం. 4, డోర్ నెం. 28-1-79, టి.యస్.నెం. 67, సబ్ డివిజన్ సర్వే నెం. 67/1 మరియు 67/2 లో 541-5 చ॥గ॥ల స్థలం మరియు MID సిటీ అపార్ట్మెంట్ హద్దులు: తూర్పు: ప్రభుత్వ డొంకా - 63-9 అ॥లు, దక్షిణం: 15 అ॥లు గల్లి బజార్ – 93-6 అ॥లు, పడమర: పాచిపులుసు సుబ్రహ్మణ్యం ఆస్తి – 35-6 అ॥లు, ఉత్తరం: పుదోట సుబ్బయ్య యొక్క ఆస్తి – 103-0 అ॥లు.
బి షెడ్యూల్: అవిభాజ్యపు మరియు అనిర్దేశపు స్థలం 67.6875 చ॥గ॥ లేదా 56.59 చ॥మీ॥ వాటాతో "మిడ్ సిటీ హోమ్స్", 2వ అంతస్తు నందు ఫ్లాట్ నెం. 301. హద్దులు: తూర్పు: గ్రౌండ్లో ఒపెన్ ఏరియా, దక్షిణం: మున్సిపల్ రోడ్డు అనుకొని గ్రౌండ్లో ఒపెన్ ఏరియా, పడమర: ఉమ్మడి మెట్లు ఉమ్మడి వరండా మరియు ఉమ్మడి లిఫ్ట్, ఉత్తరం: గ్రౌండ్లో ఒపెన్ ఏరియా. ఈ హద్దులలో నిర్మించిన అపార్ట్మెంట్ "మిడ్ సిటీ హోమ్స్", 2వ అంతస్తు, ప్లింత్ ఏరియా 1500 చ॥అ॥ (ఉమ్మడి ఏరియాలు కలుపుకొని) ఫ్లాట్ నెం. 301 ఉమ్మడి సౌకర్యాలతో మరియు ఉమ్మడి దారి హక్కులతో, స్టిల్ట్ ఫ్లోర్లో ఒక కారు పార్కింగ్ & ఉమ్మడి పార్కింగ్ సౌకర్యాలతో.

రిజర్వు ధర: రూ. 44,30,000/- **ధరావత్తు సొమ్ము: రూ. 4,43,000/-**

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, బృందావన్ గార్డెన్స్ బ్రాంచ్ (13276). మేనేజర్ గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 9440905117.
ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్బి అలయన్స్ (Baanknet), వెబ్పోర్టల్ https://baanknet.com, హెల్ప్డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com.

తేది: 30.01.2026, ప్రదేశం: గుంటూరు | సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

పోలీసుల అదుపులో మాజీ ఎంపీపీ!

- ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానని హామీ
- నగదు తీసుకుని మోసం చేశారంటూ ఫిర్యాదు

మంగళగిరి టౌన్: మంగళగిరి మాజీ ఎంపీపీ మున్నంగి గోపిరెడ్డిని కర్నూలు పట్టణ 3వ పోలీస్ స్టేషన్ పోలీసులు శనివారం మంగళగిరిలో అదుపులోకి తీసుకున్నారు. సేకరించిన వివరాల మేరకు కర్నూలు పట్టణానికి చెందిన నేశిపోగు కిరణ్మయికి కర్నూలు పార్లమెంట్ పరిధిలో ఎమ్మెల్యే సీటు ఇప్పిస్తానంటూ కర్నూలుకు చెందిన అజయ్ మాథ్యూ మంగళగిరికి చెందిన మాజీ ఎంపీపీ గోపిరెడ్డిలు ఆమె వద్ద రూ.3కోట్లు తీసుకున్నారు. 2024 ఎన్నికల్లో ఎక్కడా ఎమ్మెల్యే టికెట్ ఇప్పించకపోవడంతో తన డబ్బును తిరిగి ఇవ్వమని కోరింది. వారి నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో కర్నూలు పట్టణం 3వ పోలీస్స్టేషన్లో కిరణ్మయి ఇటీవల ఫిర్యాదు చేసింది. జనవరి 30వ తేదీన కర్నూలు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా మంగళగిరిలో నివాసముంటున్న మున్నంగి గోపిరెడ్డిని శనివారం అదుపులోకి తీసుకుని కర్నూలుకు తీసుకువెళ్లి విచారిస్తున్నట్లు సమాచారం.

ఉద్దేశపూర్వకంగా ఇరికించారు..

కర్నూలు పట్టణం 3వ పోలీస్ స్టేషన్లో కిరణ్మయి అనే మహిళ పెట్టిన కేసులో తనకు ఎటువంటి సంబంధం లేదని మంగళగిరి మాజీ ఎంపీపీ మున్నంగి గోపిరెడ్డి వివరణ ఇచ్చారు. ఈ కేసు విషయమై ఆదివారం కర్నూలు పోలీస్స్టేషన్లో అధికారులకు వివరణ ఇవ్వడం జరిగిందని, తనను అరెస్ట్ చేశారనేది అసత్య ప్రచారమని, ప్రజాప్రయోజనాల దృష్ట్యా కోర్టులో పిటీషన్ వేశానని, దానిని మనసులో పెట్టుకుని పలువురు నాయకులు తనను ఈ కేసులో ఉద్దేశపూర్వకంగా ఇరికించారని తెలిపారు. దీనిపై త్వరలో మీడియా సమావేశం ఏర్పాటు చేస్తానని స్పష్టం చేశారు.

గంజాయి దాడులను ప్రభుత్వాలు కట్టడి చేయాలి

తాడేపల్లి రూరల్: రెండు తెలుగు రాష్ట్రాల్లో గంజాయి దాడులు ఎక్కువయ్యాయని.. ఇద్దరు ముఖ్యమంత్రులు గంజాయిని నివారించి అమాయక ప్రజలు, ఉద్యోగులపై దాడులు జరగకుండా కాపాడాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు శ్రీదేవి, సావిత్రి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య స్మగ్లర్ల దాడిలో మరణించారని.. ఆమె స్వగ్రామం నిజామాబాద్ జిల్లా మోస్రా మండల కేంద్రమని అన్నారు. ఆమె తల్లిదండ్రులు మసాలా పొడులు తయారు చేస్తూ జీవిస్తున్నారని తెలిపారు. సౌమ్య కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం రూ.కోటి పరిహారం, ఉద్యోగం ఇస్తామని ప్రకటించినట్లు పేర్కొన్నారు. నెల్లూరు జిల్లాలో పెంచలయ్యను గంజాయి స్మగ్లర్ దాడి చేసి హత్యచేయడం సంచలనం రేకెత్తించిందని.. ప్రభుత్వం పెంచలయ్య కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పినా ఇప్పటి వరకు ఆయన భార్య, కుటుంబాన్ని పరామర్శించలేదని విమర్శించారు. మద్యం, గంజాయి, మాదక ద్రవ్యాలను అరికట్టకపోతే పెద్ద ఎత్తున రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆందోళన చేస్తామని వారు ఆ ప్రకటనలో హెచ్చరించారు.

మద్యానికి డబ్బు దొరక్క కూలీ ఆత్మహత్య

తెనాలిరూరల్: మద్యానికి డబ్బు దొరక్క కూలీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. తెనాలి మారిస్పేట సీఎం కాలనీకి చెందిన దేవరకొండ వెంకటేష్(32)కు 12 ఏళ్ల క్రితం వివాహమై భార్య, పిల్లలతో కలసి తాడేపల్లిలో నివసించేవాడు. కూలి పనులు చేసుకునే వెంకటేష్ మద్యానికి బానిసై తరచూ భార్యతో ఘర్షణ పడుతూ ఉండేవాడు. ఆరు నెలల క్రితం కుమారుడిని తీసుకుని వచ్చి ఇక్కడి సీఎం కాలనీలో తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. జనవరి 30న మద్యానికి డబ్బులు కావాలని తల్లిదండ్రులను అడగ్గా వారు లేవని చెప్పారు. ఎలుకల మందు తిన్న అతని 31వ తేదీ ఉదయం కడుపులో మంటగా ఉందని చెప్పడంతో కుటుంబసభ్యులు తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారంతో త్రీ టౌన్ పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిభావంతులు సమాజాభివృద్ధికి తోడ్పడాలి

- తులసి గ్రూప్ కంపెనీస్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు
- 270 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ

విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేస్తున్న తులసి రామచంద్ర ప్రభు, ఉగ్గిరాల సీతారామయ్య, నరేంద్ర

కొరిటెపాడు(గుంటూరు): దాతల సహకారంతో ఉపకార వేతనాలు పొందిన విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకున్నాక సమాజాభివృద్ధికి తమవంతు తోడ్పాటు అందించాలని తులసి గ్రూప్ కంపెనీస్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు అన్నారు. ఆదివారం గుంటూరు నగరం ఆర్.అగ్రహారంలోని రామనామ క్షేత్రం ప్రాంగణంలో కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలైజ్డ్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం తులసి రామచంద్ర ప్రభు, ట్రస్టు సభ్యుల చేతుల మీదుగా జరిగింది. 270 మంది విద్యార్థులకు రూ.12,12,500 చెక్కుల రూపంలో ఉపకార వేతనాలను అందజేశారు. తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ 1995–96లో ఇద్దరు విద్యార్థులతో మొదలుపెట్టి నేటికి సుమారు 40 వేల మంది విద్యార్థులకు రూ.23 కోట్లు ఉపకార వేతనాలుగా ట్రస్టు ద్వారా పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. దీనికి మేజర్ కాంట్రిబ్యూషన్ తులసి సీడ్స్ సమకూరుస్తుందని, దీంతో పాటు నగరంలోని కొంతమంది సమాజ హితం కోరే పెద్దలు ఈ కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలైజ్డ్ ట్రస్టులో సభ్యులుగా చేరి సహాయ సహకారాలు అందిస్తున్నారని వెల్లడించారు. అనంతరం విద్యార్థులకు ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు తులసి రామచంద్ర ప్రభును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏటుకూరు మాజీ సర్పంచ్ ఉగ్గిరాల సీతారామయ్య, ట్రస్ట్ సభ్యులు నారదాసు శ్రీహరిరావు, తిమ్మిశెట్టి నారాయణరావు, పసుపులేటి రమణయ్య, అంకిరెడ్డి సాంబశివరావు, నారదాసు కోటేశ్వరరావు, పుచ్చకాయల ఆనంద్, కనదం నరేంద్రనాథ్, దళవాయి సుబ్రమణ్యం, మిరియాల శ్రీనివాస్, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071 [G-370]

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టు లో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు.తీసుకుంటాం ✆ 83338 33368 [B-2676]

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు. కొనబడును సంప్ర॥✆ 87907 41166 [B-707]

WANTED

■ గుంటూరు మాస్టర్మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్ఛార్జీస్ వార్డెన్స్గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12,000/- నుండి 15,000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు : 22 సంవత్సరములపైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్ : 8978480435 [G-6440]

■ గుంటూరు మాస్టర్మైండ్స్ కాలేజి నందు SR Construction Site Inchargesగా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 35,000/- నుండి 45,000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: Civil Diploma మరియు Civil Engineering, వయస్సు : 30 సంవత్సరములపైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్ : 8978480429 [G-6442]

■ గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు విశ్రాంత ఉద్యోగులు, హౌస్ వైఫ్స్, 10th పాస్, 50సం॥ వయస్సు వారు కావలెను. 7036761665 [G-779407]

■ AGM / RM / BM కావలెను. P.G, వివిధ రంగాలలో 10సం॥ అనుభవం, 45సం॥లోపు వారు గుంటూరులో పనిచేయుటకు రెజ్యూములను kamathamjob@gmail.comకు పంపగలరు. [G-518]

■ ఫ్రీ కంప్యూటర్ స్పోకెన్ ఇంగ్లీష్, MS ఆఫీస్ కోర్సు 3నెలల శిక్షణఇచ్చి జాబ్ చూపబడును. ఫ్రీ భోజనం & హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ. వ:18-28 సం॥లోపు ✆ 9133444985 / 89 [G-779321]

■ తెనాలి, మంగళగిరి ఏరియాలో పురుగు మందు కంపెనీలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అ:డిగ్రీ, జీ: 15000+3000. సంప్ర: 91214 69383 [SCA26011523]

■ తెనాలి రేపల్లె గుంటూరులో పని చేయుటకు ఆయాలు నర్సులు కేర్ టేకర్స్ (M/F) కావలెను. జీతం: 18000/-. సం॥ 7991523705, 7893145549 [SCA26011529]

■ గుంటూరులో గల నర్సింగ్ కాలేజి నందు పని చేయుటకు ఆటో, కారు నడుపుటకు డ్రైవర్ కావలెను. ఆకర్షణీయమైన జీతము ఇవ్వబడును. వివరముల కొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్ : 8122461164 [G-6437]

■ తుమ్మలపాలెం ప్రముఖ కంపెనీలో ASOలుగా పనిచేయుటకు Ex సర్వీస్మెన్లు కావలెను. మంచి జీతం PF / ESI Q:12th, 26రో 8గం॥వ. 48 లోపు ✆944185 3786 [B-755644]

■ డ్వాక్రా మహిళలకు, నిరుద్యోగులకు ఇంట్లో ఉంటూ పెట్టుబడి మీరే పెట్టుకొని కొవ్వొత్తులు, పెన్సిల్స్ తయారుచేసి మాకు ఇవ్వండి వీక్లీ పేమెంట్ 9640729906 [SCA26011554]

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4లైన్లు)
ప్రతి అదనపు లైను రూ॥100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
ఈ సెక్షన్లో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

నేడు కార్పొరేషన్‌లో పీజీఆర్‌ఎస్

నెహ్రూనగర్: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సోమవారం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గుంటూరు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సెల్ సిస్టం) కార్యక్రమం ద్వారా నగరపాలక సంస్థ విభాగాధిపతులతో కలిసి ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని కమిషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

చంద్రబాబు ప్రభుత్వంలో మాదిగలకు రక్షణ కరువు

నెహ్రూ నగర్: చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో మాదిగలకు రక్షణ లేకుండా పోయిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిహెచ్ శశికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రకాశం జిల్లాలో మాదిగలపై దాడి, నిన్న పిన్నెల్లి గ్రామంలో మంద సాల్మన్ హత్య, కర్నూలు జిల్లాలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ హత్య ఉదంతాలు చూస్తుంటే తెలుగుదేశం పార్టీలో మాదిగలు అంటే ఎంత చిన్న చూపో అర్థమవుతోందని చెప్పారు. హత్యకు గురైన రమేష్ కుటుంబానికి తగిన న్యాయం చేయడంతో పాటు.. ప్రభుత్వం మాదిగలపై దాడులు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామన్నారు.

గుంటూరు వాసవిక్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

నగరంపాలెం: భవిష్యత్‌లో నిరుపేద ప్రజలకు మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకెళ్తామని గుంటూరు వాసవిక్లబ్ నూతన అధ్యక్షుడు రాయవరపు అశోక్‌కుమార్ అన్నారు. ఆర్.అగ్రహారం శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన ఆవరణలో ఆదివారం గుంటూరు వాసవిక్లబ్ (2026) నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. నూతన అధ్యక్షులుగా రాయవరపు అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పెరుమాళ్ల సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా అమరా రమేష్‌లు ప్రమాణ స్వీకారం చేసి అనంతరం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాయవరపు అశోక్‌కుమార్ మాట్లాడుతూ శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో క్లబ్ సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేస్తామని చెప్పారు.

అలరించిన అష్టావధానం

నగరంపాలెం: స్థానిక బ్రాడీపేట 2/7వ అడ్డరోడ్డులోని సీపీఎం కార్యాలయ ఆవరణలో తెలుగు కావ్యమథనం పద్య పాఠశాల తృతీయ వార్షికోత్సవం ఆదివారం రెండో రోజుకు చేరింది. సుప్రసిద్ధ మహిళా అష్టావధని బులుసు అపర్ణ అష్టావధానం నయనాల వాణిశ్రీ అధ్యక్షతన జరగ్గా, తొగల సురేష్‌బాబు సంచాలకులుగా వ్యవహరించారు. నిషిద్ధాక్షరిని విట్టు బాబు, సమస్యాపూరణను నడిమింటి మార్కండే శర్మ, దత్తపదిని గోలి హనుమత్ శాస్త్రి, వర్ణన నాగులపల్లి శ్రీనివాస్, వ్యస్తాక్షరిని బైరోజు రాజశేఖర్, పురాణ పఠనాన్ని నండూరి వెంకటేశ్వర రాజు, ఆశువును కర్నాటి చంద్రమౌళి నిర్వహించారు. అప్రస్తుత ప్రసంగాన్ని పూసపాటి కృష్ణసూర్యకుమార్ నిర్వహించగా, ఎంతో సమర్థంగా పచ్చకుల ప్రశ్నలకు దీటుగా అవధాని సమాధానాలు చెప్పి మెప్పించారు. పద్యరచన వ్యాకరణం మెలకువలు అనే అంశంపై సుప్రద్ధ పండితులు సహస్రావధాని డాక్టర్ సూరం శ్రీనివాసులు విశ్లేషణాత్మక ప్రసంగం చేశారు. చిత్రకవితా సౌరభం గ్రంథ పరిచయాన్ని అలంకారం వెంకటరమణరాజు చేశారు. పద్యగురువు పూసపాటి కృష్ణసూర్యకుమార్ దంపతులను సత్కరించారు. పదకొండు పుస్తకాల ఆవిష్కరణలు జరగ్గా, కార్యక్రమాలను వేదుల సత్య రమాదేవి, యల్లాప్రగడ సాయి, బైరోజు రాజశేఖర్ పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న వీణానాదార్చన

గుంటూరు రూరల్: మండలంలోని అంకిరెడ్డిపాలెంలోని రామాలయం(పెద్దగుడి)లో ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలలో భాగంగా ఆదివారం శ్రీ భారతి సంగీతానిలయం వ్యవస్థాపక అధ్యక్షురాలు భారతి దేవి శిష్యులు కె.నాగలక్ష్మి, ఎస్.భవానీ వీణ కచేరి నిర్వహించారు. మహాగణపతిమ్ భజే, మరుగేలరా ఓ రాఘవ అనేక కీర్తనలను వీణలపై పలికించి అభిమానులను అలరించారు. పాలకమండలి సభ్యులు కళాకారులను భారతి దేవిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉద్యోగులు ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యలకు పరిష్కారం

ఏపీ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక జేఏసీ అధ్యక్షుడు విద్యాసాగర్

మాట్లాడుతున్న ఏపీ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక జేఏసీ అధ్యక్షుడు విద్యాసాగర్

గుంటూరు ఎడ్యుకేషన్: ఉద్యోగులు సమష్టిగా కలసి వచ్చినప్పుడే సమస్యల పరిష్కారం దిశగా ముందుకు వెళ్లేందుకు అవకాశముంటుందని ఏపీ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాల జేఏసీ అధ్యక్షుడు విద్యాసాగర్ అన్నారు. ఆదివారం మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాల హైస్కూల్ సమావేశ మందిరంలో స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యాశాఖలో కీలక భూమిక పోషించే మినిస్ట్రీయల్ ఉద్యోగుల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, సిబ్బంది కొరత కారణంగా ఉద్యోగులు ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. దశాబ్దాల తరబడి ఉద్యోగ నియామకాలు చేపట్టకపోవడంతో పని విభజనలో ఇబ్బందులు వస్తున్నాయని అన్నారు. ఉద్యోగోన్నతులకు నోచుకోక ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని, వారి సమస్యలను పరిష్కరించేందుకు ఏపీ జేఏసీ తరపున శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని, ఉద్యోగులు ఇందుకు సహకారం అందించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్జేడీ, డీఈఓ కార్యాలయాల్లో మినిస్ట్రీయల్ విభాగ ఉద్యోగులు 1500 మందికి పైగా ఉన్నారని, వారి న్యాయమైన సమస్యల పరిష్కారంతో పాటు ఉద్యోగోన్నతుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఉద్యోగులంతా ఏకతాటిపై నిలిచి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయాలన్నారు. జేఏసీ ఇందుకు సంఘీభావం తెలియజేస్తుందని స్పష్టం చేశారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డీవీ రమణ మాట్లాడుతూ న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాల్సిందేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ రాష్ట్ర అధ్యక్షుడు పద్మకుమారి, నాయకుల శ్రీనివాసరావు, స్వాములు, కె.శ్రీనివాసు, వేణుగోపాలరావు, వెంకటప్పయ్య, రాజేంద్ర, ముత్యాల నాయుడు, సత్యనారాయణ, రవి, జిల్లా అధ్యక్ష ప్రధాన, కార్యదర్శులు వజ్ర బాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కోటేశ్వరరావు ఆశయాలు నెరవేరుస్తాం

కోటేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: తమ తల్లిదండ్రుల పేరుతో స్థాపించిన పులిపాటి కోటమ్మ, రామయ్య– డాక్టర్ కోటేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా డాక్టర్ కోటేశ్వరరావు కలలు కన్న ఆశయాలను నెరవేరుస్తామని ట్రస్టు వైస్ చైర్మన్ స్వర్గం పుల్లారావు పేర్కొన్నారు. ప్రముఖ సంఘ సేవకుడు, మహాదాత డాక్టర్ పులిపాటి కోటేశ్వరరావు స్మృతిసభను ఆదివారం వల్లూరివారితోటలోని పీకేఆర్ అండ్ కేఆర్ ట్రస్ట్ భవనంలో నిర్వహించారు. ఈసందర్భంగా ట్రస్టు సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు అధ్యక్షత వహించిన ట్రస్టు అధ్యక్షుడు కన్న మాస్టారు మాట్లాడుతూ గొప్ప ఆశయాలతో డాక్టర్ కోటేశ్వరరావు ఏర్పాటుచేసిన ట్రస్టు ద్వారా పేద విద్యార్థులకు కావలసిన వసతి, భోజన సౌకర్యాలు అందజేసేందుకు నిజాయతీ, సేవా దృక్పథంతో తమ ట్రస్టు సభ్యులు కృషి చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు కోట సత్యం, జీసీహెచ్ వీరయ్య, విజేత వాసుదేవరావు, మసనం దామోదర్ ఏడుకొండలు, హైకోర్టు అడ్వకేట్ సంజీవరెడ్డి, న్యాయవాది పుల్లారావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో ఆదివారం చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా విశ్వశాంతిని కాంక్షిస్తూ భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు పది మంది వేదపండితుల నిర్వహణలో గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, లక్ష్మీగణపతి, చండీ, రుద్ర హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

నేటి నుంచి పాఠశాలల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు

పొన్నూరు: ఆధార్ ప్రత్యేక శిబిరాలను పలు పాఠశాలల్లో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2 నుంచి 6వ తేదీ వరకు జీబీసీ రోడ్డులోని సెయింట్ ఆన్స్ ప్రైమరీ స్కూల్, వివేక స్కూల్, 19 వార్డు యానాది కాలనీలోని స్పెషల్ మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్, 5వ వార్డు మున్సిపల్ స్కూల్, 9వ వార్డు ఏపీ స్కూల్, 16 నుంచి 20వ తేదీ వరకు 16వ వార్డు నేతాజీ నగర్, వివేకా జూనియర్ కళాశాల, 3వ వార్డు సెయింట్ థామస్ స్కూల్, జిబిసి రోడ్డు సెయింట్ ఆన్స్ ప్రైమరీ స్కూల్, టీచర్స్ కాలనీ –2 సచివాలయం, 5వ వార్డు మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరాలు పనిచేస్తాయని చెప్పారు.

అలరించిన గోదా కల్యాణం నృత్యరూపకం

నృత్య రూపకంలోని దృశ్యం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆదివారం గోదా కల్యాణం కూచిపూడి నృత్య రూపకం ప్రదర్శించారు. గుళ్లపల్లి సుబ్బారావు సేవా సంస్థ ఆధ్వర్యంలో జరగ్గా, గుళ్లపల్లి సుబ్బారావు, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య, ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, వేంకటరామశర్మ దంపతులు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం శ్రీనత్య ఆర్ట్ అకాడమి(విజయవాడ) నాట్యాచార్యులు భాగవతుల వెంకటరామశర్మ శిష్య బృందం గోదా కల్యాణం నృత్యరూపకం ప్రదర్శించారు. సాక్ష్యాత్తు భూదేవి అంశ అయిన గోదాదేవి, శ్రీరంగనాథుడిని వివాహం చేసుకున్న దివ్యమైన ప్రేమకథ అని, ధనుర్మాస వ్రతం ఆచరించడం, గోదాదేవి శ్రీకృష్ణుడిని తన పతిగా పొంది, చివరకు రంగనాథుడిలో ఐక్యమయ్యే దృశ్యాలను ప్రదర్శించారు. అనంతరం భాగవతుల వెంకటరామశర్మ దంపతులను, శిష్య బృందాన్ని సత్కరించగా, సంస్థ కన్వీనర్ రాఘవ రావు పాల్గొన్నారు.

వావ్.. బాల మహోత్సవ్!

విజ్ఞాన్‌లో సందడిగా కొనసాగిన విజ్ఞాన్ బాల మహోత్సవ్–2కే26

కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో జరుగుతున్న రాష్ట్రస్థాయి రెండో ఎడిషన్ 'విజ్ఞాన్ బాల మహోత్సవ్–2కే26' రెండో రోజు ఆదివారం సందడిగా సాగింది. సోమవారం జరిగే ముగింపు వేడుకలకు విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లవరపు సూర్యతేజ (ఐఆర్‌ఎంఎస్) ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. వివిధ క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు రూ.5 లక్షల నగదు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు, మెమొంటోలు అందజేయనున్నారు. రెండో రోజు ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ కేవీ క్రిష్ణకిషోర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ కొంత సమయం క్రీడలకు కేటాయించాలని సూచించారు. ఫిజికల్‌గా ఫిట్‌గా ఉంటే మెంటల్‌గా కూడా బలంగా ఉంటారని, దాంతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని చెప్పారు. క్రీడలు కేవలం శారీరక ఉల్లాసానికే కాకుండా మానసిక ఉల్లాసానికి దోహదపడుతుందన్నారు.

పోటాపోటీగా క్రీడలు..

విజ్ఞాన్ బాల మహోత్సవ్‌లో భాగంగా నిర్వహిస్తున్న పోటీల్లో విద్యార్థులు నువ్వా నేనా అన్నట్లుగా పోటీపడుతున్నారు. క్రీడా పోటీలలో భాగంగా వాలీబాల్, కబడ్డీ, ఖో–ఖో, బాస్కెట్ బాల్, ఫుట్‌బాల్, చెస్, అథ్లెటిక్స్ (100 మీటర్లు, 800 మీటర్లు, 4x100 మీటర్లు రిలే, లాంగ్‌జంప్, షాట్‌పుట్) వంటి విభాగాల్లో ఉత్కంఠభరితమైన పోటీలు జరిగాయి.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

నృత్య–సంగీత విభాగంలో క్లాసికల్ డాన్స్ సోలో, వెస్ట్రన్, ఫోక్ గ్రూప్, వెస్ట్రన్ డాన్స్ గ్రూప్, కర్ణాటిక్ వోకల్ సోలో, సింగింగ్ ఐడల్–లిటిల్ చాంప్, గ్రూప్ సింగింగ్ (ఫోక్, దేశభక్తి గీతాలు), మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్ సోలో ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సృజనాత్మక కళలు–ఫ్యాషన్ విభాగంలో ఆన్ ద స్పాట్ పెయింటింగ్, క్లే మోడలింగ్, ట్రెడిషనల్ అండ్ ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్లు ఆకర్షణగా నిలిచాయి. పోటీలన్నీ సెమీఫైనల్స్ దశకు చేరుకోగా, సోమవారం ఫైనల్స్ జరగనున్నాయి. విజేతలకు ముగింపు కార్యక్రమంలో ట్రోఫీలు, ప్రశంసా పత్రాలతో పాటు నగదు బహుమతులు అందజేయనున్నారు.

పరుగుపందెంలో సత్తా చాటిన యువతులు

చదరంగంలో ఎత్తుకు పై ఎత్తులు

జాగ్రత్తలతో బిడ్డకు షుగర్ రాకుండా చేయవచ్చు

డాక్టర్ సునీల్ గుప్తాను సత్కరిస్తున్న దృశ్యం

గుంటూరు మెడికల్: గర్భిణికి మధుమేహం ఉన్నా హై బ్లడ్ షుగర్ లెవెల్స్ రాకుండా చూసుకుంటూ కడుపులోని బిడ్డ హై బ్లడ్ షుగర్ లెవెల్స్‌కు ఎక్స్పోజ్ కాకుండా జాగ్రత్త తీసుకున్నట్లయితే రాబోయే తరాల్లో మధుమేహ వ్యాధిని అరికట్టవచ్చని ప్రముఖ ఐవీఎఫ్ స్పెషలిస్ట్, గైనకాలజీ వైద్యుల సంఘం సెక్రటరీ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ చెప్పారు.స్థానిక భారతీయ విద్యా భవన్ ఆడిటోరియంలో మధుమేహ వ్యాధినిపుణులు, డయాబెటిస్ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ వీవీ రామ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గర్భిణులలోఐదుగిరిలో ఒకరికి మధుమేహం లక్షణాలు కనబడుతున్నాయి కాబట్టి డాక్టర్లు ముందుగానే గుర్తించి చికిత్స చేస్తే తల్లిని బిడ్డని కాపాడుకోవచ్చని తెలిపారు. డాక్టర్ సునీల్ గుప్తా, పద్మశ్రీ డాక్టర్ వి.శేషయ్య గోల్డ్ మెడల్ ఓరేషన్ ప్రసంగించారు. కార్యక్రమానికి చైర్ పర్సన్స్‌గా జీజీహెచ్ గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ వి.అరుణ వ్యవహరించారు. కార్యక్రమంలో గుంటూరుకు చెందిన సీనియర్ వైద్యులు డాక్టర్ టీసీ రెడ్డి, డాక్టర్ రాఘవ శర్మ, డాక్టర్ వైవీఎస్ ప్రభాకర్, డాక్టర్ పీవీ రావు, డాక్టర్ సేవ కుమార్, డాక్టర్ కమలా రామ్ కుమార్ పాల్గొన్నారు.

వృద్ధులకు వ్యాధులపై అవగాహన ఉండాలి

ఆరోగ్య సభలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రావణి, వేదికపై డాక్టర్ రాహుల్ కృష్ణ

లక్ష్మీపురం: 60 ఏళ్ల వయసు తర్వాత తలెత్తే కంటి, చర్మ సంబంధిత వ్యాధులు సహజంగా వస్తుంటాయని కావున ఆ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్లు శ్రావణి, రాహుల్ కృష్ణ అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలంయలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. చర్మ వ్యాధి నిపుణలు డాక్టర్ రాహుల్ కృష్ణ మాట్లాడుతూ చర్మ వ్యాధులు ఇన్ఫెక్షన్లు, ఎలర్జీలు రోగ నిరోధక శక్తి సమస్య, జన్యుపరమైన సమస్యల వలన వస్తాయని చెప్పారు. చర్మంపై దద్దుర్లు దురద, ఎరుపు పొక్కులు, చర్మం రంగు మారటం వంటివి కనిపిస్తే అవి చర్మవ్యాధుల లక్షణాలుగా భావించాలని కోరారు. సాధారణంగా పెద్ద వయసు వారిలో తామర, సొరియాసిస్ మొటిమలు, బొబ్బలు లాంటి చర్మ వ్యాధులు ఎక్కువగా వస్తుంటాయన్నారు. చర్మంపై వాపు, ఎరుపు, తీవ్రమైన దురద, మంట, చర్మం పొడిబారటం లేదా పగుళ్లు రావడం, దురదలు రావడం జరుగుతుంటాయని వాటిని గమనించిన వెంటనే చర్మవ్యాధి నిపుణులను సంప్రదించాలని సూచించారు. నేత్ర వైద్య నిపుణలు డాక్టర్ శ్రావణి మాట్లాడుతూ. బయట ప్రపంచానికి మనకు బంధం ఏర్పరిచే పంచేంద్రియాలలో కన్ను అన్నిటి కంటే ముఖ్యమైన విషయాన్ని గుర్తించి నేత్రం వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అక్షరాలు స్పష్టంగా కనిపించక పోవడం, చదవలేకపోవడం, లాంటి లక్షణాలను గుర్తిస్తే వెంటనే ఆప్తమాలజిస్ట్లు సంప్రదించి దృష్టికి సంబంధించిన పరీక్షలు చేయించుకుని సమస్య పెద్దది కాకుండా చేసుకోవాలని కోరారు. అనంతరం అవగాహన సభ్యులు డాక్టర్ శ్రావణి. రాహుల్ కృష్ణ లను ఘనంగా సత్కరించారు. సభలో చర్మవ్యాధి నిపుణురాలు డాక్టర్ సౌమ్య, యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్ ప్రసంగించారు.

కేంద్ర బడ్జెట్‌తో దేశ ఆర్థిక వృద్ధి మరింత బలోపేతం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు

పార్టీ జిల్లా కార్యాలయంలో బడ్జెట్ సమావేశాన్ని స్క్రీన్‌పై వీక్షిస్తున్న బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ దేశ ఆర్థిక వృద్ధిని మరింత బలోపేతం చేస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అన్నారు. ఆదివారం స్థానిక లాల్‌పురం రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో బడ్జెట్ ప్రసంగాన్ని బీజేపీ నేతలు, ఆర్థిక నిపుణులు, వ్యాపార వర్గాలతో కలసి స్క్రీన్‌పై ప్రత్యక్షంగా వీక్షించారు. అనంతరం జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే కాకుండా, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ఉపాధి సృష్టికి, పెట్టుబడులకు, పారిశ్రామిక వృద్ధికి అనుకూలంగా రూపొందించబడిందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా రైతులు, మధ్యతరగతి, యువత, మహిళలు, వ్యాపార వర్గాలకు ఉపయోగపడే అనేక సంస్కరణాత్మక నిర్ణయాలు ఈ బడ్జెట్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. వికసిత్ భారత్ లక్ష్యాయన్ని సాధించే దిశగా ముందడుగు అని, దేశాన్ని ప్రపంచ ఆర్థిక శక్తిగా నిలబెట్టే దిశలో కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు ఇది స్పష్టమైన నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జోనల్ సమన్వయకర్త వల్లూరు జయప్రకాష్ నారాయణ, ప్రముఖ ఆడిటర్లు కేవీ బ్రహ్మం, మన్నవ శ్రీనివాస్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఏల్చూరి వెంకటేశ్వర్లు, భారతీయ వికాస్ పరిషత్ అధ్యక్షులు బైరిశెట్టి మల్లికార్జునరావు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బిట్రా శివన్నారాయణ, పొగాకు బోర్డు చైర్మన్ సి.హెచ్.యశ్వంత్, రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, జాతీయ స్పైసెస్ బోర్డు సభ్యుడు కొత్తూరి వెంకట సుబ్బారావు, బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ తాడువాయి రామకృష్ణ, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంతేటి బ్రహ్మయ్య, డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, డాక్టర్ రాధా మాధవి, దేసు సత్యనారాయణ, బజరంగ్ రామకృష్ణ, తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేతన జీవులకు బడ్జెట్‌లో నిరాశ

సయ్యద్ చాంద్ బాషా

గుంటూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వార్షిక బడ్జెట్ 2026–2027 ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగులకు ఎటువంటి ప్రయోజనం లేదని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు అసోసియేషన్(అమరావతి) రాష్ట్ర ప్రధానకార్యదర్శి సయ్యద్ చాంద్ బాషా విమర్శించారు. ఆదాయ పన్ను విధానం అలాగే ఉంచారని చెప్పారు. ఉద్యోగులకు ఎలాంటి ప్రయోజనం ఉండదని, కనీసం 12 లక్షల నుంచి 15 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు ఇచ్చి ఉంటే ఉద్యోగులకు కాస్తంత ఉపశమనం కలిగేలా ఉండేదని అభిప్రాయపడ్డారు. నిత్యావసరాల ఖర్చులతో పాటు అన్ని ఖర్చులు అధికంగా పెరిగినట్లు చెప్పారు. దీంతో పాటు అన్ని రకాల ఉద్యోగులకు ఈ బడ్జెట్ పెద్దగా ఒరగబెట్టిందేమీలేదని వివరించారు. కనీసం రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని కొన్ని సిఫార్సులు చేసి ఉంటే బాగుండేదని పేర్కొన్నారు.

గ్రూపు- 2లో ఉద్యోగం సాధించిన యువకుడికి ఘన స్వాగతం



గ్రూపు- 2లో డెప్యూటీ తహసీల్దార్ ఉద్యోగం సాధించిన బద్దెపూడి సుకేష్‌తో తల్లిదండ్రులు

పెదకాకాని: గ్రూపు- 2 ఫలితాల్లో డెప్యూటీ తహసీల్దార్ ఉద్యోగం సాధించిన బద్దెపూడి సుకేష్‌కు తల్లిదండ్రులు, స్నేహితులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. మండల పరిధిలోని తంగెళ్లమూడికి చెందిన బద్దెపూడి సుకేష్ తిరుపతి పోలీసు ట్రెనింగ్ సెంటర్‌లో 43 రోజులుగా కానిస్టేబుల్ ట్రైనింగ్‌లో ఉన్నాడు. జనవరి 28వ తేదీన ప్రకటించిన గ్రూపు- 2 పరీక్షల్లో డెప్యూటీ తహసీల్దార్‌కు ఎంపికయ్యాడు. తిరుపతి నుంచి ఆదివారం సాయంత్రం గుంటూరు నుంచి నందివెలుగు వెళ్లే రోడ్డులోని తంగెళ్ళమూడి అడ్డరోడ్డుకు చేరుకున్నాడు. అప్పటికే అక్కడికి తల్లిదండ్రులతో పాటు కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు, గ్రామ ప్రజలు చేరుకున్నారు. ఘన స్వాగతం పలికారు. పూలు, శాలువాలతో సత్కరించారు. గ్రామంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుకేష్ మాట్లాడుతూ గ్రూపు 2 లో విజయం సాధించడానికి సహకరించి ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానన్నారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్ట్

తెనాలిరూరల్: భార్య హత్య కేసులో భర్తను పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ రామలింగేశ్వరపేట పాత డిపో ప్రాంతానికి చెందిన బండా శిరీషను ఆమె భర్త సాయిబాబు జనవరి 27న హత్య చేశాడు. అనుమానంతో హత్య చేసినట్టు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. నిందితుడిని శనివారం రాత్రి పొద్దుపోయాక అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు ఈస్ట్)
90109 57733
Office mail : sakshigntadvt@gmail.com

కేంద్ర బడ్జెట్‌లో క్రీడలకు రూ.4479.88 కోట్లు

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో ఈసారి క్రీడలకు కాస్త ప్రాధాన్యం పెరిగింది. గతంతో పోలిస్తే సుమారు రూ.1133 కోట్లకు పైగా నిధుల్ని పెంచారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో క్రీడలు, యువజన సర్వీసులకు రూ. 4479.88 కోట్లు కేటాయించారు. గత ఆర్థిక సంవత్సరం రూ. 3346.54 కోట్లు నిధులివ్వగా తాజా బడ్జెట్‌లో రూ.1133.34 కోట్ల మేర హెచ్చింపు చేశారు. దేశ వ్యాప్తంగా క్రీడా కేంద్రాల నిర్వహణ, శిబిరాలు ఏర్పాటు చేసే భారత స్పోర్ట్స్ అథారిటీకి రూ. 917.38 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో రూ.880 కోట్లు ఇవ్వగా కాస్త పెంచారు. అయితే డోప్ పరీక్షల ల్యాబొరేటరీతో పాటు జాతీయ డోపింగ్ నిరోధక ఏజెన్సీ (నాడా) నిధుల్లో కోత పెట్టారు. డోపింగ్ టెస్టులకు క్రితం ఏడాది రూ.28.55 కోట్లు ఇస్తే... ప్రస్తుతం రూ.23 కోట్లకు కుదించారు. జాతీయ స్పోర్ట్స్ యూనివర్సిటీకి గతంలో రూ. 78.64 కోట్లు విదిల్చిన ఆర్థికమంత్రి తాజాగా రూ.46.98 కోట్లే కేటాయించారు. 1998లో ఏర్పాటు చేసిన జాతీయ క్రీడాభివృద్ధి నిధిని రూ. 3 కోట్ల నుంచి రూ.5 కోట్లకు పెంచారు. అలాగే క్రీడాకారుల ప్రోత్సాహకాలను రూ. 28 కోట్ల నుంచి రూ. 40 కోట్లకు పెంచారు. జాతీయ క్రీడా సమాఖ్యలకు ఇచ్చే నిధుల్ని రూ. 400 కోట్ల నుంచి 425 కోట్లకు హెచ్చింపు చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం ‘ఖేలో ఇండియా’కు రూ.924.35 కోట్లు కేటాయించారు. గతేడాది రూ. 1000 కోట్లు నిధులివ్వగా... కేవలం రూ.700 కోట్లే వెచ్చించడంతో ఇప్పుడు తగ్గించారు.

అల్‌కరాజ్ కొత్త చరిత్ర

‘కెరీర్ గ్రాండ్‌స్లామ్’ పూర్తి చేసుకున్న స్పెయిన్ స్టార్

- ఈ ఘనత సాధించిన అతిపిన్న వయస్కుడిగా రికార్డు
- తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ హస్తగతం
- ఫైనల్లో సెర్బియా దిగ్గజం జొకోవిచ్‌పై విజయం
- రూ. 26 కోట్ల 55 లక్షల ప్రైజ్‌మనీ సొంతం

రన్నరప్ ట్రోఫీతో జొకోవిచ్
అల్‌కరాజ్ గెలుపు సంబరం

మెల్‌బోర్న్: పురుషుల టెన్నిస్ చరిత్రలో స్పెయిన్ స్టార్, ప్రపంచ నంబర్‌వన్ అల్‌కరాజ్ కొత్త రికార్డు నెలకొల్పాడు. టెన్నిస్‌లోని నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీల టైటిల్స్‌ను సాధించిన అతిపిన్న వయస్కుడిగా (22 ఏళ్ల 272 రోజులు) అల్‌కరాజ్ చరిత్ర సృష్టించాడు. ఆదివారం ముగిసిన ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీలో ఈ స్పెయిన్ స్టార్ తొలిసారి విజేతగా అవతరించాడు. 10 సార్లు చాంపియన్, 24 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన సెర్బియా దిగ్గజం జొకోవిచ్‌తో జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో అల్‌కరాజ్ 2–6, 6–2, 6–3, 7–5తో గెలుపొందాడు. విజేత అల్‌కరాజ్‌కు 41,50,000 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 26 కోట్ల 55 లక్షలు), రన్నరప్ జొకోవిచ్‌కు 21,50,000 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 13 కోట్ల 75 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. అల్‌కరాజ్ కెరీర్‌లో ఇది ఏడో గ్రాండ్‌స్లామ్ టైటిల్. ఇప్పటికే అతను ఫ్రెంచ్ (2024, 2025), వింబుల్డన్ (2023, 2024), యూఎస్ ఓపెన్ (2022, 2025)లను రెండుసార్లు చొప్పున గెలిచాడు. తాజా ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌తో అల్‌కరాజ్ ‘కెరీర్ గ్రాండ్‌స్లామ్’ పూర్తి చేసుకున్న అతిపిన్న వయస్కుడిగా గుర్తింపు పొందాడు. ఓవరాల్‌గా డాన్ బడ్జ్ (అమెరికా; 22 ఏళ్ల 363 రోజులు; 1938లో) పేరిట ఉన్న రికార్డును.... ఓపెన్ శకం (1968) మొదలయ్యాక నాదల్ (స్పెయిన్; 24 ఏళ్ల 88 రోజులు; 2010లో) పేరిట ఉన్న రికార్డులను ఈ స్పెయిన్ స్టార్ సవరించాడు. తాజా ఓటమితో అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ (25) నెగ్గిన ఏకైక ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పాలని ఆశించిన జొకోవిచ్‌కు నిరాశ ఎదురైంది.

ఫైనల్ మ్యాచ్ గణాంకాలు

అల్‌కరాజ్		జొకోవిచ్
9	ఏస్‌లు	4
2	డబుల్ ఫాల్ట్‌లు	2
5/16	బ్రేక్ పాయింట్లు	2/6
36	విన్నర్స్	32
27	అనవసర తప్పిదాలు	46
14/20	నెట్ పాయింట్లు	20/32
118	మొత్తం పాయింట్లు	106

9 పురుషుల టెన్నిస్‌లో ‘కెరీర్ గ్రాండ్‌స్లామ్’ పూర్తి చేసుకున్న 9వ ప్లేయర్ అల్‌కరాజ్. ఈ జాబితాలో ఫ్రెడ్ పెర్రీ (బ్రిటన్; 1935లో), డాన్ బడ్జ్ (అమెరికా; 1938లో), రాడ్ లేవర్ (ఆస్ట్రేలియా; 1962లో), రాయ్ ఎమర్సన్ (ఆస్ట్రేలియా; 1964లో), అగస్సీ (అమెరికా; 1999లో), ఫెడరర్ (స్విట్జర్లాండ్; 2009లో), నాదల్ (స్పెయిన్; 2010లో), జొకోవిచ్ (సెర్బియా; 2016లో) ఉన్నారు.

తొలి సెట్ కోల్పోయినా...

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఫైనల్ చేరిన 10 సార్లూ విజేతగా నిలిచిన జొకోవిచ్‌కు తుది పోరులో తొలిసారి ఓటమి ఎదురైంది. సెమీస్‌లో డిఫెండింగ్ చాంపియన్ సినెర్ (ఇటలీ)పై ఐదు సెట్‌ల పోరులో గెలిచిన జొకోవిచ్ తొలి సెట్‌ను గెలిచి ఫైనల్లో శుభారంభం చేశాడు. అయితే 38 ఏళ్ల జొకోవిచ్‌తో పోలిస్తే ఎక్కువ ఫిట్‌గా ఉన్న అల్‌కరాజ్ రెండో సెట్ నుంచి తన అసలు ఆటతీరును ప్రదర్శించాడు. రెండో సెట్‌లో రెండుసార్లు... మూడో సెట్‌లో రెండు సార్లు జొకోవిచ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి అతను ఈ రెండు సెట్‌లు గెలిచాడు. నాలుగో సెట్‌లోని 12వ గేమ్‌లో జొకోవిచ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన అల్‌కరాజ్ సెట్‌తోపాటు విజయాన్ని ఖాయం చేసుకున్నాడు.

ప్రపంచకప్‌లో ఆడతాం... కానీ భారత్‌తో ఆడం

పాకిస్తాన్ ప్రభుత్వ ప్రకటన


భారత్, పాక్ టి20 జట్ల కెప్టెన్‌లు సూర్యకుమార్, సల్మాన్ ఆఘా (ఫైల్)

లాహోర్: మరో ఐదు రోజుల్లో మొదలయ్యే పురుషుల టి20 ప్రపంచకప్‌పై పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) తమ నిర్ణయాన్ని వెల్లడించింది. కొన్నాళ్లుగా బంగ్లాదేశ్‌కు బాసటగా నిలిచేందుకు ఈ మెగా ఈవెంట్‌నే బహిష్కరిస్తామని బీరాలు పలికిన పాక్ ఇప్పుడు ప్రపంచకప్ ఆడేందుకు సిద్ధమైంది. అయితే భారత్‌తో మాత్రం మ్యాచ్ ఆడబోమని ప్రకటించింది. నిజానికి జట్లు ఎంపిక, ప్రకటనకు ఐసీసీ ఇచ్చిన తుదిగడువుకు ముందే పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) తమ జట్టును ప్రకటించింది. అయితే తమ ప్రభుత్వం ఆమోదం తెలిపితేనే ప్రపంచకప్ ఆడతామని జట్టును ఎంపిక చేసిన సందర్భంలో తెలిపింది. ప్రపంచకప్‌లో ఆడేందుకు అనుమతి ఇచ్చిన పాకిస్తాన్ ప్రభుత్వం భారత్‌తో జరిగే మ్యాచ్‌ను మాత్రం బహిష్కరించాలని నిర్ణయం తీసుకుంది. దాంతో వరల్డ్‌కప్ ఆడతామని ఆదివారం స్పష్టం చేసిన పీసీబీ ఈ నెల 15న కొలంబో (శ్రీలంక) వేదికగా భారత్‌తో జరిగే మ్యాచ్‌లో బరిలోకి దిగబోమని తెలిపింది. ఈ నేపథ్యంలో పీసీబీపై ఐసీసీ తీసుకోబోయే చర్యలెలా ఉంటాయో తెలియదు కానీ... దాయాదుల ‘ప్రపంచ’ సమరంపై ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న క్రికెట్ అభిమానులకు ఇది కచ్చితంగా గుండెకోతే! ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌ల మధ్య జరిగే ప్రతిష్టాత్మక ‘యాషెస్’ కంటే కూడా భారత్, పాక్ మ్యాచ్‌లకు ఉండే ప్రేక్షకాదరణే ఎక్కువ! కోట్లాది మంది వీక్షణతో ఎన్నోమార్లు ఇది రుజువైంది కూడా! ఫ్యాన్స్‌పైనే కాదు తక్షణ ప్రభావం గ్లోబల్ బ్రాడ్‌కాస్టర్లపై కూడా పడుతుంది. అసలే 20 జట్లు ఆడుతున్న ఈ మెగా టోర్నీలో ఇక ఒక్క మ్యాచ్‌కు కూడా కిక్కిరిసే మైదానం కనబడక... టికెట్ రెవెన్యూ యాడ్ రెవెన్యూ, ఓ ప్రపంచకప్‌కు వీక్షకుల సంఖ్య, ఇలా అన్నింటి పైనా తక్షణ ప్రభావం పడుతుంది.

రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్లో ఆంధ్ర

సొవిమా (నాగాలాండ్): దేశవాళీ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ రంజీ ట్రోఫీలో ఆంధ్ర జట్టు నాకౌట్ దశకు దూసుకెళ్లింది. నాగాలాండ్‌తో గ్రూప్ ‘ఎ’ చివరి లీగ్ మ్యాచ్‌ను ‘డ్రా’ చేసుకున్న ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ద్వారా 3 పాయింట్లు సాధించింది. గ్రూప్ ‘ఎ’లో ఆంధ్ర, జార్ఖండ్, విదర్భ జట్లు 31 పాయింట్లతో ఉమ్మడిగా అగ్రస్థానంలో నిలిచాయి. అయితే మెరుగైన రన్‌రేట్ ఆధారంగా రికీ భుయ్ సారథ్యంలోని ఆంధ్ర జట్టుతో పాటు జార్ఖండ్ జట్టు క్వార్టర్ ఫైనల్‌కు చేరాయి. డిఫెండింగ్ చాంపియన్ విదర్భకు నిరాశ ఎదురైంది. ఓవర్‌నైట్ స్కోరు 85/4తో ఆఖరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన నాగాలాండ్ జట్టు చివరకు 104 ఓవర్లలో 342 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో రాణించిన వికెట్ కీపర్ బ్యాటర్ చేతన్ బిస్త్ (100; 6 ఫోర్లు, 1 సిక్స్) మరో శతకంతో అదరగొట్టాడు. ఆంధ్ర బౌలర్లలో త్రిపురాణ విజయ్ 5 వికెట్లు పడగొట్టగా... సౌరభ్ కుమార్ 4 వికెట్లు తీశాడు. అనంతరం 173 పరుగుల విజయలక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు 8.3 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 64 పరుగులు చేసింది. ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇరు జట్ల కెప్టెన్‌లు ‘డ్రా’కు అంగీకరించారు. ఛత్తీస్‌గఢ్‌తో గ్రూప్ ‘డి’లో చివరి లీగ్ మ్యాచ్‌ను హైదరాబాద్ ‘డ్రా’ చేసుకొని 16 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. శుక్రవారం నుంచి జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో జార్ఖండ్‌తో ఉత్తరాఖండ్; మధ్యప్రదేశ్‌తో జమ్మూ కశ్మీర్; బెంగాల్‌తో ఆంధ్ర; ముంబైతో కర్ణాటక తలపడతాయి.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సెమీస్‌లో భారత్

- ‘సూపర్ సిక్స్’లో పాకిస్తాన్‌పై గెలుపు
- 4న రెండో సెమీస్‌లో అఫ్గానిస్తాన్‌తో ‘ఢీ’

కనిష్క్ చౌహాన్

బులవాయో: అండర్–19 ప్రపంచ కప్ టోర్నీలో ఆయుశ్ మాత్రే సారథ్యంలోని యువ భారత జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. పాకిస్తాన్‌తో ఆదివారం జరిగిన ‘సూపర్ సిక్స్’ మ్యాచ్‌లో ఓడినా ముందుకెళ్లే అవకాశముండగా... భారత జట్టు 58 పరుగుల తేడాతో దర్జాగా గెలిచి సెమీస్ చేరింది. ముందుగా భారత్ 49.5 ఓవర్లలో 252 పరుగులకు ఆలౌటైంది. వేదాంత్ త్రివేది (68; 2 ఫోర్లు, 1 సిక్స్), ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ కనిష్క్ చౌహాన్ (35; 4 ఫోర్లు, 1 సిక్స్), వైభవ్ సూర్యవంశీ (30; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. తర్వాత 33.3 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదిస్తేనే సెమీస్ అర్హత సాధించే క్రమంలో పాక్ తేలిపోయింది. 46.2 ఓవర్లలో 194 పరుగులకే కుప్పకూలింది. భారత బౌలర్లలో ఖిలాన్ పటేల్, ఆయుశ్ మాత్రే చెరో 3 వికెట్లు తీశారు. బుధవారం హరారేలో జరిగే రెండో సెమీఫైనల్లో అఫ్గానిస్తాన్‌తో భారత్; మంగళవారం జరిగే తొలి సెమీఫైనల్లో ఇంగ్లండ్‌తో ఆస్ట్రేలియా తలపడతాయి.

‘ఎలిమినేటర్’కు ఢిల్లీ క్యాపిటల్స్

చివరి లీగ్ మ్యాచ్‌లో యూపీ వారియర్స్‌పై విజయం

శ్రీచరణి, జెమీమా

వడోదర: మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ‘ఎలిమినేటర్’ పోరుకు అర్హత పొందింది. ఆదివారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో జెమీమా రోడ్రిగ్స్ సారథ్యంలోని ఢిల్లీ 5 వికెట్ల తేడాతో యూపీ వారియర్స్‌పై నెగ్గింది. తొలుత యూపీ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది. దీప్తి శర్మ (24; 4 ఫోర్లు, 1సిక్స్), సిమ్రన్ షేక్ (22; 3 ఫోర్లు), శిఖా పాండే (23; 3 ఫోర్లు) రెండు పదులు స్కోర్లు చేశారు. మరిజాన్ కాప్ 3, హెన్రీ, శ్రీచరణి చెరో 2 వికెట్లు తీశారు. తర్వాత ఢిల్లీ 18.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 126 పరుగులు చేసి గెలిచింది. వోల్వార్డ్ (47; 7 ఫోర్లు) రాణించింది. వరుసగా నాలుగోసారి ఫైనల్ చేరేందుకు ఢిల్లీ క్యాపిటల్స్ మంగళవారం జరిగే గుజరాత్‌తో ఎలిమినేటర్ మ్యాచ్ ఆడుతుంది. ఇప్పటికే బెంగళూరు నేరుగా ఫైనల్ చేరింది.

సాక్షి సినిమా

మన జీవితాల్లోని మహిళలే మనకు బలం

- రామ్‌చరణ్

రామ్‌చరణ్, ఉపాసన

జనవరి 31న (శనివారం) రామ్‌చరణ్–ఉపాసన కవలలకు తల్లిదండ్రులైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రామ్‌చరణ్ తన సంతోషాన్ని సోషల్ మీడియా వేదికగా వ్యక్తపరచి, ఓ స్పెషల్ ఫొటోను షేర్ చేశారు. ‘‘మాకు బాబు, పాప జన్మించారన్న విషయాన్ని మీతో పంచుకుంటున్నందుకు హ్యాపీగా ఉంది. ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండటాన్ని ఎంతో కృతజ్ఞతగా భావిస్తున్నాం. మన జీవితాల్లోని మహిళలే మనకు అత్యంత బలం. ప్రతి క్షణం మాకు అండగా నిలుస్తున్న మా అభిమానులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు’’ అని రామ్‌చరణ్ షేర్ చేశారు. ఇక 2023 జూన్ 20న ఈ దంపతులకు తొలి సంతానంగా కుమార్తె క్లింకార జన్మించిన విషయం తెలిసిందే.

చాలా సంతోషంగా ఉన్నాం: చిరంజీవి

ఆదివారం మీడియాతో చిరంజీవి మాట్లాడుతూ– ‘‘భగవంతుడు, హనుమాన్ కృప వల్ల ఒక పాప, ఒక బాబు జన్మించారు. ఉపాసన, బిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారు. మా అభిమానులు, మా మంచి కాంక్షించే ప్రతి ఒక్కరితో ఈ శుభ వార్తను పంచుకోవడం చాలా సంతోషంగా ఉంది. కొణిదెల, కామినేని... రెండు కుటుంబాల సభ్యులు సంతోషంగా ఉన్నాం. ఇంత సుఖ ప్రసవం జరిగినందుకు అపోలో వైద్యులకు, వారి సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను’’ అని చెప్పారు.

చలో జార్జియా

మహేశ్‌బాబు

హీరో మహేశ్‌బాబు జార్జియా వెళ్లనున్నారట. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో రూపొందుతున్న చిత్రం ‘వారణాసి’. ఈ సినిమాలో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రకాశ్‌రాజ్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. మహేశ్‌బాబు–ప్రియాంకా చోప్రా పాల్గొంటుండగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. కాగా, ‘వారణాసి’ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ జార్జియాలో మొదలు కానుందని సమాచారం. అక్కడ షూటింగ్ చేసేందుకు సంబంధించిన కార్యాచరణను ఆల్రెడీ ప్రారంభించారట రాజమౌళి. అలాగే ఓ కీలక షెడ్యూల్‌ను అంటార్కిటాలోనూ ప్లాన్ చేశారని ఫిల్మ్‌నగర్ భోగట్టా. ఒకవేళ అంటార్కిటా లొకేషన్స్‌లో చిత్రీకరణ జరిగితే, అక్కడి క్లిష్టమైన లొకేషన్స్‌లో చిత్రీకరణ జరుపుకునే తొలి భారతీయ చిత్రంగా ‘వారణాసి’ సినిమా నిలుస్తుందనే ప్రచారం జరుగుతోంది. కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్న ఈ సినిమా 2027 ఏప్రిల్ 7న రిలీజ్ కానుంది.

దసరాకి కింగ్


నాగార్జున

హీరో నాగార్జున ఒక స్పెషల్ మూవీ చేస్తున్నారు. మరి... కెరీర్‌లో నూరవ చిత్రం అంటే ప్రత్యేకమే కదా. అందుకే దసరా పండగకి సందడి చేయాలని నిర్ణయించుకున్నట్లున్నారు. అభిమానులు కూడా తమ కింగ్ (నాగార్జునని అలానే పిలుస్తారు) సెంచరీ సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ‘కింగ్ 100’ అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ చిత్రం రూపొందుతోంది. తమిళ చిత్రం ‘నిదమ్ ఒరు వానమ్’తో దర్శకుడిగా పరిచయమైన ఆర్ఏ కార్తీక్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఫ్యామిలీ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారని సమాచారం. లాటరీ నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుందని భోగట్టా. అందుకే ‘లాటరీ కింగ్’ అనే టైటిల్‌ని అనుకుంటున్నారట. ఇంకా ‘కింగ్ 100, కింగ్ 100 నాటౌట్’ టైటిల్స్‌ని కూడా పరిశీలిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రంలో టబు నటిస్తున్నారు. టబు ఎంట్రీని అధికారికంగా ప్రకటించారు. అలాగే అనుష్క కూడా ఓ కీలక పాత్రలో కనిపిస్తారట. అయితే ఈ విషయంపై ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై నాగార్జున నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని దసరా సందర్భంగా విడుదల చేయాలనుకుంటున్నారనే వార్త తెరపైకి వచ్చింది.

మౌత్ టాక్‌తో నిలబడే చిత్రం ఇది

- నవీన్ చంద్ర

దివి, దివ్యా పిళ్లై, నవీన్ చంద్ర

‘‘హనీ’ మంచి థియేట్రికల్ ఫిల్మ్. మౌత్ టాక్‌తో నిలబడే చిత్రం అవుతుంది. ప్రేక్షకుల్లో ఆలోచన రేకెత్తిస్తుంది’’ అని నవీన్ చంద్ర చెప్పారు. కరుణకుమార్ దర్శకత్వంలో నవీన్ చంద్ర, దివ్యా పిళ్లై నటించిన చిత్రం ‘హనీ’. శేఖర్ స్టూడియోస్ సమర్పణలో ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 6న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో నవీన్ చంద్ర మాట్లాడుతూ– ‘‘ఈ చిత్రంలో ఓ డార్క్ సొసైటీని చూపించాం. మంచి ఇంటెన్సిటీ ఉన్న ఆనంద్ (నవీన్ చంద్ర పాత్ర) క్యారెక్టర్‌ను క్రియేట్ చేసిన కరుణకుమార్ గారికి థ్యాంక్స్’’ అని చెప్పారు. ‘‘నిజజీవిత సంఘటనల నేపథ్యంలో ఈ సినిమా తీశాం. మెదడు అంతా చీకటి ఉన్న మనుషుల మధ్య జరిగే కథే ఈ చిత్రం. మనిషి మెదడు కంటే పెద్ద దెయ్యం లేదనేది ఈ సినిమా సారాంశం. పిల్లి మాయ అనే ఓ వస్తువును శోధించి, సాధించే ఒక వ్యక్తి జీవితాన్ని ఈ సినిమాలో చూపించాం. అందరికీ చెప్పాల్సిన కథ ఇది. సినిమా ఒకరి జీవితాన్ని మార్చలేదు, అలాగే సందేశాన్ని కూడా ఇవ్వలేదు. కానీ తప్పు జరుగుతున్నప్పుడు దాన్ని టార్చి వేసి చూపించగలదు. నేను అదే చేశానని నమ్ముతున్నాను’’ అని అన్నారు కరుణకుమార్. ‘‘ఈ సినిమా చూసి షాక్ అయ్యాను’’ అని చెప్పారు రాజా రవీంద్ర. ‘‘చాలా కొత్త కథ ఇది. కథ విని భయపడ్డాను’’ అని తెలిపారు దివ్యా పిళ్లై. ‘‘ప్రేక్షకులను వెంటాడే చిత్రం ఇది’’ అని చెప్పారు దివి.

ప్రముఖ నటుడు రఘునాథ్ రెడ్డి కన్నుమూత



ప్రముఖ నటుడు కలకోట రఘునాథ్ రెడ్డి (83) కన్నుమూశారు. హైదరాబాద్ కాప్రా డివిజన్ ప్రథమపురి కాలనీలో నివాసం ఉండే రఘునాథ్ రెడ్డి శనివారం తీవ్ర అనారోగ్యానికి (బ్రెయిన్ స్ట్రోక్) గురయ్యారు. కుటుంబ సభ్యులు ఆయన్ను సికింద్రాబాద్ అపోలో ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూనే తుది శ్వాస విడిచినట్లు వైద్యులు నిర్ధారించారు. రఘునాథ్ రెడ్డి స్వగ్రామం కృష్ణా జిల్లా కుందేరు. పీయూసీ చదివిన రఘునాథ్ రెడ్డికి రైల్వేలో ఉద్యోగం వచ్చింది. అయితే నాటకాలంటే మక్కువతో చదువుకునే సమయంలోనే నాటక ప్రదర్శనలు వేసేవారు. అలా నటనపై ఉన్న ఇష్టంతో తొమ్మిదేళ్ల ముందుగానే వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుని సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాడు. 1988లో ‘కళ్లు’ సినిమాతో అరంగేట్రం చేశారు. తెలుగులోనే కాకుండా హిందీ, తమిళంలో దాదాపు 350కి పైగా సినిమాల్లో నటించారు. టీవీ సీరియల్స్‌లోనూ నటించారు. ‘ఒసేయ్ రాములమ్మ, ఇంద్ర, డాన్, తమ్ముడు, రాయలసీమ రామన్న చౌదరి, మల్లీశ్వరి, సంక్రాంతి, శ్రీరామ రాజ్యం’ వంటి సూపర్ హిట్ సినిమాల్లో రఘునాథ్ రెడ్డి కీలక పాత్రలు చేశారు. ఆయన నటించిన చివరి సినిమా ‘సుబ్రహ్మణ్యపురం’. ఆ తరువాత తన స్నేహితులతో కలిసి ఓ చిన్న సినిమాలో కూడా నటించినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. రఘునాథ్ రెడ్డికి భార్య అన్నపూర్ణ, కొడుకు సుధాకర్ రెడ్డి, ఇద్దరు కుమార్తెలు అరుణ, సుధాలక్ష్మి. నెల రోజుల క్రితం కుమారుడు సుధాకర్ గుండెపోటుతో కన్నుమూయడంతో రఘునాథ్ రెడ్డి మనోవేదనకు గురయ్యారు. కొడుకు మరణంతో ఆయన ఆరోగ్యం మరింత క్షీణించింది. శనివారం ఆయన కన్నుమూశారు. రఘునాథ్ రెడ్డి మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం లాలాపేట్‌లోని స్మశానవాటికలో ఆయన అంత్యక్రియలు జరిగాయి.

– కాప్రా (హైదరాబాద్)

హాయిగా నవ్వుతారు

- కె. హిమబిందు

రాజేష్, హిమబిందు, ప్రజోత్

రాజేష్ మేరు, నవ్య చిట్యాల నటించిన సినిమా ‘లగ్గం టైం’. కె. యశ్వంత్ కుమార్ సమర్పణలో ప్రజోత్ కె. వెన్నం దర్శకత్వంలో కె. హిమబిందు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 6న రిలీజ్ కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రాజేష్ మాట్లాడుతూ– ‘‘కథ విన్న వెంటనే ఈ సినిమా చేయాలనిపించింది’’ అని అన్నారు. ‘‘మేం కొత్తవాళ్లమే అయినా మేకింగ్‌లో ఎక్కడా తప్పులు జరగకుండా ఈ సినిమా చేశాం’’ అని చెప్పారు ప్రజోత్. ‘‘ప్రేక్షకులు ఈ సినిమా చూసిన తర్వాత వారి అభిప్రాయాన్ని చెబుతారు. అయితే రీ–రిలీజ్‌లను శుక్రవారం, వీకెండ్ సమయాల్లోనే రిలీజ్ చేస్తుంటే చిన్న చిత్రాలకు అంతగా ఆదరణ లభించడం లేదు. ఈ రీ–రిలీజ్‌ల విషయంలో ఓసారి అందరూ ఆలోచించాలి. మా ‘లగ్గం టైం’ను చూసిన ఆడియన్స్ హాయిగా థియేటర్స్ నుంచి నవ్వుతూ వెళ్తారని చెప్పగలను’’ అన్నారు కె. హిమబిందు.

వ్యవసాయం విలువ తెలిపేలా...

త్రిగుణ్, మధు, పాయల్

త్రిగుణ్ హీరోగా పాయల్ రాధాకృష్ణ హీరోయిన్‌గా నటించిన చిత్రం ‘వర్క్ ఫ్రమ్ హోమ్’. మధు దర్శకత్వంలో అరవింద్ నిర్మించారు. వైజాగ్‌లో జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో మధు మాట్లాడుతూ– ‘‘వ్యవసాయంలో నూతన యంత్ర పరికరాల వినియోగ ఆధారిత నేపథ్యంలో ఈ చిత్రం సాగుతుంది. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన ఓ యువతి, యువకుడి ప్రేమ, పెళ్లి, కుటుంబం నేపథ్యంలో ఈ సినిమా అందర్నీ అలరించేలా ఉంటుంది. ‘‘నేటి తరానికి అవసరమైన ఈ సినిమా భావితరాలకు సందేశం ఇచ్చేలా ఉంటుంది’’ అని త్రిగుణ్ పేర్కొన్నారు. ‘‘వ్యవసాయం విలువ తెలిపే మంచి కథాంశంతో రూపొందించిన మా సినిమాని ఫిబ్రవరి 13న రిలీజ్ చేస్తాం’’ అని నిర్మాత చెప్పారు.

అపర్ణ, ఏగన్, ఫెమీనా

హైకూ ఆరంభం

ఏగన్ హీరోగా ఫెమీనా జార్జ్, తెలుగు మూవీ ‘కోర్ట్’ ఫేమ్ శ్రీదేవి అప్పల్ల హీరోయిన్లుగా ‘హైకూ’ అనే చిత్రం ఆరంభం అయింది. కేరళలోని ఇడుక్కి ప్రాంతంలో ఆదివారం పూజా కార్యక్రమాలతో ప్రారంభించి, అనంతరం షూటింగ్ కూడా మొదలుపెట్టారు. యువరాజ్ చిన్నసామి దర్శకత్వంలో డా. డి. అరుళనందు, మ్యాథ్యూ అరుళ నందు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ‘జో’ వంటి సూపర్ హిట్ మూవీతో గుర్తింపు పొందిన హరిహరన్ రామ్ అడిషనల్ స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. ‘‘సాధారణంగా థియేట్రికల్ రన్ చూసిన తర్వాతే ఓటీటీ సంస్థలు డిజిటల్ హక్కుల కోసం ప్రయత్నిస్తాం. కానీ మా సినిమా షూటింగ్ పూర్తి కాక ముందే డిజిటల్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకోవడం విశేషం. ఇలా మా సినిమా విడుదలకు ముందే డిజిటల్ డీల్ క్లియర్ కావడం మాకు చాలా ఆనందంగా ఉంది’’ అని నిర్మాతలు పేర్కొన్నారు.

'మట్టిని నమ్ముకున్న వ్యక్తి రాబోయే రోజుల్లో ధనవంతుడు కావాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 312

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సోమవారం 2-2-2026

అందరికీ పెద్దపీట

రైతులు, మహిళా పారిశ్రామికవేత్తల దాకా అందరి ప్రయోజనాలకు పెద్దపీట వేశాం. అత్యధిక అనిశ్చితి, అస్తవ్యస్త పరిస్థితుల్లోనూ ఉమ్మడిగా మేం తీసుకున్న నిర్ణయాల వల్లే భారత ఆర్థికవ్యవస్థ స్థిరంగా ఉంది. ప్రజోపయోగ పథకాలపై పెట్టుబడులు పెడుతూనే ఆర్థిక వివేకం ప్రదర్శించాం. విపక్ష నేత రాహుల్ ఏం చెప్పదల్చుకున్నారో చెబితే సావధానంగా వింటా.. అందుకు తగినట్టు బదులిస్తా..

- నిర్మలా సీతారామన్, కేంద్ర ఆర్థిక మంత్రి

వికసిత్ భారత్‌కు రోడ్‌మ్యాప్

ఇది ఉజ్వల భవితకు బాటలు వేసే బడ్జెట్. అద్భుత అవకాశాలకు ఈ బడ్జెట్ ఒక రహదారి. ఇది భారతీయుల సమ్మిళిత సంకల్పం. ఈ చరిత్రాత్మక బడ్జెట్ యువత ఆకాంక్షలను నెరవేరుస్తుంది. మహిళల సాధికార స్ఫూర్తిని ప్రతిబింబిస్తోంది. గ్రామాల సంక్షేమం, పేదలు, రైతుల అభివృద్ధి కోసం చక్కటి బడ్జెట్‌ను తీసుకొచ్చిన నిర్మలా సీతారామన్‌కు, ఆమె బృందానికి నా అభినందనలు.

- ప్రధానమంత్రి మోదీ



నో హిట్టింగ్ ఓన్లీ డిఫెన్స్

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్

సుదీర్ఘ ఇన్నింగ్స్‌ను ఆరంభించిన మోదీ సర్కారు

- 2026 బడ్జెట్లో ఇన్‌ఫ్రా, తయారీ రంగాలపై ఫోకస్
- 7 హైస్పీడ్ రైల్ కారిడార్లు.. 4 రాష్ట్రాల్లో రేర్ ఎర్త్ మినరల్ హబ్‌లు
- ఫైనాన్షియల్ మార్కెట్లకు సంబంధించి పలు నిర్ణయాలు
- ఫ్యూచర్స్, ఆప్షన్లపై లావాదేవీల పన్ను భారీగా పెంపు

భారీగా పతనమైన స్టాక్ మార్కెట్లు

కొత్త ఆదాయపు పన్ను.. జీఎస్టీ మార్పుల వంటి అనూహ్య నిర్ణయాలు చూస్తున్న వీక్షకులంతా.. బడ్జెట్ కూడా ఈ వారంలో మొదలయ్యే టి-20 వరల్డ్‌కప్ మ్యాచ్‌లా ఉంటుందనుకున్నారు. తొలి బంతి నుంచే సిక్సర్ల వర్షాన్ని ఆశించారు. అభిషేక్ శర్మ స్థాయి పవర్‌ప్లేకి రెడీ అయిపోయారు.

కానీ... కెప్టెన్ మోదీ తమది టి-20 ధనాధన్ కాదని.. సుదీర్ఘ టెస్ట్ ఇన్నింగ్స్‌తోనే అనుకున్న వృద్ధిని సాధిస్తామని సంకేతాలిచ్చారు. తమ ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను ఫుల్‌గార్డ్‌తో పంపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతావనిని సాధిస్తామంటూ రెండు దశాబ్దాల తరువాతి లక్ష్యాన్ని ఆవిష్కరించారు. ఆ దిశగా టెస్ట్ ఇన్నింగ్స్‌కు శ్రీకారం చుట్టారు. వీరబాదుడు లేదు.. రిస్కీ షాట్లు లేనే లేవు. బౌండరీలు, సిక్సర్లు అస్సలే లేవు. ప్రతి బంతినీ పద్ధతిగా ఆడుతూ సింగిల్స్‌కు పరిమితమయ్యారు. సునీల్ గవాస్కర్‌ను మరిపించారు. కళ్లు చెదిరే షాట్లు అక్కర్లేదు... క్రీజ్‌లో ఉంటే చాలనే స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్ ద్వారా కెప్టెన్ నరేంద్ర మోదీ చెప్పింది ఒక్కటే.. 'నో హిట్టింగ్.. ఓన్లీ డిఫెన్స్.. ఇది లాంగ్‌టర్మ్ ఇన్నింగ్స్''.

ఇన్‌కమ్‌ట్యాక్స్ పిచ్ ఏమాత్రం మారలేదు. అవే శ్లాబ్స్. కాకపోతే టీసీఎస్, టీడీఎస్ విషయాల్లో చిన్నచిన్న ఉపశమనాలిచ్చారు. ఎన్నారైలు, ఫారిన్ అసెట్స్‌కు సంబంధించి పాత తప్పులు దిద్దుకోవటానికి కొన్ని ఫ్రీహిట్స్ ఇచ్చారు. వన్‌టైమ్ డిస్‌క్లోజర్ అనేది ఓ వార్నింగ్. అంటే... నోబాల్‌గా ప్రకటించిన క్లీన్‌బౌల్డ్ అన్నమాట. 7 రంగాల్లో తయారీ సామర్థ్యాన్ని పెంచటం... 7 కొత్త హైస్పీడ్ రైల్ కారిడార్లు అంటూ మోదీ '7'వ నంబర్లో వచ్చే ధోనీ, కపిల్ వంటి కెప్టెన్ల స్థాయిని కళ్లకు కట్టారు. ఇండియా సెమీకండక్టర్ మిషన్ 2.0, బయోఫార్మా శక్తి, కెమికల్ పార్కులు, రేర్ ఎర్త్ కారిడార్లు, కంటైనర్ తయారీ, ఎలక్ట్రానిక్ కాంపోనెంట్ల తయారీ వంటి పథకాలన్నీ మున్ముందు స్కోర్‌బోర్డును ముందుకు తీసుకెళ్లబోయే షాట్లు. ఇన్ని ఒత్తిళ్ల నడుమ... ద్రవ్య లోటును 4.3 శాతానికే పరిమితం చేస్తామంటూ... సింగిల్స్‌తోనైనా రన్‌రేటు మాత్రం పడిపోకుండా చూసుకున్నారు.

ఇక స్టాక్ మార్కెట్ల విషయానికొస్తే... ఎస్టీటీ రూపంలో మోదీ ప్రభుత్వం ఓ బౌన్సర్ వేసింది. ఆదాయ నష్టాన్ని పూడ్చుకోవాలి కనక స్టాక్ మార్కెట్లలో ఫ్యూచర్లపై సెక్యూరిటీ లావాదేవీల పన్నును 150 శాతం, ఆప్షన్లపై 50 శాతం పెంచారు. మార్కెట్లకిది నచ్చలేదు. బంతిని బలంగానే కొట్టాయి. ప్రస్తుతానికైతే బంతి గాల్లోకి లేచి మార్కెట్లు పడ్డాయి. అది క్యాచో కాదో మున్ముందు తెలుస్తుంది.

- బడ్జెట్‌పై పూర్తి కథనాలు 2,6,7,8,9, 10,11,12,13 పేజీల్లో..

బడ్జెట్ స్వరూపం (రూ. కోట్లలో)

రెవెన్యూ వసూళ్లు	మూలధన వసూళ్లు
35,33,150	18,14,165
మొత్తం బడ్జెట్ 53,47,315	
రెవెన్యూ వ్యయం	మూలధన వ్యయం
41,25,494	12,21,821

ధరలు పెరిగేవి

- దిగుమతి చేసుకొనే తక్కువ ధర గొడుగులు
- కాఫీ వెండింగ్ మెషీన్లు
- ఏటీఎంలు/క్యాష్ డిస్పెన్సర్లు
- టీవీ భాగాలు, కెమెరాలు
- జూలలో ప్రదర్శనకు దిగుమతి చేసుకొనే జంతువులు, పక్షులు
- ఆముదం చెక్క
- అమ్మోనియం ఫాస్ఫేట్/నైట్రో ఫాస్ఫేట్, నాఫ్తా

ధరలు తగ్గేవి

- కేన్సర్ రోగులకు అవసరమైన 17 రకాల మందులు
- మైక్రోవేవ్ ఓవెన్‌లలోని పరికరాలు
- సోలార్ ప్యానెల్స్‌కు వాడే మెటీరియల్
- అణు విద్యుత్ ప్రాజెక్టులకు వాడే పరికరాలు
- విమానాల తయారీ దిగుమతుల విడిభాగాలు
- కీలక ఖనిజాల శుద్ధికి దిగుమతి చేసుకొనే క్యాపిటల్ గూడ్స్

గోల్డ్.. బౌల్డ్

బంగారం, వెండిలో కొనసాగుతున్న అమ్మకాలు

రూ.26,273 పడిపోయిన వెండి ధర

ఫ్యూచర్స్ మార్కెట్లో రూ.2.65 లక్షలకు

బంగారం 4,241 డౌన్ రూ.1,48,104కు పరిమితం



నేటి గ్రుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గ్రుడ్ల రిటైల్ ధర				
₹75	ఫారం దగ్గర లైవ్ బర్డ్	143 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో	247 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	170 కిలో	స్కిన్ లెస్	281 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

ఇదండీ జగత్

ఈ బడ్జెట్ వల్ల ఎవరికి ప్రయోజనం అని నా చిలకను ఎందుకు అడిగావయ్యా!

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో జోగి రమేష్ ఇంటిపై దాడి చేస్తున్న టీడీపీ గూండాలు

పెట్రోల్ బాంబులతో దాడి చేయడంతో తగలబడుతున్న జోగి రమేష్ ఇల్లు

కొనసాగుతున్న జంగిల్‌రాజ్

ఇబ్రహీంపట్నంలో బీసీ నేత జోగి రమేష్ ఇంటిపై టీడీపీ గూండాల దాడి

- పెట్రోల్ బాంబులు, కత్తులు, బండరాళ్లు, కర్రలతో స్వైర విహారం
- దాడిలో పాల్గొన్న బ్లేడ్, గంజాయి బ్యాచ్ రౌడీ షీటర్లు
- పెట్రోల్ బాటిళ్లతో దాడులు చేస్తున్నా పట్టించుకోని పోలీసులు
- దాడి సమయంలో ఇంట్లోనే ఉన్న జోగి రమేష్ తండ్రి, కుటుంబ సభ్యులు
- దేవినేని అవినాష్‌ను అడ్డుకున్న పోలీసులు.. పచ్చ మూకలకు గ్రీన్ సిగ్నల్
- రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన అవినాష్
- బలవంతంగా అరెస్టు చేసి విజయవాడకు తరలింపు

3 లో

అదే నిప్పు మీ ప్రభుత్వాన్ని దహించేస్తుంది

- చంద్రబాబుపై వైఎస్ జగన్ ఆగ్రహం
- అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్లకు నిప్పు జంగిల్‌రాజ్‌కు ప్రతీక
- ఆటవిక పాలన అంతం కాక తప్పదు

3 లో

చంద్రబాబు పరపతి తుస్సు!

కేంద్ర బడ్జెట్‌లో ఆయనేమీ సాధించలేకపోయారంటున్న విశ్లేషకులు

బుల్లెట్ ట్రయిన్ అన్నారు.. కనీసం రైలు కారిడారూ దక్కలేదు

రూ.2,066.32 కోట్ల అప్పులకు మాత్రం అనుమతి

ఆహో ఓహో అంటూ కూటమి ఎంపీల గొప్పలు

- వివరాలు 11లో

పోలవరానికి రూ.3,320 కోట్లే

11లో



విశాఖ స్టీల్‌కు మొండిచేయి

11లో

నన్ను అంతం చేయడమే వారి లక్ష్యం



జడ్జి ఎదుట అంబటి ఆవేదన

పైనుంచి ఒత్తిడి ఉందంటూ పోలీసులు హింసించారు

పట్టాభిపురం, నల్లపాడు సీఐల సమక్షంలో వేధింపులు.. స్టేట్‌మెంట్ రికార్డు చేసిన జడ్జి

14 రోజుల రిమాండ్.. రాజమహేంద్రవరం జైలుకు తరలింపు

5లో

అప్పుడు శ్యామలరావు.. ఇప్పుడు సింఘాల్

- చంద్రబాబు రాజకీయ కుతంత్రాలకు ఐఏఎస్ అధికారుల బలి
- తిరుమల లడ్డూ నెయ్యి విషయంలో తమ ఆరోపణలు నిజమని నిరూపించుకునేందుకు తాజాగా టీటీడీ ఈవో అనిల్ సింఘాల్‌పై బదిలీ వేటు

14 లో



రాహుల్ గాంధీ,
కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ

దేశం ఎదుర్కొంటున్న సంక్షోభాలు, సమస్యలపై బడ్జెట్‌లో ప్రస్తావనే లేదు. యువతకు ఉద్యోగాలు లేవు. తయారీ రంగం పతనమవుతోంది. ఆదాయం లేక రైతులు నిరాశలో ఉన్నారు. పెట్టుబడిదారులు వెనక్కి వెళ్లిపోతున్నారు. మన దేశం నుంచి పెట్టుబడులు ఉపసంహరించుకుంటున్నారు. అంతర్జాతీయంగా ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయి. బడ్జెట్‌లో ఈ అంశాలను పూర్తిగా విస్మరించారు.

సవాళ్లకు పరిష్కారాలేవి?

''దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక, రాజకీయ సవాళ్లకు బడ్జెట్‌లో పరిష్కార మార్గాలు చూపలేకపోయారు. మోదీ ప్రభుత్వంలో కొత్త ఆలోచనలు అడుగంటిపోయాయి. దేశంలో అసమానతలు బ్రిటిష్‌రాజ్ కాలం కంటే విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్, మైనార్టీ వర్గాలకు బడ్జెట్‌లో ఎలాంటి ఊరట కల్పించలేదు. ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్న రాష్ట్రాలకు కూడా చేసిందేమీ లేదు. రూపాయి విలువను పెంచడానికి చర్యల్లేవు''
- మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ అధ్యక్షుడు

మన గ్లోబల్ ఇమేజ్‌కు బూస్ట్

''కేంద్ర బడ్జెట్‌తో అంతర్జాతీయంగా భారతదేశ పేరు ప్రతిష్టలు మరింత పెరుగుతాయి. కీలక రంగాల్లో పెట్టుబడులకు మనదేశం అత్యంత ఆకర్షణీయమైన గమ్యస్థానంగా పేరు గడిస్తుంది. సంప్రదాయ రంగాల నుంచి అత్యాధునిక రంగాల దాకా పెట్టుబడులకు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయి. ఇది ముమ్మాటికీ వికసిత్ భారత్ బడ్జెట్. ప్రతి గ్రామం, ప్రతి పట్టణం, ప్రతి నగరంలో ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తుంది. ప్రధానంగా యువత, మహిళలు, రైతుల కలలు సాకారమవుతాయి''
- అమిత్ షా, కేంద్ర హోంశాఖ మంత్రి

సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్

''వికసిత్ భారత్ సంకల్పాన్ని నెరవేర్చే బడ్జెట్ ఇది. అన్ని వర్గాల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. బడ్జెట్‌లోని ప్రతి కోణంలో సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ ఆశయమే కనిపిస్తోంది. కేంద్ర బడ్జెట్‌ను మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాం. విద్యా, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ప్రభుత్వం ప్రాధాన్యం హర్షణీయం. సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, క్రీడలు, బయోఫార్మా రంగాలకు అధిక ప్రోత్సాహకాలు ప్రకటించడం ప్రశంసనీయం. రక్షణ రంగానికి బడ్జెట్‌లో రూ.7.8 లక్షల కోట్లు కేటాయించడం మంచి పరిణామం''
- నితిన్ నబీన్, బీజేపీ అధ్యక్షుడు

సామాన్యులకు ఒరిగిందేమీ లేదు

''దశాదిశా లేని వ్యర్థ బడ్జెట్. ప్రజలకు ఒరిగిందేమీ లేదు. పశ్చిమ బెంగాల్‌కు తీవ్ర అన్యాయం జరిగింది. కీలక రంగాలకు సరైన కేటాయింపులే లేవు. ఇది ముమ్మాటికీ మహిళా వ్యతిరేక, రైతు వ్యతిరేక, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల వ్యతిరేక బడ్జెట్. విద్యా రంగానికి కూడా మొండిచెయ్యి చూపారు. నిధులు, రాయితీల్లో భారీగా కోతలు విధించారు. సామాజిక భద్రత సబ్సిడీ, ఎరువుల సబ్సిడీని కూడా తగ్గించారు. మౌలిక సదుపాయాలకు సంబంధించి గతంలో ప్రకటించిన పథకాలనే పునరావృతం చేశారు''
- మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ సీఎం

కంచి పట్టుచీరలో హుందాగా..

న్యూఢిల్లీ: ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టే బడ్జెట్ పైనే కాకుండా.. ఆమె ధరించే చీరలు కూడా ఏటా ఆసక్తికి కేంద్రంగా మారుతుంటాయి. నిర్మల వరుసగా తొమ్మిదిసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు. ప్రతిసారీ ప్రత్యేకమైన చీరలో కనిపించారు. తమిళనాడులో సంప్రదాయ కుటుంబంలో జన్మించి, తెలుగింటికి కోడలిగా వచ్చిన నిర్మలా సీతారామన్ దక్షిణ భారత సంస్కృతిని, వారసత్వాన్ని ప్రతిబింబించే వస్త్రాలకే ప్రాధాన్యం ఇస్తుంటారు. ఈసారి బడ్జెట్ సందర్భంగా మెజెంటా రంగు కంచి పట్టుచీర ధరించారు. బంగారు రంగు గడులు, కాఫీ–ఊదా రంగు బోర్డర్ చీరలో హుందాగా కనిపించారు. పసుపు రంగు, నిండు చేతుల రవిక ధరించారు. తమిళనాడు చేనేత కార్మికులు మగ్గంపై తయారుచేసే కంచి పట్టుచీరలకు దేశవ్యాప్తంగా పేరుంది. ఈ చీరలకు శతాబ్దాల చరిత్ర ఉంది. 9వ శతాబ్దం నుంచి 13వ శతాబ్దం దాకా చోళ రాజుల హయాంలో కంచి చేనేత పరిశ్రమ ఎంతగానో అభివృద్ధి చెందింది.

వికసిత్ భారత్‌కు రోడ్‌మ్యాప్

''ఇదొక విశిష్టమైన, ప్రతిష్టాత్మకమైన బడ్జెట్. ఉజ్వలమైన భవిష్యత్తుకు బాటలు వేసే బడ్జెట్. ప్రపంచ వేదికపై మనదేశ ప్రతిష్ట మరింత పెరగడం ఖాయం. 'వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ' అనే పేరుతో 140 కోట్ల మంది భారతీయులు సంతృప్తి చెందడం లేదు. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదగాలని కోరుకుంటున్నారు. ద్రవ్యలోటును తగ్గించడం, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం, పెట్టుబడి వ్యయాన్ని పెంచడం, అధిక వృద్ధిని సాధించడమే ధ్యేయంగా బడ్జెట్ రూపుదిద్దుకుంది. ఇది భారతీయుల సమ్మిళిత సంకల్పం. విశ్వసనీయ ప్రజాస్వామ్య భాగస్వామిగా, విశ్వసనీయ నాణ్యమైన ఉత్పత్తుల సరఫరాదారుగా భారత్ పాత్ర మరింత విస్తరిస్తుంది. యువతకు, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలకు లబ్ధి చేకూర్చేలా బడ్జెట్‌ను రూపొందించారు. ఈ చరిత్రాత్మక బడ్జెట్ యువత ఆకాంక్షలను నెరవేరుస్తుంది. మహిళల సాధికార స్ఫూర్తిని ప్రతిబింబిస్తోంది. గ్రామాల సంక్షేమం, పేదలు, రైతుల అభివృద్ధి కోసం చక్కటి బడ్జెట్‌ను తీసుకొచ్చిన నిర్మలా సీతారామన్, ఆమె బృందానికి నా అభినందనలు. వరుసగా తొమ్మిదిసార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మహిళా ఆర్థిక మంత్రిగా ఆమె రికార్డు సృష్టించినందుకు సంతోషంగా ఉంది. అద్భుత అవకాశాలకు ఈ బడ్జెట్ ఒక రహదారి. వికసిత్ భారత్–2047కు బలమైన పునాదిగా నిలుస్తుంది. దేశం ప్రయాణిస్తున్న సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌కు నూతన వేగం, నూతన శక్తి లభించడం తథ్యం. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమాలను బలోపేతం చేయడానికి రోడ్‌మ్యాప్‌గా తోడ్పడుతుంది. దేశ ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలను కచ్చితంగా తీరుస్తుంది. మన పరిశ్రమలు లోకల్ నుంచి గ్లోబల్ స్థాయికి ఎదగడానికి ప్రభుత్వం సహకరిస్తుంది. బడ్జెట్‌లో ప్రతిపాదించిన చర్యలతో 'అభివృద్ధి చెందిన భారత్' దిశగా మన ప్రయాణం వేగవంతమవుతుంది. ఏ దేశానికైనా ప్రజలే అతిపెద్ద బలం. అందుకే ప్రజల్లో శక్తిసామర్థ్యాలు, నైపుణ్యాలు పెంచడానికి కృషి చేస్తున్నాం. యువశక్తికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. తాజా బడ్జెట్‌తో వేర్వేరు కీలక రంగాల్లో నాయకులు, నూతన ఆవిష్కరణలు తయారు కాబోతున్నారు. క్రీడా రంగంలో యువతకు నూతన అవకాశాలు దక్కబోతున్నాయి. మన దేశాన్ని ప్రపంచ డేటా సెంటర్ హబ్‌గా మార్చడమే లక్ష్యంగా పన్ను మినహాయింపులు ప్రకటించాం. దేశంలో కొత్త ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల సృష్టికి మరింత ప్రోత్సాహం లభిస్తుంది. మహిళల సారథ్యంలోని స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం నుంచి మరింత మద్దతు దక్కుతుంది. ప్రతి జిల్లాలో బాలికల కోసం కొత్త హాస్టళ్లు రాబోతున్నాయి. దాంతో వారి విద్యాభ్యాసం మరింత మెరుగవుతుంది. వ్యవసాయం, పాడి, మత్స్య పరిశ్రమలు ఎల్లప్పుడూ ప్రభుత్వ ప్రాధాన్య రంగాలే. కొబ్బరి, జీడిపప్పు, కోకోవా, చందనం రైతులకు బడ్జెట్‌లో ఎన్నో ప్రోత్సాహకాలు ప్రకటించాం'' - ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

డేటా సెంటర్లకు ప్రోత్సాహంగా ట్యాక్స్ హాలిడే
దీర్ఘకాలిక భవిష్యత్తు కోసం 3 కర్తవ్యాల ప్రకటన
తయారీ రంగ సామర్థ్యం పెంపునకు కీలక చర్యలు
విదేశాల నుంచి మరింత మూలధనాన్ని ఆకర్షించే మంత్రం
ప్రపంచ స్థాయికి దేశీయ ఉత్పాదక రంగం ఎదిగేలా ప్రణాళిక

వికసిత విజన్

2026-27 బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ: సామాన్యుడికి కొంత మోదం.. స్టాక్ మార్కెట్లకు, మదుపర్లకు ఖేదం.. స్టార్టప్‌లకు కాస్త నిరాశ.. పన్ను చెల్లింపుదారులకు అసంతృప్తి.. విదేశీ పెట్టుబడిదారులకు శుభవార్త.. తయారీరంగం వారికి ఊరట.. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన బడ్జెట్ క్రికెట్ మ్యాచ్ చూశాక.. వివిధ వర్గాల అనుభూతులివి. 2026–27 సంవత్సరానికిగానూ రూ.53.47 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్‌ను నిర్మల ఆదివారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ ఏడాది పశ్చిమ బెంగాల్, తమిళనాడు సహా ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు ఉన్నప్పటికీ, ప్రజాకర్షక హామీలకు దూరంగా బడ్జెట్‌ను రూపొందించారు. విత్త మంత్రి తన బడ్జెట్‌లో తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు అనేక చర్యలు ప్రకటించారు.

యువశక్తి బడ్జెట్

మాఘ పౌర్ణమి శుభ పర్వదినాన, సిక్కుల ఆధ్యాత్మిక గురువు గురు రవిదాస్ జయంతి రోజున 2026–27 బడ్జెట్ ప్రవేశపెడుతున్నట్టు నిర్మల తన ఉపన్యాసాన్ని ప్రారంభించారు. తమ ప్రభుత్వం వచ్చాక ఈ 12 ఏళ్లలో ఆర్థిక రంగానికి స్థిరత్వం వచ్చిందని, సుస్థిరాభివృద్ధి, ద్రవ్య క్రమశిక్షణ సాధ్యమయ్యాయని, ద్రవ్యోల్బణం అదుపులో ఉందని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం ప్రజాకర్షక హామీలకంటే ప్రజల ప్రయోజనాలను నిరంతరం ఎంచుకుంటూ ముందుకు సాగుతోందన్నారు. మోదీ ఆలోచనలకు అనుగుణంగా.. దీన్ని 'యువ శక్తి నడిపిన బడ్జెట్'గా ఆమె అభివర్ణించారు.

3 కర్తవ్యాలు

విత్తమంత్రి తన ప్రసంగాన్ని మూడు ప్రధాన కర్తవ్యాలతో ప్రారంభించారు. అవి సమ్మిళిత వృద్ధి, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం, అందరితో కలసి–అందరి ప్రగతి. జీఎస్టీ సరళీకరణ, లేబర్ కోడ్స్ నోటిఫికేషన్ వంటి 350కిపైగా సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. మొదటి కర్తవ్యం కింద 6 రంగాల్లో చర్యలు ప్రతిపాదించారు. కీలక రంగాల్లో తయారీని భారీగా పెంచడం, 'చాంపియన్ సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలు (ఎమ్ఎస్ఎమ్ఈ)' తయారుచేయడం, మౌలిక వసతుల రంగానికి ఊపునివ్వడం, ఇంధనరంగంలో సుస్థిరాభివృద్ధి – దీర్ఘకాలిక భద్రతకు చర్యలు, పట్టణ ఆర్థిక ప్రాంతాల అభివృద్ధి వంటివి ఇందులో ఉన్నాయి.

కస్టమ్స్ పన్నుల్లో సరళీకరణ

2026–27 బడ్జెట్‌లో కస్టమ్స్ విధానాన్ని సరళీకరించారు. అనవసర మినహాయింపులను తగ్గించారు. 17 రకాల క్యాన్సర్ మందులపై కస్టమ్స్ డ్యూటీని పూర్తిగా ఎత్తేశారు. ప్రయాణికుల బ్యాగేజ్ నిబంధనలను సడలించి, వ్యక్తిగత వినియోగానికి దిగుమతి చేసే వస్తువులపై కస్టమ్స్ డ్యూటీని 10 శాతానికి తగ్గించారు.

'ఇంద్రధనుస్సు' తయారీ

ఫార్మాస్యూటికల్స్, సెమీకండక్టర్లు, రేర్ ఎర్త్ మ్యాగ్నెట్లు, రసాయనాలు, క్యాపిటల్ గూడ్స్, టెక్స్‌టైల్స్, క్రీడా పరికరాలు వంటి ఏడు రంగాల్లో తయారీ సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా బడ్జెట్‌లో కీలక ప్రతిపాదనలు చేశారు. ఉద్యోగాల సృష్టి, సాంకేతికత ఆధారిత అభివృద్ధిపై దృష్టి ఉంటుందని ఆమె స్పష్టం చేశారు.

పర్యాటకం - చిరు వ్యాపారాలు

హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూకశ్మీర్‌లలో పర్యావరణ హిత పర్వత మార్గాల అభివృద్ధికి ప్రతిపాదించారు. దేశవ్యాప్తంగా 15 పురావస్తు కేంద్రాల అభివృద్ధికి కూడా బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేశారు. చిన్న పరిశ్రమల కోసం ప్రత్యేకంగా రూ.10,000 కోట్ల ఎస్ఎంఈ గ్రోత్ ఫండ్‌ను ఏర్పాటు చేయనున్నారు.

డేటా సెంటర్లు, స్టాక్ మార్కెట్

మనదేశంలో డేటా సెంటర్లు ఏర్పాటుచేసే సంస్థలకు నిర్మలమ్మ పెద్ద శుభవార్తే చెప్పారు. భారతదేశం నుంచి గ్లోబల్ డేటా సెంటర్ సేవలు అందించే సంస్థలకు ఏకంగా 20 ఏళ్ల పాటు.. అంటే 2047 వరకు పన్ను మినహాయింపు ప్రకటించారు. కార్పొరేట్ బైబ్యాక్ కొనుగోళ్లపై 22 శాతం పన్ను, నాన్ కార్పొరేట్ బైబ్యాక్ కొనుగోళ్లపై 30 శాతం పన్ను విధించారు. ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీస్ ట్రాన్జాక్షన్ ట్యాక్స్ (ఎస్టీటీ) పెంచుతున్నట్టు ప్రకటించారు.

విదేశీ టూర్లు - విదేశీ విద్య

విదేశీ టూర్ ప్యాకేజీలపై టీసీఎస్‌ను 2 శాతానికి తగ్గించారు. విదేశీ విద్య, వైద్య ఖర్చులపై కూడా టీసీఎస్ తగ్గింపు ప్రకటించారు. ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆదాయపన్ను చట్టం అమల్లోకి వస్తుందని వెల్లడించారు. విద్యార్థులు, యువ ఉద్యోగులు, టెక్ ఉద్యోగులు, విదేశాల నుంచి తిరిగి వచ్చిన ఎన్నారైలు వంటి చిన్న పన్ను చెల్లింపుదారులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించేందుకు, 6 నెలల పాటు అమల్లో ఉండే విదేశీ ఆస్తుల వెల్లడింపు పథకాన్ని ప్రవేశపెడుతున్నట్టు వెల్లడించారు.

విదేశీ పెట్టుబడిదారులకు శుభవార్త

ఆర్థిక మార్కెట్లను బలోపేతం చేసేందుకు, విదేశాల నుంచి మరింత మూలధనాన్ని ఆకర్షించేందుకు నిర్మల మూడు కీలక అంశాలు ప్రకటించారు. కార్పొరేట్ బాండ్లకు మార్కెట్ - మేకింగ్ ఫ్రేమ్‌వర్క్, విదేశీ వ్యక్తులు భారతీయ ఈక్విటీల్లో పెట్టుబడి పెట్టడానికి వినూత్న మార్గం, లిస్టెడ్ కంపెనీల్లో అలాంటి పెట్టుబడిదారులకు యాజమాన్య పరిమితులు పెంచడం వంటి నిర్ణయాలు వెల్లడించారు. ముఖ్యంగా పోర్ట్‌ఫోలియో ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్ (పీఐఎస్) ద్వారా ఎన్ఆర్ఐలు ఇప్పుడు భారతీయ స్టాక్స్‌లో పెట్టుబడి పెట్టొచ్చు.

మౌలిక వసతులు

మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా, తూర్పున పశ్చిమ బెంగాల్‌లోని డంకుని నుంచి పశ్చిమాన సూరత్ వరకు కలిపే ప్రత్యేక సరకు రవాణా కారిడార్‌ను ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. అలాగే వచ్చే ఐదేళ్లలో 20 కొత్త జాతీయ జలమార్గాలను ప్రారంభిస్తారు. తీర ప్రాంత సరుకు రవాణాను ప్రోత్సహించే పథకాన్ని కూడా అమలు చేస్తారు. సీప్లేన్‌ల తయారీ దేశీయంగా జరిగేలా ప్రోత్సాహకాలు ఇస్తారు.

క్లీన్ ఎనర్జీ

స్వచ్ఛ ఇంధన రంగంలో భాగంగా, కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను తగించే కార్బన్ క్యాప్చర్ యుటిలైజేషన్ అండ్ స్టోరేజ్ సాంకేతికతల కోసం వచ్చే ఐదేళ్లలో రూ.20,000 కోట్ల వ్యయం ప్రకటించారు. పర్యావరణ అనుకూల ప్రయాణ వ్యవస్థలను ప్రోత్సహించేందుకు, నగరాల మధ్య ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లను 'వృద్ధి అనుసంధానాలుగా' అభివృద్ధి చేయనున్నారు. లిథియం–అయాన్ బ్యాటరీలు, అణు విద్యుత్ ప్రాజెక్టులకు అవసరమైన దిగుమతులపై కూడా డ్యూటీ మినహాయింపు కొనసాగుతుందని ప్రకటించారు. హైదరాబాద్, ముంబై, చెన్నై, బెంగళూరు, పుణె వంటి నగరాల మధ్య హైస్పీడ్ కారిడార్లు ఏర్పాటుచేయనున్నారు.

దివ్యాంగులకు వరాలు

దివ్యాంగులకు చేయూతకోసం 'దివ్యాంగజన్ కౌశల్ యోజన', 'దివ్యాంగ్ సహకార యోజన' వంటి పథకాలు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్, బెంగాల్, ఒడిశా, బిహార్, జార్ఖండ్ వంటి 5 పూర్వోదయ రాష్ట్రాల్లో పర్యావరణ ప్రజా రవాణా ప్రోత్సహించేందుకు 4వేల విద్యుత్ బస్సులు ప్రవేశపెట్టనున్నారు. ఇంకా, 7 అరుదైన వ్యాధులకు అవసరమైన మందులు, ఆహార పదార్థాలను వ్యక్తిగత వినియోగం కోసం డ్యూటీ లేకుండా దిగుమతికి అనుమతి ఇచ్చారు.

ప్రపంచ స్థాయికి ఉత్పాదక రంగం

దేశీయ ఉత్పాదక రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ఆర్థిక మంత్రి నిర్మల అనేక పథకాలు ప్రకటించారు. సెమీకండక్టర్ రంగంలో భారత్‌ను గ్లోబల్ హబ్‌గా మార్చేందుకు 'ఇండియా సెమీకండక్టర్ మిషన్ 2.0', ఫార్మా రంగాన్ని బలోపేతం చేసేందుకు రూ.10వేల కోట్లతో బయోఫార్మా శక్తి పథకాన్ని ప్రకటించారు. ఎలక్ట్రానిక్ వస్తువుల విడి భాగాల తయారీ ప్రోత్సహించేందుకు ఎలక్ట్రానిక్స్ కాంపొనెంట్స్ మ్యానుఫ్యాక్చరింగ్ పథకం, గ్లోబల్ సప్లై చైన్‌లో భారత్ వాటా పెంచేందుకు రూ.10వేల కోట్లతో కంటైనర్ తయారీ పథకం ప్రకటించారు.

సాగు - బ్యాంకింగ్ - క్రీడలు

వ్యవసాయ ఆదాయం పెంచేందుకు అధిక విలువ పంటలకు ప్రోత్సాహం, తీర ప్రాంతాల్లో కొబ్బరి, గంధం చెట్ల ఏర్పాటుకు ప్రోత్సాహం వంటి చర్యలు ప్రకటించారు. బ్యాంకింగ్ రంగం మీద అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటుచేస్తున్నట్టు వెల్లడించారు. వచ్చే పదేళ్లలో క్రీడా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ఖేలో ఇండియా మిషన్‌కు శ్రీకారం చుడుతున్నట్టు నిర్మల తెలిపారు.

విమర్శలకు దీటైన జవాబు

మీడియా సమావేశంలో నిర్మల

న్యూఢిల్లీ: రైతులు, యువత, తయారీ దారులు, కుటుంబాల వ్యథలను పట్టించుకోకుండా బడ్జెట్‌ను తయారుచేశారని విపక్ష నేత రాహుల్‌గాంధీ చేసిన విమర్శలను ఆర్థిక మంత్రి నిర్మల మీడియా భేటీలో తిప్పికొట్టారు. '' రాహుల్‌గాంధీ ఏం మాట్లాడుతున్నారో నాకైతే అర్థంకాలేదు. భారత ఆర్థిక వ్యవస్థ పునాదులు బలంగా ఉన్నాయి. అంతర్జాతీయ అనిశ్చితి, ప్రతికూల పరిస్థితుల ప్రభావం మన రంగాల మీదా పడుతోంది. అందుకే చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మొదలు వస్త్ర, తోలు పరిశ్రమల దాకా అన్నింట్లోనూ కొత్త పథకాలు తీసుకొచ్చాం. రైతులు, మహిళా వ్యవస్థాపకుల దాకా అందరి ప్రయోజనాలకు పెద్దపీట వేశాం. ఇవన్నీ చూశాక కూడా మీరు(రాహుల్) రాజకీయంగా విమర్శలు గుప్పించాలనుకుంటే అది మీ ఇష్టం. కానీ మీరు ఏ అంశాల మీదయితే విమర్శించాలనుకుంటున్నారో అవన్నీ నాకు చెప్తే నేను సావధానంగా వింటా. అందుకు తగ్గట్లు బదులిస్తా'' అని నిర్మల అన్నారు. '' గత 12 ఏళ్లుగా భారతీయ ఆర్థికపథం స్థిరంగా ముందుకు సాగుతోంది. స్థిర అభివృద్ధిని సాధిస్తోంది. ద్రవ్యోల్బణం మధ్యస్తంగా ఉంది. అత్యధిక అనిశ్చితి, అస్తవ్యస్త పరిస్థితుల్లోనూ ఉమ్మడిగా మేం తీసుకున్న నిర్ణయాల వల్లే భారత ఆర్థికవ్యవస్థ స్థిరంగా ఉంది. నిర్మాణాత్మక సంస్కరణలకు జై కొట్టాం. ప్రజోపయోగ పథకాలపై పెట్టుబడులు పెడుతూనే ఆర్థిక వివేకం ప్రదర్శించాం. ఆత్మనిర్భరతను మదిలో నిలుపుకుని దేశీయ తయారీరంగ సామర్థ్యాన్ని ఇనుమడింపజేశాం. ఇంధన భద్రతకు పట్టంకట్టాం. దిగుమతులపై ఆధారపడే తత్వం నుంచి కాస్తంత దూరం జరిగాం'' అని ఆమె అన్నారు.

బడ్జెట్ ప్రవేశపెట్టేముందు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు నోరు తీపిచేస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

డెరివేటివ్ మార్కెట్లో ఎస్టీటీ పన్ను పెంపు

అత్యాశకు పోయి పెట్టుబడులను పోగొట్టుకొనే మదుపరులను అప్రమత్తంచేసే లక్ష్యంతో డెరివేటివ్ మార్కెట్లో సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ పన్ను(ఎస్‌టీటీ)ని కాస్తంత పెంచామని నిర్మల చెప్పారు. తాజా బడ్జెట్‌లో ఎస్‌టీటీని ప్రస్తుతమున్న 0.02 నుంచి 0.05 శాతానికి పెంచారు. '' నేనేం డెరివేటివ్ ట్రేడింగ్‌కు వ్యతిరేకం కాదు. చిన్న మదుపరులు పెట్టుబడులను నష్టపోవద్దనే సదుద్దేశంతోనే ఎఫ్ అండ్ ఓ మార్కెట్లో పన్నులను పెంచాం'' అని నిర్మల పేర్కొన్నారు.

ఇదీ బడ్జెట్ సమగ్ర స్వరూపం (అంకెలు రూ.కోట్లలో)

అంశం	2024-25 వాస్తవ గణాంకాలు	2025-2026 బడ్జెట్ అంచనాలు	2025-2026 వాస్తవ (ప్రాథమిక) గణాంకాలు	2026-2027 బడ్జెట్ అంచనాలు
1. రెవెన్యూ వసూళ్లు	30,36,619	34,20,409	33,42,323	35,33,150
• పన్ను ఆదాయం	25,00,039	28,37,409	26,74,661	28,66,922
• పన్నేతర ఆదాయం	5,36,580	5,83,000	6,67,662	6,66,228
2. మూలధన వసూళ్లు	16,16,248	16,44,936	16,22,519	18,14,165
• రుణాల రికవరీ	24,617	29,000	30,190	38,397
• ఇతర వసూళ్లు	17,202	47,000	33,837	80,000
• రుణాలు	15,74,431	15,68,936	15,58,492	16,95,768
మొత్తం ఆదాయం (1+2)	46,52,867	50,65,345	49,64,842	53,47,315
మొత్తం వ్యయం (3+6)	46,52,867	50,65,345	49,64,842	53,47,315
3. రెవెన్యూ పద్దు	36,00,914	39,44,255	38,69,087	41,25,494
4. వడ్డీ చెల్లింపులు	11,15,575	12,76,338	12,74,338	14,03,972
5. మూలధన ఆస్తుల కోసం కేటాయించిన గ్రాంట్లు	2,72,656	4,27,192	3,08,151	4,92,702
6. మూలధన పద్దు	10,51,953	11,21,090	10,95,755	12,21,821
• నికర మూలధన వ్యయం (5+6)	13,24,609	15,48,282	14,03,906	17,14,523
7. రెవెన్యూ లోటు (3-1)	5,64,296	5,23,846	5,26,764	5,92,344
8. నికర రెవెన్యూ లోటు (7-5)	2,91,640	96,654	2,18,613	99,642
9. ద్రవ్య లోటు	15,74,431	15,68,936	15,58,492	16,95,768
10. ప్రాథమిక లోటు	4,58,856	2,92,598	2,84,154	2,91,796

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా..
మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 425 9899

జోగి రమేష్ ఇంటిపై దాడికి పాల్పడుతున్న టీడీపీ గూండాలు

జోగి రమేష్ ఇంటి మీదకు కర్రలను విసురుతున్న టీడీపీ గూండాలు

టీడీపీ మూకల దాడిలో ధ్వంసమైన జోగి రమేష్ ఇంటి అద్దాలు

జోగి రమేష్ ఇంటి మీదకు టీడీపీ గూండాలు విసిరిన రాళ్లు



జోగి రమేష్ ఇంటికి నిప్పు పెట్టిన టీడీపీ మూకలు

పోలీసులను నెట్టివేస్తున్న టీడీపీ మూకలు

కొనసాగుతున్న జంగిల్ రాజ్

ఇబ్రహీంపట్నంలో జోగి రమేష్ ఇంటిపై టీడీపీ గూండాల దాడి

సాక్షి ప్రతినిధి, విజయవాడ: రాష్ట్రంలో జంగిల్ రాజ్ విధ్వంసకాండ కొనసాగుతూనే ఉంది. ఇచ్చిన హామీలు అమలు చేయలేక, ప్రశ్నిస్తున్న వారికి సమాధానం చెప్పలేక ఆటవిక పాలనను ఎంచుకున్నారు. తిరుమల లడ్డూపై దుష్ప్రచారం చేయడంలో సీఎం చంద్రబాబుదే తప్పు అన్న విషయం సీబీఐ సిట్ సాక్షిగా బట్టబయలు కావడంతో ప్రజల దృష్టిలో చులకనై, వారి దృష్టి మళ్లించేందుకు వైఎస్సార్ సీపీ నేతలపై దాడులకు తన రౌడీలను పురమాయిస్తున్నారు. శనివారం గుంటూరులో మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై గూండాల దాడిని మరచిపోక ముందే ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని జోగి రమేష్ ఇంటిపై విధ్వంసానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. పెట్రోల్ బాంబులతో బ్లేడ్, గంజాయి బ్యాచ్, రౌడీషీటర్లు, టీడీపీ మూకలు రమేష్ ఇంటిపై విరుచుపడి విధ్వంసం సృష్టించారు. వందలాది మంది రౌడీలు విధ్వంసం సృష్టిస్తుంటే నిలువరించాల్సిన పోలీసులు చేష్టలుడిగి చూస్తుండటం విస్తుగొలుపుతోంది. వెళ్లిపోండి.. వెళ్లిపోండి.. అంటూ వారిని బతిమిలాడటం పోలీసు వ్యవస్థ దీన స్థితిని తెలియజేస్తోంది. రాష్ట్రంలో సాగుతున్నది ప్రజాస్వామ్యమా.. లేక ఆటవిక రాజ్యమా అని రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు చర్చించుకుంటున్నారు. పైగా ఈ విధ్వంసకాండను చంద్రబాబు తనయుడు స్వయంగా పర్యవేక్షిస్తున్నారని, సదరు టీడీపీ శ్రేణులు చెప్పుకుంటుండటం దారుణమని, ఇది అత్యంత ప్రమాదకర పరిణామమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బలహీన వర్గాల గొంతు నులిమి రాక్షసానందం పొందుతూ ప్రశ్నించే తత్వాన్ని చంపేయడమే టీడీపీ పెద్దల లక్ష్యమనే భావన అత్యధికుల్లో వ్యక్తం అవుతోంది.

పక్కా ప్లాన్‌తోనే దాడి

ఆదివారం ఇబ్రహీంపట్నంలో జోగి రమేష్ ఇంటిపై దాడి చినబాబు డైరెక్షన్‌లో పక్కా ప్లాన్‌తో జరిగింది. బీసీ నేత జోగి రమేష్ ఇంటిపై దాడికి ఎన్టీఆర్ జిల్లాలోని పలు ప్రాంతాలు.. ప్రధానంగా విజయవాడలోని కృష్ణలంక, అజిత్‌సింగ్ నగర్, భవానీపురం ప్రాంతాలకు చెందిన బ్లేడ్, గంజాయి బ్యాచ్‌లు, కిరాయి రౌడీలు, రౌడీ షీటర్లను భారీగా టీడీపీ నేతల డైరెక్షన్‌లో ఇబ్రహీంపట్నం తరలించారు. వీరు పెట్రోలు బాంబులు, బాటిళ్లతో దాడి చేసి, ఇంటికి నిప్పు పెట్టారు. ఇంట్లో సామగ్రి కాలి బూడిదైంది. ఇల్లంతా దట్టమైన పొగ కమ్ముకుంది. ఇదే సమయంలో భారీగా గుమికూడిన టీడీపీ మూకలు.. కత్తులు, కర్రలు, బండరాళ్లతో స్వైర్వ విహారం చేసి ఇంటిపైన రాళ్ల వర్షం కురిపించాయి. గేటును పగలగొట్టే యత్నం చేశారు. రాళ్ల దాడిలో ఇంటి అద్దాలు పగిలిపోయాయి. ఈ దాడి సమయంలో జోగి రమేష్ తండ్రి జగన్‌మోహన్‌రావు, కుటుంబ సభ్యులు ఇంట్లోనే ఉన్నారు. జోగి కుటుంబ సభ్యులను అంత మొందించాలనే కుట్రతో, పక్కా ప్రణాళికతో ఈ దాడి చేసినట్లు స్పష్టం అవుతోంది. కాగా, జోగి రమేష్ రాత్రి 11 గంటలకు ఆయన ఇంటికి వచ్చి టీడీపీ మూకలు దాడి చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు.

పోలీసుల ప్రేక్షక పాత్ర

టీడీపీ గూండాలు జోగి రమేష్ ఇంటిపై దాడికి వస్తున్నట్లు ముందస్తు సమాచారం ఉన్నప్పటికీ, పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. నామ మాత్రంగా బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసుల కనుసన్నల్లోనే టీడీపీ, బ్లేడ్, గంజాయి బ్యాచ్, రౌడీషీటర్లు రెచ్చిపోయి దాడులు చేస్తున్నా చేష్టలుడిగి చూస్తుండిపోయారు. కనీసం వారిని నిలువరించ లేక, ప్రేక్షక పాత్రకే పరిమితం అయ్యారు. మధ్యాహ్నం నుంచే జోగి రమేష్ ఇంటి వైపు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులను నిలువరించిన పోలీసులు, టీడీపీ గూండాలకు మాత్రం పచ్చ జెండా ఊపారు. పోలీసుల తీరుపై వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజా సంఘాల నేతలు తీవ్రంగా మండిపడ్డారు.

రోడ్డుపై బైఠాయింపు

జోగి రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, నందిగామ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్‌రావును జూపూడి వద్ద పోలీసులు అడ్డుకున్నారు. పరామర్శకు వెళ్తుంటే అడ్డుకోవడం ఏమిటని దేవినేని అవినాష్ పోలీసులను ప్రశ్నించారు. పోలీసుల తీరును నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించారు. దీంతో పోలీసులు ఆయన్ను బలవంతంగా అరెస్టు చేసి, విజయవాడ భవానీపురం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలియడంతో అక్కడికి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు చేరుకుంటుండంతో, ఆయన్ను అక్కడి నుంచి సత్యనారాయణపురం పోలీసు స్టేషన్‌కు తరలించారు. జోగి రమేష్ ఇంటిపై జరిగిన దాడిని ఎమ్మెల్సీ తలశిల రఘురాం, పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఖండించారు. ఇలాంటి దాడులకు వైఎస్సార్‌సీపీ భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సత్యనారాయణపురం పోలీసు స్టేషన్ వద్దకు మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మేయర్ భాగ్యలక్ష్మి, పార్టీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున చేరుకున్నారు.

సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తే దాడులు చేయిస్తే రక్షణ ఎక్కడుంటుంది?

మాజీ మంత్రి జోగి రమేష్ సతీమణి శకుంతలమ్మ

దాడి జరిగిన విషయం తెలిసి హుటాహుటిన హైదరాబాద్ నుంచి రాక

ఇబ్రహీంపట్నం: ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తే దాడులు చేయిస్తే రక్షణ ఎక్కడ ఉంటుందని మాజీ మంత్రి జోగి రమేష్ సతీమణి శకుంతలమ్మ ప్రశ్నించారు. తమ ఇంటిపై దాడి జరిగిన విషయం తెలుసుకున్న శకుంతలమ్మ హైదరాబాద్ నుంచి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం హుటాహుటిన ఇబ్రహీంపట్నంలోని ఇంటికి కుటుంబ సభ్యులతో కలిసి చేరుకున్నారు. దాడిలో దగ్ధమైన ఇంటిని, ధ్వంసమైన సామగ్రిని పరిశీలించి ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు, ఆయన కుమారుడు తన కుటుంబంపై చేస్తున్న అన్యాయాలను ఖండించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆమె మాట్లాడుతూ.. 'మా కుటుంబంపై జరుగుతున్న దాడులు, అన్యాయాలను చూస్తుంటే మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా అని అనిపిస్తోంది. మా కుటుంబానికి భద్రత లేకుండా పోయింది. ఇది దౌర్భాగ్యపు పాలన. లోకేశ్ చేస్తున్న పనులను తండ్రిగా చంద్రబాబు ఖండించాలి. నా భర్తకు దాడి సమాచారం ఉంది. భద్రత కల్పించాలని పోలీస్ అధికారులను కోరారు. అయినా దాడులు జరిగాయి. మాకు భద్రత లేకుండా పోయింది. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి దాడులు చేయిస్తే రక్షణ ఎక్కడ ఉంటుంది? దేవుడనే వారు చూస్తున్నారు. కచ్చితంగా వారిని వదిలిపెట్టడు' అని శకుంతలమ్మ వ్యాఖ్యానించారు.

అదే నిప్పు మీ ప్రభుత్వాన్ని దహించేస్తుంది

సీఎం చంద్రబాబుపై వైఎస్ జగన్ ఆగ్రహం

- అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్లకు నిప్పు జంగిల్‌రాజ్‌కు ప్రతీక
- అరాచక, ఆటవిక పాలన అంతం కాక తప్పదు
- ప్రజాస్వామ్యంలో హింసా జ్వాలను రేపే చేయీ కాలక తప్పదు
- ఇది చరిత్ర చెప్పే సత్యం అని గుర్తుంచుకోండి

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటికి శనివారం రాత్రి.. మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటికి ఆదివారం టీడీపీ గూండాలు, అసాంఘిక శక్తులు నిప్పు పెట్టడంపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి ఇళ్లకు పెట్టిన నిప్పు జంగిల్‌రాజ్‌కు ప్రతీక అన్నారు. ఈ నిప్పు ద్వారా ప్రజాస్వామ్యంపై రగిల్చిన మంటలతో పుట్టిన వేడి.. మీ సర్కార్‌ను దహించి వేయక మానదని సీఎం చంద్రబాబును హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం వైఎస్ జగన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఏమన్నారంటే.. 'ప్రజాస్వామ్యంలో, మీరు చేసిన ఆరోపణలు తప్పు అని, ఏకంగా కేంద్ర ప్రభుత్వానికి చెందిన ల్యాబులు ఎన్‌డీడీబీ, ఎన్‌డీఆర్‌ఐ నిర్ధారణ చేసిన తర్వాత, మీరు చేసిన ఆ తప్పులకు మిమ్మల్ని ప్రశ్నిస్తే, జీర్ణించుకోలేక అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్లకు మీరు నిప్పు పెట్టడం, ఆ దుశ్చర్యలతో భయాన్ని కలిగించానని మీరు అనుకోవడం, చంద్రబాబు గారూ అది మీ భ్రమే. ఆ నిప్పు మీ ప్రభుత్వానికి మీరు పెట్టుకున్నారని గుర్తుంచుకోవాలి. అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్లకు పెట్టిన నిప్పు అరాచకానికి, ఆటవిక పాలనకు, జంగిల్‌రాజ్‌కు ప్రతీక. ఈ నిప్పు మీ సర్కార్‌ను దహించి వేయక మానదని గుర్తుంచుకోండి. రానున్న కాలంలో మీకు వ్యతిరేకంగా ఉవ్వెత్తున ఎగిసే ప్రజాగ్రహ జ్వాలలు, మీ ప్రభుత్వాన్ని పూర్తిగా దహనం చేసి, బూడిద చేయక మానదనీ గుర్తుంచుకోండి. ప్రజాస్వామ్యంలో హింసా జ్వాలను రేపే చేయీ కాలక తప్పదు. అరాచక, ఆటవిక పాలన అంతం కాక తప్పదు. మీరు సృష్టించిన జంగిల్ రాజ్ భూ స్థాపితం కాక తప్పదు. ఇది చరిత్ర చెప్పే సత్యం' అని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

జోగి రమేష్‌కు వైఎస్ జగన్ పరామర్శ

పార్టీ మొత్తం అండగా ఉంటుందని భరోసా

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆదివారం మాజీ మంత్రి జోగి రమేశ్‌కు ఫోన్ చేసి పరామర్శించారు. జోగి రమేష్ ఇంటిపై టీడీపీ గూండాల దాడిని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావుండకూడదని, అయితే ప్రశ్నించే వారిని భయపెట్టడానికే చంద్రబాబు హింసా జ్వాలను రాజేస్తున్నారని మండిపడ్డారు. పార్టీ మొత్తం అండగా ఉంటుందంటూ జోగి రమేష్‌కు ధైర్యం చెప్పారు.

విడదల రజిని, బొల్లా బ్రహ్మనాయుడుకూ భరోసా

టీడీపీ గూండాల దాడికి గురైన వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి విడదల రజిని, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడులనూ వైఎస్ జగన్ ఫోన్‌లో పరామర్శించారు. రాష్ట్రంలో జంగిల్‌రాజ్ నడుస్తోందని.. చంద్రబాబు ఆటవిక పాలన సాగిస్తున్నారని వైఎస్ జగన్ నిప్పులు చెరిగారు. శాంతిభద్రతలు కుప్పకూలిపోయాయని, పోలీసులను అడ్డుపెట్టుకుని చంద్రబాబు దుర్మార్గాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నించే గొంతును నొక్కేసేందుకే ఈ దాడులు చేస్తున్నారంటూ మండిపడ్డారు. ధైర్యంగా ఉండాలని.. పార్టీ అండగా ఉంటుందని వారిద్దరికీ జగన్ భరోసా ఇచ్చారు.

అధికార మదంతో రెచ్చిపోతున్నారు

- అందుకే మా ఇంటిపై పెట్రోల్ బాంబులతో దాడి
- శాంతి భద్రతలు పరిరక్షించలేని చంద్రబాబు రాజీనామా చేయాలి
- దేవదేవుని లడ్డూపై దుష్ప్రచారం చేస్తుంటే ఊరుకోవాలా?
- మాపై దాడులు చేస్తుంటే పోలీసులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు
- తిరుపతిలో మాజీ మంత్రి జోగి రమేష్ ధ్వజం

మాట్లాడుతున్న జోగి రమేష్, పక్కన నారాయణస్వామి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: చంద్రబాబు, కూటమి నేతల ప్రజా వ్యతిరేక విధానాలు, దేవదేవుడు శ్రీ వేంకటేశ్వర స్వామి పవిత్ర ప్రసాదం లడ్డూపై చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రశ్నిస్తున్నందుకే తమ పార్టీ నేతలపైన, ఇళ్లపైన కుట్రపూరితంగా దాడులకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేష్ ధ్వజమెత్తారు. చంద్రబాబు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, వైఫల్యాలు, మోసాలు, అవినీతిని, పవిత్ర లడ్డూ ప్రసాదంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రజల్లోకి తీసుకెళ్తుంటే చంద్రబాబు, కూటమి నేతలు తట్టుకోలేకపోతున్నారన్నారు. శాంతి భద్రతలను పరిరక్షించలేని చంద్రబాబు తక్షణమే రాజీనామా చేసి వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. రమేష్ ఆదివారం తిరుపతి పర్యటనలో ఉండగా, ఇబ్రహీంపట్నంలోని ఆయన ఇంటిపై టీడీపీ కార్యకర్తలు దాడి చేసి, నిప్పంటించారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన తిరుపతిలో మీడియాతో మాట్లాడారు. 'చేతిలో అధికారం ఉంది కదా అని ప్రతిపక్ష నాయకులను కొడతాం, తిడతాం, బాంబులేసి చంపుతాం అంటే ప్రజలు చూస్తూ ఊరుకోరు. చంద్రబాబు అండ్ కో అధికార మదంతో రెచ్చిపోతూ ఎన్నో దుర్మార్గాలకు పాల్పడ్డారు. రెడ్ బుక్ రాజ్యాంగంతో సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరిస్తున్నారు. ప్రజలకు మేలు చేయాలన్న ఆలోచన వారికి లేదు. ఈ దుర్మార్గాలన్నింటికీ మూల్యం చెల్లించుకునే రోజు త్వరలోనే వస్తుంది' అని అన్నారు.

ఇది వికృత రాజకీయ క్రీడ

'నేను లేని సమయం చూసి పెట్రోల్ బాంబులతో మా ఇంటి మీద దాడి చేసి భయాందోళన సృష్టించారు. టీడీపీ గూండాలు దాడులకు తెగబడుతుంటే పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారు. తిరుమల లడ్డూల తయారీలో వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలవలేదని సీబీఐ సిట్ చార్జ్‌షీట్‌లో తేల్చి చెప్పింది. దీంతో లడ్డూ నెయ్యిలో కల్తీ జరిగిందని తప్పుడు ప్రచారం చేస్తున్న టీడీపీయే కల్తీ పార్టీ అని అనడం నేను చేసిన తప్పా? వీధుల్లో ఫ్లెక్సీలు వేసి తప్పుడు ప్రచారంతో భక్తుల మనోభావాలతో ఆడుకుంటున్న వారి మీద పోలీసులు కేసులు ఎందుకు పెట్టడంలేదు? పైగా వివాదాలు సృష్టిస్తున్న ఫ్లెక్సీలకు కాపలాగా నిలబడతారా?' అని ప్రశ్నించారు.

లోకేశ్ లక్ష్యం ఎప్పటికీ నెరవేరదు

'వెనుకబడిన వర్గాలకు చెందిన నాయకుల మీద అక్రమ కేసులు పెట్టి వేధించడమే చంద్రబాబు పనిగా పెట్టుకున్నారు. అన్యాయంగా ఇరికించిన అక్రమ మద్యం కేసులో నన్ను మూడు నెలలు జైలుకు పంపినా నాపై కోపం చల్లారినట్టు లేదు. నేను వైఎస్సార్‌సీపీ జెండా పట్టుకోకుండా చేయాలనేది లోకేశ్ లక్ష్యం. అది ఎప్పటికీ నెరవేరదు' అని జోగి రమేష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.

'26

టెస్ట్ మ్యాచ్ బడ్జెట్

హర్ష్ గోయెంకా
పారిశ్రామికవేత్త

టీ20 ప్రపంచ కప్ ముందర టెస్ట్ మ్యాచ్ లాంటి బడ్జెట్ ఇది. బడాయి సిక్సులు లేవు, కానీ స్కోర్‌బోర్డ్ నడుస్తూ ఉండేలా చక్కని సింగిల్స్ ఉన్నాయి. నిలకడ, క్రమశిక్షణ, స్వభావంలో పూర్తిగా 'రో-కో' (రోహిత్-కోహ్లీ) ముద్ర.

రైతు ఊసే లేదు!

యోగేంద్ర యాదవ్
విధానాంశాల నిపుణుడు

2026 బడ్జెట్ స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది. గ్రామం, రైతు, వ్యవసాయం ఇక ప్రభుత్వ ప్రాథమ్యాల్లో లేవు. రైతు పేరు కూడా ఎత్తని తొలి బడ్జెట్ ఇది. నీటి పారుదల లేదు, ఎరువులు లేవు, వ్యవసాయ కూలీల మాట లేదు.

ఆశా... నిరాశేనా!



దేవీందర్ శర్మ
వ్యవసాయ నిపుణులు

భారత రైతులు గత 25 ఏళ్లలో 111 లక్షల కోట్లు నష్టపోయారనీ, 2034 నాటికి ఇండియా గోధుమల నికర దిగుమతిదారు కానున్నదనీ 'ఓఈసీడీ', 'ఎఫ్ఏఓ' హెచ్చరిస్తున్న సమయంలో, వ్యవసాయాన్ని పునరుజ్జీవింపచేయడం, రైతుల ఆదాయాన్ని పెంచడం లక్ష్యంగా బడ్జెట్ ఉంటుందని ఆశించాను.

సమర్థించాల్సిందే!



రిటైల్ గ్యాంబ్లర్లు ట్రేడర్లూ కాదు, ఇన్వెస్టర్లూ కాదు. నిజంగా మీరు డబ్బు చేసుకోవాలంటే నిజమైన నైపుణ్యాన్ని నేర్చుకోండి, ఆ పనితో సంపాదించండి. ఎస్టీటీ(సెక్యూరిటీల లావాదేవీ పన్ను) విషయంలో ఆర్థిక మంత్రి నిర్ణయాన్ని సమర్థించాలి.

– మాధవన్ నారాయణన్, సీనియర్ జర్నలిస్ట్

పోరు లేదేం!

బడ్జెట్‌లో వ్యక్తిగతంగా నాకు నిరాశ కలిగించింది కాలుష్యం మీది పోరాటంపై ఫోకస్ లేకపోవడం! క్యాన్సర్, గుండె జబ్బులకు కారణమవుతూ కాలుష్యం ఆరోగ్య అత్యవసర పరిస్థితిని కల్పిస్తోంది. కాలుష్యాన్ని నియంత్రించగలిగితే మనం జీడీపీకి 2 శాతాన్ని జమ చేయగలం.

– తెహసీన్ పూనావాలా, వెంచర్ క్యాపిటలిస్ట్

అందుకే ఆ టైమ్!

బడ్జెట్ చర్చలకు వెళ్తుంటే ఈ సంగతి గుర్తొచ్చింది. ఒకప్పుడు లండన్‌లో మధ్యాహ్నానికి కుదిరేలాగా మన బడ్జెట్‌ను సాయంత్రం ఐదింటికి ప్రవేశ పెట్టేవాళ్లు. 1999లో వాజ్‌పేయి ప్రభుత్వం దీన్ని 11 గంటలకు మార్చింది. వలసవాద హ్యాంగోవర్ మన మీద చాలాకాలం ఉండింది.

– మోనికా హాలన్, ఆర్థికాంశాల రచయిత్రి

మరచిన వాగ్దానం

ఈ లెక్కన అనేక ఉన్నత స్థాయి కమిటీలను ఏర్పాటుచేస్తే 'వికసిత్ భారత్' సాధ్యమవుతుంది. అంతేనా? రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న బాస ఏమయ్యింది? – కవిత కురుగంటి, యాక్టివిస్ట్

లంకె కుదిరింది

రేర్ ఎర్త్ కారిడార్లు, సెమీకండక్టర్ మిషన్ 2.0 ప్రకటనలతో అరుదైన ఖనిజాల సరఫరా గొలుసులో ఎన్నాళ్లుగానో మిస్సయిన లింకును పూరించినట్టయింది. – అరుణభ ఘోష్, విధాన నిపుణుడు

సాగుకు ఒరిగేది తక్కువే!

అభిప్రాయం



డా॥ దొంతి నరసింహారెడ్డి

డిజిటల్ వ్యవసాయం ద్వారా అద్భుతం సాధిస్తున్నామని చెబుతున్న కేంద్ర ప్రభుత్వ ధోరణి బడ్జెట్ కేటాయింపుల్లోనూ కనిపించింది. అయితే భారత వ్యవసాయం ఎదుర్కొంటున్న మూడు ప్రధాన సవాళ్ల పట్ల బడ్జెట్‌లో ప్రతి స్పందన దాదాపు శూన్యం అని చెప్పాలి. వాతావరణ మార్పులతో పెరుగుతున్న ఒత్తిడి, తగ్గుతున్న మార్కెట్ రాబడి కారణంగా రైతు ఆదాయాలు తరుగు తున్నాయి. పెరుగుతున్న వివిధ పంటల దిగుమతి, అమెరికా దేశం నుంచి ఒత్తిళ్లను ఆర్థిక సర్వే 2025–26 అంగీకరించినా బడ్జెట్‌లో కనీస స్పందన లేదు.

పెరుగుతున్న వాతావరణ ప్రభావానికి, ప్రభుత్వ పెట్టుబడుల మధ్య పొంతన అసలు లేదు. ఆశించినట్టుగా 2026–27 బడ్జెట్‌లో సహజ వ్యవసాయం వంటి పైలట్ కార్యక్రమాలకు నిధులను గణనీయంగా పెంచినట్లు కనిపించడం లేదు. డిజిటల్ వ్యవసాయం మీద పెట్టుబడుల వల్ల ఒరిగేది చాలా తక్కువ. డిజిటల్ టెక్నాలజీ కేవలం ప్రకృతి వైపరీత్యాల గురించి హెచ్చరించడానికి మాత్రమే పనికొస్తుంది. స్థిరమైన పంటల ఉత్పత్తి ఉన్నప్పటికీ రైతు ఆదాయ సంక్షోభాన్ని పరిష్కరించడంలో ఇప్పటివరకు తీసుకున్న చర్యలు ఫలితాలు ఇవ్వడం లేదు. ఈ-నామ్, ధరల డ్యాష్‌బోర్డ్‌లు, గిడ్డంగి రసీదు వ్యవస్థలు వంటి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు రైతుల సమస్యలను పరిష్కరించడం లేదు.

◆ డిజిటల్ వ్యవసాయం మీద పెట్టుబడుల వల్ల ఒరిగేది తక్కువ. డిజిటల్ టెక్నాలజీ కేవలం ప్రకృతి వైపరీత్యాల గురించి హెచ్చరించడానికే పనికొస్తుంది. స్థిరమైన పంటల ఉత్పత్తి ఉన్నా రైతు ఆదాయ సంక్షోభం పరిష్కారం కావడం లేదు.

ధరల స్థిరీకరణ, వైవిధ్యభరితమైన సేకరణ, వ్యవసాయ–ప్రాసెసింగ్ సామర్థ్యం, మార్కెట్ కార్యకలాపాలలో బలమైన ప్రభుత్వ జోక్యం లేకుండా... డిజిటల్ వ్యవస్థలనేవి రైతుల ఆదాయాలను రక్షించడం కంటే ధరలను అస్థిర పరచేందుకే అవకాశం ఎక్కువ ఉంది.

వ్యవసాయానికి ఇచ్చిన మొత్తం నికర కేటాయింపు రూ.1,30,561 కోట్లు (2025–26 సవరించిన బడ్జెట్ కేటాయింపు కన్నా 6% ఎక్కువ). ఇందులో ప్రధానంగా 'పీఎమ్– కిసాన్ సమ్మాన్ నిధి'కి రూ. 63,500 కోట్లు (49%), వడ్డీ సబ్సిడీలకు రూ. 22,600 కోట్లు (17%), పంట బీమా (పీఎమ్ఎఫ్‌బీవై)కు రూ. 12,200 కోట్లు (9%) కేటాయింపులు జరిగాయి.

'కృషియోన్నతి యోజన'కు కేటాయింపులు 65% (రూ. 6,800 నుండి 11,200 కోట్లకు) పెరిగాయి. ఇందులో కొత్తగా 'కూరగాయలు/ పండ్ల మిషన్' ఉంది. సహజ వ్యవసాయ మిషన్‌కు ఇచ్చిన నిధులలో కేవలం 3% వృద్ధి (రూ.725 నుండి 750 కోట్లకు) మాత్రమే ఉంది. ఇక, కేంద్ర ప్రాయోజిత పథకాలకు 41% కేటాయింపులు పెరిగాయి.

వడ్డీ చెల్లింపుల భారం

బడ్జెట్‌లో కొత్త కార్యక్రమాలు (2026–27) చూస్తే... 'భారత్–విస్తార్' అనే బహుభాషా ఏఐ సాధనం ఏర్పాటుకు రూ. 150 కోట్ల కేటాయింపు జరిగింది. ఇది రైతులు మెరుగైన నిర్ణయాలు తీసుకోవడానికి సాయం చేస్తుందని భావిస్తు న్నారు. అధిక విలువ కలిగిన వ్యవసాయ పంటలకు మద్దతు పేరిట తీరప్రాంత/కొండ ప్రాంతాలలో కొబ్బరి, గంధపు చెట్ల పెంపకానికి రూ. 350 కోట్లు ఇచ్చారు. మఖానా అభివృద్ధికి రూ. 90 కోట్లు ఇచ్చి, పసుపుకు మాత్రం ప్రత్యేక కేటాయింపులు ఏమీ చేయలేదు.

బడ్జెట్ వ్యూహాత్మక దృష్టి కేవలం డిజిటల్ వ్యవసాయానికి పరిమితం అయ్యింది. డ్రోన్లు, ఏఐ, డిజిటల్ వ్యవస్థల వంటివి భాగంగా ఉండే సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడటం; 'పీఎమ్ కిసాన్ సమ్మాన్ నిధి'కి అధిక నిధులను కేటాయించడం ద్వారా రైతు ఆదాయాన్ని స్థిరీకరించడం, అధిక విలువ కలిగిన పంటలను వైవిధ్యీకరించడం, సహజ వ్యవసాయ పరివర్తనకు స్థిరమైన నిధులను అందు బాటులోకి తేవడం వంటి వాటికి బడ్జెట్ ప్రాధాన్యం ఇచ్చింది.

మొత్తం కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ శాఖకు కేటాయించినది 2.7% మాత్రమే! మొత్తం బడ్జెట్ ప్రాథమ్యాలతో పోలిస్తే... ప్రభుత్వం అప్పులపై వడ్డీ చెల్లింపుల (రూ. 14.4 లక్షల కోట్లు) పైనే ఎక్కువ దృష్టి పెట్టినట్లు అర్థమవుతోంది. వ్యవసాయానికి రూ. 1.3 లక్షల కోట్లు మాత్రమే కేటాయించడం చూస్తే ప్రభుత్వం మీద ఉన్న అప్పుల భారం అభివృద్ధి మీద వ్యయాన్ని పరి మితం చేస్తుందని స్పష్టం అవుతున్నది. వ్యవసాయ బడ్జెట్ నిరాడంబరమైన వృద్ధిని చూపుతోంది. వాస్తవ అభివృద్ధి/ వ్యవసాయ రంగ పరివర్తన వ్యయం కేవలం రూ. 33,000 కోట్లు మాత్రమే. ప్రభుత్వం ప్రతి 2 రోజులకు వడ్డీ చెల్లింపులపై చేసే ఖర్చు కన్నా ఇది తక్కువగా ఉండటం గమనార్హం.

వ్యాసకర్త వ్యవసాయ రంగ నిపుణులు

అంతా ప్రైవేటు రూటే!

సందర్భం



తెలకపల్లి రవి

ఈ ఏడాది బడ్జెట్‌లో అమెరికా టారిఫ్‌ల తాకిడిని తట్టుకోవడంపై దృష్టిని కేంద్రీకరించినట్టు కేంద్రం చెబుతూనే వారితో ఒప్పందానికి తలుపులు తీసి ఉంచింది. ఈయూతో ఒప్పందం కూడా చాలా విధాలుగా మన దేశీయ ఉత్పత్తులను, వ్యాపారాలను దెబ్బ తీస్తుంది. అంతర్జాతీయంగా చాలా ఆర్థికాంశాలు మన అధీనంలో లేకుండాపోయాయంటూ ఆర్థిక సర్వేలోనే కేంద్రం మూడు అవకాశాలు సూచించింది. అధ్వాన్నమైన పరిస్థితి వస్తే 2008 నాటి ఆర్థిక సంక్షోభం కన్నా దారుణంగా ఉండొచ్చని కూడా పేర్కొంది. మరి బడ్జెట్‌లో స్వావలంబన కోసం ఏవైనా నిర్మాణాత్మక పథకాలున్నాయా అంటే చాలా భాగం విదేశాలతో ముడిపడిన ప్రైవేటు ప్రాజెక్టులే. అన్నీ ప్రైవేటుకు అప్పగించే పీపీపీ నమూనా దీనంతటి వెనక దాగి ఉంది. ఆర్థిక సర్వేలోనే కేంద్రం ప్రైవేటు రంగంపై దృష్టి పెట్టాలని దిశానిర్దేశం చేసింది. ప్రభుత్వ సంస్థల్లో సర్కారుకు 51 శాతం వాటా ఉండాలనే విధానాన్ని మార్చి... 26 శాతం ఉంటే సరిపోతుందని సూచించింది.

◆ విశాఖ ఉక్కుపై ముఖ్యమంత్రి చంద్రబాబు వంటివారు కార్మికులపై విరుచుకుపడ్డారుగానీ బడ్జెట్‌లో నిర్దిష్ట ప్రకటనలేమీ చేయించలేక పోయారు. అసలు కూటమిలో ఉండటం వల్ల ఏపీకి ఏమి తీసుకురాగలిగారంటే శూన్యమే!

ఆర్థిక అంచనా ఆందోళనకరంగా ఉంటే ముందు ఆదుకోవలసింది పేద, మధ్య తరగతి వర్గాలను! కానీ ఆర్థిక క్రమశిక్షణ పేరిట వారికి ఇచ్చే సంక్షేమ పథకాలనే నిర్మలమ్మ టార్గెట్‌గా చేసుకున్నారు. 2025–26లో పన్ను ఆదాయం ఆశించిన మేరకైనా పెరిగింది లేదు. 2026–27కు చూపించిన అంచనాలు 2025–26 స్థాయిలోనే ఉండటం ఇందుకు నిదర్శనం. కార్పొరేట్ రంగానికి లక్షల కోట్ల రాయితీల వల్ల గండి కొనసాగించారు. పీఎమ్ పోషణ్, పీఎమ్‌శ్రీ, పంటల బీమా వంటి వాటన్నిటికీ కేటాయింపుల్లో కోత వేశారు. మహిళల కోసం ఉద్దేశించిన నిధులలో 51,444 కోట్లు కోత పెట్టారు. 2026–27లో ఎరువులు, ఆహారం, పెట్రోలియం, సబ్సిడీ లలో మరింత కోత ప్రతిపాదించారు. ప్రజా సంక్షేమం ప్రధానంగా భావించకపోవడం వల్లనే నగదు బదిలీలు 1.7 కోట్లు దాటిపోతున్నాయని సర్వేలోనే ఆందోళన వెలిబుచ్చింది. గిగ్ వర్కర్ల జీతాలు పెరగకపోవచ్చని కూడా సర్వేలోనే వెల్లడించింది. కొత్త లేబర్ కోడ్‌లు, పనిగంటల పెంపు వంటివన్నీ కలిపి చూసుకుంటే ఏలినవారు ఏ దిశలో ఆలోచించారో తెలుస్తుంది. ఇవన్నీ ప్రజా వ్యతిరేక నిర్ణయాలే.

ఏఐ డేటా సెంటర్లకు, క్లౌడ్ కంపెనీలకు 2047 దాకా భారీ రాయితీలు ప్రకటించింది. కంటైనర్లపై, విమాన తయారీ పరికరాలపై రాయితీలు కూడా కార్పొరేట్లకే కానుకలవుతాయి. ఇన్‌ఫ్రా రంగం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా భారీ పెట్టుబడులకు ఆధారమవుతున్న నేపథ్యంలో ఆర్థిక మంత్రి వాటికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. అరుదైన మృణ్మయ నమూనాలపై ఇప్పుడు అంతర్జాతీయ పెట్టుబడి కన్నుపడింది గనక ఏపీలోనూ అలాటి ఒక పరిశోధనా కేంద్రం నెలకొల్పుతామన్నారు. ఈనగాచి నక్కల పాలైనట్టు ఇవన్నీ తర్వాత ప్రైవేటు బాటలోకి తరలించబడతాయి. రక్షణ రంగం కేటాయింపుల పెంపు కూడా ప్రైవేటు భాగస్వామ్యంలోనే ఖర్చయిపోతుంది. అప్పుల శాతం జీడీపీలో 50 శాతానికి తగ్గించడం లక్ష్యమైందంటే పరిస్థితి తెలుస్తోంది.

ప్రజలకు ప్రత్యక్షంగా సేవలందించవలసిన రాష్ట్రాలు ఎంత మొరపెట్టుకున్నా వాటి కేటాయింపుల పెంపు లేదు. 16వ ఆర్థిక సంఘం చెప్పిందంటూ గత ఏడాది ఇచ్చిన 41 శాతం వాటాను కొనసాగించడమే గొప్ప వరంగా బడ్జెట్ చిత్రించింది. 2025–26 బడ్జెట్‌లో చెప్పినదానితో పోలిస్తే ఆచరణలో కేంద్ర పథకాలు, ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లు, ఇతర బదలాయింపుల కింద వచ్చే మొత్తం రాష్ట్రాల వాటాకు రూ. 2,03,801 కోట్లు కోత పడింది. జీఎస్టీ రేట్ల తగ్గింపు రాష్ట్రాలపై ముందే వేటు వేసింది. 'వీబీ జీ రామ్ జీ' – కింద మరింత తగ్గింది. ఈ పరిస్థితుల్లో రాష్ట్రాలను ఆదుకోవడానికి ముందుకు రాకపోవడం దారుణం,

విభజిత రాష్ట్రమైన ఏపీ వంటి వాటిని తీసుకుంటే... ఒక్కటంటే ఒక్క పథకం కింద కూడా నిధులు ఇవ్వలేదు. పోలవరం నిర్మాణానికి కేటాయింపు రూ. 3000 కోట్లు తగ్గించారు. నిర్వాసితులకు అవసరమైన 21 వేల కోట్లలో ఎంత ఇచ్చేదీ పేర్కొనలేదు. అమరావతి గురించి అప్పుల గొప్పలు చెప్పడం తప్ప సహాయం ఊసే లేదు. విశాఖ ఉక్కుపై ముఖ్య మంత్రి చంద్రబాబు వంటి వారు కార్మికులపై విరుచుకుపడ్డారు గానీ బడ్జెట్‌లో నిర్దిష్ట ప్రకటనలేమీ చేయించలేక పోయారు. అసలు కూటమిలో ఉండటం వల్ల రాష్ట్రానికిఏమి తీసుకురాగలిగారంటే శూన్యమే! అలాగే తెలంగాణ ప్రభుత్వం పలుసార్లు కోరిన అంశాలేవీ చోటు సంపాదించ లేకపోయాయి. కనుక ఏ విధంగా చూసినా నిర్మలమ్మ బడ్జెట్ నిస్సారమైన, నిరుత్సాహకర వ్యవహారం. పైగా బడ్జెట్‌లో చూపించకుండా తర్వాత పన్ను పెంచడం ఇటీవలి రివాజు గనక పారా హుషార్!

వ్యాసకర్త సీనియర్ సంపాదకులు

అభివృద్ధి మంత్రం... సంస్కరణ మార్గం

అభిప్రాయం

ప్రొ॥ ఇ. రేవతి

దేశాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్ ప్రణాళికలు కన్పిస్తున్నాయి. మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యమిచ్చారు. కాకపోతే ఈసారి సంక్షేమాన్ని పక్కన పెట్టారు. ద్రవ్యలోటును 9 శాతం నుంచి క్రమంగా తగ్గిస్తామని ఐదేళ్ళ క్రితం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ అన్నారు. ఇందులో భాగంగానే ఆర్థిక క్రమశిక్షణ వైపు ఆమె బడ్జెట్‌ను తీసుకెళ్ళారు. 350 నిర్మాణాత్మక సంస్కరణలను బడ్జెట్‌లో ప్రస్తావించారు. ఎగుమతులు, దిగుమతుల్లో నాణ్యతా ప్రమాణాలకు అడుగులు పడ్డాయి. ఉద్యోగుల వేతనాలకు భద్రత, సామాజిక బాధ్యత వంటివి సంస్కరణల్లో భాగం చేశారు. జీఎస్టీ–2 సంస్కరణలు వినియోగంపై ఏ విధంగా ఉంటాయని పరిశీలించాల్సి ఉంటుంది.

ట్రంప్ నిర్ణయాల నేపథ్యంలో అంతర్జాతీయ వాణిజ్యానికి అనేక సవాళ్ళు ఎదురవుతున్నాయి. మన దేశంలోనూ ఎగుమతులు తగ్గాయి. ఇది ఉత్పత్తిపై ప్రభావం చూపుతోంది. వినియోగదారుడి కొనుగోలు శక్తిని పెంచి, ఉత్పాదక రంగానికి దన్నుగా నిలిచే సంస్కరణలకు కేంద్ర బడ్జెట్ ప్రాధాన్యమిచ్చింది. తెలంగాణ సహా కొన్ని రాష్ట్రాల్లో సర్వీస్ విభాగం ప్రధాన ఆదాయ వనరుగా ఉంది. ఈ రంగాన్ని బలోపేతం చేసేందుకు బడ్జెట్‌లో ప్రాధాన్యమిచ్చారు. అమెరికాలో తాజా పరిణామాలు సర్వీస్ సెక్టార్‌లో ఉన్న ప్రవాస భారతీయులను అభద్రతకు గురి చేస్తున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని వారు ఇండియాకు తిరిగి వచ్చే విధంగా వారికి సౌలభ్యాలు ఎక్కువ ఇచ్చారు. పన్నుల విధానం వారిని ఆకర్షించేలా ఉందనే చెప్పాలి.

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించేలా క్లౌడ్ సర్వీస్‌కు 2047 వరకూ ట్యాక్స్ హాలీడే ప్రకటించారు. విదేశీ పెట్టుబడిదారులను దేశీయ మార్కెట్‌లో భాగస్వామ్యం చేసే కృషి జరిగింది. ఆడియో–విజువల్, గేమింగ్, కామిక్స్ వంటి 'ఆరెంజ్ ఎకానమీ'ని పెంచి, ఉపాధి అవశాలు పెంచాలనే ప్రయత్నం జరిగింది. కొత్త తరహా పరిశ్రమలను ప్రోత్సహించేలా ఉంది. ఇండస్ట్రియల్ కారిడార్స్ ఏర్పాటు ద్వారా మానవ వనరుల నైపుణ్యం పెంపునకు కేటాయింపులు ఉన్నాయి. పట్టణీకరణ వైపు అడుగులు పడుతున్న నేపథ్యంలో కేటాయింపులు చేపట్టారు. ఆతిథ్య రంగం పరుగు పెంచేందుకు బడ్జెట్ ప్రాధాన్యమిచ్చింది. మౌలిక వసతుల కల్పన ద్వారా ప్రైవేటు పెట్టుబడులు ఆకర్షించడం వ్యూహాత్మక నిర్ణయంగా కన్పిస్తోంది. కాకపోతే ప్రజల వినిమయ శక్తి పెరిగితేనే సంస్కరణ బడ్జెట్ సత్ఫలితాలు ఇస్తుందని చెప్పాలి.

వ్యాసకర్త సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్) డైరెక్టర్

ఇది... రొటీన్ బడ్జెట్

విశ్లేషణ

ప్రొ॥ అందె సత్యం

గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2026–27 కేంద్ర బడ్జెట్ పరిమాణం చాలా పరిమితంగా పెరిగింది. గత ఏడాది రూ. 50.6 లక్షల కోట్లు ఉన్న బడ్జెట్‌ను రూ. 53.5 లక్షల కోట్లకు మాత్రమే పెంచారు. సాధారణంగా ద్రవ్యోల్బణం స్థాయి 5 శాతం కంటే ఎక్కువున్నప్పుడు బడ్జెట్ పరిమాణం 8–10 శాతం పెరుగుతుంది. కానీ, ఈసారి ద్రవ్యోల్బణం 2 శాతం లోపే ఉండటంతో బడ్జెట్ పరిమాణం రూ. 3 లక్షల కోట్లే పెరిగింది. దీనివల్ల కొన్ని రంగాలకు కేటాయింపులు పెరిగితే, మరికొన్నిటికి తగ్గాయి. ఎన్నికల సంవత్సరం కాదు కాబట్టి ఏ వర్గానికీ, రాష్ట్రానికీ ఇష్టానుసార కేటాయింపులకు ప్రాధాన్యం ఇవ్వలేదు.

తెలంగాణ విషయానికి వస్తే దేశంలో హైస్పీడ్ రైల్వే కారిడార్లను ప్రకటించగా, అందులో 3 హైదరాబాద్‌కు సంబంధమున్నవి. పుణె–హైదరాబాద్, బెంగళూరు–హైదరాబాద్, హైదరాబాద్–చెన్నై ఈ జాబితాలో ఉన్నాయి. ఈ కారిడార్లకు సమాంతరంగా హైదరాబాద్‌ను కేంద్రంగా ఉపయోగించుకుని తెలంగాణలో కూడా రోడ్ల కనెక్టివిటీ పెంచుకుంటే మరింత అభివృద్ధికి అవకాశముంటుంది. ట్రిపుల్ ఆర్, గ్రీన్‌ఫీల్డ్ హైవే లాంటివి ఈ దిశలో ఉపయోగపడుతాయి. మిగతా కేటాయింపులు యథావిధిగా ఉన్నప్పటికీ డాటా సెంటర్లకు ట్యాక్స్ హాలిడే, కృత్రిమ మేధ అభివృద్ధి లాంటి సాంకేతిక అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మళ్లించడమూ మంచి పరిణామమే. హైదరాబాద్ అనుకూలతలను దృష్టిలో ఉంచుకుంటే వీటన్నింటికీ నిధులు లభించే అవకాశాలున్నాయి. వ్యవసాయంలో వాణిజ్య పంటలను ప్రోత్సహించేందుకు ఈ బడ్జెట్ వీలు కల్పిస్తోంది. ప్రత్యేకంగా తెలంగాణలో సాగునీరు లేదా ఇతర రంగాల్లో జాతీయ ప్రాజెక్టు మంజూరు చేయకపోవడం నిరాశ కలిగించింది. గత బడ్జెట్‌లో గిరిజన వర్సిటీకి అత్తెసరు నిధులిచ్చారు కానీ ఈసారి అసలు పట్టించుకోలేదు. మెట్రో రెండో దశ విస్తరణ, సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో ప్రతిపాదనలు లేవు. తెలంగాణకు ఒక ఐఐఎం కావాలని కూడా అడిగారు. కానీ ఎలాంటి హామీ లభించలేదు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తులకు కూడా ప్రాధాన్యం లభించలేదు.

◆ ఈ బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల 8వ పీఆర్సీ ప్రస్తావన లేదు. అయితే, 16వ ఆర్థిక సంఘం సిఫారసులను ఆమోదిస్తున్నట్టు ప్రకటించడం హర్షణీయం. ద్రవ్య కోశ విధానాలను కఠినంగా అమలు చేయాలనే భావనతో కేంద్రం ముందుకెళ్లినట్టు కనిపిస్తోంది.

ఇక, ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే బడ్జెట్‌లో ప్రతిపాదించిన సాంకేతికపరమైన అభివృద్ధి కార్యాచరణ విశాఖపట్నానికి అందుబాటులోకి వచ్చే అవకాశముంది. రేర్ ఎర్త్ మెటీరియల్ కారిడార్‌లో నాలుగు రాష్ట్రాలకు ప్రాధాన్యమిస్తామని చెప్పిన దాంట్లో ఏపీ ఉంది. షిప్ బిల్డింగ్, కంటెయినర్ షిప్ ప్రతిపాదనలు కూడా ఏపీకి ఉపయోగపడే అవకాశముంది. అమరావతికి ప్రత్యేకంగా కేటాయింపులు లేనప్పటికీ ఇతర అంతర్జాతీయ సంస్థల నుంచి తీసుకునే రుణాలకు కేంద్రం పూచీకత్తు లభిస్తే అక్కడ అభివృద్ధి సాధ్యపడుతుంది. బడ్జెట్‌లో ప్రత్యేకంగా కొబ్బరి పంటను ప్రస్తావించి నిధులు కేటాయించారు. దేశీయ కొబ్బరి ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ వాటా 40 శాతం. అందులో భాగంగా ఆ రాష్ట్రం చొరవ చూపెట్టాలి.

ఈ బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల 8వ పీఆర్సీ ప్రస్తావన లేదు. అయితే, 16వ ఆర్థిక సంఘం సిఫారసులను ఆమోదిస్తున్నట్టు ప్రకటించడం హర్షణీయం. కేంద్ర పన్నుల్లో వాటా 41 శాతానికి అంగీకరించారు. అయితే, గ్రాంట్లు, ఇతర సాయాల కింద రాష్ట్రాలకు కేంద్రం అండగా నిలబడాలి. ఈ బడ్జెట్ ద్రవ్యకోశ విధానాలను కఠినంగా అమలు చేయాలనే భావనతో కేంద్రం ముందుకెళ్లినట్టు కనిపిస్తోంది. బడ్జెట్ పరిమాణం కూడా పెద్దగా పెరగకపోవడంతో అన్ని వర్గాలనూ ఈ బడ్జెట్ సంతోష పరచలేదు. పరిమిత వనరులు, పరిమిత వ్యయంతో పెట్టిన బడ్జెట్ దేశ ఆర్థిక, సామాజిక ముఖచిత్రాలపై ప్రభావాన్ని చూపే పరిస్థితి లేనట్టే. ఇది రొటీన్ బడ్జెట్.

వ్యాసకర్త ఆర్థిక రంగ విశ్లేషకులు

అతి విశ్వాసంతో స్వారీ

విశ్లేషణ

ప్రొఫెసర్ డి. నర్సింహా రెడ్డి

మొత్తంగా చూస్తే కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించిన కేంద్ర బడ్జెట్ 2026–27... ప్రధానంగా నమ్మకం, ఆశ, దృఢ విశ్వాసం వంటి వాటిపై స్వారీ చేస్తున్నట్టు కనిపిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025–26) కూడా ఆశించిన మేర ఆదాయ అంచనాలను చేరుకోలేదు. దీనిని బట్టి ప్రభుత్వపరంగానూ ఆ యా అంశాలు, రంగాల్లో ఆశించిన మేర పెట్టుబడులు, ఖర్చు పెట్టలేదు. గత బడ్జెట్లోనూ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌పై రూ.వెయ్యి కోట్లు ప్రతిపాదించినా అందులో రూ. 200 కోట్లు కూడా ఖర్చుచేయలేదని ఆ రంగానికి చెందినవారు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో... ప్రైవేట్ రంగం నుంచి ఆశించిన మేర పెట్టుబడులు రాకపోతే ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు పెట్టిన పెట్టుబడులు ఏ మేరకు ఉపయోగపడతాయనేది చర్చనీయాంశమవుతోంది.

మన బడ్జెట్లన్నీ కూడా ఎక్కువ మటుకు పెట్టుబడిదారులకు అనుకూలంగానే ఉంటున్నాయి. వీటిపై సమతూకం సాధించే క్రమంలో ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు ప్రాధాన్యమిస్తామనీ, దీనినుంచి మంచి ఫలితాలు వస్తాయనీ చెబుతున్నారు. ఇది ఎంతవరకు వాస్తవరూపం దాల్చుతుందనేది చూడాల్సి ఉంది. 7.5 కోట్ల యూనిట్లలో 32 కోట్ల మంది ఉపాధి, ఉద్యోగాలు పొందుతున్నందున, గ్రామీణ ప్రాంతాల్లోని ఎంఎస్ఎంఈలు కూడా క్రియాశీలమై కొంత శాతం ఉపాధిని కల్పిస్తే వీటి పునరుద్ధరణ జరిగే అవకాశాలున్నాయి.

జాతీయస్థాయిలో 6.4 శాతం నుంచి 7.2 శాతం దాకా వృద్ధిరేటు సాధిస్తామని ప్రభుత్వం చెబుతున్నా... ఈ వృద్ధి నుంచి ఏ వర్గానికి ఎంత పంపిణీ అవుతుందనేది ముఖ్యం. కొన్నేళ్లుగా చూస్తే మన వృద్ధి ఎగుడుదిగుళ్లుగానే ఉంటోంది. ఉదాహరణకు.. తాజా ఇన్‌ఈక్వాలిటీ రిపోర్ట్ ప్రకారం చూస్తే... మొత్తం వంద రూపాయల జీడీపీ ఉత్పత్తిలో పై వర్గానికి 60 శాతం, మధ్య తరగతికి 25 శాతం, దిగువన ఉన్న వారికి 15 శాతం వస్తోంది. అధిక ఆదాయం పొందుతున్న వారు కొంత అధిక పన్ను కట్టాల్సి ఉండగా ఈ వర్గాన్ని ముట్టుకునే సాహసం చేయడం లేదు. అదీగాకుండా ఆరోగ్య రంగం విషయానికొస్తే... మెడికల్ టూరిజంను ప్రోత్సహించడం ద్వారా డబ్బు భరించగలిగిన విదేశీయులకు నాణ్యతా పరమైన వైద్యసేవలు అందించి, దేశంలోని పెద్దమొత్తంలో డబ్బు ఖర్చుచేయలేని సామాన్యులకు ఆ నాణ్యమైన వైద్య సేవలు ఏవనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దేశ పౌరులందరికీ సమానమైన వైద్య సేవలను అందించి... అప్పుడు వ్యాపారం చేస్తే బాగుంటుంది.

బడ్జెట్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి పెద్దపీట వేయడమే కాకుండా, దానికి అధిక ప్రాధాన్యమిస్తు న్నారు. అయితే ప్రైవేట్ రంగంలో పెట్టుబడుల్లో గత కొన్నేళ్లలో ఎలాంటి వృద్ధీ లేదు. దీనికి భిన్నంగా భారత పెట్టుబడిదారులు విదేశాల్లో పెట్టుబడులు పెట్టడం ఎక్కువైంది. దేశీయంగా తగిన డిమాండ్ లేదనీ, తమ పరిశ్రమల్లో పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యాలను ఉపయోగించుకోవడం లేదనీ వారు చెబుతున్నారు. తాజాగా బడ్జెట్లో... విదేశాల్లో పెట్టుబడులపై నిబంధనలను మరింతగా సులభతరం చేశారు. దేశంలోకి విదేశీ పెట్టుబడులు రావడం కంటే కూడా ఇక్కడి నుంచి బయటి దేశాల్లో పెట్టే పెట్టుబడులు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిని అధిగమించేందుకు దేశీయంగా కేంద్రప్రభుత్వం మాత్రమే పెట్టుబడులు పెడుతోంది. మౌలిక సదుపాయాల కల్పన పెట్టుబడులు గతేడాది రూ.11.20 లక్షల కోట్ల నుంచి ఈ ఏడాది రూ.12.25 లక్షల కోట్లకు పెంచుతామని బడ్జెట్లో ప్రతిపాదించారు. వృద్ధిరేటును నిలబెట్టేందుకు ఈ పెట్టుబడులు పెడుతున్నారు. ప్రభుత్వపరంగా రోడ్లు, కమ్యూనికేషన్లు, తదితరాలన్నీ చేస్తుంటే దానిని ప్రోత్సాహకంగా తీసుకుని, ప్రైవేట్ పెట్టుబడులు రావాలి. కానీ అవి రావడం లేదు. మెరుగైన ఆర్థిక పరిస్థితి, వృద్ధిరేటు వంటి వాటిపై కేంద్ర ప్రభుత్వం అతి విశ్వాసం, నమ్మకం పెట్టుకోవడం వల్ల మిగతా ముఖ్యమైన అంశాలపై దృష్టి పెట్టడం లేదు. గతంలో ఎన్నడూలేని విధంగా దేశ రక్షణ బడ్జెట్‌ను ఒక్కసారిగా రూ.27 లక్షల కోట్లు (గతం కంటే 21 శాతం పెంపుదల) ప్రతిపాదించారు. 'ఆపరేషన్ సిందూర్' ద్వారా విజయం సాధించామనే భావనతో ఈ రంగానికి కేటాయింపులు గణనీయంగా పెరిగాయి. దేశ భద్రతకు సంబంధించిన అంశం కాబట్టి దీనిని ఎవరూ ప్రశ్నించలేని పరిస్థితి ఉంది. అయితే ఇతర దేశాలతో పోల్చితే ద్రవ్యోల్బణం తక్కువగా ఉండటం, వృద్ధి రేటు 6–7 శాతం మధ్యలో ఉండటం కలిసొచ్చే అంశాలు.

వ్యాసకర్త ఆర్థికవేత్త, హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ సోషల్‌సైన్సెస్ మాజీ డీన్

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.పాడ్యమి రా.3.04 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** ఆశ్లేష రా.12.10 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** ప.1.15 నుండి 2.50 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.35 నుండి 1.20 వరకు తదుపరి ప.2.52 నుండి 3.35 వరకు, **అమృత ఘడియలు:** రా.10.35 నుండి 12.10 వరకు ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.36, **సూర్యాస్తమయం:** 5.52.

రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలి

- చంద్రబాబు రాజ్యహింస పేట్రేగిపోతోంది
- మాజీమంత్రులు అంబటి, రజినీ, జోగి రమేశ్‌లపై కూటమి కార్యకర్తల రౌడీయిజం
- అంబటి రాంబాబు అరెస్టు అన్యాయం
- మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు పేర్ని నాని

చిలకలపూడి (మచిలీపట్నం)/పామర్రు: రాష్ట్రంలో రావణకాష్టం రాజ్యమేలుతున్నందున వెంటనే రాష్ట్రపతి పాలన విధించాలని మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్ ఆదేశాలతో అటు కూటమి నేతలు, ఇటు పోలీసులు వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేసి చిత్రహింసలకు గురిచేస్తున్నారని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఇది ఏమాత్రం తగదన్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన మాజీమంత్రులు అంబటి రాంబాబు, విడదల రజినీ, జోగి రమేష్‌లపై కూటమి కార్యకర్తలు రౌడీయిజానికి పాల్పడటం ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా వ్యతిరేకించటమేనని చెప్పారు. చంద్రబాబు, లోకేశ్ ఆదేశాలతో.. డీజీపీ కనుసన్నల్లోనే ఈ దాడులు జరుగుతున్నాయన్నారు. అందువల్ల తక్షణమే రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాల్సిన అవసరం ఉందని చెప్పారు. మచిలీపట్నంలోను, పామర్రులోను ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. గుంటూరులో టీడీపీ నాయకులు దారికాచి మాజీమంత్రి అంబటి రాంబాబుపై రాళ్లు, కర్రలతో దాడిచేయటం, మహిళలు దూషించటం ఎంతవరకు సమంజసమన్నారు. రాంబాబు తల్లి, భార్య, పిల్లలను దూషించటం సబబా అని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు పోలీసుల అండదండలతో అంబటి నివాసం, పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేయటంతోపాటు నిప్పంటించారని, ఆయనపై హత్యాయత్నం చేశారని, అలాగే ఇబ్రహీంపట్నంలో ఇంట్లోకి పెట్రోల్, డీజిల్ సీసాలు విసిరి మాజీమంత్రి జోగి రమేష్ ఇల్లు తగలబెట్టే ప్రయత్నం చేయటం టీడీపీ నాయకుల అరాచకానికి అద్దం పడుతోందని చెప్పారు.

అంబటి అక్రమ అరెస్టుపై ఐటీ ఉద్యోగుల నిరసన

ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి, ఐటీ వింగ్ ఉద్యోగులు

వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ఐటీ ఉద్యోగులతో కలిసి హైదరాబాద్‌లో ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ టెంపుల్ బస్‌స్టాప్ వద్ద ఆదివారం ప్రకాశం జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు దొండేటి నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గానికి చెందిన ఐటీ విభాగం ఉద్యోగులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రభుత్వ అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని తాటిపర్తి అన్నారు. ముందుగా ఆ ప్రాంతంలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. – యర్రగొండపాలెం

రెడ్‌బుక్ పాలనకు ప్రజలే చరమగీతం పాడతారు

అంబటిపై దాడిని ఖండిస్తూ తిరుపతిలో భూమన నిరసన

తన ఇంటి ముందు రోడ్డుపై నిరసన తెలుపుతున్న భూమన తదితరులు

తిరుపతి మంగళం: మాజీ మంత్రి అంబటి రాంబాబుపై హత్యాయత్నానికి పాల్పడి, ఆయన ఇంటిని ధ్వంసం చేయడం అప్రజాస్వామికమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూమన కరుణాకరరెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. గుంటూరులో అంబటిపై దాడిని ఖండిస్తూ ఆదివారం తిరుపతి పద్మావతిపురంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులతో కలిసి భూమన కరుణాకరరెడ్డి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భూమన మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం రెడ్‌బుక్ పాలనే సాగిస్తోందన్నారు. ఈ రెడ్‌బుక్ పాలనకు ప్రజలే చరమగీతం పాడతారన్నారు. కూటమి గూండాలను రెచ్చగొట్టి అంబటి ఇంటిపైకి పంపింది చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లేనని ఆరోపించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు చేయడం, అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు రాచకొండ రమేష్‌యాదవ్ మాట్లాడుతూ తమ పార్టీ శ్రేణులపై దాడులు చేసి, అక్రమ కేసులు పెట్టే విష సంస్కృతిని చంద్రబాబు ప్రభుత్వం తెచ్చిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, తిరుపతి మేయర్ శిరీష, పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జక్కంపూడి, మార్గాని హౌస్ అరెస్ట్

- అంబటికి సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న రాజాను అడ్డుకున్న పోలీసులు
- ప్రైవేటు ఫంక్షన్‌కు సైతం వెళ్లనివ్వకుండా మార్గాని భరత్ గృహ నిర్బంధం

జక్కంపూడి రాజా, విజయలక్ష్మి తదితరులను అడ్డుకుంటున్న పోలీసులు

మార్గాని భరత్‌రామ్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

సాక్షి, రాజమహేంద్రవరం: వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను, పార్టీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ను తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం పోలీసులు ఆదివారం హౌస్ అరెస్ట్ చేశారు. మాజీ మంత్రి అంబటి రాంబాబుకు నైతిక మద్దతు తెలిపేందుకు వెళ్తున్న జక్కంపూడి రాజాను, ఆయన సోదరుడు, యువజన నేత జక్కంపూడి గణేష్‌ను, పార్టీ అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మిని వారి నివాసం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఇంటినుంచి బయటకు వెళ్లడానికి వీల్లేదని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని చెప్పారు. బయటకు వెళ్లకూడదంటూ వారి వాహనాన్ని అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, వైఎస్సార్‌సీపీ నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రాజాను హౌస్ అరెస్ట్ చేయడంతో వైఎస్సార్ సీపీ శ్రేణులు అక్కడే బైఠాయించి నిరసన తెలిపాయి. మరోవైపు మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ను కూడా ఇంటినుంచి బయటకు రానివ్వకుండా పోలీసులు నిర్బంధించారు. ఓ ప్రైవేటు ఫంక్షన్‌కు వెళ్లేందుకు సిద్ధమవుతున్న భరత్‌రామ్‌ను బయటకు వెళ్లేందుకు వీల్లేదంటూ అడ్డుకున్నారు. తాను ప్రైవేటు కార్యక్రమానికి వెళ్తున్నానని చెప్పినా వినలేదు. సాయంత్రం 6 గంటల వరకూ బయటకు కదలకూడదంటూ హుకుం జారీ చేశారు.

నన్ను అంతం చేయడమే వారి లక్ష్యం

న్యాయమూర్తి ఎదుట అంబటి రాంబాబు ఆవేదన

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్)/గుంటూరు లీగల్: తనను అంతం చేయడమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ నేత, కాపు నాయకుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు న్యాయమూర్తి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో పోలీస్‌స్టేషన్లో తనను హింసించారని తెలిపారు. ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, తమ విధులకు ఆటంకం కలిగించారని ఆయనపై పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు. దీంతో శనివారం ఆయన్ను అరెస్ట్ చేసిన పోలీసులు ఆదివారం రాత్రి 8.30 గంటలకు గుంటూరు మొబైల్ కోర్టులో హాజరు పరిచారు. రాష్ట్ర వ్యాప్తంగా అంబటి రాంబాబుపై 16 క్రిమినల్ కేసులు ఉన్నాయని పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. అంబటి పదే పదే వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారని, దీనివల్ల శాంతి భద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీనిపై అంబటి తరఫు న్యాయవాది పొన్నవోలు సుధాకరరెడ్డి తీవ్ర అభ్యంతరం తెలిపారు. అంబటిపై నమోదైన కేసు ఎఫ్ఐఆర్ చెల్లదన్నారు. ఏడు సంవత్సరాల లోపు శిక్ష పడే కేసుల్లో ప్రాథమిక విచారణ జరిపిన తర్వాతే ఉన్నతాధికారుల అనుమతితో ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సి ఉందని, దీన్ని పోలీసులు పట్టించుకోలేదన్నారు. అంబటిపై పెట్టిన సెక్షన్లన్నీ ఏడేళ్లలోపు శిక్ష పడేవే కాబట్టి 41ఏ నోటీసు కూడా ఇవ్వకుండా నేరుగా అరెస్టు చేయడం తగదన్నారు.

రెండు కాళ్లు పంగ చీల్చి వేధించారు

ఈ సందర్భంగా మాజీ మంత్రి అంబటి రాంబాబు తనను హింసించిన తీరును న్యాయమూర్తి ఎదుట వివరించారు. 'గుంటూరు సిద్ధార్థనగర్‌లోని మా ఇంటి వద్ద నుంచి శనివారం రాత్రి 10.30 గంటలకు పోలీసులు నన్ను నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. లాకప్‌లో పడుకుని ఉండగా, రాత్రి రెండు గంటలప్పుడు ఒక కానిస్టేబుల్ వచ్చి.. స్టేట్‌మెంట్ రికార్డు చేయాలంటూ మొదటి అంతస్తులోకి తీసుకువెళ్లాడు. అక్కడ నల్లపాడు సీఐ వంశీధర్, పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు వచ్చి పక్కన కూర్చున్నారు. తమకు పై నుంచి ఒత్తిడి ఉందని, తప్పుగా అనుకోవద్దని

అంబటిని రాజమండ్రి జైలుకు తీసుకెళ్తున్న పోలీసులు

చెబుతూనే కానిస్టేబుళ్లకు సైగ చేశారు. కానిస్టేబుళ్లు నన్ను గోడకు అనించి కూర్చోబెట్టి, రెండు కాళ్లు ఎడం చేసి గట్టిగా లాగి పంగ చీల్చారు. నొప్పితో అరవడంతో కాసేపు ఆపి.. రెండోసారి కూడా అలాగే చేశారు. నొప్పితో తర్వాత లేచి నిల్చుని నడవలేక పోయాను. కొంచెం సేపు నెమ్మదిగా నడిపించి కిందికి పంపారు. చాలా నొప్పిగా ఉంది. నన్ను అంతం చేసేందుకే టీడీపీ నాయకులు ఈ వ్యవహారం అంతా చేస్తున్నారు' అని న్యాయమూర్తి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో న్యాయమూర్తి అంబటి రాంబాబు స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న కేసులో 14 రోజుల పాటు రిమాండ్ విధించారు. తమ విధులకు అడ్డు పడ్డారంటూ నల్లపాడు ఎస్ఐ చేత పెట్టించిన కేసులో రిమాండ్‌ను తిరస్కరించారు. దీంతో అంబటిని రాజమహేంద్రవరం జైలుకు తరలించారు. కాగా, అంతకు ముందు రాత్రి 7.30 గంటలకు అంబటికి గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు.

న్యాయవాదుల ఆగ్రహం

కోర్టు ఆవరణలో కూడా బ్యారికేడ్లు పెట్టడం, పోలీసులు తమను పదే పదే బయటకు పంపే ప్రయత్నం చేయడంపై న్యాయవాదులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. పోలీసుల వల్ల తమకు కోర్టులో కూడా రక్షణ లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై హైకోర్టుకు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. అంబటిని ఏ జైలుకు తరలిస్తున్నారనే విషయం కూడా అంబటి రాంబాబు తరఫు న్యాయవాదులకు చెప్పక పోవడం దారుణం అని మండిపడ్డారు. ఇదిలా ఉండగా ఆదివారం ఉదయం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు గల్లా మాధవి నల్లపాడు పోలీస్ స్టేషన్ లోపలికి వెళ్ళి బయటకు వచ్చి మీడియాతో మాట్లాడారు. అంబటిని పోలీసులు 'బాగా చూసుకున్నారు' అని ఆమె తెలిపారు.

తిరుగుబాటు తప్పదు

ప్రభుత్వ పెద్దలు పరిపాలనను పక్కనపెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు. అహంకార ధోరణితో కక్షగట్టి అంబటి రాంబాబుపై హత్యాయత్నం చేశారు. తిరిగి ఆయనపైనే తప్పుడు కేసులు పెట్టి అరెస్ట్ చేయడం దుర్మార్గంతో కూడిన రాక్షస చర్య. రెడ్‌బుక్ పేరుతో తండ్రీకొడుకులిద్దరూ కలిసి వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ శ్రేణులపై దాడులు చేయడం, తప్పుడు కేసులతో అరెస్ట్ చేయడం మినహా ప్రజా సంక్షేమాన్ని పట్టించుకున్నారా? తప్పుడు కేసులకు, బెదిరింపులకు భయపడేది లేదు.
– పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ మంత్రి

ఆటవిక రాజ్యంలో ఉన్నామా?

అంబటి రాంబాబుపై దాడికి పాల్పడటం దుర్మార్గం. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా లేక ఆటవిక రాజ్యంలో ఉన్నామా? సీబీఐ–సిట్ దర్యాప్తులో లడ్డూలో ఎటువంటి జంతువుల కొవ్వు కలవలేదని తేల్చింది. దీనిని డైవర్ట్ చేసేందుకు టీడీపీ గూండాలు అంబటి రాంబాబు ఇంటిని, పార్టీ కార్యాలయాన్ని, ఆయన వాహనాన్ని ధ్వంసం చేసి ఇంటికి నిప్పు పెట్టారు.
– రామసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ

డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే..

లడ్డూలో కల్తీ జరగలేదని సీబీఐ నిగ్గు తేల్చడంతో డైవర్షన్ పాలిటిక్స్‌ను తెరపైకి తెచ్చింది. ప్రభుత్వం తమదేనన్న మదంతో అంబటి రాంబాబు ఇంటిపై పైశాచికంగా దాడులు చేశారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని దేవాలయం మెట్లు కడిగిన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఈ రోజు ఏ దేవాలయం మెట్లు కడుగుతారో చెప్పాలి. చంద్రబాబు, లోకేశ్ అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారు.
– తాటిపర్తి చంద్రశేఖర్, ఎమ్మెల్యే

రాష్ట్రంలో రాబందుల పాలన

రాష్ట్రంలో రాబందుల పాలన నడుస్తోంది. టీడీపీ కూటమి అధికారంలో ఉన్నంతకాలం పక్క రాష్ట్రాలకు పారిపోయేలా చేస్తున్నారు. చంద్రబాబు మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై దాడి చేసిన ఘటనతో ఏపీని ఆటవిక ప్రదేశ్‌గా మార్చేశారు.
– సీదిరి అప్పలరాజు, మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగం అధ్యక్షుడు

చంద్రబాబు నేతృత్వంలో వికృత పాలన

వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి చేసే వికృత రాజకీయ క్రీడ రాష్ట్రంలో కొనసాగుతోంది. లోకేశ్ తోడల్లుడికి చెందిన గీతం వర్సిటీకి రూ.5 వేల కోట్ల విలువైన భూములు కట్టబెట్టడంతో రాష్ట్ర ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. వీటికి సమాధానం చెప్పుకోలేక ప్రజల ఆలోచనలను మళ్లించేందుకు పథకం ప్రకారం అంబటి రాంబాబుపై దాడి చేశారు.
– సాకే శైలజానాథ్, మాజీ మంత్రి

బిహార్ తరహా ఆటవిక పాలన

రాష్ట్రంలో బిహార్ తరహా పాలనకు టీడీపీ కూటమి ప్రభుత్వం తెరతీసింది. వైఎస్సార్‌సీపీకి చెందిన ముగ్గురు మాజీ మంత్రుల, మాజీ ఎమ్మెల్యేల ఇంటిపై అధికార పార్టీ శ్రేణులు దాడికి పాల్పడటం గర్హనీయం. అంబటి ఇంటిపైన, మరో మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటిపైన పెట్రోల్, కిరోసిన్ బాంబులతో దాడికి దిగారు. కూటమి పాలనలో రౌడీ రాజ్యానికి ఇది నిదర్శనం.
– వెలంపల్లి శ్రీనివాస్, మాజీ మంత్రి

దాడులకు భయపడం

రాజధాని ప్రాంతంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతోంది. వైఎస్సార్‌సీపీ నాయకులపై కూటమి మూకలు దాడులు చేస్తున్నాయి. ఇబ్రహీంపట్నంలో జోగి రమేష్ ఇంటిపై దాడి చేయడం అమానుషం. డీజీపీ పచ్చచొక్కాను వీడి ఖాకీ చొక్కా ధరించాలి. పోలీసుల సమక్షంలోనే దాడులు జరగటం సిగ్గుచేటు. వైఎస్సార్‌సీపీ దాడులకు భయపడే ప్రసక్తే లేదు. ప్రభుత్వ విధానాలపై ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటాలు చేస్తూనే ఉంటాం.
– తలశిల రఘురాం, ఎమ్మెల్సీ

అమిత్‌షా దృష్టికి తీసుకెళ్తాం..

అంబటి రాంబాబుపై జరిగిన దాడి గురించి కేంద్ర హోంశాఖకు, ఎన్‌హెచ్ఆర్‌సీకి ఫిర్యాదు చేశాం. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకెళతాం. రాష్ట్రంలో జరుగుతున్న దాడులపై పార్లమెంట్ వేదికగా తెలియజేస్తాం. బాధితుల్ని కాపాడాల్సిన పోలీసులు దాడిచేసేవారికి రక్షణ కల్పించడం దుర్మార్గం.
– వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ

వ్యూహం ప్రకారమే దాడి

కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేసిన వ్యాఖ్యలను బట్టి వ్యూహం ప్రకారమే అంబటిపై దాడి జరిగిందనిపిస్తోంది. ఈ కేసులో పోలీసుల్ని నిందితుల్ని చేయాలి.
– పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎంపీ

పోలీసులు చోద్యం చూశారు

అంబటి రాంబాబు కారులో వస్తుండగా ఆయన్ని అడ్డగించి టీడీపీ గూండాలు దాడికి పాల్పడ్డారు. అక్కడే ఉన్న పోలీసులు చోద్యం చూశారు. సాక్షాత్తు స్థానిక ఎమ్మెల్యే భర్త సమక్షంలో దాడి జరిగింది.
– వైఎస్ అవినాశ్‌రెడ్డి, ఎంపీ

అంబటిని రెచ్చగొట్టారు

లడ్డూ వ్యవహారంలో అంబటి రాంబాబుపై 24 గంటల ముందునుంచే వ్యూహం పన్ని ఆయన్ని రెచ్చగొట్టారు. టీటీడీ ఈవోపై ప్రభుత్వం అభాండాలు వేస్తోంది. వైఎస్ జగన్, వైవీ సుబ్బారెడ్డి తప్పుచేయలేదని సీబీఐ చార్జ్‌షీట్ ద్వారా నిజం బహిర్గతమైంది.
– మేడ రఘునాథరెడ్డి, ఎంపీ

హత్య చేయాలని చూశారు

అంబటి రాంబాబును హత్య చేసేందుకు టీడీపీ గూండాలు ప్రయత్నం చేశారు. వందలాదిమంది ఆయన ఇంటిపై దాడిచేసి నిప్పంటించడం అత్యంత దుర్మార్గం. దీని ఉద్దేశం ఏమిటంటే హత్యచేయాలనే కదా? అక్కడున్న పోలీసులు ఏం చేస్తున్నారు? వారు పోలీసులా? గూండాలా? దాడిచేసిన వారిపై కేసులు పెట్టకుండా అంబటి రాంబాబుపై కేసు పెట్టడం దారుణం.
– గొల్ల బాబూరావు, ఎంపీ

గల్లా రామచంద్రరావుకు దొరికి ఉంటే..

అంబటి అంత్యక్రియలు పూర్తయ్యేవి

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే గల్లా మాధవి భర్త గళ్ళా రామచంద్రరావుకు అంబటి రాంబాబు దొరికి ఉంటే ఈపాటికి ఆయన అంత్యక్రియలు పూర్తయి ఉండేవంటూ తెలుగుదేశం సోషల్ మీడియా కార్యకర్త స్వాతిరెడ్డి (స్వాతిచౌదరి) ఆదివారం 'ఎక్స్'లో పెట్టిన పోస్టు తీవ్ర కలకలం రేపుతోంది. ఈ పోస్టుతో అంబటి రాంబాబును హత్య చేయడమే టార్గెట్‌గా ఆయనపై దాడి జరిగిందనేది స్పష్టమవుతోంది. గుంటూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మాజీమంత్రి అంబటి రాంబాబు ఇంటిపై శనివారం సా.4 గంటల నుంచి అర్ధరాత్రి 11 గంటలకు వరకు జరిగిన విధ్వంసకాండలో గల్లా మాధవి, ఆమె భర్త రామచంద్రరావు కీలకం అంటూ స్వాతిరెడ్డి తన పోస్టులో పేర్కొన్నారు. అలాగే, వైసీపీ వాళ్లు రామచంద్రరావును ఏదో చేస్తామని ఆయన ఫొటోను సేవ్ చేసుకుంటున్నారని.. 'మీరు అనుకున్నట్లుగా ఆయన వ్యక్తి కాదురా, కనపడని శక్తి. గుంటూరు రాజకీయాల్లో ఇప్పుడే అడుగుపెట్టాడు. ఆయన దగ్గరకు వెళ్లాలంటే చాలా సైన్యాన్ని దాటుకుని వెళ్లాలి' అంటూ స్వాతిరెడ్డి (స్వాతిచౌదరి) తన పోస్టులో పేర్కొన్నారు.



టీడీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ స్వాతిరెడ్డి పెట్టిన నీచమైన పోస్టు

అంబటి ఇంటి వద్ద రక్షణ చర్యలు చేపట్టండి

- గుంటూరు జిల్లా ఎస్పీకి తేల్చి చెప్పిన హైకోర్టు
- అంబటి రాంబాబు సతీమణి ఆందోళనను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై అధికార తెలుగుదేశం పార్టీ గూండాల దుర్మార్గపు దాడి నేపథ్యంలో ఆయన సతీమణి దాఖలు చేసిన అత్యవసర పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. ఆ మూకలు తమ ఇంటిపై పెట్రోల్ బాంబులు వేసి అరాచకం సృష్టిస్తున్నారంటూ రాంబాబు సతీమణి అంబటి విజయలక్ష్మి వ్యక్తం చేసిన ఆందోళనను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. అంబటి రాంబాబు ఇంటి వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని, తదుపరి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా ఎస్పీని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు ఆదివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం రాత్రి జరిగిన ఘటనలు పునరావృతం కారాదని ఎస్పీకి న్యాయమూర్తి మౌఖికంగా స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ పరిమితుల్లో ఉండాలని, రాజకీయ నేతలు హుందాగా వ్యవహరించాలని చెప్పారు. పోలీసుల బాధ్యత శాంతి భద్రతలను పరిరక్షించడమే కాదని, సమాజంలో శాంతి, సామరస్యాలు ఉండేలా చూడాల్సిన బాధ్యత కూడా వారిపైనే ఉందని అన్నారు. పిటిషన్‌పై విచారణ సందర్భంగా అంబటి విజయలక్ష్మి తరఫున న్యాయవాది సానేపల్లి రామలక్ష్మణరెడ్డి వాదనలు వినిపించారు. 'రాంబాబు ఇంటిపై జరిగిన దారుణకాండను రామలక్ష్మణ రెడ్డి కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

పోలీసులు ఎలాంటి రక్షణ కల్పించడం లేదు

'ఇప్పటికీ పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. ప్రతి 20, 30 నిమిషాలకు ఓసారి 100 మంది చొప్పున గుంపులుగా వచ్చి రాళ్ల దాడి చేస్తున్నారు. ఇల్లు మొత్తం పూర్తిగా ధ్వంసమైంది, రాంబాబు సతీమణి ఇప్పటికీ అదే ఇంట్లో ఉంటున్నారు. ఆమెకు పోలీసులు ఎలాంటి రక్షణ కల్పించడంలేదు.

అందుకే మరో దారి లేక అత్యవసరంగా కోర్టు మెట్లు ఎక్కాం. పిటిషనర్ కోరుతున్నది కేవలం పరిమిత, తక్షణ రక్షణ చర్యలే. రాంబాబు నివాసం చుట్టూ ఉన్న మూకలను వెంటనే చెదరగొట్టాలి. కుటుంబ సభ్యుల భద్రత, ఆస్తి రక్షణకు పోలీసులు తక్షణ చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇవ్వండి. ముఖ్యంగా రాత్రి వేళల్లో మరిన్ని అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టేలా ఉత్తర్వులివ్వండి.' అని సానేపల్లి రామలక్ష్మణరెడ్డి కోర్టుకు విన్నవించారు. మీరేమంటారంటూ ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) సింగమనేని ప్రణతిని న్యాయమూర్తి ప్రశ్నించగా.. ఈ కేసులో ప్రస్తుతం పోలీసు అధికారుల నుంచి తనకు ఎలాంటి సమాచారం లేదని ఆమె చెప్పారు. ప్రస్తుతం అక్కడ ఎలాంటి మూకలు లేవని, పరిస్థితి అదుపులో ఉందన్నారు. రాంబాబు ఇంటి వద్ద పోలీసుల మోహరింపు విషయంపై సమాచారం లేదన్నారు. దాడి చేసిన వారిపై కేసులు ఎందుకు నమోదు కాలేదన్న దానిపై స్పష్టత లేదని తెలిపారు.

ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నారా?

ఈ సమయంలో న్యాయమూర్తి స్పందిస్తూ.. రాత్రి సమయంలో మళ్లీ మూక దాడి జరిగే అవకాశం ఉందన్నారు. అలా జరిగితే పరిస్థితి చేజారుతుందని, అలా జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు ఏమైనా తీసుకున్నారా అని ప్రణతిని ప్రశ్నించారు. తదుపరి ఎలాంటి నష్టం జరగకుండా రాంబాబు ఇంటి వద్ద పోలీసు అధికారులను మోహరించారా లేదా అన్న విషయంపై జిల్లా ఎస్పీ నుండి స్పష్టమైన సమాచారం తీసుకుని చెప్పాలని ప్రణతికి సూచిస్తూ విచారణను కొద్దిసేపు వాయిదా వేశారు. అర్ధ గంట తరువాత తిరిగి విచారణ ప్రారంభం కాగా.. పోలీసుల తరఫున హోంశాఖ న్యాయవాది అడుసుమిల్లి జయంతి స్పందిస్తూ.. ప్రస్తుతం అంబటి రాంబాబు ఇంటి వద్ద ఎలాంటి మూకలు లేవన్నారు. రాంబాబు ఇంటి వద్ద 15 మంది పోలీసు అధికారులు ఉన్నారని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ప్రణతి తెలిపారు. రాంబాబు ఇంటి వద్ద మళ్లీ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీకి స్పష్టం చేస్తూ న్యాయమూర్తి ఈ వ్యాజ్యాన్ని పరిష్కరించారు.

గెడ్డపలుగుతో టీడీపీ కార్యకర్త హల్‌చల్

టీడీపీ కార్యకర్తకు సర్దిచెబుతున్న పోలీసులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: అంబటి రాంబాబుపై పోలీసులు అక్రమంగా కేసు నమోదు చేసి, గుంటూరులోని నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన సమయంలో ఓ టీడీపీ కార్యకర్త గెడ్డ పలుగుతో వచ్చి వీరంగం సృష్టించాడు. పోలీసుల వద్దకు వచ్చి 'మా చంద్రబాబుని తిట్టిన వాడ్ని లోపల కూర్చోబెట్టి, మీరు బయట ఏం చేస్తున్నారు' అంటూ కేకలు వేశాడు. పోలీసులు వెంటనే గెడ్డపలుగును స్వాధీనం చేసుకొని, అతడికి సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించేశారు. కాగా, పూర్తిగా పచ్చ పార్టీ కార్యకర్తల్లా మారిపోయిన పోలీసులు దీనిపై వివరణ ఇస్తూ.. ఎవరో గుంతలు తవ్వే వ్యక్తి వచ్చాడని, కాసేపు లోపల విశ్రాంతి తీసుకుంటానని చెప్పడంతో అతన్ని పంపించేశామంటూ పొంతన లేకుండా, నిస్సిగ్గుగా కట్టుకథ వల్లించడం గమనార్హం.

ఎన్‌డీడీబీ రిపోర్టు మేరకే

లడ్డూలో కల్తీ జరిగిందని చెప్పాను

- వైఎస్సార్‌సీపీ నానాయాగి చేసి సుప్రీం కోర్టును ఆశ్రయించింది
- ఇప్పుడు సీబీఐ సిట్ నివేదికను పట్టుకుని నాపై ఆరోపణలు చేస్తున్నారు
- తిరుమల పవిత్రతను కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నాం
- కేంద్ర బడ్జెట్‌ను స్వాగతిస్తున్నాం : సీఎం చంద్రబాబు

కుప్పం: తిరుమల శ్రీవారి లడ్డూలో జంతు కొవ్వు కలిసిందని ఎన్‌డీడీబీ ఇచ్చిన నివేదిక మేరకే తాము కల్తీ గురించి మాట్లాడామని, దీనిపై వైఎస్సార్‌సీపీ నానా యాగి చేసి సుప్రీం కోర్టును ఆశ్రయించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఆదివారం కుప్పం పర్యటనలో భాగంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తిరుమల పవిత్రతను కాపాడేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నెయ్యి కల్తీపై సీబీఐ సిట్ వేసి నివేదిక ఇస్తే, మళ్లీ నాపై ఆరోపణలు చేసే స్థాయికి వచ్చారన్నారు. మహాద్వారం ద్వారా వెళ్లే అవకాశం ఉన్నా, సామాన్య భక్తుడిలా స్వామి వారి దర్శనానికి వెళ్తున్నానని చెప్పారు. వాళ్లు అపచారం చేసి, మహా పాపాన్ని కప్పి పుచ్చుకునేందుకు నాపైనే తిరిగి దాడి చేస్తున్నారని తెలిపారు. శ్రీ వేంకటేశ్వర స్వామితో రాజకీయం చేస్తే భగవంతుడు చూస్తూ ఊరుకోడని చెప్పారు.

కేంద్ర బడ్జెట్‌ను స్వాగతిస్తున్నాం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను స్వాగతిస్తున్నామని.. రాష్ట్రం అమలు చేస్తున్న ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి ఈ బడ్జెట్ సహకరించేలా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఎంఎస్ఎంఈలపై ఎక్కువగా దృష్టి సారించిందని, వీటిని మరింతగా బలోపేతం చేసుకునే అవకాశం ఉందన్నారు. 2047 వికసిత్ భారత్ డెవలప్డ్ ఎకానమీగా మారేందుకు ఈ బడ్జెట్ ఉపయోగపడుతుందని చెప్పారు. 'ఇది బ్యాలెన్స్‌డ్ బడ్జెట్. ఏఐ సహా వివిధ టెక్నాలజీలు, నెక్స్ట్ లెవల్ ఆఫ్ రిఫార్మ్స్‌కు వెళ్తుంది. హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్‌లు రాష్ట్రానికి ఉపయోగపడతాయి. ఈ బడ్జెట్‌లో తొలిసారిగా లాజిస్టిక్స్ రంగం అభివృద్ధి గురించి ప్రస్తావించారు. ఈ బడ్జెట్ పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను అభినందిస్తున్నా' అని తెలిపారు.

2025 ఆర్థిక సంవత్సరంలో తొలుత చేసిన బడ్జెట్ కేటాయింపులకన్నా ఎక్కువ/తక్కువ ఖర్చుపెట్టిన మంత్రిత్వ శాఖలు..



సతీశ్‌రెడ్డి
డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, రక్షణ మంత్రిత్వశాఖ సలహాదారు

రక్షణ రంగానికి కేంద్ర బడ్జెట్‌లో పెద్దపీట వేయడం శుభపరిణామం. గతంతో పోలిస్తే ఈసారి కేంద్ర బడ్జెట్‌లో రక్షణ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. ఈసారి డిఫెన్స్ రంగానికి బడ్జెట్ రూ. 7.85 లక్షల కోట్లు పెట్టారు. ఈసారి ఏకంగా 15 శాతం కేటాయింపులు పెరిగాయి. దీనివల్ల అవసరమైన ఆయుధాల కొనుగోలుతోపాటు దేశీయంగా ఆయుధాల తయారీకి మరింత అవకాశం ఏర్పడుతుంది. రక్షణ రంగానికి ఇంత పెద్దఎత్తున బడ్జెట్ పెరగడం సంతోషం.

నిధుల సిక్సర్

అంతరిక్ష శాఖకు రూ.13,705 కోట్లు

న్యూఢిల్లీ: 2026–27 కేంద్ర బడ్జెట్‌లో అంతరిక్ష శాఖకు రూ.13,705.60 కోట్లు కేటాయించారు. దీంతో సొంత అంతరిక్ష కేంద్రం, మానవ అంతరిక్ష విమానాల ఆశయాన్ని సాధించేందుకు కొత్త రాకెట్లను నిర్మించాలన్న ఇస్రో ప్రణాళికలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కేటాయింపులతో ఊతం లభించినట్లయింది. 2026–27 కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనా అయిన రూ.13,416 కోట్ల కంటే స్వల్పంగా పెరిగింది. 2026–27 బడ్జెట్‌లో 'స్పేస్ టెక్నాలజీ' కింద రూ.10,397.06 కోట్లు కేటాయించారు. ఇందులో విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్, లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్స్ సెంటర్, ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్, యూఆర్ రావు శాటిలైట్ సెంటర్‌తో సహా వివిధ ఇస్రో కేంద్రాల కార్యకలాపాలకు మద్దతు ఉంటుంది. వీటిలో లాంచ్ వెహికల్ ప్రాజెక్టులు, ఉపగ్రహ ప్రాజెక్టులున్నాయి. అలాగే అభివృద్ధి, కార్యా చరణ ప్రాజెక్టులు, ఐఎన్–స్పేస్ పథకాలు న్నాయి. మొత్తం వ్యయంలో రూ.7,329.70 కోట్లు రెవెన్యూ వ్యయం కాగా, రూ.6,375.90 కోట్లు మూలధన వ్యయం. ఇది గతేడాది సవరించిన మూలధన ప్రణాళిక కంటే దాదాపు రూ.1,066 కోట్లు ఎక్కువ.

రక్షణ రంగానికి రికార్డు స్థాయిలో రూ.7,84,678 కోట్ల కేటాయింపు

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌తో పోల్చుకుంటే 15 శాతం అధికం
- చైనా, పాకిస్తాన్‌ల నుంచి ఎదురవుతున్న సవాళ్లపై కేంద్రం దృష్టి
- 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో కొత్త ఆయుధాలు, ఎయిర్‌క్రాఫ్టులు, యుద్ధనౌకలు, మిలటరీ హార్డ్‌వేర్ కొనుగోళ్ల లక్ష్యంగా ప్రతిపాదనలు
- మూలధన వ్యయం కోసమే రూ.2,19,306 కోట్లు
- దేశ రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే దృఢ సంకల్పానికి ఊతం: రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ

పొరుగు దేశాలైన చైనా, పాకిస్తాన్‌ల నుంచి ఎదురవుతున్న సవాళ్ల దృష్ట్యా మిలటరీ ఆధునీకరణపై కేంద్రం ఫోకస్ పెంచింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి గాను ఆదివారం నాడు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రక్షణ రంగానికి సింహభాగం కేటాయించింది. ముఖ్యంగా మూలధన వ్యయంలో భారీ పెరుగుదల చోటు చేసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఏకంగా లక్ష కోట్లకు పైగానే కేటాయింపులు జరిపింది. 2025–26లో రూ.6.81 లక్షల కోట్లు కేటాయించగా, ఈసారి రికార్డు స్థాయిలో రూ.7,84,678 కోట్లు ప్రతిపాదించింది. అంటే ప్రస్తుత ఏడాదితో పోల్చుకుంటే దాదాపు 15 శాతం అధికంగా కేటాయింపులు జరిపింది. ముఖ్యంగా పాకిస్తాన్‌పై 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో అత్యాధునిక యుద్ధరీతులపై కేంద్రం దృష్టి పెట్టింది. అందుకు అనుగుణంగా కొత్త ఆయుధాలు, ఎయిర్‌క్రాఫ్టులు, యుద్ధనౌకలు, మిలటరీ హార్డ్‌వేర్ కొనుగోళ్ల లక్ష్యంగా మొత్తం రక్షణ బడ్జెట్‌లో మూలధన వ్యయం కోసం రూ.2,19,306 కోట్లు కేటాయించింది. 'ఆపరేషన్ సిందూర్'చరిత్రాత్మక విజయం నేపథ్యంలో దేశ రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే తమ దృఢ సంకల్పానికి మూలధన సేకరణ సహా రక్షణ రంగ బడ్జెట్ పెంపు మరింత ఊతం ఇచ్చిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు.

రెవెన్యూ వ్యయం రూ.5,53,668 కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కేటాయింపులు రూ.1.80 లక్షల కోట్లతో పోల్చుకుంటే మూలధన వ్యయం రూ.39 వేల కోట్లు పెంచింది. అయితే 2025–26 సంవత్సరానికి సవరించిన మూలధన వ్యయాన్ని రూ.1,86,454 కోట్లుగా అంచనా వేశారు. తాజా మూలధన వ్యయంలో యుద్ధ విమానాలు, ఏరో ఇంజిన్ల కోసం రూ.53,733 కోట్లు, నౌకాదళం కోసం రూ.25,023 కోట్లు కేటాయించారు. రూ.1,71,338 కోట్ల పింఛన్లతో కలిపి రెవెన్యూ వ్యయాన్ని రూ.5,53,668 కోట్లుగా చూపించారు.

కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు

పౌర, శిక్షణ విమానాల తయారీకి అవసరమైన కాంపోనెంట్లు, విడిభాగాలపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ (బీసీడీ) మినహాయింపును ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. రక్షణ రంగ పరిశ్రమలకు.. విమానాల నిర్వహణ, మరమ్మతు, ఓవర్‌హాలింగ్‌కు అవసరమైన విడిభాగాలపై బీసీడీ రద్దును ప్రతిపాదించారు. రక్షణ రంగ వైమానిక పరిశ్రమకు ఈ రెండు నిర్ణయాలు ఉపకరిస్తాయని భావిస్తున్నారు.

పాకిస్తాన్‌పై 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో అత్యాధునిక యుద్ధరీతులపై కేంద్రం దృష్టి పెట్టింది.

మాజీ సైనికుల సీహెచ్‌ఎస్‌కు రూ.12,100 కోట్లు

మాజీ సైనికుల కంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్ (సీహెచ్ఎస్) కోసం రూ.12,100 కోట్లు ప్రతిపాదించామని రాజ్‌నాథ్ చెప్పారు. భద్రత, అభివృద్ధి, స్వయం సమృద్ధి మధ్య సమతూకాన్ని ఈ బడ్జెట్ బలోపేతం చేస్తుందని అన్నారు. 2026–27 నాటికి అంచనా వేస్తున్న జీడీపీలో రక్షణ రంగ బడ్జెట్ సుమారు 2 శాతంగా ఉండే అవకాశం ఉందన్నారు. రక్షణ రంగానికి రూ.7.85 లక్షల కోట్లు కేటాయించినందుకు ప్రధాని మోదీకి తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. మిలటరీ ఆధునీకరణతో పాటు సాంకేతిక ఆవిష్కరణలు, వనరుల సముచిత వినియోగానికి వీలుగా క్రమబద్ధమైన సేకరణపై రక్షణ బడ్జెట్ దృష్టి పెడుతుందని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. కాగా సాయుధ దళాల బడ్జెట్‌పై దేశ రక్షణ పరిశ్రమ హర్షం వ్యక్తం చేసింది. సాయుధ దళాల ఆధునీకరణ, బలోపేతానికి దేశం కట్టుబడి ఉందనే విషయాన్ని రక్షణ బడ్జెట్ ప్రస్ఫుటం చేసిందని థాలేస్ ఇండియా ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ అంకుర్ కనగ్లేకర్ అన్నారు.

త్రివిధ దళాల ఆధునీకరణే లక్ష్యం: రక్షణ మంత్రి

త్రివిధ దళాల ఆధునీకరణే ఈ బడ్జెట్‌లో అతి ముఖ్యమైన అంశమని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఇందుకోసం ఈ ఏడాది రూ.1.85 లక్షల కోట్లు కేటాయించడం జరిగిందని, గత ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే ఇది సుమారు 24 శాతం అధికమని పేర్కొన్నారు. ఈ పెంపుదలతో దేశ మిలటరీ సామర్థ్యం మరింత శక్తివంతం అవుతుందని అన్నారు. మాజీ సైనికులు, వారి కుటుంబాల సంక్షేమానికి కూడా ప్రస్తుత బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు.

మ్యాచ్ సమ్మరీ

మిగతా విషయాల్లో ఎంత 'డిఫెన్స్' ఆడినా... డిఫెన్స్ రంగం విషయానికి వచ్చేసరికి నో డిఫెన్స్. ఎందుకంటే భద్రతపై రాజీ ఉండకూడదన్నది ప్రభుత్వ పాలసీ. అందుకే... రక్షణ రంగం సేఫ్ ప్లేను వదిలి నిధుల సిక్సర్ కొట్టింది. రూ.7.84 లక్షల కోట్ల రికార్డు కేటాయింపుతో కేంద్రం బంతిని నేరుగా బౌండరీ దాటించింది. చైనా, పాకిస్తాన్‌ల నుంచి ఎదురవుతున్న సవాళ్ల నేపథ్యంలో కొట్టిన ఈ షాట్ కేవలం స్కోర్ పెంచడానికి కాదు, మ్యాచ్‌ను కంట్రోల్‌లోకి తీసుకురావడానికి. మూలధన వ్యయాన్ని భారీగా పెంచుతూ కొత్త ఆయుధాలు, యుద్ధ విమానాలు, నౌకలు, ఆధునిక మిలటరీ హార్డ్‌వేర్‌తో దేశ రక్షణ విషయంలో ఎంత హిట్టింగ్‌కైనా సిద్ధమని మోదీ సర్కారు స్పష్టంగా చెప్పింది. ఆపరేషన్ సిందూర్' తర్వాత సన్నద్ధతకు మరింత పదునుపెట్టిన ఈ బడ్జెట్... డిఫెన్స్‌లో కాదు, అగ్రెసివ్ ఫీల్డ్ సెటప్‌తో ఆడుతున్న స్పష్టమైన సంకేతం.

పర్యాటకానికి మహర్దశ

- 15 పురాతత్వ ప్రాంతాల పునరుజ్జీవం
- నేషనల్ డెస్టినేషన్ డిజిటల్ నాలెడ్జ్ గ్రిడ్ ఏర్పాటు
- కశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్‌లో ట్రెక్కింగ్‌తరహా సదుపాయాల మెరుగు

న్యూఢిల్లీ: దేశంలో పర్యాటక రంగాన్ని మరింత పరిపుష్టం చేసేందుకు మోదీ సర్కార్ నడుం బిగించింది. భారతీయ పురాతన ప్రాంతాల ప్రాశస్త్యాన్ని ప్రపంచ దేశాలకు తెలియజేప్పే ఉద్దేశంతో దేశంలోని 15 ప్రఖ్యాత పురాతత్వ ప్రాంతాలకు పునరుజ్జీవ భాగ్యం కల్పించాలని నిర్ణయించినట్లు ఆర్థిక మంత్రి నిర్మల ఆదివారం తన బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. ఆయా పురాతన ప్రాంతాల్లో కనీస సదుపాయాలను కల్పించి దేశ, విదేశీ సందర్శనలు విపరీతంగా పెరిగేలా చేస్తారు. సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా ఖ్యాతిపొందిన ప్రాంతాలనూ కలుపుతూ నేషనల్ డెస్టినేషన్ డిజిటల్ నాలెడ్జ్ గ్రిడ్‌ను ఏర్పాటుచేయనున్నట్లు నిర్మల చెప్పారు. ''హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూకశ్మీర్‌లలో ట్రెక్కింగ్, హైకింగ్ తరహా ఇతర సదుపాయాల కల్పనకు నిధులు మంజూరుచేస్తున్నాం. దీంతో తూర్పు కనుమల్లో అరకు లోయ మొదలు పశ్చిమ కనుమల్లో పొధిగై మలై దాకా ట్రెక్కింగ్, హైకింగ్ వంటి సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి'' అని మంత్రి నిర్మల వెల్లడించారు. టూరిజం రంగం కోసం రూ.2,438.40 కోట్లు కేటాయించారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, కేటరింగ్ టెక్నాలజీను ఆధునీకరించి కొత్తగా జాతీయ ఆతిథ్య సంస్థను ఏర్పాటుచేయనున్నారు. నేషనల్ డెస్టినేషన్ డిజిటల్ నాలెడ్జ్ గ్రిడ్‌లో భాగంగా లోథల్, ధోలావరియా, రాఖీగఢీ, సారనాథ్, హస్తినాపూర్, లేహ్ ప్యాలెస్‌లను మరింత అభివృద్ధి చేయనున్నారు. అన్ని పురాతన స్థలాల వివరాలను డిజిటలైజ్ చేసేందుకు జాతీయస్థాయిలో డిజిటల్ గ్రిడ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ''నాలెడ్జ్ గ్రిడ్ ద్వారా ఆయా సాంస్కృతిక, ఆధ్యాత్మిక, వారసత్వ స్థలాల వద్ద కొత్తగా స్థానిక పరిశోధకులు, చరిత్రకారులు, కంటెంట్ క్రియేటర్లు, సాంకేతిక భాగస్వాములకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. 20 ప్రఖ్యాత సందర్శనా స్థలాల్లో 10,000 మంది గైడ్‌ల నైపుణ్యశిక్షణనందిస్తాం'' అని మంత్రి చెప్పారు.

ఐదేళ్లలో లక్ష మంది హెల్త్ ప్రొఫెషనల్స్‌కు శిక్షణ

రేడియాలజీ, అనస్తీషియా వంటి దాదాపు 10 రకాల వైద్యానుబంధ వృత్తి నిపుణులకు తగు శిక్షణ ఇస్తామని మంత్రి వెల్లడించారు.

సీబీఐకి రూ.1,105 కోట్లు

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం ప్రవేశపెట్టిన 2026-27 కేంద్ర బడ్జెట్‌లో సీబీఐకి రూ.1,104.98 కోట్లు కేటాయించారు. 2025-26 బడ్జెట్ అంచనాలలో సీబీఐకి రూ.997.62 కోట్లు కేటాయించగా తర్వాత దీన్ని రూ.1,058.3 కోట్లకు సవరించారు. సీబీఐ శిక్షణా కేంద్రాల ఆధునీకరణ, సాంకేతిక, ఫోరెన్సిక్ సపోర్ట్ యూనిట్ల స్థాపన, సమగ్ర ఆధునీకరణ, సీబీఐ కోసం భూమి కొనుగోలు/కార్యాలయం/నివాస భవనాల నిర్మాణం వంటి వివిధ ప్రాజెక్టులకు కూడా ఇది వర్తిస్తుందని పేర్కొన్నారు.

'హోం' పటిష్టం

- కేంద్ర హోంశాఖకు రూ.2,55,233.53 కోట్లు
- గత బడ్జెట్‌తో పోలిస్తే అదనంగా రూ.22 వేల కోట్లు

న్యూఢిల్లీ: కేంద్ర హోంశాఖకు ఈ దఫా బడ్జెట్‌లో రూ.2,55,233.53 కోట్లు కేటాయించారు. ఇందులో సింహభాగం నిధులను అంతర్గత భద్రత, కీలక వ్యవస్థలను పరిరక్షించే కేంద్ర పోలీసు బలగాలైన సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్‌కు రూ.1,73,802.53 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్ అంచనాలతో పోలిస్తే ఈసారి కేంద్ర హోంశాఖకు కేటాయింపులు రూ.22 వేల కోట్లకుపైగా పెరిగాయి. 2025–25 బడ్జెట్ అంచనాల్లో కేంద్ర హోంశాఖ కేటాయింపులు రూ.2,33,210.68 కోట్లుగా పేర్కొన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలు, ఈశాన్య రాష్ట్రాల్లో చొరబాటుదారుల అణచివేతతోపాటు మావోయిస్టుల ఏరివేత చర్యల్లో సీఆర్‌పీఎఫ్ బలగాలు కీలకపాత్ర పోషిస్తుండగా.. పాకిస్తాన్, బంగ్లాదేశ్‌తో 6,000 కి.మీ.పైగా ఉన్న సరిహద్దులను బీఎస్ఎఫ్ పరిరక్షిస్తోంది. ఇండో టిబెటన్ బోర్డర్ పోలీసులు భారత్ – చైనా సరిహద్దుల్లో విధుల్లో నిమగ్నం కాగా నేపాల్, భూటాన్ సరిహద్దుల వద్ద సశస్త్ర సీమాబల్ బలగాలు పహారా కాస్తున్నాయి. అణు కేంద్రాలు, ఎయిర్‌పోర్టులు, మెట్రో నెట్‌వర్క్‌ల వద్ద కేంద్ర పారిశ్రామిక భద్రతా బలగాలు (సీఐఎస్ఎఫ్) సేవలందిస్తున్నాయి.

నిఘాకు మరిన్ని నిధులు

ఇంటెలిజెన్స్ విభాగానికి ఈసారి రూ.6,782.43 కోట్లు కేటాయించారు. ఢిల్లీ పోలీసు విభాగానికి కేటాయింపులు స్వల్పంగా పెంచి రూ.12,503.65 కోట్లు ఇస్తున్నట్లు ప్రకటించారు. ప్రధానితోపాటు మాజీ ప్రధానులు, వారి కుటుంబ సభ్యులు, ఇతర ప్రముఖులకు భద్రత కల్పించే స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ కోసం బడ్జెట్‌లో రూ.499.99 కోట్లు నిర్దేశించారు. గత బడ్జెట్‌తో పోలిస్తే ఎస్‌పీజీకి నిధులు తగ్గించారు. నేరుగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వచ్చే జమ్మూకశ్మీర్ పోలీసు విభాగానికి పరిపాలన వ్యయం కింద రూ.9,925.50 కోట్లు కేటాయించారు. పోలీసు బలగాలు, నేరాలు – నేరాల ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్స్ ఆధునీకరణ కోసం రూ.450.54 కోట్లు కేటాయించారు. ఈ ఏడాది మార్చి 31లోగా దేశంలో మావోయిస్టులను ఏరివేయాలని కేంద్ర హోంశాఖ గడువు నిర్దేశించుకున్న నేపథ్యంలో భద్రతా పరమైన వ్యయం, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వసతుల కోసం రూ.3,610.80 కోట్లు కేటాయించారు. కేంద్ర సాయుధ బలగాల ఆధునీకరణ కోసం రూ.343.66 కోట్లు వ్యయం చేయాలని ప్రతిపాదించారు.

కశ్మీర్‌కు 43,290.29 కోట్లు



ఆర్టికల్ 370 రద్దు అనంతరం కేంద్ర పాలిత ప్రాంతంగా మారిన జమ్మూ కశ్మీర్‌కు బడ్జెట్‌లో రూ.43,290.29 కోట్లు కేటాయిస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. దేశ రాజధాని ఢిల్లీకి రూ.1,348 కోట్లు కేటాయించారు. 1984 ఢిల్లీ అల్లర్ల బాధితుల పరిహారం పెంపు, విపత్తుల నిర్వహణ గ్రాంటు, కేంద్ర పథకాల ద్వారా సాయం, మెరుగైన నీటి సరఫరా వ్యవస్థ తదితరాల కోసం ఈ నిధులను వెచ్చించనున్నారు. అండమాన్ నికోబార్‌కు రూ.6,680.94 కోట్లు, చండీగఢ్‌కు రూ.5,720.17 కోట్లు, డయ్యూ డామన్ దాద్రా నగర్ హవేలీకి రూ.2,832.70 కోట్లు, లద్దాఖ్‌కు రూ.4,869.31 కోట్లు, లక్ష దీవులకు రూ.1,682.35 కోట్లు, పుదుచ్చేరికి రూ.3,517.88 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు.

జన గణనకు రూ.6,000 కోట్లు

ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న జనాభా లెక్కల పనుల కోసం బడ్జెట్‌లో రూ.6,000 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. 2020 –21లో మొదలు కావాల్సిన జన గణన కోవిడ్ కారణంగా వాయిదా పడింది.

మిషన్ మౌసమ్‌కు రూ.1,342 కోట్లు

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో మిషన్ మౌసమ్‌కు రూ.1,342 కోట్లు కేటాయించారు. దీంతో భారతదేశం తన వాతావరణ అంచనా సామర్థ్యాలను పెంపొందించుకునే ప్రయత్నాలకు గణనీయమైన ఊపు లభించినట్లయింది. 2025–26 బడ్జెట్‌లో సవరించిన అంచనా రూ.3,380 కోట్లతో పోలిస్తే, భూశాస్త్ర మంత్రిత్వ శాఖకు కేటాయింపు రూ.3,789.23 కోట్లుగా ఉంది. డీప్ ఓషన్ మిషన్‌కు రూ.625 కోట్లు కేటాయించగా, ఇది మునుపటి బడ్జెట్ సవరించిన అంచనాల్లో కేటాయించిన రూ.660 కోట్ల కంటే తక్కువ. డీప్–ఓషన్ వనరులను అన్వేషించడం, వాటి స్థిరమైన ఉపయోగం కోసం సాంకేతికతలను అభివృద్ధి చేయడం ఈ మిషన్ లక్ష్యం. వాతావరణ పర్యవేక్షణ, అంచనా, డేటా విశ్లేషణలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి అత్యాధునిక సాంకేతికతలు, అధిక-పనితీరు గల కంప్యూటింగ్, అధునాతన మోడలింగ్ పద్ధతులను ఉపయోగించుకునే 'ప్రతిష్టాత్మక చొరవ'గా మిషన్ మౌసమ్‌ను బడ్జెట్ పత్రాలు అభివర్ణించాయి. కాగా, 2025–26 బడ్జెట్ సవరించిన అంచనాలలో ఇది రూ.219.6 కోట్లు.



జీడీపీలో ప్రపంచంలోనే టాప్-5లో నిలిచిన భారత్.. తలసరి జీడీపీలో మాత్రం ఎంతో వెనుకబడి ఉంది. మొత్తం జీడీపీని దేశ ప్రజలందరికీ పంచితే వచ్చే తలసరి జీడీపీ లెక్క సుమారు 2,800 డాలర్లకు పరిమితం కావడమే అందుకు కారణం.

కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి ప్రాధాన్యం ఇచ్చారు. తాజా బడ్జెట్‌లో 15 వేల పాఠశాలల్లో కంటెంట్ క్రియేషన్ ల్యాబ్స్ ఏర్పాటు ప్రతిపాదన ఎంతో దూరదృష్టితో కూడుకున్నది. ఇది విద్యార్థుల్లో చిన్న వయసు నుంచే సృజనాత్మకత, కమ్యూనికేషన్ స్కిల్స్, డిజిటల్ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుంది. బాలికల విద్యకు ప్రాధాన్యం కల్పించే బడ్జెట్ ఇది.

- చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, రాయన్ ఎడ్యుకేషన్

ఫ్లాష్‌బ్యాక్..

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రికార్డు స్థాయిలో వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టిన నేపథ్యంలో బడ్జెట్‌లకు సంబంధించి కొన్ని పాత రికార్డులు ఓసారి చూద్దాం

1733లో బడ్జెట్‌గా మారి..

ఫ్రెంచ్ పదాలు బోగ్, బోగెట్ నుంచి బడ్జెట్ పుట్టింది. బోగెట్ అంటే పత్రాలు లేదా డబ్బు దాచుకొనే చిన్నపాటి లెదర్ బ్రీఫ్‌కేస్ అని అర్థం . 1733లో నాటి బ్రిటన్ డిఫాక్టో ప్రధాని అయిన సర్ రాబర్ట్ వాల్‌పోల్ తొలిసారి ప్రవేశపెట్టిన దేశ ఆర్థిక ప్రణాళికలను ఎద్దేవా చేస్తూ ముద్రించిన ఓ ఫ్రెంచ్ పాంప్లెట్‌లో తొలిసారి బడ్జెట్ అనే పదాన్ని వాడారు.



అప్పుడు హల్వా వండలే..

బడ్జెట్ ప్రతుల ముద్రణ ప్రక్రియ ప్రారంభానికి సూచికగా కేంద్ర ఆర్థిక మంత్రి సహా అధికారులు, సిబ్బంది సంప్రదాయ హల్వా తయారీలో పాల్గొంటారు. ఏదైనా కొత్త పని లేదా శుభకార్యాన్ని తీపితో మొదలుపెట్టడమనే సంప్రదాయంలో భాగంగా ఈ ప్రక్రియ చేపడతారు. కొన్ని నెలలపాటు బడ్జెట్ తయారీలో నిమగ్నమయ్యే అధికారులకు కృతజ్ఞత తెలపడంగా కూడా దీన్ని పరిగణిస్తారు. అయితే కోవిడ్ నేపథ్యంలో 2022లో మాత్రం హల్వా తయారీకి బదులుగా అధికారులకు స్వీట్ బాక్సులను పంచి పెట్టారు. అలాగే సార్వత్రిక ఎన్నికల ఏడాది అయిన 2024లో మాత్రం ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత రెండుసార్లు హల్వా తయారీ నిర్వహించడం విశేషం.

పరీక్ష పేపర్లే కాదు.. బడ్జెట్ పత్రమూ..

1950లో కేంద్ర బడ్జెట్ ప్రింటింగ్ దశలోనే లీకైంది. అప్పటి వరకూ బడ్జెట్ ప్రతులను రాష్ట్రపతి భవన్ ప్రెస్‌లో ముద్రించేవారు. లీక్‌లను నివారించేందుకు ప్రింటింగ్‌ను ఢిల్లీ సెక్రటేరియట్ భవనంలోని నార్త్‌బ్లాక్‌లో ఉన్న బేస్‌మెంట్‌కు మార్చారు. అలాగే బడ్జెట్ తయారీతో నేరుగా సంబంధమున్న అధికారులను 10 రోజుల పాటు బేస్‌మెంట్‌కే పరిమితం చేస్తారు. బడ్జెట్‌ను ప్రవేశపెట్టే దాకా వారిని ఇంటికి దూరంగా ఉంచుతారు. దేశంలో 1955 వరకు బడ్జెట్ ప్రతులను ఆంగ్లంలోనే ప్రచురించేవారు. 1955లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తొలిసారి హిందీలో బడ్జెట్ ప్రతులను ముద్రించింది.



బ్లాక్ బడ్జెట్ అంటూ..

1973లో నాటి ఆర్థిక మంత్రి యశ్వంత్‌రావు చవాన్ ప్రవేశపెట్టిన బడ్జెట్.. బ్లాక్ బడ్జెట్‌గా విమర్శలపాలైంది. 1971లో బంగ్లాదేశ్ విముక్తి కోసం పాక్‌తో భారత్ సాగించిన యుద్ధం ప్రభావం కారణంగా ద్రవ్యలోటు రూ. 550 కోట్లకు పెరిగింది. అప్పట్లో అది చాలా పెద్ద మొత్తం.

విలేజ్.. విన్నర్

వికసిత్ భారత్ లక్ష్యంగా గ్రామీణాభివృద్ధిపై ఫుల్ ఫోకస్

ఫ్లాగ్‌షిప్ పథకాలకు దండిగా నిధులు

ఉపాధి హామీ పథకానికి కొత్తరూపు

ఇళ్లు, రహదారుల నిర్మాణానికి మరింత దన్ను

న్యూఢిల్లీ: వికసిత్ భారత్ లక్ష్యంగా సాగుతున్న మోదీ సర్కారు ఆర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మలాంటి గ్రామీణ భారతావనిపై మరింత దృష్టి సారించింది. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధి, ఇళ్ల నిర్మాణం, అందరికీ స్వచ్ఛమైన తాగు నీరు అందించడం కోసం కీలక ఫ్లాగ్‌షిప్ పథకాలకు తాజా బడ్జెట్‌లో దండిగా నిధులు కేటాయించింది. గత ఉపాధి హామీ పథకం స్థానంలో మరింత పటిష్టమైన వీబీ–జీ రామ్ జీ చట్టాన్ని అమల్లోకి తీసుకొస్తోంది. రాష్ట్రాలను భాగస్వామ్యం చేసే ఈ కొత్త పథకానికి మునుపెన్నడూ లేని రీతిలో కేటాయింపులు చేయడం విశేషం. మొత్తంమీద గ్రామీణాభివృద్ధికి 2026–27 బడ్జెట్లో రూ.1,94,369 కోట్లు దక్కాయి. పాత ఉపాధి హామీ పథకానికి రూ.30,000 కోట్లు, వ్యవసాయ మౌలికసదుపాయాలు, అభివృద్ధి ఫండ్‌కు రూ.4,400 కోట్లను కలుపుకుంటే 21 శాతం మేర నిధులు ఎగబాకినట్లు లెక్క!

'వికసిత్ భారత్ జీ-రామ్-జీ'తో ఉపాధికి మరింత గ్యారంటీ...

2026-27 కేటాయింపులు: రూ.**95,692** కోట్లు

2025-26 కేటాయింపులు: రూ.**86,000** కోట్లు

(సవరించిన అంచనా రూ.**88,000** కోట్లు)

గ్రామీణ ప్రజలకు పక్కాగా ఉపాధి కల్పించే ఉద్దేశంతో రెండు దశాబ్దాల క్రితం యూపీఏ సర్కారు అమల్లోకి తెచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) స్థానంలో మోదీ సర్కారు కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది. దీనికి వికసిత్ భారత్ – గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ).. సంక్షిప్తంగా వీబీ–జీ రామ్ జీ అని పేరు పెట్టారు. దీని ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబాలకు ఇకపై ఏటా 125 రోజుల పాటు (పాత చట్టంలో 100 రోజులు) ఉపాధి హామీ దక్కుతుంది. కీలక వ్యవసాయ సీజన్‌లో కూలీల కొరతను నివారించేందుకు 60 రోజుల పాటు ఈ పథకాన్ని నిలిపివేస్తారు. దీని కింద ప్రధానంగా జల సంరక్షణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక మౌలిక వసతుల అభివృద్ధి, జీవనోపాధిని కల్పించే పనులు, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనే పనులను చేపడతారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశం(వికసిత్ భారత్) లక్ష్యాన్ని సాధించడంలో భాగంగా, మెరుగైన ఉపాధి అవకాశాలు, మౌలిక సదుపాయాల కల్పన, డిజిటల్ గవర్నెన్స్ పెంపొందించడం, పల్లెవాసుల్లో ఆర్థిక సాధికారతను పెంచడం కొత్త చట్టం ప్రధానోద్దేశమని మోదీ ప్రభుత్వం చెబుతోంది.

పాత ఉపాధి హామీ పథకంలో కూలీల వేతనాలు 100 శాతం, మెటీరియల్ ఖర్చులో 75 శాతం కేంద్రమే భరించేది. అయితే 2026–27 ఆర్థిక సంవత్సరం నుంచి అమల్లోకి రానున్న జీ–రామ్–జీ చట్టం ప్రకారం కేంద్ర, రాష్ట్రాలు ఉపాధి వ్యయాన్ని 60:40 శాతం చొప్పున భరించాల్సి ఉంటుంది. ఈశాన్య, హిమాలయ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఇది 90:10 నిష్పత్తిలో ఉంటుంది. తాజా బడ్జెట్ కేటాయింపులకు రాష్ట్రాల వాటా తోడైతే జీ–రామ్–జీ కోసం ఏకంగా రూ.1.51 లక్షల కోట్లు దక్కుతాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. ఈ కేటాయింపులను 'చరిత్రాత్మకం, అపూర్వమైనది'గా ఆయన అభివర్ణించారు. కాగా, ముగిసిపోతున్న పాత పథకం కింద చేపట్టిన పనుల కోసం అదనంగా ఈ బడ్జెట్లో మరో రూ.30,000 కోట్లను కేటాయించడం ద్వారా ఉపాధి కల్పనకు గట్టిగానే నిధుల హామీ లభించింది.

ఇక చాంపియన్లుగా ఎంఎస్ఎంఈలు

బడ్జెట్‌లో రూ.10,000 కోట్లతో డెడికేటెడ్ ఫండ్

న్యూఢిల్లీ: దేశంలో ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు(ఎంఎస్ఎంఈ) చాంపియన్లుగా ఎదగడానికి సహకరించాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా రూ.10,000 కోట్లతో డెడికేటెడ్ ఫండ్‌ను తాజా బడ్జెట్‌లో ప్రకటించింది. నూతన ఉపాధి అవకాశాలను సృష్టించడం, ఉత్పాదకత పెంచడం, వృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా మోదీ ప్రభుత్వం సమగ్ర ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టినట్లు ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. మన కర్తవ్యం నెరవేర్చుకోవడానికి సంస్కరణల ఎక్స్‌ప్రెస్ వేగం ఇలాగే కొనసాగుతుందని స్పష్టంచేశారు. మనకు మూడు కర్తవ్యాలు ఉన్నట్లు చెప్పారు. అవి.. వేగవంతమైన, సుస్థిరాభివృద్ధి, ఆకాంక్షలు నెరవేర్చుకోవడం–సామర్థ్యాలు పెంచుకోవడం, సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ అని వివరించారు. ఇందులో భాగంగా ఎంఎస్ఎస్ఈలు చాంపియన్లుగా మారాలన్నది ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. గ్రోత్ ఇంజన్‌కు ఎంఎస్ఎంఈలు అత్యంత కీలకమని ఉద్ఘాటించారు. ఆయా కంపెనీలకు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. అందుకోసం రూ.10,000 కోట్లతో ప్రత్యేక నిధిని ప్రతిపాదించారు. సూక్ష్మ పరిశ్రమలకు ఊతం ఇవ్వడానికి 2021లో ఏర్పాటుచేసిన 'స్వయం సమృద్ధ భారత్ నిధి'కి రూ.2,000 కోట్లు ఇవ్వబోతున్నట్లు ప్రకటించారు. రూ.7 లక్షల కోట్లకుపైగా విలువైన టీఆర్ఈడీఎస్‌లను ఎంఎస్ఎంఈలు ఉపయోగించుకోవచ్చని సూచించారు. ఆయా కంపెనీలకు మరిన్ని ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు నిర్మలా సీతారామన్ వెల్లడించారు. టీడీఎస్‌ను సులభతరం చేయడంతో ఎంఎస్ఎంఈలకు మేలు జరుగుతుందన్నారు.

జోరుగా ఇళ్ల నిర్మాణం (పీఎంఏవై)



గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పేద, మధ్య తరగతి వర్గాల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా తాజా బడ్జెట్లోనూ కేంద్రం నిధులను భారీగా కేటాయించింది. పీఎంఏవై 2.0 స్కీమ్ కింద పీఎంఏవై (అర్బన్)కు ఈ బడ్జెట్లో రూ.18,625 కోట్లు దక్కాయి. గృహ రుణం ద్వారా ఇల్లు కొనుగోలు చేసిన లబ్ధిదారులకు వడ్డీ సబ్సిడీ స్కీమ్ కింద 2026–27లో రూ.3,000 కోట్లు జమ చేయనున్నారు. కాగా, ఆర్థికంగా బలహీన వర్గాలకు 2026–27లో 6.5 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా నిర్దేశించారు. తద్వారా 30.75 లక్షల మంది కుటుంబ సభ్యులకు లబ్ధి చేకూరనుంది. పీఎంఏవై (గ్రామీణ్)కు రూ.54,917 కోట్ల నిధులు అందనున్నాయి. గ్రామాల్లో 2029 మార్చికల్లా 2 కోట్ల అదనపు ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2026–27లో 40 లక్షల ఇళ్లు నిర్మించాలనేది బడ్జెట్ అంచనా.

2026-27 కేటాయింపులు: రూ.**73,542** కోట్లు | 2025-26 కేటాయింపులు: రూ.**74,626** కోట్లు | (సవరించిన అంచనా రూ.**40,000** కోట్లు)

మ్యాచ్ సమ్మరీ

ఈ బడ్జెట్ మ్యాచ్‌లో గ్రామీణ భారతం క్రీజ్‌లో నిలబడి గెలిచింది. ఉపాధి, ఇళ్లు, రహదారులు, తాగునీరు, డిజిటల్ కనెక్టివిటీతో పల్లెల ఇన్నింగ్స్ ఒక్కసారిగా ఊపందుకుంది. ఫ్లాగ్‌షిప్ పథకాలకు దండిగా నిధులు రావడంతో గ్రామీణ అభివృద్ధి స్ట్రెట్ బ్యాట్‌తో ఆడిన క్లియర్ విన్నర్‌గా మారింది. ఉపాధి హామీకి కొత్త రూపు, ఇళ్ల నిర్మాణానికి వేగం, గ్రామ రహదారులకు దిశ, ఇంటింటికీ నీరు, నెట్‌కి హైస్పీడ్‌తో గ్రామాలు ఈ బడ్జెట్‌లో చేతులెత్తి విజయాన్ని ప్రకటించాయి. ఇది వికసిత్ భారత్ లక్ష్యం దిశగా గ్రామీణ భారతం సమయం చూసుకుని కొట్టిన మ్యాచ్- విన్నింగ్ షాట్.

రహదారులు.. రయ్ రయ్ (పీఎంజీఎస్‌వై)

గ్రామీణ ప్రాంతాల్లో పక్కా రోడ్ల నిర్మాణం, వాటిని సక్రమంగా నిర్వహించేందుకు అమలవుతున్న ఫ్లాగ్‌షిప్ స్కీమ్ (ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన – పీఎంజీఎస్‌వై) ఇది. తాజా బడ్జెట్లోనూ మోదీ సర్కారు ఈ పథకంపై మరింత ఫోకస్ పెట్టింది. ప్రస్తుతం ఈ స్కీమ్ నాలుగో దశ అమలవుతోంది. 2026–27 ఆర్థిక సంవత్సరంలో 26,000 కిలోమీటర్ల పొడవైన పక్కా రోడ్ల నిర్మాణం లక్ష్యం. పర్యావరణ అనుకూల సాంకేతికతతో 12,000 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. దాదాపు 4,200 గ్రామీణ ప్రాంతాలను పక్కా రోడ్లతో అనుసంధానించాలని కేంద్రం సంకల్పించింది. ఈ పథకం ప్రారంభం నుంచి 2025 డిసెంబర్ నాటికి 7,87,809 కిలోమీటర్ల పొడవైన రోడ్ల నిర్మాణం పూర్తయినట్లు అంచనా.

2026-27 కేటాయింపులు: రూ.**19,000** కోట్లు

2025-26 కేటాయింపులు: రూ.**19,000** కోట్లు

(సవరించిన అంచనా రూ. **11,000** కోట్లు)

స్వచ్ఛ భారత్.. రెండో దశ

2014లో ఆరంభమైన స్వచ్ఛ భారత్ మిషన్ ఫ్లాగ్‌షిప్ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో బహిరంగ మలమూత్ర విసర్జన నిర్మూలన (ఓడీఎఫ్) స్టేటస్ సాకారమైంది. దీన్ని కొనసాగించడంతో పాటు అన్ని గ్రామాల్లో ఘన వ్యర్థాల నిర్వహణ, మురుగు నీటి నిర్వహణ కోసం ఇప్పుడు రెండో దశ అమలవుతోంది. 2026–27లో 48,096 గ్రామాలను ఘన వ్యర్థాల నిర్వహణ పరిధిలోకి తీసుకురానున్నారు. 36,119 గ్రామాల్లో మురుగునీటి నిర్వహణ చేపట్టనున్నారు. 1,352 బ్లాక్‌లలో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్లు నెలకొల్పనున్నారు. 1,50,000 గ్రామాల్లో సెప్టిక్ ట్యాంకుల క్లీనింగ్ సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. స్వచ్ఛ భారత్ (అర్బన్) కింద పట్టణ ప్రాంతాల్లో 2026–27లో 50,000 వ్యక్తిగత టాయిలెట్లు, 5,000 కమ్యూనిటీ టాయిలెట్లు, 10,000 పబ్లిక్ టాయిలెట్లను నిర్మించనున్నారు.

2026-27 కేటాయింపులు: రూ.**9,692** కోట్లు

2025-26 కేటాయింపులు: రూ.**12,192** కోట్లు

(సవరించిన అంచనా రూ.**8,000** కోట్లు)

ఇంటింటికీ తాగునీరు (జల్‌జీవన్ మిషన్)

జల్ జీవన్ మిషన్ ఫ్లాగ్‌షిప్ పథకం ద్వారా దేశంలో ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలనేది లక్ష్యం. దీన్ని సాకారం చేసేందుకు పథకాన్ని 2028 వరకు పొడిగించారు. తదనుగుణంగానే తాజా బడ్జెట్‌లో దండిగా నిధులు కేటాయించారు. ఇప్పటివరకు 15 కోట్ల కుటుంబాలకు తాగు నీటి సదుపాయం (కుళాయి కనెక్షన్లు) కల్పించినట్లు అంచనా. 2026–27లో 1,70,000 గ్రామ పంచాయితీల్లో హర్‌ఘర్ జల్ కనెక్షన్లు ఏర్పాటు చేయనున్నారు. 80 శాతం గ్రామాలకు కుళాయిల ద్వారా తాగునీరు అందించాలనేది తాజా బడ్జెట్ లక్ష్యం.

2026-27 కేటాయింపులు: రూ.**67,670** కోట్లు

2025-26 కేటాయింపులు: రూ.**67,000** కోట్లు

(సవరించిన అంచనా రూ. **17,000** కోట్లు)

భారత్ నెట్.. హైస్పీడ్

దేశంలో గ్రామ పంచాయతీలన్నింటినీ హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్ కనెక్ట్ చేయాలనేది ఈ స్కీమ్ లక్ష్యం. ఇప్పటి దాకా 2,24,323 పంచాయితీలను కనెక్ట్ చేశారు. 7,72,676 లక్షల కిలోమీటర్ల పొడవైన ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్ (ఓఎఫ్సీ) వేశారు. 2025–26లో 10,000 జీపీలకు బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యం కల్పించారు. 80,000 కిలోమీటర్ల పొడవైన ఓఎఫ్‌సీ నెట్‌వర్క్ వేశారు. 2026–27లో 42,000 పంచాయతీలకు కొత్తగా బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యం లభించనుంది. 1,60,000 కిలోమీటర్ల పొడవైన ఓఎఫ్‌సీ వేయనున్నారు. 20,50,00 ఫైబర్–టు–హోమ్ కనెక్షన్లు ఇవ్వాలనేది లక్ష్యం.

2026-27 కేటాయింపులు: రూ.**24,000** కోట్లు | 2025-26 కేటాయింపులు: రూ.**22,000** కోట్లు | (సవరించిన అంచనా రూ.**5,500** కోట్లు)

జిల్లాకో బాలికల హాస్టల్

దేశంలో పారిశ్రామిక కారిడార్లలో ఐదు వర్సిటీ టౌన్‌షిప్‌ల ఏర్పాటు

15 వేల స్కూళ్లు, 500 కాలేజీల్లో కంటెంట్ క్రియేటర్ ల్యాబ్స్

బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.1.39 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: దేశంలో పెద్ద పారిశ్రామిక, లాజిస్టిక్ కారిడార్లలో ఐదు యూనివర్సిటీ టౌన్‌షిప్‌లు, ప్రతీ జిల్లాలో ఒక బాలికల హాస్టల్, 15 వేల స్కూళ్లు, 500 కాలేజీల్లో కంటెంట్ క్రియేటర్ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని కేంద్ర బడ్జెట్ ప్రతిపాదించింది. దేశంలో విద్యారంగానికి ఈసారి బడ్జెట్‌లో రూ.1.39 లక్షల కోట్లు కేటాయించారు. ఇందులో ఉన్నత విద్యారంగం వాటా రూ.55,727 కోట్లుగా ఉంది. ఆయా రాష్ట్రాల్లోని పెద్ద పారిశ్రామిక, లాజిస్టిక్ కారిడార్లలో ఏర్పాటుచేసే ఐదు యూనివర్సిటీ టౌన్‌షిప్‌లకు కేంద్రం సహకారం అందిస్తుంది. ప్రణాళికబద్ధంగా ఏర్పాటుచేసే ఈ విద్యామండళ్లలో పలు యూనివర్సిటీలు, కాలేజీలు, పరిశోధన సంస్థలు, స్కిల్ సెంటర్లు, రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లు ఉంటాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు.

బాలికలకు ఇబ్బందుల్లేకుండా...

దేశవ్యాప్తంగా 700 జిల్లాలుండగా జిల్లాకొక బాలికల వసతి గృహాన్ని ఏర్పాటుచేయనున్నట్లు చెప్పారు. 'ఉన్నతవిద్యకు సంబంధించిన స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్) సంస్థల్లో చదువుతున్న బాలికలు సుదీర్ఘమైన సమయాల వల్ల ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని నివారించేందుకు వీజీఎఫ్ (వయబిలిటీ గ్యాప్ ఫండింగ్)/పెట్టుబడుల సహకారంతో జిల్లాకొక బాలికల హాస్టల్‌ను నిర్మిస్తాం' అని మంత్రి పేర్కొన్నారు. అలాగే, వెటర్నరీ కాలేజీలు, ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ ల్యాబొరేటరీలకు లోన్ లింక్డ్ కేపిటల్ సబ్సిడీ పథకాన్ని ప్రతిపాదించారు. ముంబైలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్ ఏర్పాటుకు, కంటెంట్ ల్యాబ్స్‌ను ఏర్పాటుచేసేందుకు కేంద్రం సహకారం అందిస్తుందని చెప్పారు. ఈశాన్య రాష్ట్రాల్లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ)ని ఏర్పాటుచేయాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. అలాగే విద్యారుణాలకు, వైద్యచికిత్సలో ఉండే లిబరైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) మొత్తాలకు టీసీఎస్ (మూలం వద్ద పన్ను సేకరణ)ను 5 శాతం నుంచి 2 శాతానికి తగ్గిస్తున్నట్లు చెప్పారు. ఈ ఎల్ఆర్ఎస్ కింద భారతీయులు ఏడాది (ఏప్రిల్–మార్చి)కి 2.5 లక్షల డాలర్లను పంపేందుకు అనుమతిస్తారు. అయితే, విద్య, వైద్యచికిత్సల్లో కాకుండా మిగతా రంగాల్లో టీసీఎస్ యథావిధిగా 20 శాతం కొనసాగుతుందని పేర్కొన్నారు. సేవారంగంపై మరింత దృష్టి కేంద్రీకరించేందుకు 'ఎడ్యుకేషన్ టు ఎంప్లాయ్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రైజ్'కు అనే అత్యున్నత స్థాయిసంఘాన్ని నియమించాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. దీన్ని వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించే బడ్జెట్‌గా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అభివర్ణించారు.

2024 నాటికి ప్రపంచంలోకెల్లా అత్యధిక విదేశీ మారకం, బంగారం నిల్వలు ఉన్న 10 దేశాలు

ర్యాంక్, దేశాల వారీగా మొత్తం కేంద్ర బ్యాంకు నిల్వలు (అమెరికా డాలర్లలో)

ర్యాంక్	దేశం	నిల్వలు
1	చైనా	3,45,000 కోట్లు
2	జపాన్	1,23,000 కోట్లు
3	అమెరికా	91,003 కోట్లు
4	స్విట్జర్లాండ్	90,936 కోట్లు
5	ఇండియా	64,304 కోట్లు
6	రష్యా	59,721 కోట్లు
7	సౌదీ అరేబియా	46,387 కోట్లు
8	హాంకాంగ్	42,555 కోట్లు
9	దక్షిణ కొరియా	41,821 కోట్లు
10	సింగపూర్	38,394 కోట్లు

పి.చిదంబరం
కాంగ్రెస్ సీనియర్ నేత

‘కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక వ్యూహం, ఆర్థిక రాజనీతిజ్ఞత లోపించింది. ఆర్థిక సర్వేను పూర్తిగా విస్మరించారు. ద్రవ్యలోటును తగ్గించడానికి ఏం చేస్తారో వివరణ లేదు. రుణాలు తీసుకోవడం, వ్యయం చేయడం తప్పు కాదు. కానీ, అదే సమయంలో ఆర్థికవృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ఇప్పుడున్న వృద్ధి రేటు ఏమాత్రం సరిపోదు. మరింత వేగం పెంచాలి. వీబీ-జీ రామ్ జీ చట్టంతో కనీసం 125 పనిదినాలు కల్పిస్తామని చెబుతున్నారు. తక్కువ నిధులతో ఎక్కువ పని దినాలు కల్పించడం సాధ్యంకాదు’



సండే సందడి

బడ్జెట్ ప్రసంగం ప్రారంభానికి ముందు లోక్‌సభలో సందడి నెలకొంది. ఆదివారం కూడా కావడంతో సభ్యులందరూ ఒకరికొకరు అభివాదాలు తెలుపుకుంటూ ఉత్సాహంగా కనిపించారు. బీజేపీ ఎంపీ రాజ్‌కుమార్ చాహర్ తన పార్టీ సభ్యులతో కలిసి సెల్ఫీలు దిగుతూ హడావిడి చేశారు.

ముచ్చట్లు..

సభలో కొందరు బీజేపీ నేతలు, కేంద్ర మంత్రులు.. హోం మంత్రి అమిత్ షా చుట్టూ చేరి కబుర్లు కలబోయటం కనిపించింది. డీఎంకే నాయకురాలు కె. కనిమొళి.. అమిత్ షా, విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్. జైశంకర్ వద్దకు వెళ్లి ముచ్చటిస్తూ కనిపించారు.

పరామర్శలు

జనవరి 28న జరిగిన విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మరణించిన సంగతి తెలిసిందే. ఆ విషాద ఘటన నేపథ్యంలో, ఆయన సోదరి, ఎన్సీపీ (శరద్ పవార్ పక్షం) సభ్యురాలు సుప్రియా సూలేను పరామర్శించేందుకు విపక్ష సభ్యులందరూ ఆమె చుట్టూ చేరారు. తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

నినాదాలు

ప్రధాని మోదీ సభలోకి ప్రవేశించగానే వాతావరణం ఒక్కసారిగా ఉద్వేగభరితం అయింది. అధికార పక్ష సభ్యులు ‘భారత్ మాతా కీ జై’, ‘వందేమాతరం’, ‘హర హర మహాదేవ్’ అంటూ నినాదాలతో సభను హోరెత్తించారు. అందుకు దీటుగా విపక్ష సభ్యులు ‘జై సంవిధాన్’ (రాజ్యాంగం వర్ధిల్లాలి) అంటూ నినదించారు. బడ్జెట్ ప్రసంగం ముగిసిన తర్వాత సభలో ఈ పోటా పోటీ నినాదాలు కొనసాగాయి.

లేని ప్రవచనాలు!

85 నిమిషాల పాటు సాగిన తన బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈసారి కవిత్వాల ప్రస్తావన లేకుండా, కేవలం పెట్టుబడులు, అభివృద్ధిపైనే దృష్టిని కేంద్రీకరించారు. గతంలో మాదిరిగా తిరువళ్లువర్ సూక్తులు, బసవన్న వచనాలు ప్రసంగంలో ఎక్కడా లేవు. ప్రసంగంలో భావుకత లేనప్పటికీ, ఆధ్యాత్మిక స్పర్శతో ప్రారంభమైంది. గురు రవిదాస్‌ను స్మరిస్తూ, ‘మాఘ పౌర్ణమి’పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగాన్ని మొదలుపెట్టారు.

ఫోకస్ మిస్!

సాగు..

వ్యవసాయానికి గత ఏడాదికంటే 7 శాతం మాత్రమే పెంపు

పీఎం-కిసాన్‌కు రూ.63,500 కోట్లు

రైతుల కోసం ‘భారత్-విస్తార్’ పేరుతో బహుళ భాషా ఏఐ టూల్

సాగు, అనుబంధ రంగాలకు రూ.1,62,671 కోట్ల కేటాయింపు

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.1,62,671 కోట్లు కేటాయించారు. 2025-26 సవరించిన అంచనాల (రూ. 1,51,853 కోట్లు) కంటే ఈసారి 7.12 శాతం మాత్రమే కేటాయింపులు పెంచారు. దీంతో వ్యవసాయ రంగంలో ఏ విభాగంపై కూడా పెద్దగా ఫోకస్ లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వ్యవసాయ రంగాన్ని ఆర్థిక మంత్రి పూర్తి నిర్లక్ష్యం చేశారని అఖిల భారత కిసాన్ సభ ఆరోపించింది. వ్యవసాయ రంగం వ్యూహాత్మక పునరుజ్జీవనం పట్ల ఎటువంటి నిబద్ధతను చూపలేదని ఆక్షేపించారు. అయితే, వికసిత్ భారత్ లక్ష్య సాధన దిశగా ప్రభుత్వం ‘సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్’ అనే దార్శనికతను కనబరిచిందని ఆర్థిక మంత్రి నిర్మల చెప్పారు. సంప్రదాయసాగుపై ఆధారపడటాన్ని తగ్గించి గ్రామీణ జీవనోపాధిని వైవిధ్యపరిచేందుకు బడ్జెట్ దోహదం చేస్తుందన్నారు.

- కేంద్రం ‘భారత్-విస్తార్ (వర్చువల్లీ ఇంటిగ్రేటెడ్ సిస్టమ్ టు యాక్సెస్ అగ్రికల్చరల్ రిసోర్సెస్)’ అనే పేరుతో బహుళ భాషా కృత్రిమ మేధ టూల్‌ను ప్రకటించింది. దీనికోసం రూ.150 కోట్లు కేటాయించింది. వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి, రైతులకు సలహాలు అందించడానికి ఇది తోడ్పడుతుంది. ఈ టూల్ అగ్రిస్టాక్ పోర్టల్‌లను, సాగు పద్ధతులపై ఐకార్ ప్యాకేజీని ఏఐ వ్యవస్థలతో అనుసంధానం చేస్తుంది.
- పండ్లు, కూరగాయల మిషన్‌ను క్రిషినియోన్నతి యోజన కింద కలిపేసి రూ.700 కోట్లు కేటాయించారు.
- మఖానా బోర్డు పేరును బిహార్, ఇతర రాష్ట్రాల్లో మఖానా అభివృద్ధి పథకంగా మార్చారు. దీనికి రూ.90 కోట్లు కేటాయించారు.
- పీఎం-కిసాన్‌కు రూ.63,500 కోట్లు కేటాయించారు.

కొత్త ఏఐ టూల్..

- వ్యవసాయ విద్య, పరిశోధనకు 3 శాతం కోతవేసి రూ. 9,964 కోట్లు కేటాయించారు.
- ఇన్‌లాండ్ ఫిషరీల కోసం 500 రిజర్వాయర్లు, అమృత్ సరోవర్లను స్టార్టప్‌లు, మహిళా సంఘాలు, చేపల పెంపకందారుల ద్వారా పటిష్టం చేస్తారు. ప్రధానమంత్రి సంపద యోజనకు కేటాయింపులను రూ.1,500 కోట్ల నుంచి 2,500 కోట్లకు పెంచారు.
- కోస్తా, కొండ ప్రాంతాల్లో అధిక వ్యయమయ్యే పంటలైన కొబ్బరి, గంధం, కోకో, జీడిపప్పు, బాదం, వాల్‌నట్స్ సాగుకు రూ.350 కోట్ల ప్రోత్సాహకాలను ప్రకటించారు.

- పేద, సన్నకారు రైతులకు వస్తున్న ఆదాయంలో దాదాపు 16 శాతం పశుసంపద నుంచి వస్తోందంటూ.. 20,000 కంటే ఎక్కువ పశువైద్య నిపుణుల లభ్యతను పెంచడానికి రుణ-సంబంధిత మూలధన సబ్సిడీ పథకాన్ని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఈ పథకం ప్రైవేట్ రంగంలో వెటర్నరీ, పారావెట్ (పారా-వెటర్నరీ) కళాశాలలు, వెటర్నరీ ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ కేంద్రాలు, బ్రీడింగ్ సౌకర్యాల స్థాపనకు తోడ్పడుతుంది.
- గత బడ్జెట్‌లో ప్రకటించిన కాటన్ టెక్నాలజీ మిషన్, నేషనల్ మిషన్ ఫర్ హైబ్రిడ్ సీడ్స్‌కు ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదు. దీంతో ఈ పథకాలు ఇంకా ప్రారంభంకాలేదు.

చరిత్రాత్మక బడ్జెట్..

అభివృద్ధి చెందిన, స్వావలంబన భారతదేశానికి బలమైన పునాది వేసే చరిత్రాత్మక బడ్జెట్ అని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. ఇది రైతులు, యువత, మహిళలు, పేదల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తెస్తుందని చెప్పారు.

- వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

మ్యాచ్ సమ్మరీ

ఈ ఇన్నింగ్స్‌లో వ్యవసాయ రంగానిది విచిత్రమైన పరిస్థితి. బంతి నేరుగా వ్యయసాయ రంగం చేతిలోకి వచ్చింది. కానీ కీపర్ చేతిలోకి రాకుండానే జారిపోయింది. అంటే... అన్నీ ఉన్నా కొంచెం ఫోకస్ మాత్రం మిస్సయింది. కేటాయింపులు స్వల్పంగా పెరిగాయి. పెద్ద షాట్లు వస్తాయని ఆశించిన చోట బంతి జారిపోయింది. అటు బ్యాట్స్‌మన్‌కూ అందలేదు. ఇటు కీపర్‌కూ దొరకలేదు. సాగు, అనుబంధ రంగాల కేటాయింపుల్లో స్కోర్‌బోర్డు ముందుకు కదిలినట్టే కనిపించినా, ఫీల్డ్‌లో మాత్రం ఫోకస్ తప్పిన దృశ్యం స్పష్టంగా కనిపించింది. ఏఐ టూల్స్, పథకాలు ప్రకటించినా రైతులు ఎదురుచూస్తున్న అంశాలకు మాత్రం చోటు దొరకలేదు. వికెట్ పడలేదు. కానీ ఫోకస్ లేక వ్యవసాయానికి అవకాశం మిస్ అయింది.



న్యాయ వ్యవస్థలో డిజిటల్ విప్లవం

ఈ-కోర్టులకు రూ.1,200 కోట్లు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న కింది స్థాయి కోర్టులను (సబార్డినేట్ కోర్టులు) డిజిటలైజ్ చేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం భారీ కేటాయింపులు చేసింది. కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘ఈ-కోర్ట్స్ ప్రాజెక్ట్ - ఫేజ్ 3’ కోసం 2026-27 కేంద్ర బడ్జెట్‌లో రూ.1,200 కోట్లు కేటాయించారు. ఈ ప్రాజెక్టు కోసం బడ్జెట్ అంచనాల్లో రూ.1,500 కోట్లు ప్రతిపాదించగా, తుది కేటాయింపుల్లో రూ.1,200 కోట్లు ఖరారు చేశారు.

సబార్డినేట్ కోర్టుల కంప్యూటరీకరణ: దేశంలోని అన్ని సబార్డినేట్ కోర్టులను పూర్తిస్థాయిలో కంప్యూటరీకరించి, సాంకేతికతను అనుసంధానం చేయడం ఈ విడత ప్రధానోద్దేశం. 2023 సెప్టెంబర్‌లో కేంద్ర కేబినెట్ ఈ మూడో దశను ఆమోదించింది. నాలుగేళ్ల కాలపరిమితిలో అమలు చేయనున్న ఈ ప్రాజెక్టు మొత్తం బడ్జెట్ అంచనా రూ.7,210 కోట్లు. దీనిని కేంద్ర రంగ పథకంగా అమలు చేస్తున్నారు.

ప్రసారభారతికి పెద్దపీట

సమాచార, ప్రసార శాఖకు రూ.4,551 కోట్లు

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో సమాచార, ప్రసార శాఖకు రూ.4,551 కోట్లు కేటాయించారు. ఇందులో అధిక భాగం ఆలిండియా రేడియో, ప్రసారభారతికి దక్కనుంది. మిగతా నిధులను యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్ రంగాల్లో నైపుణ్యం పెంపుదలకు, కమ్యూనిటీ రేడియో విస్తరణకు కేటాయించారు. 2025-26 బడ్జెట్‌లో ఈ శాఖకు కేటాయించింది రూ.6,103.02 కోట్లు మాత్రమే కావడం గమనార్హం. ఈ దఫా సమాచార, ప్రసార శాఖకు ఇచ్చిన రూ.4,551 కోట్లలో ప్రసారభారతికి రూ.2,291.88 కోట్లను ప్రత్యేకించారు. ఈ నిధులను వేతనాలు, పింఛన్లు తదితరాల కోసం ఖర్చు పెడతారు. ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూ.250 కోట్లను వెచ్చిస్తారు. ఫిల్మ్ ఫెస్టివల్స్ నిర్వహణ, కొత్త చిత్రాలు, డాక్యుమెంటరీల నిర్మాణానికి రూ.344.55 కోట్లను, ఎఫ్ఎం ప్రసారాలతో ఆలిండియా రేడియో నెట్‌వర్క్ విస్తరణ, డీటీహెచ్ సామర్థ్యం పెంపు వంటి వాటికి రూ.509.24 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో మాదిరిగానే ఈసారి కూడా నిరక్షరాస్యుల కోసం కమ్యూనిటీ రేడియో కార్య క్రమాల నిమిత్తం రూ.8 కోట్లు కేటాయించారు. యానిమేషన్, గేమింగ్, విజువల్ ఎఫెక్ట్స్, కామిక్స్(ఏవీజీసీ) రంగంలో నైపుణ్యాలను పెంచేందుకు దేశవ్యాప్తంగా 15 వేల సెకండరీ స్కూళ్లు, 500 కాలేజీల్లో ఏవీజీసీ కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌ల కోసం రూ.250 కోట్లు కేటాయించారు. పుణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియాకు రూ89.97 కోట్లు, కోల్‌కతాలోని సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్‌కు రూ.80 కోట్లు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్స్‌కు రూ.83 కోట్లు, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు రూ.11.22 కోట్లు, నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు రూ.35 కోట్లు వేర్వేరుగా కేటాయింపులు జరిపారు. ఈశాన్య రాష్ట్రాల్లో సామాజిక సేవల రంగానికి బడ్జెట్‌లో మరో రూ.111.22 కోట్లను కేటాయించారు.

హెల్త్ హబ్

కొత్తగా 3 నైపర్‌లు..

వెయ్యి అక్రిడిటెడ్ క్లినికల్ ట్రయల్ సెంటర్లు

ఐదు ప్రాంతీయ మెడికల్ టూరిజం హబ్‌లు

3 చోట్ల ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద కేంద్రాలు

ఆరోగ్యానికి రూ.1,06,530.42 కోట్లు

న్యూఢిల్లీ

ఆరోగ్య రంగంలో సదుపాయాలను విస్తరించడం, వైద్య విద్య, ఫార్మా రంగాలకు ప్రోత్సాహం, హెల్త్‌కేర్‌లో భారత్‌ను గ్లోబల్ హబ్‌గా మార్చడం లక్ష్యంగా బడ్జెట్‌లో పలు ప్రతిపాదనలు చేశారు. గతేడాది సవరించిన అంచనాలతో పోలిస్తే పది శాతం పెంపుతో రూ.1,06,530.42 కోట్లను ఆరోగ్యశాఖకు కేటాయించారు. ఆధునిక చికిత్సలతో బయో ఫార్మాస్యూటికల్ రంగాన్ని ప్రోత్సహిస్తూ ‘బయో ఫార్మా శక్తి’ కార్యక్రమం ద్వారా ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు వ్యయం చేయనున్నారు. దేశం బయో ఫార్మా తయారీ హబ్‌గా ఎదిగి దిగుమతులపై ఆధార పడాల్సిన అవసరాన్ని ఇది తగ్గిస్తుంది. కొత్తగా మూడు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైపర్) ఏర్పాటుతో పాటు ఇప్పటికే ఉన్న 7 నైపర్‌లను ఆధునీకరిస్తారు. వెయ్యి అక్రిడిటెడ్ క్లినికల్ ట్రయల్ సెంటర్లను ఏర్పాటు చేస్తారు. ఆరోగ్య రంగంలో పరిశోధనలను ప్రోత్సహిస్తూ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్)కు రూ.4,000 కోట్లు కేటాయించారు. నేషనల్ ఎయిడ్స్, లైంగిక సాంక్రమిక వ్యాధుల నియంత్రణ కార్యక్రమానికి రూ.3,477 కోట్లు వ్యయం చేయనున్నారు. రాంచి, తేజ్‌పూర్‌లోని మానసిక ఆరోగ్య కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయడంతోపాటు ఉత్తరాదిలో ‘నిమ్‌హాన్స్’ ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఆరోగ్య రంగంలో డిజిటల్ విధానాన్ని ప్రోత్సహిస్తూ ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌కు రూ.350 కోట్లు కేటాయించారు.

ప్రమాదాల సమయంలో వేగంగా అత్యవసర వైద్య సదుపాయాలు అందేలా ప్రతి జిల్లా ఆస్పత్రిలో ఎమర్జెన్సీ, ట్రామా కేర్ సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఆరోగ్య, వైద్య విద్య రంగంలో సిబ్బంది, కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు, వైద్య విద్య సీట్ల అప్‌గ్రేడేషన్, నర్సింగ్ విద్య తదితరాల కోసం రూ.1,725 కోట్లు కేటాయించారు. దేశంలో పెరుగుతున్న వృద్ధుల జనాభా, జీవన శైలి జబ్బుల చికిత్స భారం, నైపుణ్యం కలిగిన హెల్త్‌కేర్ నిపుణులకు డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని హెల్త్‌కేర్ ప్రొఫెషనల్ విద్య విస్తరణ, బలోపేతం కోసం మూడేళ్లలో రూ.980 కోట్లు వ్యయం చేయనున్నట్లు కేంద్రం పేర్కొంది. దీని ద్వారా 10 కీలక విభాగాల్లో హెల్త్ ప్రొఫెషనల్ అనుబంధ ఇన్‌స్టిట్యూట్లను నెలకొల్పి ఐదేళ్లలో లక్ష మంది నిపుణులైన ప్రొఫెషనల్స్‌ను సిద్ధం చేస్తారు. వృద్ధుల జనాభాకు అనుగుణంగా 1.5 లక్షల మంది కేర్ టేకర్స్‌ను సిద్ధం చేసేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపడతారు. దేశంలో ఐదు ప్రాంతీయ మెడికల్ టూరిజం హబ్‌ల ఏర్పాటుకు బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఆయుష్, ఆధునిక మౌలిక సదుపాయాలతో ఆస్పత్రులు, అధునాతన రోగ నిర్ధారణ పరీక్షలు, పునరావాసం, వైద్య విద్య , పరిశోధన సౌకర్యాలతో ఇవి ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌లుగా ఉంటాయని ఆర్థిక మంత్రి తెలిపారు. దేశంలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద కేంద్రాలు 3 ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

ప్రధాని స్వాస్థ్య సురక్ష యోజన రూ.11,307 కోట్లు
ఎన్‌హెచ్‌ఎం రూ.39,390 కోట్లు
పీఎం -జేఏవై రూ.9,500 కోట్లు
పీఎం - ఏబీహెచ్ఐఎం రూ.4770 కోట్లు
ఢిల్లీ ఎయిమ్స్ రూ.5500.92 కోట్లు
సీజీహెచ్ఎస్ పెన్షనర్లు, రిటైర్మెంట్ బెనిఫిట్ పథకానికి రూ.8697.86 కోట్లు
కేంద్ర ఆస్పత్రులకు రూ.4599.66 కోట్లు
హెల్త్ రీసెర్చ్ విభాగానికి రూ.4,821.21 కోట్లు (డీహెచ్ఆర్)
సురక్షితమైన రక్త మార్పిడి సేవలకు రూ.275 కోట్లు

డేటా సెంటర్లలో 200 బిలియన్ డాలర్ల పెట్టుబడులు

కేంద్ర ప్రభుత్వం అంచనా

న్యూఢిల్లీ: డేటా సెంటర్లలో 200 బిలియన్ డాలర్ల(రూ.18.33 లక్షల కోట్లు) పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. డేటా సెంటర్లకు అవసరమైన విద్యుత్ కోసం అణు ఇంధనంపై ఆధారపడాల్సి ఉంటుందని తెలిపారు. ఇప్పటికే 90 బిలియన్ డాలర్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయని పేర్కొన్నారు. ఇందులో 70 బిలియన్ డాలర్ల పెట్టుబడులు కార్యరూపం దాలుస్తున్నాయని వివరించారు. భారత్‌లో డేటా సెంటర్లలో పెట్టుబడులు పెట్టేందుకు అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. ఇండియాలో డేటా సెంటర్లు సహా ఏఐ మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు పెడతామని గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, డిజిటల్ కనెక్షన్ వంటి సంస్థలు ఇప్పటికే ప్రకటించాయి. డేటా సెంటర్ రంగాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో 2047 దాకా ట్యాక్స్ హాలిడే ప్రకటించింది. దేశంలో సెమీ కండక్టర్ల తయారీకి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. ప్రతిపాదిత ఇండియా సెమీకండక్టర్ మిషన్ 2.0తో చిప్‌ల తయారీ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.

క్యాన్సర్ బాధితులపై కరుణ

సాక్షి, అమరావతి: క్యాన్సర్ బాధితులకు కేంద్రం భారీ ఆర్థిక ఊరట ఇచ్చింది. క్యాన్సర్ చికిత్సల్లో వినియోగించే 17 రకాల ప్రాణాధార ఔషధాలపై ప్రాథమిక కస్టమ్స్ సుంకం నుంచి పూర్తి మినహాయింపు ఇస్తున్నట్లు ప్రకటించింది. దీంతో విదేశాల నుంచి దిగుమతి అయ్యే క్యాన్సర్ ఆధునిక ఔషధాల ధరలు గణనీయంగా తగ్గనున్నాయి. టార్గెట్, ఇమ్యునోథెరపీ లాంటి ఖరీదైన చికిత్సలు మరింత మందికి అందుబాటులోకి వస్తాయని వైద్య నిపుణులు అభిప్రాయపడు తున్నారు. విదేశాల నుంచి దిగుమతి అయ్యే క్యాన్సర్ మందులపై సాధారణంగా 10% కస్టమ్స్ సుంకం ఉంటుంది. తాజాగా దీన్ని మినహాయించనుండటంతో బాధి తులకు ఊరట లభించనుంది. శరీరంలో నిర్దిష్టంగా క్యాన్సర్ కణాలను మాత్రమే వెతికి పట్టుకుని నాశనం చేసే టార్గెటెడ్ థెరపీ, రోగ నిరోధక వ్యవస్థను శక్తిమంతం చేసి క్యాన్సర్ కణాలను గుర్తించి నాశనం చేసే ఇమ్యునోథెరపీ లాంటి ఆధునిక చికిత్సలు ప్రస్తుతం పేద రోగులకు అందుబాటులో లేవు. ఆ మందులు విదేశాల నుంచి దిగుమతి అవుతుండటమే దీనికి కారణం. ఇక 7 రకాల అరుదైన వ్యాధులకు సంబంధించి వ్యక్తిగతంగా దిగుమతి చేసుకునే ఔషధాలను కూడా సుంకాల మినహాయింపు జాబితాలో చేర్చారు.

17 రకాల క్యాన్సర్ ఔషధాలపై కస్టమ్స్ సుంకం రద్దు

అత్యాధునిక చికిత్సలు మరింత మందికి చేరువ

మినహాయింపు పొందే 17 క్యాన్సర్ ఔషధాలు

రిబోసిక్లిబ్	రొమ్ము క్యాన్సర్
అబెమాసిక్లిబ్	రొమ్ము క్యాన్సర్
ఇబ్రూటినిబ్	బ్లడ్ క్యాన్సర్, లింఫోమా
వెనెటోక్లాక్స్	బ్లడ్ క్యాన్సర్
డాబ్రాఫెనిబ్	చర్మ క్యాన్సర్, థైరాయిడ్ క్యాన్సర్
ట్రామెటినిబ్	చర్మ క్యాన్సర్ (మెలనోమా)
ఇపిలిముమాబ్	ఇమ్యునోథెరపీ
ట్రెమెలిముమాబ్	ఇమ్యునోథెరపీ (కాలేయ క్యాన్సర్)
టోరిపాలిమాబ్	గొంతు, ముక్కు సంబంధిత క్యాన్సర్
సెర్ఫ్లులిమాబ్	ఊపిరితిత్తుల క్యాన్సర్ (కణితుల నివారణ)
టాలీకాబ్టజీన్ ఆటోలూసెల్	కార్-టి సెల్ థెరపీ మందు
నిరాపరిబ్	అండాశయ క్యాన్సర్
తాలాజోపరిబ్	జన్యుపరమైన రొమ్ము క్యాన్సర్
ఎనాసిడెనిబ్	అక్యూట్ మైలోయిడ్ లుకేమియా
అవాప్రిటినిబ్ కణితులు	జీర్ణ వ్యవస్థ అరుదైన క్యాన్సర్
టుకాటినిబ్	మెటాస్టాటిక్ రొమ్ము క్యాన్సర్
సెల్పెర్కాటినిబ్	ఊపిరితిత్తులు, థైరాయిడ్ క్యాన్సర్



శశి థరూర్
కాంగ్రెస్ ఎంపీ

"కేంద్ర బడ్జెట్ అసంతృప్తి కలిగించింది. ఇందులో సంతోషించడానికి ఏమీ లేదు. ఉద్యోగాల కల్పనపై ప్రస్తావన లేదు. మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి ప్రజల సమస్యలను పట్టించుకోలేదు. రాష్ట్రాలకు కూడా నిరాశ కలిగించారు. ఎయిమ్స్ కోసం కేరళ రాష్ట్రం 15 ఏళ్లుగా ఎదురుచూస్తోంది. కానీ, ఈసారి కూడా మొండిచేయి చూపించారు. ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో తమిళ కవి తిరువళ్లువరు సూక్తులను పేర్కొనకపోవడం మాకు ఆశ్చర్యం కలిగింది"

హైస్పీడ్‌గా రైల్

దేశంలో ఏడు కొత్త హైస్పీడ్ కారిడార్లు



- వీటిలో పుణే-హైదరాబాద్, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై కూడా...
- తూర్పు నుంచి పశ్చిమానికి డెడికేటెడ్ రవాణా కారిడార్
- రైల్వే శాఖకు రూ.2.77 లక్షల కోట్ల కేటాయింపు
- లోకోమోటివ్స్, వేగన్లు కొనుగోలుకు రూ.52,108.73 కోట్లు
- రైల్వే భద్రతపై ఫోకస్: రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ: భారతీయ రైల్వేని అత్యాధునికంగా రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. హైస్పీడ్ రైల్, రవాణా సామర్థ్యం పెంపు, భద్రత విభాగాలపై మరింత దృష్టి కేంద్రీకరించింది. ఇందులోభాగంగా దేశంలో ప్రధాన నగరాలను అనుసంధానిస్తూ ఏడు హైస్పీడ్ రైల్వే కారిడార్లను ఏర్పాటుచేయాలని బడ్జెట్‌లో ప్రతిపాదించింది. అభివృద్ధి అనుసంధానకర్తగా భావించే ఈ కారిడార్లను ముంబై-పుణే, పుణే-హైదరాబాద్, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, చెన్నై-బెంగళూరు, ఢిల్లీ-వారణాసి, వారణాసి-సిలిగురి మధ్య ఏర్పాటుచేయాలని ప్రకటించింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 బడ్జెట్‌లో రైల్వే శాఖకు రూ.2,77,830 కోట్లను కేటాయించారు. దీంతోపాటు అదనపు బడ్జెటరీ వనరుల నుంచి రూ.15 వేల కోట్లు సమకూరుతాయని బడ్జెట్ పత్రంలో పేర్కొన్నారు. ఈ నిధులతో కొత్తలైన్ల నిర్మాణ,ం లోకోమోటివ్స్, కోచ్‌లు, వేగన్ల కొనుగోలు, ఇతర పనులు చేపడతారు. 2025-26లో రైల్వేకి 2,52,000 కోట్లు కేటాయించగా, ఈసారి 10.25 శాతం ఎక్కువగా కేటాయించారు. ఇప్పటివరకు రైల్వేకి చేసిన కేటాయింపుల్లో ఇదే అత్యధికం కావడం విశేషం.

రవాణా కారిడార్



- సుస్థిర రవాణా కోసం డెడికేటెడ్ రవాణా కారిడార్ (డీఎఫ్‌సీ)ను డాంకునీ (పశ్చిమబెంగాల్) నుంచి సూరత్ (గుజరాత్) వరకు 2.052 కి.మీ. నిడివితో ఏర్పాటుచేయాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. దీన్ని తూర్పు-పశ్చిమ డీఎఫ్‌ఏసీగా పేర్కొంటారు.
- అధిక రద్దీ ఉండే 18 వేల కి.మీ. ట్రాక్ మార్గంలో భద్రతకు నిర్దేశించిన కవచ్, సీసీటీవీ కెమెరాలు, టెలికం కోసం రూ.7,500 కోట్లు కేటాయించారు. రైల్వే నెట్‌వర్క్ మొత్తానికి కవచ్ వ్యవస్థను ఏర్పాటుచేయాలని బడ్జెట్ లో పేర్కొన్నారు
- దేశీయ కంటెయినర్ తయారీ కోసం కొత్త పథకం ప్రవేశపెడుతూ రూ.10వేల కోట్లు కేటాయించారు.
- లోకోమోటివ్స్, వేగన్లు తదితరాల కొనుగోలుకు రూ.52,108.73 కోట్లు కేటాయించారు. దీంతో మరిన్ని వందేభారత్ రైళ్లు, 24-కోచ్ స్లీపర్ రైళ్లను తీసుకుంటారు.
- అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి కోసం రూ.11,917 కోట్లు కేటాయించారు.
- కొత్త లైన్ల నిర్మాణానికి రూ.36,721.55 కోట్లు, రూ. గేజ్ మార్పిడికి రూ.4,600 కోట్లు, డబ్లింగ్ పనులకు రూ. 37,750 కోట్లు కేటాయించారు.

రూపురేఖలు మారిపోతాయి

హైస్పీడ్ రైల్వే కారిడార్ల నిర్మాణంతో దేశ రవాణారంగం రూపురేఖలు మారిపోతాయని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. ఏడు కారిడార్లు మొత్తం 4000 కి.మీ. నిడివితో విస్తరించి ఉంటాయని తెలిపారు. బడ్జెట్ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈసారి రూ.1.20 లక్షల కోట్లు ప్రయాణికులు, భద్రత కోసం వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు. భద్రతపై రైల్వే ఎక్కువ ఫోకస్ పెట్టిందని, దీనివల్ల 95 శాతం రైలు ప్రమాదాలు తగ్గినట్లు తెలిపారు. ముంబై-అహ్మదాబాద్ మధ్య తొలిసారి చేపట్టిన హైస్పీడ్ రైలు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు.

– రైల్వే మంత్రి

3,547.32 కోట్ల మిగులు

రైల్వే శాఖకు వచ్చే సంవత్సరంలో రూ.3,85,733.33 కోట్ల ఆదాయం వస్తుందని, రూ. 3,82,186.01 కోట్లు వ్యయమవుతాయని బడ్జెట్‌లో అంచనా వేశారు. ఆర్థిక సంవత్సరాంతానికి రూ. 3,547.32 కోట్లు మిగులుతుందని భావిస్తున్నారు. 2024-25లో రైల్వేకి రూ. 3,35,757.09 కోట్ల ఆదాయం సమకూరగా, రూ.3,32,440.64 కోట్లు వ్యయమైంది. రూ.3,316.45 కోట్లు మిగులు వచ్చింది.

మ్యాచ్ సమ్మరీ

వందే భారత్‌తో రైల్వే శాఖ బౌలింగ్ స్పీడు పెరిగింది. ఆ స్పీడు మరింత పెంచేందుకు వీలుగా... ఎంత ఫాస్ట్ బౌలింగ్‌నైనా తట్టుకునేందుకు తగ్గ పిచ్‌లు తయారు చేయాలని మోదీ సర్కారు సంకల్పించింది. దేశవ్యాప్తంగా 7 హైస్పీడ్ రైల్ కారిడార్లను ప్రతిపాదించింది. ఇవి అమల్లోకి వస్తే కొత్త రైళ్లు హైస్పీడ్ బంతుల్లా దూసుకెళతాయి. స్థిరమైన ఆటకు తగ్గ పిచ్‌లా సరకు రవాణాను గాడిలో పెట్టడానికి డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ అక్కరకొస్తుంది. కవచ్, సీసీటీవీలతో భద్రతపై పెట్టే వ్యయం... నోబాల్స్, వైడ్స్‌కు అడ్డుకట్ట వేస్తుంది. రూ.2.77 లక్షల కోట్ల భారీ కేటాయింపుతో ఈ బడ్జెట్‌లో రైల్వే మామూలు ఓవర్ కాదు. దేశ రవాణాను వేగంగా నడిపించే పవర్ స్పెల్ వేసింది.



మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు రూ. 3,400 కోట్లు

కేంద్ర బడ్జెట్ 2026-27లో మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు మొత్తం రూ.3,400 కోట్లు కేటాయించారు. ఇది గత ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనా కంటే రూ.50 కోట్లు ఎక్కువ కాగా, 2025-26 సవరించిన అంచనాల కంటే దాదాపు రూ.1,240 కోట్లు ఎక్కువ. గత బడ్జెట్‌లో మంత్రిత్వ శాఖకు రూ.3,350 కోట్లు అంచనా వేయగా, సవరించిన అంచనా రూ.2,160.45 కోట్లు. కాగా, ఈసారి మైనారిటీ వర్గాల విద్యార్థుల విద్యా సాధికారత కోసం రూ.831.7 కోట్లు కేటాయించారు. కేంద్ర ప్రభుత్వ రంగ పథకాలు, మంత్రిత్వ శాఖ కింద ఉన్న ప్రాజెక్టులకు మొత్తం రూ.1,197.97 కోట్లు కేటాయించారు. జాతీయ మైనారిటీల అభివృద్ధి, ఆర్థిక సంస్థకు ఈక్విటీ సహకారం కోసం రూ. 915 కోట్ల బడ్జెట్ అంచనాను అందించారు.

సిటీ ఎకనమిక్ రీజియన్స్..

దేశ వృద్ధి, ఆవిష్కరణలు, అవకాశాలను నడిపించే చోదకాలుగా నగరాలను అభివర్ణించిన ప్రభుత్వం.. ఇప్పుడు ఆధునిక మౌలిక సదుపాయాలు, ప్రాథమిక సౌకర్యాలు అవసరమయ్యే ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు, ఆధ్యాత్మిక పట్టణాలపైనా దృష్టి సారిస్తుందని ప్రకటించింది. నిర్దిష్ట వృద్ధి అవకాశాల ఆధారంగా నగర ఆర్థిక ప్రాంతాలను గుర్తించి.. వీటి సామర్థ్యాన్ని మరింత విస్తరించడం లక్ష్యం అని బడ్జెట్ సందర్భంగా నిర్మల సీతారామన్ అన్నారు.

టెలికం శాఖకు 40% ఎక్కువ నిధులు

న్యూఢిల్లీ: టెలికం మంత్రిత్వ శాఖకు తాజా బడ్జెట్‌లో రూ.73,990 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఏడాదిలో ఈ నిధులు దాదాపు 40% పెరగడం విశేషం. ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్‌కు రూ.28,473 కోట్ల మూలధనం ప్రతిపాదించారు. గ్రామీణ బ్రాడ్‌బ్యాండ్ ప్రాజెక్ట్ అయిన భారత్‌నెట్, బీఎస్ఎన్ఎల్ మూలధన అవసరాలు, స్పెక్ట్రమ్ ఖర్చు, నెట్‌వర్క్ విస్తరణ, అంతర్గత అవసరాలను తీర్చడం వంటి వివిధ ప్రాజెక్టులకు ఈ నిధులను వెచ్చిస్తామని టెలికం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. బీఎస్ఎన్ఎల్‌ను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, అందుకే టెలికం మంత్రిత్వ శాఖకు నిధులు అధికం చేసినట్టు వెల్లడించారు. ఒక్కో వినియోగదారు నుంచి బీఎస్ఎన్ఎల్ అందుకుంటున్న సగటు ఆదాయం దాదాపు 9% పెరిగి రూ.90 నుండి దాదాపు రూ.99కి చేరుకుందని చెప్పారు. ఈ ఆదాయాన్ని త్వరలో మూడు అంకెల స్థాయికి చేర్చాలని భావిస్తున్నట్టు తెలిపారు.

రూ.10 వేల కోట్లతో కంటైనర్ల తయారీ పథకం

న్యూఢిల్లీ: కంటైనర్ల తయారీ రంగంలో మన దేశాన్ని ప్రపంచ దేశాలతో పోటీపడేలా తీర్చిదిద్దాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందులో భాగంగా రూ.10 వేల కోట్లతో కంటైనర్ల తయారీ పథకాన్ని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 బడ్జెట్‌లో ప్రతిపాదించారు. రాబోయే ఐదేళ్లలో ఈ నిధులు ఖర్చు చేయనున్నట్లు ప్రకటించారు. పర్యావరణ హిత సరుకు రవాణాకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆధునిక కంటైనర్ల తయారీకి ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందన్నారు. అలాగే వారణాసి, పట్నాలో ఓడల మరమ్మతు కేంద్రాలు ఏర్పాటు చేయబోతున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా కోస్టల్ కార్గో ప్రమోషన్ పథకాన్ని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. కోస్టల్ షిప్పింగ్‌ను ప్రస్తుతం ఉన్న 6 శాతం నుంచి 2047 నాటికి 12 శాతానికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఓడల్లో సరుకు రవాణాకు అవసరమైన శ్రామిక శక్తి కోసం శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఇవి రీజినల్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా పని చేస్తాయని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, కంటైనర్ల తయారీ పథకంలో ప్రత్యక్షంగా 3 వేలు, పరోక్షంగా 50 వేల ఉద్యోగాలు లభిస్తాయని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ పథకంలో భాగస్వామిగా మారడానికి ఎంఎస్సీ, మెయిర్స్క్/అర్ట్‌సన్స్(టాటా), అదానీ, జేఎం బాక్సీ వంటి సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని అధికారులు తెలియజేశారు. కంటైనర్ల తయారీలో ప్రస్తుతం చైనా ముందంజలో ఉంది. ఇతర దేశాలు తమ అవసరాల కోసం చైనాపై ఆధారపడాల్సి వస్తోంది. చైనాకు చెక్‌పెట్టి, సొంతంగా కంటైనర్లు తయారు చేసుకోవడానికే కేంద్రం కొత్త పథకాన్ని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది.

తూర్పు భారతంలో 'పూర్వోదయం'

దేశ తూర్పు ప్రాంత సమగ్ర అభివృద్ధికి (పూర్వోదయ) కేంద్ర ప్రభుత్వం పెద్ద పీట వేసింది. 'పూర్వోదయ' రాష్ట్రాల్లో (బిహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్) ఐదు ప్రధాన పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తారు. ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, అస్సాం, మణిపూర్, మిజోరం, త్రిపురలలో బుద్ధిస్ట్ సర్క్యూట్లను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక పథకాన్ని ప్రకటించారు. బౌద్ధారామాలు, ఆలయాల పరిరక్షణ, యాత్రికుల కోసం సౌకర్య కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. ఈ ప్రాంతం థేరవాద, మహాయాన లేదా వజ్రయాన సంప్రదాయాల సంగమమని మంత్రి పేర్కొన్నారు. వ్యవసాయం, ఆరోగ్యం, ఉపాధి వంటి రంగాలతో పాటు పర్యాటకానికి ఈ బడ్జెట్‌లో ఇచ్చిన ప్రాధాన్యం.. తూర్పు తీర రాష్ట్రాల్లో కొత్త ఆర్థిక అవకాశాలను సృష్టించనుంది.

బెంగాల్‌కు కొత్తగా సరుకు రవాణా కారిడార్

బడ్జెట్‌లో ప్రకటించిన నిర్మల • పశ్చిమబెంగాల్ ఎన్నికల ఎత్తుగడగా అభివర్ణించిన టీఎంసీ

కోల్‌కతా: పశ్చిమబెంగాల్, గుజరాత్ మధ్య వేగవంతమైన సరుకు రవాణా లక్ష్యంగా సరికొత్త కారిడార్‌ను ఆర్థికమంత్రి నిర్మల ఆదివారం బడ్జెట్‌లో ప్రతిపాదించారు. 'సమీకృత ఈశాన్య భారత పారిశ్రామిక కారిడార్'లో భాగంగా పశ్చిమబెంగాల్‌లోని డంకునీ నుంచి గుజరాత్‌లోని సూరత్‌కు నూతన సరుకు రవాణా కారిడార్‌ను ఏర్పాటు చేయనున్నట్లు నిర్మల ప్రకటించారు. బెంగాల్‌లోని దుర్గాపూర్ కేంద్రంగా ఈ కారిడార్‌ను విస్తరిస్తామని చెప్పారు. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పర్యాటక పథకమైన 'పూర్వోదయ విజన్'లో భాగంగా మరింత అభివృద్ధి చేస్తామని నిర్మల వెల్లడించారు. డంకునీ సూరత్ ఫ్రైట్ కారిడార్ అనేది పర్యావరణ అనుకూలమైనదేకాకుండా ఇరు రాష్ట్రాల మధ్య సరుకు రవాణా ఖర్చులనూ భారీగా తగ్గిస్తుందని నిర్మల పేర్కొన్నారు. నదీజల మార్గాల గుండా జరిగే సరకు రవాణాను సమీకృత కారిడార్లతో అనుసంధానించి బెంగాల్ పారిశ్రామికాభివృద్ధిని సరికొత్త శిఖరాలకు తీసుకెళ్తామని నిర్మల తెలిపారు. 294 నియోజకవర్గాలున్న పశ్చిమబెంగాల్ అసెంబ్లీకి మరో మూడునెలల్లో ఎన్నికలు జరగనున్న వేళ బెంగాల్‌కు మోదీ సర్కార్ వరాల జల్లు కురిపించడం గమనార్హం. పూర్వోదయ రాష్ట్రాలుగా పిలుచుకునే బిహార్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని ఆమె తెలిపారు. 4,000 ఎలక్ట్రిక్ బస్సుల అందజేతతోపాటు ఆయా రాష్ట్రాల్లో ఉపాధి పెంపు, ఆయా రాష్ట్రాల మధ్య జనం, వస్తూత్పత్తుల రవాణాపై దృష్టిపెట్టామని ఆమె వెల్లడించారు.

విమర్శించిన తృణమూల్ కాంగ్రెస్

రాష్ట్రానికి కొత్తగా సరుకు రవాణా కారిడార్ తెస్తామన్న నిర్మల నిర్ణయంపై బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ పెదవి విరిచింది. 'పాత ప్రతిపాదనలకే కొత్త తాయిలాల పొట్లంలో కట్టి ఇస్తున్నారు. నిధుల మంజూరును గాలికొదిలేసి కేవలం కాగితాలకు పరిమితమయ్యే వాగ్దానాలు చేస్తున్నారు. ఇదంతా ఎన్నికల ఎత్తుగడ. గత ఐదేళ్లుగా ఇదే చూస్తున్నాం. బెంగాల్‌కు మోదీ సర్కార్ కేంద్రనిధులపై శ్వేతపత్రం జారీచేసే దమ్ముందా? 2021లో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పరాజయం తర్వాత మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఒక్క కూలీకి అయినా ప్రత్యక్ష బదిలీ పథకం(ఈబీటీ) ద్వారా నగదు ఇచ్చినట్లు రుజువుచేస్తే రాజకీయ సన్యాసం చేస్తా' అని టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ అభిషేక్ బెనర్జీ వ్యాఖ్యానించారు.

ఎన్నికల వ్యూహంగా అభివర్ణించిన విశ్లేషకులు

అభివృద్ధి అని చెబుతున్నా వాస్తవానికి తాజా కేటాయింపులు కేవలం ఎన్నికల ఎత్తుగడగా భావించవచ్చని ఎన్నికల వ్యూహకర్తలు, నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గత 15 ఏళ్లుగా అధికారంలో ఉన్న టీఎంసీని గద్దెదించడమే లక్ష్యంగా బీజేపీ భారీ కేటాయింపులు చేస్తోందని వారు వ్యాఖ్యానించారు. ''ఎన్నికలున్న రాష్ట్రాలకు బడ్జెట్‌లో భారీ వడ్డనలు ఉండటం ఇటీవలికాలంలో ఒక సంప్రదాయంగా మారింది. ఈ కేటాయింపులు వాస్తవాలో కాదో గుర్తెరిగి తదుపరి ఎన్నికల్లో ఓటేసే స్పృహ ఓటర్లకు ఉండాల్సిందే'' అని చెబుతున్నారు.

తమిళనాడు సంస్కృతి పరిరక్షణకు..

- కొత్తగా అరుదైన మూలకాల రవాణా కారిడార్
- చెన్నై మీదుగా హైస్పీడ్ రైలు లింక్
- పొధుగైమలై వద్ద మౌంటేన్ ట్రెయిల్

చెన్నై: డీఎంకే ఏలుబడిలో ఉన్న తమిళనాడుపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరాల జల్లు కురిపించారు. రాష్ట్రంలో కొత్తగా అరుదైన ఖనిజాల రవాణా కారిడార్‌ను నెలకొల్పనున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించారు. దీంతోపాటు చెన్నై మీదుగా పయనించే హైస్పీడ్ రైలు లింక్‌లను అభివృద్ధిచేయనున్నారు. పశ్చిమ కనుమల మార్గంలో పొధుగైమలై కొండ ప్రాంతంలో హైకింగ్, ట్రెక్కింగ్, మౌంటేన్ బైకింగ్ వంటి సదుపాయాలు కల్పించనున్నారు. పులికాట్ సరస్సుకు విచ్చేసే విదేశీ పక్షుల కోలాహలం, ప్రకృతి అందాలను పర్యాటకులు వీక్షించేందుకు బర్డ్ వాచింగ్ పాయింట్లను నిర్మించనున్నారు. త్వరలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలున్న నేపథ్యంలో రాష్ట్రానికి మోదీ ప్రభుత్వం పలు అభివృద్ధి పథకాల నిధులను భారీగా కేటాయించడం విశేషం. ఇనుప రాతి యుగం నాటి ప్రఖ్యాత ఆదిచనల్లూర్ ప్రాంతంలో పురాతత్వ శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. అక్కడ లభించిన పురాతన రాళ్లు, ఆనాటి నాగరికత వైభవాన్ని చాటే వస్తువులతో ఆర్కియాలాజికల్ సైట్‌ను అభివృద్ధిచేయనున్నారు. నాటి సంస్కృతికి కళ్లకు కట్టేలా అభివృద్ధి చేస్తామని ఆమె వెల్లడించారు. నడకదారిలో మొత్తం పురాతత్వ ప్రాంతాన్ని కలియతిరిగేలా వాక్‌వేలను నిర్మించనున్నారు. అక్కడి ప్రాచీన వస్తువుల విశిష్టతను కథల రూపంలో చెప్పేలా, నాటి సాంకేతికతలను విడమర్చి విశదీకరించేలా గైడ్‌లను అందుబాటులోకి తేనున్నారు. పాడైన ప్రాచీన వస్తువులకు మరమ్మతులు, సంరక్షణ కోసం కన్జర్వేటివ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయనున్నారు. పురాతత్వ ప్రాంతానికి విచ్చేసే పర్యాటకులు, విదేశీ సందర్శకుల్లో ఆ ప్రాంతంపై మరింత అవగాహన పెంచేలా ఎగ్జిబిషన్‌ల వంటివి ఏర్పాటుచేయనున్నారు. 'అత్యంత అరుదైన మూలకాల కోసం ఖనిజాల తవ్వకం కోసం తమిళనాడులో రేర్ ఎర్త్ కారిడార్‌ను ఏర్పాటుచేయబోతున్నాం. ఖనిజాల శుద్ధి, పరిశోధన, తయారీని మరింతగా ప్రోత్సహిస్తాం' అని మంత్రి నిర్మల అన్నారు.

2025-26 బడ్జెట్‌తో పోలిస్తే 2026-27 బడ్జెట్ కేటాయింపుల్లో భారీ పెంపు లేదా కోత పడిన మంత్రిత్వ శాఖలు



డి. పాపారావు
ఆర్థికవేత్త

అంతర్జాతీయంగా ఆర్థికరంగం తీవ్ర ఒడిదొడుకులకు గురవుతుండగా, 6.8 శాతం నుంచి 7.2 శాతం వృద్ధిరేటు ఉంటుందని ఎలా చెబుతారు ?ఎకనమిక్ సర్వేలో, బడ్జెట్‌లో అనేక పరస్పర విరుద్ధమైన అంశాలున్నాయి. బడ్జెట్‌లో ప్రస్తావించిన వాటి కంటే కూడా ప్రస్తావించని అంశాలే ఎక్కువగా ఉన్నాయి. దేశంలోకి విదేశీమారకద్రవ్యం వస్తున్నదాని కంటే, బయటికి వెళుతున్నదే అధికంగా ఉంటోంది.

అదే పిచ్.. కాస్త రిలీఫ్

ఏప్రిల్1 నుంచి కొత్త ఇన్‌కమ్‌ట్యాక్స్ చట్టం అమల్లోకి..

- ఎన్నారైలపై పలు వరాలు కురిపించిన నిర్మలమ్మ
- ఎన్నారైల విద్య, మెడిక్లెయింలపై టీసీఎస్ 5 నుంచి 2 శాతానికి తగ్గింపు
- విదేశీ ఆస్తులు ప్రకటించని రూ.20 లక్షలలోపు విలువ వరకు జరిమానా ఎత్తివేత
- విదేశీ పర్యాటక ప్యాకేజీలపై విధించే టీసీఎస్ 20 శాతం నుంచి రెండు శాతానికి తగ్గింపు
- మానవ వనరులు అందించే సంస్థలపై టీడీఎస్ ఒకటి లేదా రెండు శాతానికి పరిమితం
- బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించిన ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

సాక్షి, అమరావతి

మ్యాచ్ సమ్మరీ

పిచ్ మారలేదు. ఫీల్డ్ సెట్టింగ్ కూడా మునుపట్లానే. ఇన్‌కమ్ ట్యాక్స్ శ్లాబులు యథాతథం. కాకపోతే అంపైర్ నుంచి అనుకోకుండా నోబాల్ వచ్చింది. అంటే... ఓ సింగిల్ రన్‌తో పాటు మరో బాల్ అదనమన్న మాట. టీడీఎస్, టీసీఎస్‌లను తగ్గించటం సింగిల్ రన్ అదనంగా లభించటమే. అదనపు బాల్, సింగిల్ రన్ కాంబినేషన్‌తో కొంతయినా రన్‌రేట్‌పై ఒత్తిడి తగ్గింది. ఎన్నారైలకైతే లూజ్ డెలివరీలు పడ్డాయి. విదేశీ ఆస్తులపై వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ఫ్రీ హిట్‌లాగా మారింది. బౌండరీలు లేవు, హిట్టింగ్ లేదు. కానీ వికెట్లు కాపాడుకుంటూ స్కోర్‌బోర్డు ముందుకు నడిపిన ఒక క్లాసిక్ కన్సాలిడేషన్ ఓవర్ ఇది.

ట్యాక్స్ శ్లాబుల్లో ఎటువంటి మార్పులు చేయనప్పటికీ పన్ను చెల్లింపుదారులకు ఉపశమనం కలిగించే పలు కీలక నిర్ణయాలను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. ముఖ్యంగా టీడీఎస్, టీసీఎస్‌ల భారం తగ్గించడంతోపాటు వ్యక్తిగత ట్యాక్స్ రిటర్నులు ఏడాదంతా మార్చుకునే వెసులుబాటు కల్పించారు. విదేశాల్లో ఉన్న ప్రకటించని ఆస్తులను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద ప్రకటించుకునే అవకాశాన్ని కల్పించారు. ఆదివారం నిర్మలమ్మ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించిన కొన్ని కీలక నిర్ణయాలు...

- ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇన్‌కమ్‌ట్యాక్స్– 2025 చట్టం అమల్లోకి రానుంది. దీని ప్రకారం రూ.12 లక్షల వరకు ఆదాయంపై ఇచ్చే ట్యాక్స్ రిబేట్, రూ.75,000 స్టాండర్డ్ డిడక్షన్‌ను పరిగణనలోకి తీసుకుంటే రూ.12.75 లక్షల ఆదాయం వరకు ఉన్నవారు ఎటువంటి పన్ను చెల్లించనవసరం లేదు.
- వ్యక్తిగత ఆదాయపన్ను చెల్లింపుదారులు ఐటీఆర్-1, ఐటీఆర్-2 కింద రిటర్నులు దాఖలు చేయడానికి గడువు తేదీ జూలై 31, అదే ఆడిట్ అవసరం లేని సంస్థలకు గడువు తేదీ ఆగస్టు 31.
- దాఖలు చేసిన రిటర్నుల్లో మార్పులు చేసుకోవడానికి ప్రస్తుతం డిసెంబర్ 31గా ఉన్న గడువును మార్చి 31 వరకు పొడిగించారు.
- విదేశీ టూర్ ప్యాకేజీలపై ప్రస్తుతం విధిస్తున్న 5 శాతం , 20 శాతం టీసీఎస్‌ను రెండు శాతానికి తగ్గించారు.
- మానవ వనరులు అందించే సంస్థలపై విధించే టీడీఎస్‌ను ఒకటి లేదా రెండు శాతానికి పరిమితం చేశారు.
- విదేశీ ఆస్తులను ప్రకటించడానికి వన్‌టైమ్ డిస్‌క్లోజర్ స్కీంను ప్రవేశపెట్టారు
- గత రిటర్నుల్లో విదేశీ ఆస్తులను ప్రకటించడంలో విఫలమైతే ఈ స్కీం కింద తక్కువ పెనాల్టీతో ప్రకటించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నారు.
- ఆస్తి విలువ రూ.20 లక్షల లోపు ఉంటే ఎటువంటి పెనాల్టీ ఉండదు. అదే కోటి రూపాయల లోపు ఉంటే మార్కెట్ విలువలో 30 శాతం చెల్లిస్తే సరిపోతుంది.
- ప్రవాస భారతీయులు పోర్ట్‌ఫోలియో ఇన్వెస్ట్‌మెంట్ స్కీం (పీఐఎస్) కింద పెయిడప్ క్యాపిటల్‌లో 10 శాతం వరకూ వాటా తీసుకోవచ్చు. ఇప్పటిదాకా ఇది 5 శాతంగానే ఉండేది. స్టాక్ మార్కెట్‌లో లిస్టెడ్ కంపెనీల్లో వీరు ఇక నుంచి 24 శాతం వరకూ వాటా తీసుకోవచ్చు. ఇప్పటి వరకూ ఇది 10 శాతంగా ఉండేది.
- కార్పొరేట్స్‌పై విధిస్తున్న మినిమమ్ ఆల్టర్నేటివ్ ట్యాక్స్‌ను (మ్యాట్) 15 నుంచి 14 శాతానికి తగ్గించారు.
- ఆర్‌బీఐ నుంచి నేరుగా సావరిన్ గోల్డ్ బాండ్స్ కొనుగోలు చేసిన వారు... కాలపరిమితి ముగిసేంత వరకూ తమ వద్ద ఉంచుకుంటే, వాళ్లకు మాత్రమే క్యాపిటల్ గెయిన్స్ నుంచి మినహాయింపు లభిస్తుంది. ఇవే బాండ్లను సెంకడరీ మార్కెట్ నుంచి కొనుగోలు చేసిన వారు మాత్రం క్యాపిటల్ గెయిన్స్ పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

లిబరైజ్డ్ రెమిటెన్స్ స్కీం (ఎల్ఆర్ఎస్) విదేశీ విద్య, వైద్యం కింద చేసే వ్యయాలపై ప్రస్తుతం ఉన్న టీసీఎస్‌ను (ట్యాక్స్ కలెక్షన్ ఎట్ సోర్స్) 5 శాతం నుంచి 2 శాతానికి తగ్గించారు.

2026-27కు ఆదాయపు పన్ను శ్లాబులివీ...						
	0-4 లక్షలు	లేదు	8-12 లక్షలు	10%	16-20 లక్షలు	20%
					20-24 లక్షలు	25%
	4-8 లక్షలు	5%	12-16 లక్షలు	15%	24 లక్షలు పైన	30%



‘నవ’ నిర్మల

వరుసగా 9 సార్లు కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టి రికార్డ్ నెలకొల్పిన మహిళా ఆర్థిక మంత్రి

న్యూఢిల్లీ: అనూహ్యంగా కేంద్ర ఆర్థిక మంత్రిగా పగ్గాలు చేపట్టిన నిర్మలా సీతారామన్ వరుసగా 9 సార్లు పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టి సరికొత్త రికార్డ్‌ను సృష్టించారు. దేశ చరిత్రలో మహిళా ఆర్థిక మంత్రి ఇన్ని సార్లు ఆర్థికపద్దును సభ ముందుకు తేవడం ఇదే తొలిసారి. మాజీ ప్రధానమంత్రి, దివంగత మొరార్జీ దేశాయ్ అందరికంటే ఎక్కువగా 10 సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అయితే అవన్నీ వరస ఆర్థిక సంవత్సరాల్లో ప్రవేశపెట్టినవి కాదు. మొరార్జీ దేశాయ్ ఆర్థిక మంత్రి హోదాలో 1959 నుంచి 1964 దాకా ఆరుసార్లు, తర్వాత 1967 నుంచి 1969దాకా నాలుగుసార్లు బడ్జెట్ తీసుకొచ్చారు. ఈ లెక్కన ఏకధాటిగా వరసబెట్టి బడ్జెట్ తెచ్చిన తొలి మహిళా మంత్రిగా నిర్మల చరిత్ర సృష్టించారు. తదుపరి ఆర్థిక సంవత్సరాల్లోనూ ఈమెనే ఆర్థికమంత్రిగా ఉండే అవకాశముంది. దీంతో మొరార్జీ నెలకొల్పిన రికార్డ్‌ను త్వరలోనే నిర్మల బద్దలుకొట్టే ఆస్కారముంది. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరం వేర్వేరు ప్రధానమంత్రుల హయాంలలో మొత్తంగా 9 సార్లు కేంద్రబడ్జెట్ తెచ్చారు. మాజీ రాష్ట్రపతి, దివంగత ప్రణబ్ ముఖర్జీ గతంలో ఆర్థికమంత్రి హోదాలో 8 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు. 2019లో ప్రధాని మోదీ సారథ్యంలో ఎన్‌డీఏ రెండోసారి అధికారంలోకి వచ్చాక నిర్మల తొలిసారిగా ఆర్థికమంత్రి పీఠంపై ఆసీనులయ్యారు. 2024లో మోదీ మూడోపర్యాయం ప్రధానిగా పగ్గాలుచేపట్టాక నిర్మలనే ఆర్థికమంత్రిగా కొనసాగారు. 2019 మే 31వ తేదీన ఆర్థికమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక 2019లో కోవిడ్ సంక్షోభం, తర్వాత యుద్ధాలతో మారిన భారత ఆర్థిక ముఖచిత్రాలకు తగ్గట్లు నిర్మల పద్దులను తీసుకొచ్చారు. ఆమె సారథ్యంలోని ఆర్థికశాఖ తీసుకున్న పలు సాహసోపేత నిర్ణయాలు సత్ఫలితాలిచ్చి ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థికశక్తుల్లో ఒకటిగా భారత్ నిలిచింది. 2026 జనవరి 31తో నిర్మల ఆర్థికమంత్రిగా ఆరు సంవత్సరాల 8 నెలల పదవీకాలాన్ని పూర్తిచేసుకున్నారు. ఈమె తర్వాత అత్యధిక కాలం ఆర్థికమంత్రిగా సీడీ దేశ్‌ముఖ్ ఆరు సంవత్సరాల రెండు నెలలు కొనసాగారు. ఉదారవాద ఆర్థిక సంస్కరణల రూపశిల్పిగా వినతికెక్కిన మన్మోహన్ సింగ్ ఆర్థికమంత్రిగా దాదాపు ఐదేళ్లపాటు కొనసాగారు. ప్రధానిగా ఉన్నప్పుడూ ఆర్థికమంత్రిగా కొంతకాలం సేవలందించారు.

ప్రసంగంలోనూ రికార్డే

ఎక్కువసేపు బడ్జెట్ ప్రసంగం చేసిన మంత్రిగానూ నిర్మల రికార్డ్ నెలకొల్పారు. 2020 ఫిబ్రవరి ఒకటో తేదీన ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను ఏకంగా రెండు గంటల 40 నిమిషాలపాటు ఏకధాటిగా చదివి వినిపించారు. అప్పటికీ మరో రెండు పేజీలు మిగిలి ఉండగా వాటిలోని ముఖ్యాంశాలను మాత్రమే చదివి వదిలేశారు. అత్యల్ప కాలవ్యవధిగల బడ్జెట్ ప్రసంగంగా హీరూభాయ్ ముల్జీభాయ్ పటేల్ ప్రసంగం రికార్డ్‌కెక్కింది. 1977లో ఆయన చేసిన ప్రసంగంలో కేవలం 800 పదాలుఉన్నాయి.

నాడు 5.. నేడు 11

గతంలో ఫిబ్రవరి నెల చివరి తేదీన సాయంత్రం 5 గంటలకు బడ్జెట్‌ను ప్రవేశపెట్టేవారు. బ్రిటన్ కాలమానంతో పోలిస్తే భారత కాలమానం 4 గంటల 40 నిమిషాలు ముందుండేది. లండన్‌లో మధ్యాహ్నంపూటే భారత బడ్జెట్ ప్రవేశపెట్టారని స్ఫురించేలా సరిగ్గా అదే సమయానికి బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ఆచారం ఉండేది. తర్వాత అటల్ బిహారీ వాజ్‌పేయీ హయాంలో నాటి ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా వలసపాల సంస్కృతిని విడనాడి ఉదయం 11 గంటలకు బడ్జెట్ చదివారు. 2017 నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీన బడ్జెట్ ప్రవేశపెట్టడం మొదలెట్టారు. మార్చి నెలాఖరుకల్లా పార్లమెంట్ ఆమోదం పొంది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి బడ్జెట్ అమలయ్యేందుకు వీలుగా ఫిబ్రవరి ఒకటో తేదీని బడ్జెట్ ప్రవేశపెట్టడానికి సరైన తేదీగా ఎంచుకున్నారు. ఫిబ్రవరి 28న గనక ప్రవేశపెడితే పార్లమెంట్ ఆమోదానికి రెండు, మూడు నెలల సమయం పట్టి మే, జూన్‌నాటికిగాని బడ్జెట్‌ను అమలుచేయలేని పరిస్థితి ఉండేది. దాన్ని తప్పించేందుకే ఫిబ్రవరి ఒకటో తేదీని ఖరారుచేశారు.

‘పీఎఫ్ నిబంధనల హేతుబద్ధీకరణ’

న్యూఢిల్లీ: భవిష్య నిధులు లేదా పీఎఫ్ ట్రస్టులకు సంబంధించిన నిబంధనల హేతుబద్ధీకరణకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. యాజమాన్యాల వాటాలపై సమానత్వ, పర్సంటేజీ ఆధారిత పరిమితుల తొలగింపు, వేతనాలతో ముడిపడిన సడలింపులు ఎత్తివేయడం ద్వారా గుర్తింపు పొందిన పీఎఫ్ సంస్థలకు సంబంధించిన నిబంధనలు హేతుబద్ధీకరించేందుకు షెడ్యూల్–11ను సవరించనున్నట్లు ఆర్థికమంత్రి తెలిపారు. ఉద్యోగుల భవిష్య నిధి ఖాతాల్లో పడే ఉద్యోగికి సంబంధించిన యాజమాన్యాల వాటాలను క్రమబద్ధీకరించడం ద్వారా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను ప్రోత్సహించడమే లక్ష్యంగా దీనిని చేపట్టనున్నారు.

గతంలో గల్ఫ్‌లో

మన రూపాయి పక్క దేశంలో ఇస్తే చెల్లుతుందా? చెల్లదు కదా.. కానీ ఒకప్పుడు గల్ఫ్ దేశాల్లో మన కరెన్సీ రాజ్యమేలింది. యూఏఈ, ఖతర్, ఒమన్, కువైట్‌లలోనూ విస్తృతంగా చెలామణి అయ్యింది.. కొన్నేళ్లకు వచ్చిన ఓ సమస్యతో ప్రత్యేక రూపాయి కూడా అక్కడ చెల్లుబాటయ్యింది. చివరకు అర్ధంతరంగా గల్ఫ్ నుంచి మాయమైంది. ఇంతకీ ఆ గతం వెనకున్న కథేంటి?

గల్ఫ్ రూపాయిని ఎందుకు వాడింది?

ప్రస్తుత గల్ఫ్ దేశాలైన యూఏఈ, ఖతర్, ఒమన్, కువైట్ 1950లలో బ్రిటిష్ నియంత్రణలో ఉండేవి. ప్రత్యేక కరెన్సీ లేకపోవడం, భారత్‌ను పాలిస్తున్నప్పటి నుంచే తమ నియంత్రణలో ఉన్న గల్ఫ్ ప్రాంతాల్లో రూపాయి చెల్లుబాటయ్యేలా బ్రిటిష్ పాలకులు చొరవ చూపడంతో భారతీయ రిజర్వ్ బ్యాంక్ గల్ఫ్ దేశాలకూ కేంద్ర బ్యాంకుగా ఉండేది. దీంతో మన రూపాయి అక్కడ కూడా కొన్నేళ్లు చెల్లుబాటు అయ్యింది.

స్మగ్లర్ల ప్రవేశంతో పరిస్థితి రివర్స్..

కానీ ఈ వెసులుబాటును బంగారం స్మగ్లర్లు వారికి అనుకూలంగా మార్చుకున్నారు. తమ మనుషుల ద్వారా భారతీయ కరెన్సీని గల్ఫ్‌కు తరలించి విదేశీ కరెన్సీగా మార్చుకొని భారత్‌కు అక్రమంగా బంగారాన్ని తెప్పించేవారు. ఫలితంగా గల్ఫ్‌లో భారత కరెన్సీ భారీగా పోగయ్యేది. ఈ కరెన్సీని గల్ఫ్ ప్రాంతాలు ఆర్‌బీఐకి తిరిగి అమ్మడంతో భారత కరెన్సీ విలువ పడిపోవడం మొదలైంది.

హజ్ కోసం నోట్లు

హజ్ యాత్రికుల కోసం కూడా ఆర్‌బీఐ ప్రత్యేక నోట్లను తీసుకొచ్చింది. హెచ్ఏ అనే అక్షరాలతో కూడిన 10, 100 విలువ గల నోట్లను ముద్రించింది.

గల్ఫ్ రూపాయి పతనం..

ఆర్‌బీఐ 1966లో రూపాయి విలువను తగ్గించడంతో డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ. 4.76 నుంచి రూ. 7.5కి పెరిగింది. ఇది ఖతర్, దుబాయ్‌ల నుంచి గల్ఫ్ రూపాయి ఉపసంహరణకు దారితీసింది. హజ్ రూపాయి, గల్ఫ్ రూపాయి నోట్లను ఆర్‌బీఐ 1970ల తొలినాళ్లకల్లా పూర్తిగా ఉపసంహరించుకుంది.

సాక్షి, సెంట్రల్‌డెస్క్

ఖనిజ సంపదకు కారిడార్ వెలుగులు

ఆంధ్ర ప్రదేశ్ సహా నాలుగు రాష్ట్రాల్లో రేర్ ఎర్త్ మినరల్ హబ్‌లు

- కేంద్ర బడ్జెట్‌లో ఏపీ గనుల రంగానికి ప్రయోజనాలు
- తీర ప్రాంతంలో బీచ్ శాండ్ ఖనిజం వెలికితీత పరిశోధనలకు ఊతం
- దానికి సంబంధించిన భారీ ప్రాసెసింగ్ యూనిట్లు ఏపీలో ఏర్పడే అవకాశం

సాక్షి, అమరావతి: దేశ ఆర్థిక వ్యవస్థను పరుగులు తీయించే భవిష్యత్తు ఇంధనాలుగా పిలిచే అరుదైన ఖనిజాలు ఆంధ్ర ప్రదేశ్‌కు వరంగా మారే అవకాశం కనిపిస్తోంది. కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన డెడికేటెడ్ రేర్ ఎర్త్ కారిడార్ ప్రాజెక్టులో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యత లభించింది. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కేరళ, తమిళనాడు రాష్ట్రాలను కలుపుతూ ఈ కారిడార్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇది కేవలం ఖనిజ తవ్వకాలకే పరిమితం కాకుండా రాష్ట్రాన్ని ఒక పారిశ్రామిక హబ్‌గా మార్చేందుకు దోహదపడుతుందని పారిశ్రామిక వర్గాలు భావిస్తున్నాయి. అరుదైన ఖనిజాల వెలికితీత, ప్రాసెసింగ్, పరిశోధన, తయారీ రంగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తామని నిర్మల ప్రకటించారు. దీనికోసం బడ్జెట్‌లో నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ (ఎన్‌సీఎంఎం) కింద రూ.16,300 కోట్లను కేటాయించారు. ఈ ఖనిజాల ద్వారా తయారయ్యే పర్మనెంట్ మాగ్నెట్స్ ఉత్పత్తి కోసం గత ఏడాది ప్రకటించిన రూ.7,280 కోట్ల ఇన్సెంటివ్ స్కీమ్‌ను ఈ కారిడార్‌కు అనుసంధానం చేయనున్నారు.

ఏపీలో విస్తారంగా రేర్ ఎర్త్ మినరల్స్..

ఏపీలో రేర్ ఎర్త్ మినరల్స్ ఉన్నాయి. రాష్ట్రంలోని 974 కిలోమీటర్ల తీర ప్రాంతంలో మోనజైట్ అనే ఖనిజం ద్వారా పలు అరుదైన మూలకాలు లభిస్తాయి. శ్రీకాకుళం, విశాఖపట్నం, కాకినాడ, మచిలీపట్నం, రామాయపట్నంవంటి ప్రాంతాలు ఈ బీచ్ సాండ్ నిక్షేపాలకు ప్రధాన కేంద్రాలు. అనంతపురం జిల్లాలోని దంచెర్ల, పెద్దవడుగూరు ప్రాంతాల్లోనూ రేర్ ఎర్త్ మూలకాలు ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. వైఎస్ఆర్ కడప, అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాల్లో గ్రాఫైట్, కోబాల్ట్, కాడ్మియం వంటి ఖనిజాలు ఉన్నాయి. బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఈ కారిడార్ ద్వారా కేవలం తీర ప్రాంతమే కాకుండా



ఖనిజ నిక్షేపాలున్న లోతట్టు ప్రాంతాలను రవాణా పరంగా అనుసంధానించే అవకాశం ఉంది. ఇప్పటివరకు మన ఖనిజ సంపదను ముడి రూపంలో తక్కువ ధరకు విదేశాలకు పంపించి తిరిగి వాటితో తయారైన ఖరీదైన బ్యాటరీలను, అయస్కాంతాలను దిగుమతి చేసుకుంటున్నాం. ఈ సంస్కృతికి విడనాడాలని భావిస్తున్నారు. ముడి ఖనిజాన్ని శుద్ధి చేసే రిఫైనరీలు, ఖనిజాలను వేరు చేసే అత్యాధునిక ల్యాబ్‌లు, ఎలక్ట్రిక్ వాహనాల మోటార్లు, చిప్స్ తయారు చేసే ఫ్యాక్టరీలను ఒకే తాటిమీదకు తెస్తారు. దీంతో ఖర్చు తగ్గి, స్థానికంగా ఉపాధి పెరుగుతుంది. బడ్జెట్ కేటాయింపులు ఆశాజనకంగా ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఈ కారిడార్ విజయవంతం కావాలంటే పర్యావరణ ప్రభావం, స్థానిక మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతినకుండా చూడటం ప్రధానమని నిపుణులు చెబుతున్నారు.

3 కెమికల్ పార్కుల ఏర్పాటుకు కేంద్రం మద్దతు

న్యూఢిల్లీ: దేశీయ ఉత్పత్తిని పెంచడానికి, దిగుమతులను తగ్గించడానికి మూడు డెడికేటెడ్ కెమికల్ పార్కుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వాలకు మద్దతిచ్చే పథకాన్ని ప్రారంభించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఆదివారం ప్రకటించింది. బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ ‘దేశీయ కెమికల్ ఉత్పత్తిని పెంచడానికి, దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించడానికి క్లస్టర్ ఆధారిత ప్లగ్–అండ్–ప్లే మోడల్‌లో చాలెంజ్ రూట్ ద్వారా 3 డెడికేటెడ్ కెమికల్ పార్కులను స్థాపించడంలో రాష్ట్రాలకు మద్దతు ఇచ్చే పథకాన్ని ప్రారంభిస్తాం’అని తెలిపారు. భారతదేశం ప్రస్తుతం ప్రపంచంలో ఆరవ అతిపెద్ద, ఆసియాలో మూడవ అతిపెద్ద రసాయనాల ఉత్పత్తిదారుగా ఉందని, ఔషధాలు, వస్త్రాలు, ఆటోమోటివ్, వ్యవసాయం వంటి పరిశ్రమలకు అవసరమైన ముడి పదార్థాలను సరఫరా చేస్తుందని నీతి ఆయోగ్ నివేదిక వెల్లడించింది.

ఈసీఎంఎస్‌కు రూ.40 వేల కోట్లు

న్యూఢిల్లీ: సెమీకండక్టర్ల తయారీలో ఆత్మనిర్భరతే లక్ష్యంగా ఇండియా సెమీకండక్టర్ మిషన్‌ను విస్తరించనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మల ఆదివారం తన బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. చిప్‌ల తయారీరంగాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో ఆ పరిశ్రమల్లో ఉపకరణాల సేకరణ, ముడి సరకులు, దేశీయ డిజైన్లు, ఇతర ముడి సామగ్రి విషయంలో సముపార్జనే ధ్యేయంగా ముందుకెళ్లాలని నిర్ణయించామని నిర్మల చెప్పారు. పారిశ్రామికంగా పరిశోధన శిక్షణా కేంద్రాల ఏర్పాటుపైనా దృష్టిపెట్టామని, ఇందుకోసం ఇండియా సెమీకండక్టర్ మిషన్(ఐఎస్ఎం) 2.0ను తీసుకొస్తామని నిర్మల వెల్లడించారు.'' త్వరలో ఐఎస్ఎస్ 2.0ను తీసుకొచ్చి చిప్‌ల సంబంధ ఉపకరణాలు, మెటీరియల్స్, భారతీయ మేథోపర హక్కులున్న చిప్ డిజైన్, సరకు రవాణా గొలుసులను అభివృద్ధి చేస్తాం'' అని నిర్మల వెల్లడించారు. ''ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీ పథకం (ఈసీఎంఎస్)ను 2025 ఏప్రిల్‌లో రూ.22,919 కోట్లతో ఆరంభించాం. ఈ పథకానికి నిధుల కేటాయింపులను రూ.40,000 కోట్లకు పెంచుతున్నాం'' అని నిర్మల చెప్పారు. ''మొత్తంగా రూ.54,567 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలతో కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ వద్దకు జనవరి నాటికి 46 దరఖాస్తులు చేరాయి. ఈ ప్రాజెక్టులు సాకారమైతే మరో 51,000 మందికి ఉపాధి లభిస్తుంది'' అని నిర్మల చెప్పారు.

బడ్జెట్‌లో అధిక భాగం వడ్డీలకు, రక్షణ రంగానికే..

- దొంతి నర్సింహారెడ్డి, పాలసీ అనలిస్ట్

భారతదేశం ఎదుర్కొంటున్న వాతావరణ సంబంధిత సవాలు కేవలం వనరులకు సంబంధించినది కాదు. ఇది ఆర్థిక ప్రాధాన్యాలకు సంబంధించింది. బడ్జెట్‌లో ఎక్కువ భాగం వడ్డీలకు, రక్షణ రంగానికి ముందే కట్టుబడి ఉండటంతో పర్యావరణ అనుకూల మార్పులు, సంబంధిత చర్యల మీద పాలనాపర చిత్తశుద్ధి కనపడటం లేదు. నిధులు లేక కాదు ప్రాధాన్య పర విధానం లేకపోవడం వల్ల విఫలమవుతుంది. ప్రశ్న ఆర్థిక వనరులున్నాయా లేదా అనేది కాదు. వాటిని దీర్ఘకాలిక ప్రకృతి వైపరీత్యాల నివారణకు, వాతావరణ మార్పులను అధిగమించడానికి, సంబంధిత ప్రమాదాల నుంచి కాపాడుకోవడానికి ఉపయోగించడంలో ఎంత రాజకీయ సంకల్పం ఉంది అనేది ముఖ్యం. కేంద్ర బడ్జెట్ 2026-27 రూ.48.55 లక్షల కోట్లలో, రూ.14.40 లక్షల కోట్లు వడ్డీ చెల్లింపులకే సరిపోతుంది. రూ.6.21 లక్షల కోట్లు రక్షణ రంగానికి కేటాయించారు. అంటే అభివృద్ధికి సంబంధించిన నిర్ణయాల గురించి ఆలోచన కూడా చేయకముందే సగం బడ్జెట్ అంటే రూ.20.61 లక్షల కోట్లు కేటాయించినట్టు అయింది. క్లైమేట్ యాక్షన్ చర్యలతో సహా మిగిలిన అన్నింటికీ సుమారు రూ.27.94 లక్షల కోట్లు మాత్రమే మిగులుతుంది

జి.మురళీ కృష్ణ
చైర్మన్, సీఐఐ ఏపీ చాప్టర్

మౌలిక వసతులకు ప్రాధాన్యం

నూతన తరం సంస్కరణలకు నాంది పలుకుతూ దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధి రేటును దృష్టిలో పెట్టుకొని రూపొందించిన బడ్జెట్. తయారీ, ఎంఎస్ఎంఈ, వ్యవసాయం, విద్య రంగాలకు బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. వికసిత్ భారత్‌లో భాగంగా దేశీయ ఎగుమతులను ప్రోత్సహించే విధంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిచ్చారు.

గ్రోత్ ఫండ్‌ను స్వాగతిస్తున్నాం

బడ్జెట్‌లో ఎంఎస్ఎంఈలకు పెద్దపీట వేస్తూ రూ.10 వేల కోట్లతో గ్రోత్ ఫండ్‌ను ఏర్పాటు చేయడాన్ని, సెమీ కండక్టర్ రంగానికి రూ.40 వేల కోట్లు కేటాయించడాన్ని స్వాగతిస్తున్నాం.

- పొట్లూరి భాస్కరరావు, అధ్యక్షులు, ఏపీ చాంబర్

రాష్ట్రానికి చిల్లర కేటాయింపులే..

ఈ బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు చిల్లర కేటాయింపులు చేస్తూ సరిపెట్టారు. అమరావతికి ఇచ్చిన కేటాయింపులతో కంప చెట్లు, బురద, వరద నీరు తోడడానికి కూడా సరిపోవు.

- డాక్టర్ మామిడి సుదర్శన్, జాతీయ అధ్యక్షుడు, దళిత్ ఇండస్ట్రియల్ అసోసియేషన్

నిధుల సాధనలో చంద్రబాబు విఫలం

రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ అని గొప్పలు చెప్పుకుంటున్న చంద్రబాబు ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి నిధులు రాబట్టడంలో ఘోరంగా విఫలమైంది. విశాఖ ఉక్కు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడం దారుణం. పోలవరం ప్రాజెక్టుకు గతం కన్నా నిధులు తగ్గించి రూ.3వేల కోట్లకు కుదించారు.

- వి.శ్రీనివాసరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి

రూపాయి పతనమే

ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడడానికి ఏ మాత్రం అవకాశం లేని విధంగా.. ఆర్థిక వ్యవస్థను మరింత దిగజార్చేలా కేంద్ర బడ్జెట్ ఉంది. దీనివల్ల రూపాయి పతనం మరింత పెరిగే ప్రమాదం ఉంది. ఉపాధి హామీ పథకాన్ని విచ్ఛిన్నం చేసి.. వీబీ జీ రామ్‌జీ పేరుతో కొత్త పథకాన్ని పెట్టి కూలీల నోటికాడ కూటిని కేంద్రం కొట్టేసింది. ప్రస్తుతం గ్రామీణులకు ఉపాధి, సామాజిక భద్రత లేకుండాపోయింది.

- కె.రామకృష్ణ, సీపీఐ జాతీయ కార్యదర్శి

చంద్రబాబు పరపతి తుస్సు!

కేంద్ర తాజా బడ్జెట్‌లో ఆయనేమీ సాధించలేకపోయారంటున్న విశ్లేషకులు

బుల్లెట్ ట్రైన్ అన్నారు.. కనీసం రైలు కారిడారూ దక్కలేదు

రూ.2,066.32 కోట్ల అప్పులకు మాత్రం అనుమతి

సాక్షి, న్యూఢిల్లీ : ఎన్డీఏలో కీలకంగా ఉన్నానని, తనవల్లే కేంద్రంలో మోదీ ప్రభుత్వం నడుస్తోందని చెప్పుకునే చంద్రబాబు మాటలన్నీ ఉత్తుత్తివేనని తేలిపోయింది. పైకి ఆయనెన్ని కబుర్లు చెప్పినా కేంద్రం మాత్రం చంద్రబాబును లెక్కలోకి తీసుకుంటున్నట్లు కనిపించడం లేదు. అందుకు కేంద్ర ప్రభుత్వం ఆదివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్టే ఉదాహరణగా నిలుస్తోంది. 2024లో అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు 27 సార్లు ఢిల్లీకొచ్చి కేంద్రానికి తాను చెప్పిందే వేదమన్నట్లుగా ప్రగల్భాలు పలికారు. తీరా ఈ బడ్జెట్ చూస్తే ఆయన మాటలన్నీ తుస్సే అన్నట్లుగా ఉంది. దీంతో ఎన్డీఏలో కీలకంగా ఉన్న చంద్రబాబు రాష్ట్రానికి ఏమీ సాధించుకోలేకపోయారని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

బుల్లెట్ ట్రైన్ ఎక్కడ చంద్రబాబూ?

2024లో అధికారం చేపట్టిన తర్వాత ప్రధానమంత్రిని కలిసి వచ్చిన తర్వాత చంద్రబాబు ఎల్లో మీడియాకు లీకులు ఇచ్చారు. 2026 కల్లా ఏపీలోని విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి నగరాలను అనుసంధానిస్తూ బుల్లెట్ ట్రైన్ పనులు పూర్తవుతాయన్నారు. తీరా 2026–27 బడ్జెట్‌లో ఏపీకి స్పీడ్ రైలు లేదా బుల్లెట్ రైలు వంటి వాటిల్లో దేనికీ ప్రాధాన్యత ఇవ్వలేదు. కనీసం విశాఖపట్నం–చెన్నై, విశాఖపట్నం–బెంగళూరు వంటి నగరాలకు స్పీడ్ రైలు కారిడార్‌ను సాధించడంలోనూ చంద్రబాబు ఘోరంగా విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సాధించింది శూన్యం : అధికారం చేపట్టినప్పటి నుంచి 27 సార్లు ఢిల్లీ వెళ్లిన సీఎం చంద్రబాబు (ఫైల్)

అప్పల కేటాయింపులు రూ.2,066.32 కోట్లు

ఇక చంద్రబాబు ఢిల్లీకి వచ్చిన ప్రతిసారీ అమరావతి రాజధాని నిర్మాణానికి చేయూతనివ్వాలంటూ కోరుతున్నారు. కేంద్రం మాత్రం బడ్జెట్‌లో నిధులు కాకుండా అప్పులు తెచ్చుకునేందుకు అనుమతులిచ్చింది. తాజా బడ్జెట్‌లో వివిధ అంతర్జాతీయ బ్యాంకుల అప్పుల ద్వారా కేటాయింపులు చేసింది. వీటిలో అమరావతి ఇంటిగ్రేటెడ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు వరల్డ్ బ్యాంకు నుంచి రూ.432.09 కోట్ల అప్పు.. ఏపీ జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ ప్రాజెక్టుకు జర్మనీ బ్యాంకు నుంచి రూ.155.32 కోట్లు.. ఏపీ రోడ్ అండ్ బ్రిడ్జెస్ రీ–కన్‌స్ట్రక్షన్స్ ప్రాజెక్టుకు ఎన్‌బీడీ నుంచి రూ.350 కోట్లు.. ఏపీ రూరల్ రోడ్డు ప్రాజెక్టుకు ఏఐఐబీ నుంచి రూ.1,128.91 కోట్ల అప్పులకు కేంద్రం కేటాయింపులు చేసింది. అంటే.. 2026–27 బడ్జెట్‌లో కేంద్రం చంద్రబాబుకు రూ.2,066.32 కోట్ల అప్పులకు అనుమతించినట్లు తెలుస్తోంది. దీంతో ఈ బడ్జెట్‌లో చంద్రబాబును కేంద్రం పట్టించుకోలేదని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

కూటమి ఎంపీలు మాత్రం ఆహా.. ఓహో..

ఇక కేంద్ర బడ్జెట్‌లో తాము సాధించింది ఏమీ లేకపోయినప్పటికీ టీడీపీ కూటమి ఎంపీలు మాత్రం ఆహా.. ఓహో అంటూ గొప్పలు చెప్పుకుంటున్నారు. రాష్ట్రం మీదుగా పక్క రాష్ట్రాలకు రైల్వే కారిడార్ల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపితే.. ఇదేదో తాము సాధించిన గొప్పగా బిల్డప్ ఇస్తున్నారు.

విశాఖ స్టీల్‌కు మొండిచేయి

- ఆర్ఐఎన్ఎల్‌కు ఒక్క పైసా విదల్చని నిర్మలమ్మ
- గతేడాదితో పోలిస్తే విశాఖ పోర్టు నిధుల్లో రూ.280 కోట్ల భారీ కోత

సాక్షి, న్యూఢిల్లీ : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2026 – 27 వార్షిక బడ్జెట్ ఆంధ్రప్రదేశ్‌కు చేదు ఫలితాలను ఇచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రజల భావోద్వేగమైన విశాఖ ఉక్కు పరిశ్రమ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్) విషయంలో కేంద్రం మరోసారి షాక్ ఇచ్చింది. కొన్నాళ్లుగా తీవ్ర చర్చనీయాంశమైన స్టీల్‌ప్లాంట్‌కు (ఆర్ఐఎన్ఎల్) ఈ బడ్జెట్‌లో కనీస సాయం దక్కలేదు. 2024 – 25 వాస్తవ లెక్కల్లో ఈ సంస్థకు రూ.8,423 కోట్లు, 2025 – 26 బడ్జెట్‌లో రూ.2,995 కోట్లు చూపించిన కేంద్రం.. 2026 – 27 బడ్జెట్ అంచనాల కాలమ్‌ను పూర్తిగా ఖాళీగా వదిలేసి ఒక్క పైసా కూడా కేటాయించకపోవడం గమనార్హం. అంటే వచ్చే ఏడాదికి బడ్జెట్ ద్వారా ఈ సంస్థకు ఎటువంటి ప్రత్యక్ష ఆర్థిక సాయం అందదని స్పష్టమవుతోంది. మరోవైపు విశాఖలోని 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ' (ఐఐపీఈ)కి కేంద్రం గతేడాది సవరించిన అంచనాల్లో కేవలం రూ.50 కోట్లు మాత్రమే ఇవ్వగా... ఈ సారి రూ.302 కోట్లు కేటాయించింది. పన్నుల వాటాలో భాగంగా కేంద్ర పన్నుల్లో రాష్ట్రానికి 4.217 శాతం వాటా కింద రూ.64,362 కోట్లు రానున్నాయి.

విశాఖ పోర్టుకు నిధుల కోత

మరోవైపు విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్‌కు ఇచ్చే నిధుల్లోనూ కేంద్రం కోత విధించింది. 2025–26లో రూ.730 కోట్లుగా ఉన్న అంతర్గత, బడ్జెట్ వనరుల (ఐఈబీఆర్) కేటాయింపును ఈ సారి ఏకంగా రూ.450 కోట్లకు తగ్గించింది. ఇది పోర్టు అభివృద్ధి పనులపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

- ఐఐటీ తిరుపతి, నిట్ తాడేపల్లిగూడెం, అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీలకు ప్రత్యేకంగా లైన్ – ఐటెమ్ కేటాయింపులు లేవు. దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీలు, నిట్‌లకు కేటాయించిన రూ.10,324 కోట్లు (ఐఐటీలు), రూ.6,055 కోట్ల (నిట్‌లు) నుంచే వీటికి సర్దుబాటు చేయనున్నారు.
- కేంద్రం తలపెట్టిన 7 హై స్పీడ్ రైల్వే కారిడార్లలో రెండు మార్గాలు ఆంధ్రప్రదేశ్ గుండా వెళ్లనున్నాయి. హైదరాబాద్ – బెంగళూరు, హైదరాబాద్ – చెన్నై కారిడార్లను బడ్జెట్‌లో ప్రతిపాదించారు.
- రాష్ట్రంలోని పలు జాతీయ రహదారుల ప్రాజెక్టులకు 'అన్యుటీ' పద్ధతిలో నిధులు కేటాయించారు.

పోలవరానికి రూ.3,320.39 కోట్లే..

పీపీఏకు రూ.20 కోట్లు.. 2026-27 బడ్జెట్‌లో కేంద్రం కేటాయింపు

41.15 మీటర్ల ఎత్తు వరకే నీటిని నిల్వ చేసేలా నిధులు ఇస్తామని పునరుద్ఘాటన
నీటి నిల్వ సామర్థ్యం 194.6 నుంచి 119.4 టీఎంసీలకు తగ్గింపు



సాక్షి, అమరావతి : పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం 2026–27 బడ్జెట్‌లో రూ.3,320.39 కోట్లు కేటాయించింది. పీపీఏ (పోలవరం ప్రాజెక్టు అథారిటీ)కు రూ.20 కోట్లు కేటాయించింది. ప్రాజెక్టులో 41.15 మీటర్ల (కనీస నీటిమట్టం) ఎత్తు వరకే నీటిని నిల్వ చేసేలా పూర్తి చేయడానికి మాత్రమే నిధులు ఇస్తామని పునరుద్ఘాటించింది. అంటే.. పోలవరం ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యాన్ని 194.6 టీఎంసీల నుంచి 119.4 టీఎంసీలకు తగ్గించడాన్ని బడ్జెట్ సాక్షిగా మరోసారి స్పష్టం చేసింది. పోలవరం ప్రాజెక్టు పూర్తి స్థాయి నిర్మాణానికి కేటాయించిన నిధులు రాబట్టడంలో చంద్రబాబు ప్రభుత్వం ఘోర వైఫల్యానికి ఇదే పక్కా నిదర్శనం. గత 2025–26 బడ్జెట్‌లో పోలవరానికి కేంద్రం రూ.5,936 కోట్లు కేటాయించింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రీయింబర్స్‌మెంట్ రూపంలో రూ.459.69 కోట్లను విడుదల చేసింది. అడ్వాన్సుగా రెండు విడతల్లో రూ.5,052.71 కోట్లను రాష్ట్ర ప్రభుత్వానికి విడుదల చేసింది. వాటిని ఎస్ఎన్ఏ (సింగిల్ నోడల్ ఏజెన్సీ) ఖాతాలో జమ చేసి.. పోలవరం ప్రాజెక్టు పనులు, నిర్వాసితులకు పునరావాసం కల్పించడానికి మాత్రమే వ్యయం చేసి.. 75 శాతం ఖర్చు చేశాక యూసీలు(వినియోగ ధ్రువీకరణపత్రాలు) పంపితే మళ్లీ అడ్వాన్సుగా నిధులు ఇస్తామని కేంద్రం స్పష్టం చేసింది. కానీ.. చంద్రబాబు ప్రభుత్వం ఆ నిధులను ఎస్ఎన్ఏ ఖాతాలో జమ చేయకుండా, ఇతర అవసరాలకు మళ్లించింది. ఇదే అంశంపై పీపీఏ, కేంద్ర జల్ శక్తి శాఖ అనేకమార్లు ఆగ్రహం వ్యక్తం చేయడంతో విడతల వారీగా రూ.4,352 కోట్లను ఎస్ఎన్ఏ ఖాతాలో జమ చేసి.. ప్రాజెక్టు పనులకు, నిర్వాసితులకు పరిహారం చెల్లించేందుకు ఖర్చు చేసింది. అంటే 2024–25లో అడ్వాన్సుగా ఇచ్చిన నిధుల్లో ఇప్పటికీ రూ.700 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయలేదు. దాంతో కేంద్రం 2025–26 బడ్జెట్‌లో కేటాయించిన రూ.5,936 కోట్లలో ఒక్క పైసా కూడా ఇప్పటి దాకా విడుదల చేయలేదు. 2026–27 బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో.. 2025–26 బడ్జెట్ అంచనాలను సవరించిన కేంద్ర ప్రభుత్వం పోలవరానికి కేటాయింపులను రూ.3,017.20 కోట్లకు పరిమితం చేసింది. అంటే.. గతంలో కేటాయించిన నిధుల్లో రూ.2,918.80 కోట్లు కోత వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో 58 రోజుల్లో ముగుస్తుంది. దీన్ని బట్టి చూస్తే... సవరించిన బడ్జెట్‌లో కేటాయించిన రూ.3,017.20 కోట్లను కూడా వినియోగించుకోవడం సాధ్యం కాదని సాగు నీటి రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

తాజా బడ్జెట్‌లో పునరుద్ఘాటన

పోలవరంలో 41.15 మీటర్ల ఎత్తు వరకే నీటిని నిల్వ చేస్తూ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు సవరించిన అంచనా వ్యయాన్ని రూ.30,436.95 కోట్లుగా 2024 ఆగస్టు 28న కేంద్ర కేబినెట్ ఆమోదించింది. 41.15 మీటర్ల ఎత్తు వరకు నీటిని నిల్వ చేసేలా ప్రాజెక్టును పూర్తి చేసేందుకు రూ.12,157.53 కోట్లు మాత్రమే ఇవ్వాలని కేంద్ర కేబినెట్ తీర్మానించింది. తద్వారా పోలవరం రిజర్వాయర్‌ను బ్యారేజీగా మార్చేస్తూ కేంద్ర కేబినెట్ తీర్మానం ఆమోదించినా, ఆ సమావేశంలో ఉన్న టీడీపీకి చెందిన మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు అభ్యంతరం చెప్పలేదు. దాన్ని చంద్రబాబు సర్కార్ కూడా వ్యతిరేకించలేదు. 41.15 మీటర్ల ఎత్తు వరకే నీటిని నిల్వ చేసేలా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామంటూ 2024-25, 2025-26 బడ్జెట్‌లోనూ కేంద్రం స్పష్టం చేసింది. తాజా బడ్జెట్‌లోనూ అదే అంశాన్ని పునరుద్ఘాటించింది. వాస్తవానికి 2017–18 ధరల ప్రకారం పోలవరం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.55,656.87 కోట్లు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 45.72 మీటర్ల ఎత్తుతో నీటిని నిల్వ చేసేలా పోలవరం ప్రాజెక్టు స్పిల్ వేను పూర్తి చేసింది. ఆ మేరకు ప్రాజెక్టులో నీటిని నిల్వ చేయాలంటే నిర్వాసితులకు పునరావాసం కల్పించడానికి, భూ సేకరణకు అదనంగా రూ.22 వేల కోట్లకుపైగా అవసరమని సాగు నీటి రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

నాడు.. నేడు.. అదే తీరు...

పోలవరంలో 41.15 మీటర్ల వరకే నీటిని నిల్వ చేస్తే.. వరద ప్రవాహం ఉన్నప్పుడు మాత్రమే కుడి, ఎడమ కాలువల కింద 2.98 లక్షల ఎకరాలకు మాత్రమే నీళ్లందించే అవకాశం ఉంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అంటే.. పోలవరం ప్రాజెక్టు కింద మిగతా 4.22 లక్షల ఎకరాలకు నీళ్లందించడం సాధ్యం కాదు. ఇక కృష్ణా డెల్టా స్థిరీకరణ, గోదావరి డెల్టాలో రబీ పంటకు నీళ్లందించడం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పోలవరం-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుకు నీళ్లందించడం సాధ్యం కాదని తేల్చి చెబుతున్నారు. పోలవరంలో 45.72 మీటర్ల ఎత్తుతో నీటిని నిల్వ చేస్తేనే ఆ ప్రాజెక్టు రాష్ట్రానికి జీవనాడిగా మారుతుందని స్పష్టం చేస్తున్నారు. 1995లో ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. 1996లో కేంద్రంలో యునైటెడ్ ఫ్రంట్ ఏర్పాటులో, నాటి కర్ణాటక సీఎం దేవేగౌడను ప్రధానిని చేయడంలో ప్రధాన భూమిక పోషించి, కేంద్రంలో చక్రం తిప్పానంటూ అనేక మార్లు చెప్పకున్నారు. అప్పట్లో కర్ణాటక సర్కార్ ఆల్మట్టి ఆనకట్ట ఎత్తును 506 మీటర్ల నుంచి 519.6 మీటర్లకు పెంచేసి రిజర్వాయర్‌గా మార్చేసి, ఏపీ నోట్లో మట్టి కొట్టినా అప్పట్లో చంద్రబాబు నోరు మెదపలేదు. ఇప్పుడు పోలవరం రిజర్వాయర్‌ను బ్యారేజ్‌గా మార్చేసి రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన ఘనత కూడా చంద్రబాబే దక్కించుకున్నారంటూ సాగు నీటి రంగ నిపుణులు మండిపడుతున్నారు.



సందిగ్ధత... అస్పష్టత

సాక్షి, అమరావతి: కేంద్ర రైల్వే బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులపై స్పష్టత కొరవడింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఏపీలోని రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపులను ప్రత్యేకంగా ప్రస్తావించ లేదు. ప్రధానంగా 7 కొత్త హై స్పీడ్ రైల్వే కారిడార్‌ల నిర్మాణానికి ఆమోదం తెలిపినట్లు చెప్పారు. వాటిలో హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు కారిడార్లు ఏపీ మీదుగా వెళతాయి. చెన్నై-బెంగళూరు హైస్పీడ్ కారిడార్ పరిధిలోకి రాష్ట్రంలోని చిత్తూరు జిల్లాలోని పలమనేరు ప్రాంతంలో కొంత ప్రాంతం వస్తుంది. రాష్ట్రంలోని అమరావతి రైల్వే లైన్, కడప – బెంగళూరు రైల్వే లైన్, కోటిపల్లి-నర్సాపురం, నడికుడి-శ్రీకాళహస్తి, డోన్-అంకోలా తదితర రైల్వే లైన్లకు కేటాయింపులపై స్పష్టత లేదు. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు నిధుల కేటాయింపుపై సందిగ్ధత నెలకొంది.

బడ్జెట్‌లో ఏపీకి మళ్లీ అన్యాయమే

ఎన్డీఏలో కీలకంగా ఉన్నామని చెప్పే చంద్రబాబు సాధించిందేమిటి?

- పోలవరానికి నిధులు సాధించడంలో విఫలం
- రైల్వే కారిడార్లు తెచ్చుకోవడంలో ఫెయిల్
- పోలవరంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు శ్రద్ధ లేదు
- కేంద్రం చంద్రబాబుకు అప్పులు చేసుకునే స్వేచ్ఛ ఇచ్చింది
- ధ్వజమెత్తిన వైఎస్సార్‌సీపీ ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: తాజా బడ్జెట్‌లోనూ ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయమే జరిగిందని వైఎస్సార్‌సీపీ ఎంపీలు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంలో సీఎం చంద్రబాబు ఘోరంగా విఫలమయ్యారని మండిపడ్డారు. కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌కు రైల్వే కారిడార్లు తెచ్చుకోవడంలో కూడా చంద్రబాబు విఫలమయ్యారని విమర్శించారు. గతేడాది కంటే ఈ ఏడాది పోలవరం ప్రాజెక్టుకు నిధులు తగ్గడంపై మండిపడ్డారు. ఢిల్లీలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, మేడ రఘునాథరెడ్డి, ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి, గొల్ల బాబూరావు, వైఎస్ అవినాశ్‌రెడ్డి, డాక్టర్ మద్దిల గురుమూర్తి, డాక్టర్ గుమ్మా తనూజారాణి మాట్లాడారు. ఎన్డీఏలో కీలకంగా ఉన్నామని చెప్పుకొనే చంద్రబాబు సాధించిందేమిటని ప్రశ్నించారు. వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు 41.5 మీటర్లకే ఉంచుతూ నిధులు కేటాయించినట్లు తెలిపారు. 2026–27 బడ్జెట్‌లో పోలవరానికి రూ.3,320 కోట్లు కేటాయించడం దారుణమన్నారు. దేశంలో మిగతా రాష్ట్రాల నుంచి రైల్వే కారిడార్లు ఏర్పాటు చేసిన కేంద్రం.. కొత్తగా ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్‌కు హైస్పీడ్ రైల్వే కారిడార్ ఏర్పాటు చేయలేదని విమర్శించారు. విశాఖ–చెన్నై, విశాఖ–బెంగళూరుకు రైల్వే కారిడార్లు ఏర్పాటు చేసుకుంటే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేదన్నారు. ఈ విషయాల్లో చంద్రబాబు ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. ఈ రెండు అంశాలపై తాము కేంద్రంపై ఒత్తిడి తెస్తామన్నారు. బడ్జెట్‌లో టూరిజానికి పెద్దపీట వేయడం, ఇందులో అరకు వ్యాలీ అభివృద్ధికి కేంద్రం చేయూతనివ్వడం అభినందనీయమని పేర్కొన్నారు.



మీడియా సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎంపీలు

అప్పులు చేసుకునే స్వేచ్ఛ ఇచ్చినందునే చంద్రబాబు తలొగ్గుతున్నారు

ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌ను కేంద్రం పూర్తిగా నిరాశపరిచిందని చెప్పారు. పోలవరం, జలజీవన్, పీఎంజేఎస్‌వై పథకాలకు పూర్తిగా నిధులు తగ్గించారని మండిపడ్డారు. జీరాంజీ పథకానికి రూ.58 వేల కోట్లు కోత వేశారని చెప్పారు. ఈ స్కీంను పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కంకణం కట్టుకుందని విమర్శించారు. రాష్ట్రాలు 40 శాతం భరించే పరిస్థితులు లేవని, కేంద్రం వాటా కుదిస్తే ఇది నిర్వీర్యం అవుతుందని ఆ రోజు బిల్లు పాస్ చేసినప్పుడు పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీ తరఫున తాను చెప్పినట్లు గుర్తు చేశారు. ఏపీ పునర్విభజన చట్టంలో... పోలవరాన్ని తాము నిర్మిస్తామని, ఇందుకు రూ.57 వేలకోట్లు గ్రాంటు ఇస్తున్నామని కేంద్రం పొందుపరిచిందని చెప్పారు. గత బడ్జెట్‌లో ఎత్తు తగ్గించి, నిధులు తగ్గించారన్నారు. దాదాపు రూ.27 వేల కోట్లు తగ్గించినా, ఎత్తు తగ్గించినా చంద్రబాబు ప్రభుత్వం నోరు మెదపడం లేదని విమర్శించారు. పోలవరానికి ఏటా ఇలా నిధులు తగ్గించుకుంటూపోతే ఆ స్వప్నం ఎప్పుడు సాకారమవుతుందని ప్రశ్నించారు. రూ.30 వేల కోట్లలో రూ.3,320 కోట్లే కేటాయించారన్నారు. కేంద్రం చంద్రబాబుకు అప్పులు చేసుకునే స్వేచ్ఛను ఇవ్వబట్టే.. పోలవరం విషయంలో తలొగ్గుతున్నారని దుయ్యబట్టారు. అమరావతి పేరుతో రూ.15 వేల కోట్లు అప్పు చేయడమేగాక.. మళ్లీ కొత్త అప్పులు తెచ్చారని తెలిపారు. చంద్రబాబు 21 నెలల్లో రూ.3.5 లక్షల కోట్ల అప్పు చేశారని విమర్శించారు. గత పాలనలో వైఎస్ జగన్ ఐదేళ్లలో రూ.3.32 లక్షల కోట్ల అప్పుచేస్తే రాష్ట్రం శ్రీలంక, సోమాలియా అవుతుందని వ్యాఖ్యలు చేసిన వారంతా ఇప్పుడు ఎక్కడున్నారని ప్రశ్నించారు. తాను అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబుకు ఇంత అప్పు చేయడానికి సిగ్గులేదా అని నిలదీశారు. కొత్తగా ఏపీఎండీసీ పేరుతో రూ.5 వేలకోట్లు, బెవరేజెస్ కార్పొరేషన్ పేరుతో రూ.11 వేలకోట్ల అప్పునకు పూనుకున్నారని చెప్పారు. ప్రైవేటు సంస్థ ఏదైనా ప్రభుత్వానికి అప్పు ఇస్తే.. ప్రభుత్వం కట్టని పరిస్థితుల్లో ఆ అప్పును డైరెక్ట్‌గా డ్రా చేసుకోవచ్చనే షరతును ప్రభుత్వం పెట్టడం దుర్మార్గమని చెప్పారు. ఇబ్బడిముబ్బడిగా అధిక వడ్డీలకు అప్పులు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వాన్ని అత్యంత బలహీనమైన ప్రభుత్వంగా చూడాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

పోలవరం పూర్తికి మరో పదేళ్లు?

ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు శ్రద్ధలేదని ఈ బడ్జెట్ ద్వారా మరోసారి తేటతెల్లమైందని విమర్శించారు. ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు మాటలు వింటుంటే అక్కడ నీరు ఏరులై పారుతున్నట్లు అనిపిస్తోందని ఎద్దేవా చేశారు. పోలవరం ఎత్తు తగ్గింపులో కూడా చంద్రబాబు, ఆయన టీం నోరు మెదపలేదని విమర్శించారు. గతేడాది కంటే ఇప్పుడు మరింతగా నిధులు తగ్గించడం చూస్తుంటే ప్రాజెక్టు పూర్తి చేయడాన్ని మరో పదేళ్ల వరకు తీసుకెళ్లేలా ఉన్నట్లు కనిపిస్తోందని చెప్పారు. ఎంపీ మేడ రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం ఉన్నా ఏపీకి ఏటా అన్యాయం జరుగుతోందని విమర్శించారు. రాష్ట్రాన్ని చంద్రబాబు ప్రభుత్వం అప్పులాంధ్రప్రదేశ్‌గా చేసిందన్నారు. రాష్ట్రాన్ని కార్పొరేట్ల చేతుల్లో ఎలా పెట్టాలి, సొంత లాభాలు ఎలా గడించాలి అనేవే చంద్రబాలు ఆలోచనలని ఆయన విమర్శించారు.

సిగరెట్లు ఖరీదు

అదనపు ఎక్సైజ్ సుంకం ఫిబ్రవరి 1 నుంచి అమలులోకి రావడంతో సిగరెట్ల ధరలు అమాంతం పెరిగాయి. బ్రాండ్‌నుబట్టి ఒక్కో ప్యాక్‌పై కస్టమర్లకు రూ.55 వరకు అదనపు భారం పడుతోంది. 76 మిల్లీమీటర్ల పొడవు గల ప్రీమియం సిగరెట్లు ఇప్పుడు 10 స్టిక్స్ ప్యాక్‌కు రూ.50–55 వరకు ధర పెరిగింది. సాధారణ సిగరెట్లు 10 స్టిక్స్ ఉన్న ప్యాక్ కనీసం రూ.22 నుండి 25 వరకు అధికం అయింది. తయారీదారులు ఇంకా సవరించిన గరిష్ట చిల్లర ధరలతో కొత్త స్టాక్ మార్కెట్లోకి విడుదల చేయక ముందే.. పంపిణీదారులు పాత స్టాక్‌ను 40 శాతం జీఎస్టీతో బిల్ చేస్తున్నట్లు రిటైలర్లు చెబుతున్నారు. తయారీ ప్లాంట్ల నుంచి కొత్త ఎంఆర్‌పీతో నూతన సరుకు నెలాఖరుకు చేరుకోవచ్చని పంపిణీదార్లు అంచనా వేస్తున్నారు. **కొన్ని కంపెనీలు ఇప్పటికే తమ స్టాక్‌ను నిలిపివేసినట్టు సమాచారం.**

ప్రతాప్ సి. రెడ్డి
చైర్మన్, అపోలో హాస్పిటల్స్

ఆరోగ్యకరమైన పౌరులు, పటిష్టమైన ఆరోగ్య వ్యవస్థలు .. దేశ వృద్ధికి దన్నుగా ఉంటాయని బడ్జెట్ పునరుద్ఘాటించింది. ప్రజారోగ్య వ్యవస్థలను మెరుగుపర్చడం, ప్రివెన్షన్‌ని బలోపేతం చేయడం, ద్వితీయ-తృతీయ శ్రేణి నగరాల వ్యాప్తంగా వైద్య సేవల లభ్యతను మెరుగుపర్చడంలాంటివి వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణమైన చర్యలు.

మార్కెట్ డకౌట్



బడ్జెట్ బౌన్సర్‌కి ఇన్వెస్టర్లు క్లీన్ బౌల్డ్!

- సెన్సెక్స్ 1,547 పాయింట్లు క్రాష్
- 25,500 దిగువకు పతనమైన నిఫ్టీ
- ఎఫ్అండ్ఓ ట్రేడింగ్ ఎస్‌టీటీ పెంపు
- ప్రమోటర్లపై అదనపు బైబ్యాక్ ట్యాక్స్ ప్రభావం
- రూ. 9.40 లక్షల కోట్ల సంపద ఆవిరి

2026 బడ్జెట్ మ్యాచ్‌లో నిర్మలా సీతారామన్ వేసిన తొలి ఓవర్‌కే స్టాక్ మార్కెట్ డకౌట్ అయింది. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్ పై ఆర్థిక మంత్రి వేసిన పన్నుల ఫుల్ టాస్‌కి బ్రోకరేజీలు క్లీన్ బౌల్డ్ అయ్యాయి. బడ్జెట్ రోజు స్టాక్ మార్కెట్ పాయింట్ల బ్యాటింగ్ చేస్తుందనుకుంటే నిర్మలా సీతారామన్ వేసిన అనూహ్య బౌన్సర్‌కు సెన్సెక్స్–నిఫ్టీ స్టంపులు ఎగిరిపోయాయి. ఓపెనింగ్ ఓవర్‌లోనే సెన్సెక్స్‌పై భారీ అమ్మకాల యార్కర్ల దాడి జరిగింది. మిడ్ సెషన్‌కల్లా రెడ్ స్కోర్‌బోర్డ్ దడ పుట్టించింది.. ఇన్వెస్టర్లు డకౌట్ అయ్యి వెనుదిరిగితే, ఎల్‌బీడబ్ల్యు అప్పీల్‌కి బుల్స్ చేతులు ఎత్తేశారు. బడ్జెట్ మ్యాచ్ లాభాల గెలుపుతో కాకుండా.. నష్టాల ఓటమి షాక్‌తో ముగిసింది.

న్యూఢిల్లీ: నిర్మలమ్మ బడ్జెట్ స్టాక్ మార్కెట్‌పై 'పన్నుల' దాడి చేసింది. ఫ్యూచర్స్, ఆప్షన్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీ లావాదేవీల పన్ను(ఎస్‌టీటీ) 0.02% నుంచి 0.05 శాతానికి పెంచడం, కార్పొరేట్ ప్రమోటర్ల బైబ్యాక్‌లపై 22%, నాన్ కార్పొరేట్ ప్రమోటర్లపై 30% పన్ను విధింపు ఇన్వెస్టర్లను తీవ్ర నిరాశపరిచింది. కీలక మౌలిక రంగాలకు ఆశించిన స్థాయిలో మూలధన వ్యయాన్ని కేటాయించకపోవడం ప్రతికూల ప్రభావాన్ని చూపింది. ఫలితంగా బడ్జెట్ రోజైన ఆదివారం సెన్సెక్స్ 1,547 పాయింట్లు క్షీణించి 80,723 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 496 పాయింట్లు కుప్పకూలి 25 వేల స్థాయి దిగువన 24,825 వద్ద నిలిచింది. మార్కెట్ పతన తీవ్రత ఎంతలా ఉందంటే..., ఒక్కరోజులో రూ.9.40 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.450 లక్షల కోట్లకు దిగివచ్చింది.

ట్రేడింగ్ సాగిందిలా

బడ్జెట్ నేపథ్యంలో ఆదివారం ప్రత్యేకంగా నిర్వహించిన ట్రేడింగ్‌లో స్టాక్ సూచీలు ఉదయం సానుకూలంగా మొదలయ్యాయి. ఉదయం సెన్సెక్స్ 82,389 వద్ద, నిఫ్టీ 25,334 వద్ద మొదలయ్యాయి. ఎస్‌టీటీ రద్దు, క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ మినహాయింపులపై ఆశలతో తొలిభాగంలో లాభాలు ఆర్జించాయి. ఒక దశలో సెన్సెక్స్ 457 పాయింట్లు పెరిగి 82,727 వద్ద, నిఫ్టీ 120 పాయింట్లు బలపడి 25,321 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి. బడ్జెట్ ప్రసంగంలో పన్నుల ప్రతిపాదన మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడడంతో సూచీలు క్షణాల్లో కుప్పకూలాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 2,371 పాయింట్లు క్షీణించి 79,899 వద్ద, నిఫ్టీ 549 పాయింట్లు కోల్పోయి 24,572 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. దిగువ స్థాయిల్లో కొంతమేర రికవరీ వచ్చినప్పటికీ.., సూచీలు భారీ నష్టాలతో ముగిశాయి.

సెక్యూరిటీ మార్కెట్లకు ఇదొక కఠిన పరీక్ష

''బడ్జెట్‌లో ఎస్‌టీటీ, కార్పొరేట్ బైబ్యాక్‌లపై పన్నుల పెంపు ప్రతిపాదనలు మార్కెట్ వర్గాలను విస్మయానికి గురిచేశాయి. ట్రేడింగ్ వ్యాపారంపై పన్నుల భారం పెరగడంతో భవిష్యత్‌లో వాల్యూమ్ తగ్గే అవకాశం ఉంది. సెక్యూరిటీ మార్కెట్లకు ఇదొక కఠిన పరీక్షగా మారనుంది. ఇన్వెస్టర్లు జాగ్రత్తగా వ్యవహరిస్తూ, ప్రభుత్వ నిర్ణయాల ప్రభావాన్ని అంచనా వేస్తున్నారు.'' అని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

మార్కెట్‌లో మరిన్ని అంశాలు

- ఎల్రక్టానిక్స్ ఉపకరణాల తయారీని ప్రోత్సహించేందుకు బడ్జెట్‌లో రూ.40,000 కోట్ల ప్రతిపాదనతో ఎలక్ట్రానిక్ తయారీ కంపెనీల షేర్లు వెలిగిపోయాయి. అత్యధికంగా సిర్మా ఎస్‌జీఎస్ టెక్నాలజీ 6% లాభపడింది. డిక్సాన్ టెక్నాలజీస్ 4.21%, కేన్స్ టెక్నాలజీ 3.82%, పీజీ ఎలక్ట్రోప్లాస్ట్ 2.95%, డీసీఎక్స్ సిస్టమ్స్ 2.06%, సైయంట్ డీఎల్ఎం 1 శాతం లాభపడ్డాయి.
- సెన్సెక్స్ 30 షేర్లలో టీసీఎస్(2%), ఇన్ఫోసిస్(1.17%), సన్‌ఫార్మా(0.95%), టైటాన్ (0.33%) మాత్రమే లాభాలతో గట్టెక్కాయి. మిగిలిన 26 షేర్లు నష్టపోయాయి. ఎస్‌బీఐ(5.61%), అదానీపోర్ట్స్(5.53%), బీఈఎల్(5.36%), ఐటీసీ (3.91%), టాటా స్టీల్ (3.88%) షేర్లు నష్టపోయాయి.
- ఒక ఐటీ షేర్లకు మాత్రమే స్వల్పంగా డిమాండ్ లభించింది. బీఎస్ఈలో రంగాల వారీ సూచీల్లో పీఎస్‌యూ బ్యాంక్స్ 5.60%, మెటల్ 3.85% క్షీణించాయి. కమోడిటీస్ 3.35%, ఇంధన 3.14%, క్యాపిటల్ గూడ్స్ 3.08%, వినిమయ 2.98%, ఇండస్ట్రియల్స్ 2.66%, విద్యుత్ 2.52% పతనమయ్యాయి. బీఎస్ఈ స్మాల్, మిడ్‌క్యాప్ ఇండెక్సులు వరుసగా 3%, 2% పతనమయ్యాయి.
- ఎస్‌టీటీ పెంపు ప్రభావం బ్రోకరేజ్ కంపెనీల షేర్లపై తీవ్రంగా కనిపించింది. ట్రేడింగ్ వాల్యూమ్ తగ్గుతుందనే ఆందోళనలతో ఈ రంగంలోని కీలక కంపెనీల షేర్లు 12% వరకు క్షీణించాయి.
- క్యూ3లో లాభం 16% వృద్ధి నమోదుతో సన్‌ఫార్మా షేరు 1% పెరిగి రూ.1,610 వద్ద స్థిరపడింది.

15 మోదీ బడ్జెట్లు.. 8 సార్లు పడ్డ మార్కెట్లు

న్యూఢిల్లీ: దేశ ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో మొత్తం 15 సార్లు కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇందులో బడ్జెట్ రోజున సెన్సెక్స్ ఎనిమిది సార్లు నష్టాలు మూటగట్టుకుంది. ఏడు పర్యాయాలు లాభాలు ఆర్జించింది. ఇందులో 2019, 2024 సాధారణ ఎన్నికలకు ముందు రెండుసార్లు మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టారు.

మోదీ హయాంలో బడ్జెట్ రోజు సెన్సెక్స్...

తేదీ	పాయింట్లు	ముగింపు
2014 జూలై 10	72	25,373
2015 ఫిబ్రవరి 28	141	29,362
2016 ఫిబ్రవరి 29	(-)152	23,002
2017 ఫిబ్రవరి 1	486	28,142
2018 ఫిబ్రవరి 1	(-)58	35,907
2019 ఫిబ్రవరి 1	213	36,469
2019 జూలై 5	(-)58	39,513
2020 ఫిబ్రవరి 1	(-)395	39,736
2021 ఫిబ్రవరి 1	2,315	48,601
2022 ఫిబ్రవరి 1	848	58,863
2023 ఫిబ్రవరి 1	158	59,708
2024 ఫిబ్రవరి 1	(-)107	71,645
2024 జూలై 23	(-)73	80,429
2025 ఫిబ్రవరి1	(-)5	77,506
2026 ఫిబ్రవరి 1	(-)1,843	80,723

బ్యాగేజీ నిబంధనల సడలింపు

న్యూఢిల్లీ: బడ్జెట్‌లో కస్టమ్స్ సుంకాలకు సంబంధించిన పలు నిబంధనలను సరళం చేశారు. బ్యాగేజీ నిబంధనలను సడలించేలా ప్రతిపాదనలు చేశారు. వ్యక్తిగతంగా ఉపయోగించుకునేందుకు దిగుమతి చేసుకున్న ఉత్పత్తులపై డ్యూటీని 20 శాతం నుంచి 10 శాతానికి తగ్గించారు. మోటార్ వాహనాలు, ఆల్కహాల్, పొగాకు ఈ పరిధిలోకి రావు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆవిష్కరించిన 'నమ్మకం ఆధారిత కస్టమ్స్' విధానం ప్రకారం కార్గో క్లియరెన్సుల కోసం సింగిల్ విండో వ్యవస్థ ఉంటుంది. దీర్ఘకాలంగా విశ్వసనీయమైన సరఫరా వ్యవస్థలు ఉండి, తరచుగా దిగుమతి చేసుకునే సంస్థలపై వెరిఫికేషన్లు కాస్త తక్కువగా ఉంటాయి. పోర్టుల్లో స్కానింగ్ కోసం కృత్రిమ మేధ (ఏఐ)ని ఉపయోగిస్తారు. నిజాయితీగా ఉండే ట్యాక్స్‌పేయర్లు కస్టమ్స్ వివాదాలకు సంబంధించి పెనాల్టీకి బదులుగా కొంత మొత్తాన్ని అధికంగా చెల్లించడం ద్వారా సమస్యను పరిష్కరించుకోవచ్చు. కస్టమ్స్‌కి సంబంధించిన అన్ని ప్రక్రియల కోసం రెండేళ్ల వ్యవధిలో కస్టమ్స్ ఇంటిగ్రేటెడ్ సిస్టంను (సీఐఎస్) ప్రవేశపెట్టనున్నారు.

బంగారం, వెండికి నో క్లియరెన్స్

బడ్జెట్‌లో పసిడి, వెండిపై కస్టమ్స్ డ్యూటీల్లో ఎలాంటి మార్పులు లేకుండా యథాతథంగా కొనసాగించారు. వ్యక్తిగత వినియోగం కోసం దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై సుంకాలను తగ్గిస్తున్నట్లు మంత్రి ప్రకటించడంతో వీటి విషయంలో కొంత గందరగోళం నెలకొంది. అయితే, వెండి, బంగారం అభరణాలు, ఇతరత్రా విలువైన లోహాలు సదరు ప్రతిపాదనల పరిధిలోకి రావంటూ మార్కెట్ నిపుణులు పేర్కొనడంతో స్పష్టత వచ్చింది. ప్రస్తుతం గోల్డ్, సిల్వర్‌పై డ్యూటీలు 6 శాతంగా ఉంటున్నాయి. బంగారాన్ని ఏ రూపంలో దిగుమతి చేసుకున్నా 5 శాతం బేసిక్ కస్టమ్స్ డ్యూటీ (బీసీడీ), 1 శాతం వ్యవసాయ మౌలిక సదుపాయాలు-అభివృద్ధి సెస్సు (ఏఐడీసీ).. వెరసి 6 శాతం డ్యూటీ ఉంటోంది. అర్హులైన భారత రెసిడెంట్లు దిగుమతి చేసుకునే వెండికి 6 శాతం సుంకాలు వర్తిస్తున్నాయి. ఇతరులు 36 శాతం చెల్లించాల్సి ఉంటోంది. రెండు మెటల్స్‌పైనా 3 శాతం జీఎస్‌టీ ఉంటోంది.

క్యాపిటల్ గెయిన్స్‌గా షేర్ల బైబ్యాక్

- మైనార్టీ షేర్‌హోల్డర్ల ప్రయోజనాలపై ఫోకస్
- ప్రమోటర్లు దుర్వినియోగం చేయకుండా కట్టడి

న్యూఢిల్లీ: మైనారిటీ షేర్‌హోల్డర్ల ప్రయోజనాలను కాపాడుతూ, ప్రమోటర్లు ట్యాక్స్ ఆర్బిట్రేజ్ పొందకుండా నివారించేలా షేర్ల బైబ్యాక్‌లకు సంబంధించిన ట్యాక్సేషన్ నిబంధనలను బడ్జెట్‌లో సవరించారు. అన్ని కేటగిరీల షేర్‌హోల్డర్ల బైబ్యాక్‌లను క్యాపిటల్ గెయిన్స్ కింద పరిగణించి పన్నులు వేసేలా ప్రతిపాదించారు. ప్రమోటర్లపై అదనంగా బైబ్యాక్ ట్యాక్స్‌ని ప్రస్తావించారు. దీనితో కార్పొరేట్ ప్రమోటర్లకు ఎఫెక్టివ్ ట్యాక్స్ రేటు 22 శాతానికి, నాన్–కార్పొరేట్ ప్రమోటర్లకు 30 శాతానికి పెరిగినట్లవుతుంది. బైబ్యాక్ మార్గాన్ని ప్రమోటర్లు దుర్వినియోగం చేయకుండా అరికట్టడానికి దీన్ని ఉద్దేశించినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ప్రమోటర్లపై అధిక పన్నుల భారం మోపడం వల్ల డివిడెండ్లు, బైబ్యాక్‌లకు జరిపే కేటాయింపుల విషయంలో కంపెనీలు తమ వ్యూహాలపై పునరాలోచన చేసే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు. షేర్‌హోల్డర్ల నుంచి సొంత షేర్లను కొనుగోలు చేసే కంపెనీలపై విధించే ట్యాక్స్‌ని మార్కెట్ పరిభాషలో బైబ్యాక్ ట్యాక్స్‌గా వ్యవహరిస్తారు. కంపెనీలు తమకొచ్చిన లాభాలను వాటాదార్లకు డివిడెండ్ రూపంలో చెల్లించడానికి బదులు, ఇలా షేర్ల బైబ్యాక్ కోసం వెచ్చించడాన్ని నివారించేందుకు ప్రభుత్వం దీన్ని ఉపయోగిస్తుంది.

పన్ను భారం 30 శాతం (అత్యధిక శ్లాబ్ రేటు) నుంచి క్యాపిటల్ గెయిన్స్ రేట్ల స్థాయికి తగ్గడం వల్ల (స్వల్పకాలానికి 20 శాతం, దీర్ఘకాలానికి 12.5 శాతం) ఇండివిడ్యువల్ షేర్‌హోల్డర్లకు ప్రయోజనం చేకూరుతుందని ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్ హోల్‌టైమ్ డైరెక్టర్ రూప్ భూత్రా తెలిపారు. అదే సమయంలో కార్పొరేట్లకు ఇది ప్రతికూలంగా ఉంటుందని పేర్కొన్నారు. కంపెనీలు మిగులు నిధులను బైబ్యాక్‌ల కోసం వెచ్చించడాన్ని నివారించి, మూలధన పెట్టుబడులు, పరిశోధన కార్యకలాపాల వైపు మళ్లించేందుకు దోహదపడుతుందని వివరించారు.

ఫ్యూచర్స్ ట్రేడర్లపై ఎస్‌టీటీ గూగ్లీ

- ఫ్యూచర్స్‌పై 150 శాతం పెంపు
- ఆప్షన్స్‌పై 50 శాతం అప్
- బీఎస్ఈ, బ్రోకరేజ్ స్టాక్స్ డౌన్

న్యూఢిల్లీ: డెరివేటివ్స్ సెగ్మెంట్లో భారీ స్థాయి స్పెక్యులేషన్‌ని కట్టడి చేసే దిశగా ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్అండ్‌ఓ)పై సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్‌ని (ఎస్‌టీటీ) పెంచుతూ బడ్జెట్లో ప్రతిపాదన చేశారు. ఫ్యూచర్స్‌పై ప్రస్తుతం 0.02 శాతంగా ఉన్న ఎస్‌టీటీని 0.05 శాతానికి (150 శాతం) పెంచుతున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. అలాగే ఆప్షన్స్ ప్రీమియంపై, ఆప్షన్స్ వినియోగంపై ప్రస్తుతం వరుసగా 0.1 శాతం, 0.125 శాతంగా ఉన్న ఎస్‌టీటీని 0.15 శాతానికి (దాదాపు 50 శాతం) పెంచుతున్నట్లు తెలిపారు. క్యాష్ ఈక్విటీ మార్కెట్‌పై కాకుండా అత్యధిక వాల్యూమ్స్ ఉంటున్న డెరివేటివ్ ట్రేడింగ్‌నే లక్ష్యంగా చేసుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనితో యాక్టివ్, స్వల్పకాలిక ట్రేడింగ్ లావాదేవీల వ్యయాలు పెరుగుతాయని మార్కెట్ నిపుణులు తెలిపారు. అతి స్పెక్యులేటివ్ యాక్టివిటీని నివారించేందుకు, మార్కెట్ సమతుల్యతను ప్రోత్సహించేందుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. 'ఇప్పటివరకు రూ. 1 లక్ష విలువ చేసే ఫ్యూచర్స్ విక్రయంపై ఎస్‌టీటీ రూ. 12.50గా ఉండగా ఇకపై రూ. 20కి పెరుగుతుంది. అలాగే రూ. 10,000 ఆప్షన్ కాంట్రాక్ట్ విక్రయంపై ఎస్‌టీటీ రూ. 6.25 నుంచి రూ. 10కి పెరుగుతుంది' అని స్టాక్ ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫాం లెమన్ సహ వ్యవస్థాపకుడు ఆశీష్ సింఘాల్ తెలిపారు. 2027 ఆర్థిక సంవత్సరంలో ఎస్‌టీటీ రూపంలో కేంద్రానికి రూ. 73,000 కోట్లు రావొచ్చనే అంచనాలున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇది ముందుగా అంచనా వేసిన రూ. 78,000 కోట్ల కన్నా తక్కువగా రూ. 63,670 కోట్లకు పరిమితం కావచ్చని భావిస్తున్నారు. 'నామమాత్రపు పెంపు అనేది కేవలం స్పెక్యులేషన్‌ని నివారించేందుకే తప్ప ఇన్వెస్టర్లను నిరుత్సాహపర్చేందుకు కాదు. ఎఫ్అండ్‌ఓ ట్రేడింగ్‌కి మేము వ్యతిరేకం కాదు. కాకపోతే చిన్న ఇన్వెస్టర్లు నష్టాల పాలవుతున్నప్పుడు మేము మౌనంగా చూస్తూ ఉండిపోలేము. ఈ నిర్ణయం అలాంటి స్పెక్యులేటివ్ పెట్టుబడులను నివారించేందుకు ఉపయోగపడుతుంది' అని బడ్జెట్ అనంతరం కాన్ఫరెన్స్‌లో నిర్మలా సీతారామన్ వివరించారు.

ఎఫ్‌పీఐలకు ప్రతికూలం..

సమీప భవిష్యత్తులో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) ముఖ్యంగా డెరివేటివ్స్ ఆధారిత హై–ఫ్రీక్వెన్సీ గ్లోబల్ ఫండ్స్‌కి ప్రతికూలంగా ఉండొచ్చని చాయిస్ ఈక్విటీ బ్రోకింగ్ టెక్నికల్ రీసెర్చ్ అనలిస్ట్ ఆకాశ్ షా తెలిపారు. అంతర్జాతీయంగా రిస్కులు, కరెన్సీపరమైన ఒత్తిళ్లు మొదలైన వాటి వల్ల ఎఫ్‌పీఐలు ఇప్పటికే ఆచితూచి వ్యవహరిస్తూ మన ఈక్విటీ మార్కెట్ నుంచి జనవరిలో రూ. 41,000 కోట్లు ఉపసంహరించిన ప్రస్తుత పరిస్థితుల్లో ఎస్‌టీటీ పెంపు ప్రతికూలంగా పరిణమిస్తుందన్నారు.దీనితో ట్యాక్స్ అనంతర లాభాలు తగ్గిపోయి, భారత మార్కెట్ ఆకర్షణను కోల్పోయే అవకాశం ఉందని షా వివరించారు. ఫండమెంటల్స్ ప్రాతిపదికన, దీర్ఘకాలిక దృష్టితో లావాదేవీలు నిర్వహించే ఎఫ్‌పీఐలపై ప్రభావం పరిమితంగానే ఉంటుందన్నారు. కాకపోతే, లావాదేవీల వ్యయాలు పెరిగిపోవడం వల్ల గ్లోబల్ ఇన్వెస్టర్లు..ఇతర ఆసియా మార్కెట్లవైపు మళ్లే అవకాశం ఉందని చెప్పారు. గతేడాది పెంపునకు అదనంగా ఇప్పుడు ఎస్‌టీటీని భారీగా పెంచడం వల్ల ట్రేడర్లు, హెడ్జర్ల వ్యయాలు పెరిగిపోతాయని కోటక్ సెక్యూరిటీస్ ఎండీ శ్రీపాల్ షా చెప్పారు. దీనితో డెరివేటివ్స్ విభాగంలో పరిమాణాలు తగ్గుతాయన్నారు. ఆదాయాన్ని గరిష్టంగా పెంచుకోవడం కన్నా వాల్యూమ్స్‌ని తగ్గించడమే ఈ ప్రతిపాదన అంతరార్థం అయి ఉంటుందని పేర్కొన్నారు. మరోవైపు, లిక్విడిటీ మెరుగ్గా ఉండటం, మార్కెట్లో పెట్టుబడులు పెట్టేవారు పెరుగుతున్న నేపథ్యంలో యాక్టివ్ ఎఫ్అండ్‌ఓ ఇన్వెస్టర్లను ఎస్‌టీటీ పెంపు అనేది పెద్ద అవరోధంగా ఉండకపోవచ్చని గ్రీన్ పోర్ట్‌ఫోలియో పీఎంఎస్ సహ–వ్యవస్థాపకుడు దివమ్ శర్మ తెలిపారు. అతి స్పెక్యులేటివ్ ధోరణులను తగ్గించి ఫైనాన్షియల్ మార్కెట్లను మరింతగా విస్తరించేందుకు ఇది ఉపయోగపడుతుందని ఎన్ఎస్ఈ ఎండీ ఆశీష్ కుమార్ చౌహాన్ తెలిపారు.

మార్కెట్లు డౌన్..

ఎస్‌టీటీ పెంపు ప్రభావంతో మార్కెట్లు గణనీయంగా తగ్గాయి. కీలకమైన సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు దాదాపు 2 శాతం క్షీణించాయి. బ్రోకరేజ్ సంబంధ స్టాక్స్ ఒక దశలో 18 శాతం వరకు పతనమయ్యాయి. బీఎస్ఈలో ఎంసీఎక్స్ షేరు సుమారు 12 శాతం తగ్గి రూ.2,232కి (ఇంట్రాడేలో 18 శాతం డౌన్), ఏంజెల్ వన్ స్టాక్ దాదాపు 9 శాతం క్షీణించి రూ. 2,320కి, ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ సర్వీసెస్ 8 శాతం క్షీణించి రూ. 304కి పడ్డాయి. అటు గ్రో మాతృ సంస్థ బిలియన్‌బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్ షేరు 5 శాతం క్షీణించి రూ. 168 వద్ద, ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్ 2 శాతం తగ్గి రూ. 567 వద్ద క్లోజయ్యాయి.

డిజిన్వెస్ట్‌మెంట్ @ రూ. 80,000 కోట్లు

కొత్త ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ లక్ష్యం

ఏప్రిల్1 నుంచి ప్రారంభంకానున్న వచ్చే ఆర్థిక సంవత్సరం(2026–27)లో డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా రూ. 80,000 కోట్లు సమీకరించాలని బడ్జెట్‌లో ఆర్థిక శాఖ ప్రతిపాదించింది. మిస్‌లేనియస్ క్యాపిటల్ రిసీప్ట్స్ పేరుతో ఈ పద్దును నమోదు చేయనుంది. దీనిలో భాగంగా ప్రభుత్వ రంగ సంస్థల(పీఎస్‌యూలు)లో వాటాల విక్రయం, ఆస్తుల మానిటైజేషన్ చేపట్టనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి(2025–26) సవరించిన లక్ష్యం రూ. 34,000 కోట్లతో పోలిస్తే తాజా పద్దును రెట్టింపునకుపైగా పెంచడం గమనార్హం! అయితే కీలక రంగాలలోని కంపెనీలలో వ్యూహాత్మక నియంత్రణను నిలుపుకుంటూనే డిజిన్వెస్ట్‌మెంట్ చేపట్టవచ్చునంటూ తెలియజేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గరిష్టస్థాయిలో టార్గెట్‌ను పెట్టుకోవడం ప్రాధాన్యతను సంతరించుకున్నట్లు విశ్లేషకులు తెలియజేశారు. ఈ ఏడాది సవరించిన లక్ష్యం రూ. 33,837 కోట్లుకాగా.. కేవలం రూ. 8,800 కోట్లు సమకూర్చుకోగా.. గతంలోనూ డిజిన్వెస్ట్‌మెంట్‌పై బడ్జెట్ ప్రతిపాదనా లక్ష్యాలు చేరుకోలేకపోయిన విషయం విదితమే.



స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	1,547	80,723
నిఫ్టీ ▽	496	24,825

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	23,462	▽	223
డోజోన్స్	48,892	▽	179
ఎఫ్‌టీఎస్‌ఈ 100	10,224	△	52
డాక్స్	24,539	△	229
షాంఘై	4,118	▽	40
నికాయ్	53,326	▽	53

అమెరికా ▪ బ్రిటన్ ▪ జర్మనీ ▪ చైనా ▪ జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	90.15	93.17
£	బ్రిటన్ పౌండ్	124.16	128.62
€	యూరో	107.47	111.49
¥	జపాన్ యెన్ (100)	48.00	61.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	62.07	66.00
S$	సింగపూర్ డాలర్	70.23	73.99
SAR	సౌదీ రియాల్	23.63	25.14
UAE D	యూఏఈ దిర్హామ్	24.15	25.42
¥	చైనా యువాన్	12.36	14.18

సతీష్ రెడ్డి

చైర్మన్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీస్

సంస్కరణల ఆధారిత ఆర్థిక మార్గదర్శక ప్రణాళిక అమలుపై భారత్ నిబద్ధతకు ఇది నిదర్శనం. బయోఫార్మా శక్తి ప్రోగ్రాం అనేది నాణ్యమైన ఔషధాల సరఫరాదారు స్థాయి నుంచి అంతర్జాతీయ ఇన్నోవేటర్‌గా భారత్ ఎదిగేందుకు తోడ్పడనుంది. సంక్లిష్టమైన, హై-వేల్యూ థెరపీల్లో సామర్థ్యాలను పటిష్టపర్చుకునేలా ప్రతిపాదనలు ఉన్నాయి.

గోల్డ్.. బౌల్డ్

బంగారం, వెండిలో కొనసాగుతున్న అమ్మకాలు

- రూ.26,273 పడిపోయిన వెండి ధర
- ఫ్యూచర్స్ మార్కెట్లో రూ.2.65 లక్షలకు
- బంగారం 4,241 డౌన్ రూ.1,48,104కు పరిమితం

న్యూఢిల్లీ: వెండి, బంగారంలో పెద్ద మొత్తంలో అమ్మకాలు కొనసాగుతున్నాయి. ఫలితంగా వరుసగా రెండో రోజు ప్రీమియం లోహాలు భారీ పతనాన్ని చూశాయి. ఎంసీఎక్స్ ఫ్యూచర్స్‌లో వెండి మార్చి డెలివరీ కాంట్రాక్టు కిలోకి ఏకంగా రూ.26,273 నష్టపోయింది. 9 శాతం నష్టంతో రోజులో అనుమతించిన కనిష్ట పరిమితి (10 శాతం లోయర్ సర్క్యూట్)కి సమీపంలో 2,65,652 వద్ద ముగిసింది. క్రితం సెషన్‌లో (శుక్రవారం) వెండి కిలోకి ఏకంగా రూ.1,07,968 (27 శాతం) పడిపోయి రూ.2,91,925 వద్ద ముగియడం తెలిసిందే. వరుసగా రెండు ట్రేడింగ్ సెషన్లలో వెండి కిలోకి రూ.1,34,241 నష్టపోయింది. ఇది 33.6 శాతానికి సమానం. బంగారం ఏప్రిల్ నెల కాంట్రాక్టు (10 గ్రాములు) 3 శాతం నష్టంతో (రూ.4,241) రూ.1,48,104 వద్ద స్థిరపడింది. ఆరంభంలో 10 శాతం నష్టంతో రూ.1,38,634 వద్ద లోయర్ సర్క్యూట్‌ను సైతం తాకింది. ఆ తర్వాత కొంత కోలుకుంది. బంగారం సైతం అంతక్రితం సెషన్‌లో 10 గ్రాములకు రూ.31,617 (17.2 శాతం) నష్టపోయి రూ.1,52,345 వద్ద స్థిరపడడం తెలిసిందే. **గత గురువారం బంగారం కాంట్రాక్టు రూ.1,93,096 పలకడం గమనార్హం.**

పెరుగుట విరుగుట కొరకే..

చాలా వేగంగా బంగారం, వెండి ధరలు పెరగడం పతనానికి దారితీసిందని, బులియన్ ధరల్లో అదే చూస్తున్నామని జీఎం ఫైనాన్షియల్ సర్వీసెస్ కమోడిటీ అండ్ కరెన్సీ రీసెర్చ్ వైస్ ప్రెసిడెంట్ ప్రణవ్ మీర్ తెలిపారు. ''బంగారం 20 శాతం పతనమైంది. వెండి గరిష్టాల నుంచి 37 శాతం నష్టపోయింది. దేశీ మార్కెట్లో ఆదివారం కూడా అమ్మకాలు కొనసాగాయి''అని వివరించారు. వాస్తవానికి అంతర్జాతీయంగా కమోడిటీ మార్కెట్లకు ఆదివారం సెలవు. గత శుక్రవారం దేశీ మార్కెట్లలో కంటే అంతర్జాతీయ మార్కెట్లలో వెండి, బంగారంలో దిద్దుబాటు ఎక్కువగా నెలకొంది. దీంతో మన మార్కెట్లో ఆదివారం (బడ్జెట్ కారణంగా ట్రేడింగ్) అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ ఏప్రిల్ నెల డెలివరీ కాంట్రాక్టు ఔన్స్‌కు 612 డాలర్లు (11 శాతం) నష్టంతో 4,763 డాలర్లకు దిగి రావడం గమనార్హం. గురువారం దీని గరిష్ట ధర 5,626 డాలర్లు. కామెక్స్‌లో వెండి మార్చి కాంట్రాక్ట్ 35.89 డాలర్లు పడిపోయి (31 శాతం) 78.53 డాలర్లకు పరిమితమైంది.

మారిన పరిణామాలు..

యూఎస్ ఫెడ్ చైర్మన్ జిరోమ్ పావెల్ సమీప కాలంలో వడ్డీ రేట్ల తగ్గింపు ఉండదని సంకేతం ఇవ్వడంతో డాలర్ బలపడిందని, ఇది బులియన్ ధరలపై ప్రభావం చూపించినట్టు విశ్లేషకుల అభిప్రాయం. దీనికితోడు కెవిన్ వార్ష్‌ను తదుపరి ఫెడ్ చైర్మన్‌గా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించడం సైతం ప్రభావం చూపించినట్టు చెబుతున్నారు. ''లాభాలు స్వీకరించేందుకు ఇన్వెస్టర్లు ముందుకు వచ్చారు. దీనికితోడు నెలవారీ కాంట్రాక్టుల ఎక్స్‌పైరీ సమీపించడం అమ్మకాలకు దారితీసింది. ధరల పతనం నేపథ్యంలో అంతర్జాతీయంగా కమోడిటీ ఎక్స్ఛేంజీలు బంగారం, వెండి కాంట్రాక్టుల మార్జిన్లను పెంచేశాయి. దీంతో ఆటుపోట్లు మరింత పెరిగాయి. వచ్చే కొన్ని సెషన్లలో మరింత దిద్దుబాటు చేసుకోవచ్చు. ఆ తర్వాతే ధరలు స్థిరపడొచ్చు''అని అని ప్రణవ్ మీర్ తెలిపారు.

వ్యాక్సిన్ల హబ్‌గా భారత్

బయోఫార్మా శక్తి ప్రతిపాదననేది గ్లోబల్ వ్యాక్సిన్, బయోలైజిక్స్ తయారీ హబ్‌గా భారత్ స్థానాన్ని పటిష్టపర్చగలదు. భారత్ ఇప్పటికే ప్రపంచ దేశాలకు అవసరమయ్యే టీకాల్లో 60% సరఫరా చేస్తోంది.

- ఆనంద్ కుమార్, ఎండీ
ఇండియన్ ఇమ్యునోలాజికల్స్



సమతూకం పాటించారు

సామాజిక బాధ్యత, దీర్ఘకాలికంగా దేశ అభివృద్ధి మధ్య సమతూకాన్ని పాటించేలా బడ్జెట్ ఉంది. ప్రజాసంక్షేమం, సమ్మిళిత వృద్ధిపై చిత్తశుద్ధిని ప్రతిబింబించింది. 17 క్యాన్సర్ ఔషధాలకు కస్టమ్స్ డ్యూటీల తొలగింపు వల్ల చికిత్స వ్యయాల భారం తగ్గుతుంది.

- భాస్కర్ రావు, సీఎండీ, కిమ్స్ హాస్పిటల్స్

పెట్టుబడులకు అవకాశం..

బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్‌లో ఉపయోగించే లిథియం అయాన్ సెల్ తయారీకి సుంకాలపరమైన మినహాయింపులను పొడిగించడం, బయోగ్యాస్ మిశ్రమ సీఎన్‌జీపై ఎక్సైజ్ సుంకాన్ని హేతుబద్ధీకరణ చర్యలు ప్రతిపాదించారు. రికవరీ మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులకు ఇది దోహదపడుతుంది.

- మసూద్ మలిక్, ఎండీ,
రీ సస్టైనబిలిటీ లిమిటెడ్

'ఎనర్జీ' రంగానికి పవర్..

ఎనర్జీ రంగానికి ఊతమిచ్చేలా బడ్జెట్లో ప్రతిపాదనలు ఉన్నాయి. ఇన్‌లాండ్ వాటర్‌వేస్ వల్ల రవాణా వ్యయాలు తగ్గి, బొగ్గు లాజిస్టిక్స్ మెరుగుపడుతుంది. అణు విద్యుత్‌కు సంబంధించిన ప్రతిపాదనలతో దీర్ఘకాలికంగా విద్యుత్ భద్రతకు భరోసా లభిస్తుంది. 2047 వరకు డేటా సెంటర్లపై ట్యాక్స్ హాలిడేలను పొడిగించడం వల్ల పవర్ సెక్టార్ వృద్ధి అవకాశాలు పెరుగుతాయి.

- జనమేజయ మహాపాత్ర,
సీఈవో, ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా

బయో-ఫార్మా హబ్‌గా ఎదుగుతాం

భారత వాణిజ్య సమతుల్యత, విదేశీ మారక ఆర్జన, ప్రపంచ ఆరోగ్య భద్రతలో ఫార్మా ఎగుమతులు కీలక పాత్ర పోషిస్తున్నాయి. భారత ఫార్మా ప్రస్థానంలో బయో ఫార్మా శక్తి ప్రాజెక్టు చారిత్రక మార్పును తీసుకురాగలదు. భారత్‌ను జనరిక్స్‌లో గ్లోబల్ లీడరు స్థాయి నుంచి అంతర్జాతీయంగా బయో-ఫార్మా తయారీ కేంద్రంగా తీర్చిదిద్దగలదు. బయోలాజిక్స్, బయోసిమిలర్స్‌ని తయారు చేయడానికి ఎంఎస్‌ఎంఈలకు కావాల్సిన వ్యవస్థను ఏర్పర్చేందుకు తోడ్పడగలదు.

- నమిత్ జోషి, చైర్మన్, ఫార్మెక్సిల్

యూపీఐ లావాదేవీలు రూ.28.33 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలు జనవరిలో రికార్డు గరిష్టాలకు చేరాయి. రూ.28.33 లక్షల కోట్లు విలువైన 2,170 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) విడుదల చేసిన డేటా ప్రకారం.. 2025 డిసెంబర్‌లో యూపీఐ చెల్లింపుల విలువ రూ.27.97 లక్షల కోట్లుగా ఉంది. రోజువారీ సగటు లావాదేవీల సంఖ్య 70 కోట్లుగా ఉన్నాయి.

కొత్తగా రూ.17.2 లక్షల కోట్ల రుణాలు

2026-27లో సమీకరించనున్న కేంద్రం

న్యూఢిల్లీ: రానున్న ఆర్థిక సంవత్సరానికి (2026–27) కేంద్ర సర్కారు రూ.17.2 లక్షల కోట్లను రుణాల రూపంలో సమకూర్చుకోనుంది. జీడీపీలో ద్రవ్యలోటును 4.3 శాతానికి తగ్గించాలన్న లక్ష్యానికి నిధులను వినియోగించనుంది. 2025–26 సంవత్సరానికి స్థూల రుణ సమీకరణ అంచనా రూ.14.80 లక్షల కోట్లుగా ఉంది. ''ద్రవ్యలోటును పూడ్చుకునేందుకు డేటెడ్ సెక్యూరిటీల రూపంలో రూ.11.7 లక్షల కోట్లు నికర రుణ సమీకరణ చేయనున్నాం. మిగిలిన రుణాలు చిన్న మొత్తాల పొదుపు పథకాలు, ఇతర రూపాల్లో ఉంటాయి. స్థూల రుణ సమీకరణ రూ.17.2 లక్షల కోట్లుగా ఉంటుంది''అని బడ్జెట్ ప్రసంగంలో భాగంగా మంత్రి సీతారామన్ పేర్కొన్నారు.

ఈ ఏడాది రూ.5.5 లక్షల కోట్లను తిరిగి చెల్లించాల్సి ఉందని, అందుకే రుణ సమీకరణ నంబర్ పెద్దగా కనిపిస్తోందని ఎకనమిక్ అఫైర్స్ సెక్రటరీ అనురాధా ఠాకూర్ వివరించారు. ద్రవ్య నిర్వహణ విషయమై రాష్ట్రాలతోనూ మాట్లాడుతున్నామని బడ్జెట్ అనంతరం మీడియా సమావేశంలో భాగంగా మంత్రి సీతారామన్ తెలిపారు. ఆర్టికల్ 293 (3) కింద రాష్ట్రాల రుణాలను కూడా పర్యవేక్షించాల్సి ఉంటుందన్నారు. పరిమితికి మించి రుణ సమీకరణను అడ్డుకోవడం లేదంటూ.. ఎఫ్‌ఆర్‌బీఎం కింద రాష్ట్రాలు తమ బాధ్యతను అర్థం చేసుకోవాలన్నారు.

ఘనంగా జీఎస్‌టీ వసూళ్లు

- జనవరిలో రూ.1.93 లక్షల కోట్లు
- రిఫండ్‌లు రూ.22,665 కోట్లు

న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను ఆదాయం (జీఎస్‌టీ) జనవరి నెలకు రూ.1.93 లక్షల కోట్లు వసూలైంది. ఇది మూడు నెలల గరిష్ట స్థాయి. గతేడాది సెప్టెంబర్ 22 నుంచి జీఎస్‌టీ పరిధిలో శ్లాబులను కుదించడం ఫలితంగా 375 ఉత్పత్తుల రేట్లు దిగిరావడం తెలిసిందే. దీని ఫలితంగా వినియోగం పెరిగినట్టు డేటా ఆధారంగా తెలుస్తోంది. జనవరిలో రిఫండ్‌లు (పన్ను తిరిగి చెల్లింపు) రూ.22,665 కోట్లుగా ఉన్నాయి. దీంతో నికర జీఎస్‌టీ వసూళ్లు జనవరిలో రూ.1.71 లక్షల కోట్లకు పరిమితమయ్యాయి. ఇది 7.6 శాతం వృద్ధికి సమానం. దేశీ విక్రయాలపై స్థూల జీఎస్‌టీ వసూళ్లు 4.8 శాతం పెరిగి రూ.1.41 లక్షల కోట్లుగా ఉన్నాయి. సెస్సు (పొగాకు ఉత్పత్తులు) రూపంలో రూ.5,768 కోట్లు వచ్చింది. జీఎస్‌టీలో 5, 12, 18, 28 శాతం శ్లాబులను విలీనం చేసి 5, 18 శాతంతోపాటు.. లగ్జరీ, పొగాకు ఉత్పత్తులపై 40 శాతం ప్రత్యేక శ్లాబును ప్రకటించడం తెలిసిందే. కొత్త రేట్లు అమల్లోకి వచ్చిన తర్వాత చూస్తే.. 2025 అక్టోబర్‌లో రూ.1.96 లక్షల కోట్లు వసూలైంది.

సెజ్‌ల నుంచి విక్రయాలకు ఓకే..

న్యూఢిల్లీ: ప్రత్యేక ఆర్థిక మండళ్లలోని (సెజ్‌లు) యూనిట్లు తమ ఉత్పత్తులను తక్కువ దిగుమతి సుంకాలతో దేశీ మార్కెట్లలో విక్రయించుకునేందుకు వన్–టైమ్ ప్రాతిపదికన వెసులుబాటు కల్పిస్తూ బడ్జెట్‌లో ప్రతిపాదన చేశారు. విక్రయ పరిమాణానికి సంబంధించి దీనికి నిర్దిష్ట పరిమితులు వర్తిస్తాయి. అంతర్జాతీయంగా అనిశ్చితుల వల్ల మిగులు ఉత్పత్తిని ఎగుమతి చేసుకోలేకపోతున్న సెజ్ యూనిట్లు దీర్ఘకాలంగా ఈ మేరకు వెసులుబాటు కోరుతున్న నేపథ్యంలో తాజా ప్రతిపాదన ప్రాధాన్యం సంతరించుకుంది.

ప్రస్తుతం ఇవి దేశీ మార్కెట్లో విక్రయించుకోవాలంటే పూర్తి స్థాయి దిగుమతి సుంకాలను చెల్లించాల్సి ఉంటోంది. చాలా యూనిట్లకు ప్రస్తుతం మరింతగా తయారు చేసే సామర్థ్యం ఉంటోందని, లేటెస్ట్ ప్రతిపాదనతో అవి మిగులు ఉత్పత్తిని, తక్కువ సుంకాల భారంతో మన మార్కెట్లో విక్రయించుకునేందుకు వీలవుతుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. తద్వారా వియత్నాంలాంటి దేశాల నుంచి దిగుమతులు కూడా తగ్గుతాయని వివరించారు. వచ్చే 1–2 నెలల్లో ఇందుకు సంబంధించిన విధివిధానాలు ఖరారవుతాయని పేర్కొన్నారు. దీని వల్ల దేశీ పరిశ్రమ నష్టపోకుండా ఆయిల్ రిఫైనరీల్లాంటి రంగాలకు మినహాయింపు ఉంటుందని మంత్రి చెప్పారు.

వరాలు లేవు.. శరాలు లేవు..

కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి

కె.వి.ఎన్ లావణ్య

ట్యాక్సేషన్ నిపుణులు

రెండో నెలలో
నెల మొదటి రోజున
మూడు ముఖ్యమైన కర్తవ్యాలతో
కేవలం 4.3 శాతం ద్రవ్యలోటుతో
500 మంది పైగా పార్లమెంటు సభ్యుల సమక్షంలో
ఆర్థిక సుస్థిరతకు ఆరు సంస్కరణలతో
7 శాతం అభివృద్ధి ఉందంటూ
80 నిమిషాల్లో ఏకధాటిగా
9 వసారి నిర్మలమ్మ ప్రవేశపెట్టిన పద్దు ఇది.

దీని పేరు యువ శక్తి బడ్జెట్. పవిత్ర మాఘ పౌర్ణమినాడు ఆదివారం అయినా ఆపకుండా విదేశీ మార్కెట్లతో పోటీపడుతూ, వికసిత్ భారత్ వైపుగా వడివడిగా అడుగులు వేస్తూ, అభివృద్ధిని ఆకాంక్షిస్తూ, ప్రజలను భాగస్వాములు చేస్తూ.. సబ్‌కా సాథ్ అంటూ, ఆత్మనిర్భర్ వైపుగా నిర్భయంగా అడుగులు వేస్తూ.. ఉత్పత్తి, సర్వీసులు, చిన్న తరహా పరిశ్రమలు, ఇన్‌ఫ్రా, ఫార్మా, జౌళి వివిధ రంగాలను ప్రస్తావిస్తూ, దివ్యాంగులను, యువతను మహిళలను, రైతులను, అన్ని రంగాలవారిని ఆకట్టుకుంటూ, టెక్నాలజీ ద్వారా కృత్రిమ మేధస్సు మిషన్, యోగా, ఆయుర్వేదం మొదలైన వాటికి అత్యంత ప్రాముఖ్యతనిస్తూ, ఆటలను ప్రోత్సహిస్తూ, ఎన్నో అభివృద్ధి పథకాలను ప్రస్తావిస్తూ సాగింది బడ్జెట్ ప్రసంగం.

ఎన్నికల తాయిలం లేదు. ప్రత్యేకిస్తూ కొన్ని రాష్ట్రాలకు పెద్ద పీట.. ఇంకొన్నింటిపై చిన్న చూపు చూడటంలాంటివి లేదు.. అభివృద్ధి మాత్రమే స్మరించారు. షేరు మార్కెట్ నష్టపోయింది కానీ .. పార్లమెంటులో ప్రతిపక్షాల వ్యతిరేకతలు, నిరసనలు లేవు. అయితే ఇన్‌కమ్‌ట్యాక్స్ అంశానికొస్తే.. సంచలనాలు లేవు. రేటు మార్పులు లేవు. శ్లాబుల్లో మార్పులు లేవు, వేతన జీవులకంటూ ప్రత్యేకం లేదు. సీనియర్ సిటిజన్ల ప్రస్తావన లేదు. మహిళల ఊసే లేదు. స్టాండర్డ్ డిడక్షన్ మారలేదు. 80సీ పరిమితిని పెంచలేదు. మరి ఏం ప్రపోజ్ చేశారు?

'ఐ ప్రపోజ్' అని వందసార్లకు పైగా చెప్పిన ఆర్థిక మంత్రి ఏం అన్నారంటే..

➤ కొత్త చట్టం 01–04–2026 నుంచి అమల్లోకి వస్తోంది.
➤ చట్టానికి చేదోడువాదోడుగా ఉండే రూల్సు వస్తాయి.
➤ మీరు ప్రతి సంవత్సరం దాఖలు చేసే రిటర్నులు మారుతున్నాయి.
➤ ఫారం డిజైన్ స్నేహపూర్వకంగా ఉంటుంది.
➤ 'నేను సైతం' నా రిటర్ను వేసుకోగలను అనుకునేంత సులభతరంగా ఉంటుంది.
➤ ఐటీఆర్ ఫారం 1,2లు వేయడానికి గడువు తేదీ జూలై 31.
➤ మిగతా, అంటే ట్యాక్స్ ఆడిట్ అవసరం లేని వాటికి గడువు తేదీ ఆగస్టు 31.
➤ మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్ మీద వడ్డీ ఆదాయం లేదు. టీడీఎస్ ఉండదు.
➤ టూర్ ప్రోగ్రామ్‌ల మీద, మ్యాన్‌పవర్ సర్వీస్‌ల మీద టీసీఎస్ రేటు తగ్గించారు (5 నుంచి 2 శాతానికి)
➤ విదేశాలకు పంపే మొత్తాల మీద, అంటే విద్య, వైద్యం కోసం పంపే మొత్తాల మీద టీసీఎస్‌ని 5 శాతం నుంచి 2 శాతానికి తగ్గించారు. ఇది చాలా మందికి ఉపయోగపడుతుంది.
➤ పన్ను తగ్గించి లేదా పూర్తిగా రద్దు చేయడానికి సంబంధించి టీడీఎస్ కోసం.. ఇక అధికారుల దగ్గరికి పరుగెత్తనక్కర్లేదు. అంతా ఆన్‌లైన్. ➤ రివైజ్డ్ రిటర్నులకు గడువు తేదీని డిసెంబర్ 31 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు పెంచారు. ➤ విదేశాల్లో ఉన్నవారికి టీడీఎస్, క్యాపిటల్ గెయిన్స్ విషయంలో ఒకప్పుడు TAN అవసరం. ఇప్పుడు PANతో సరి. ➤ ఒక వర్గం వారు, విదేశీ ఆస్తుల డిక్లరేషన్ ఇవ్వాలి (వివరాలు రాయాలి).
➤ అసెస్‌మెంట్ ద్వారా రివైజ్ వేయకూడదు కానీ ఇప్పుడు అప్‌డేట్ చేసుకోవచ్చు. ➤ ఇక నుంచి అండర్ రిపోర్టింగ్‌కి, మిస్–రిపోర్టింగ్‌కి ఒకేలా పెనాల్టీలు ఉంటాయి.
➤ పెనాల్టీలను తక్కువ చేశారు (కొన్ని సందర్భాల్లో)
➤ జైలు శిక్షలను తగ్గించారు (కొన్ని సందర్భాల్లో)
➤ అకౌంట్ బుక్స్ ఇవ్వకపోయినా, టీడీఎస్‌కి సంబంధించిన కాగితాలు ఇవ్వకపోయినా ఏమీ అనరు.
➤ నిజాయితీపరులైన ట్యాక్స్ పేయర్స్ తప్పులు చేసినా, ఫైన్‌తో వదిలేస్తారు.

పెద్దవి, పెను మార్పులు లేకపోయినా, కొన్ని మార్పులు మాత్రం వచ్చాయి. వాటిని స్వాగతిద్దాం.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

పన్నుల ఆదాయం రూ.44.04 లక్షల కోట్లు..!

స్థూల పన్నుల ఆదాయం వచ్చే ఆర్థిక సంవత్సరానికి **రూ.44.04 లక్షల కోట్లుగా ఉండొ**చ్చన్నది బడ్జెట్ అంచనా. వ్యక్తిగత పన్నుల ఆదాయం 11.73 శాతం పెరిగి 14.66 లక్షల కోట్లుగా ఉండనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26)లో వ్యక్తిగత పన్నుల ఆదాయం అంచనా రూ.13.12 లక్షల కోట్లుగా ఉండడం గమనార్హం. కార్పొరేట్ పన్నుల వసూళ్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.11.09 లక్షల కోట్లుగా ఉండొచ్చన్నది అంచనా కాగా, దీనికంటే 11 శాతం అధికంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.12.31 లక్షల కోట్లకు చేరతాయని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. సెక్యూరిటీల లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ) రూ.73,700 కోట్లుగా ఉండొచ్చని అంచనా వేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనా ప్రకారం ఇది రూ.63,670 కోట్లు. ప్రత్యక్ష పన్నుల మొత్తం ఆదాయం రూ.26.97 లక్షల కోట్లు ఉంటుందని బడ్జెట్‌లో పేర్కొన్నారు. పరోక్ష పన్నుల మార్గంలో కస్టమ్స్ రూపంలో రూ.2.71 లక్షల కోట్లు, ఎక్సైజ్ డ్యూటీ రూపంలో రూ.3.89 లక్షల కోట్లు, జీఎస్‌టీ రూపంలో రూ.10.19 లక్షల కోట్లు వస్తుందన్నది బడ్జెట్ అంచనా.

ఆర్‌బీఐ నుంచి డివిడెండ్ వర్షం

ఈ విడత రూ.3.16 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: రానున్న ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ, ప్రభుత్వరంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి కేంద్ర సర్కారుకు పెద్ద మొత్తంలో డివిడెండ్ సమకూరనుంది. రూ.3.16 లక్షల కోట్లు రావొచ్చని 2026–27 బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇలా వచ్చే ఆదాయం కంటే 3.75 శాతం ఎక్కువ. 2025–26 సంవత్సరంలో వాస్తవానికి రూ.2.56 లక్షల కోట్లు ఆర్‌బీఐ, ప్రభుత్వరంగ బ్యాంక్‌లు, ఆర్థిక సంస్థల నుంచి డివిడెండ్ కింద వస్తుందని ప్రభుత్వం తొలుత అంచనా వేయగా.. తాజాగా దీన్ని రూ.3.05 లక్షల కోట్లకు సవరించింది. ఇక ప్రభుత్వరంగ సంస్థలు, పెట్టుబడులపై డివిడెండ్ రూపంలో మరో రూ.75,000 కోట్లు సమకూరుతుందని ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అంచనా రూ.71,000 కోట్ల కంటే 6 శాతం అధికం. డివిడెండ్‌లు, ఆర్‌బీఐ మిగులు నిల్వల నుంచి బదిలీ చేసే మొత్తం పన్నేతర ఆదాయం కిందకు వస్తుంది. 2025–26లో పన్నేతర ఆదాయం రూ.6.67 లక్షల కోట్ల అంచనా కాగా, వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఎలాంటి మార్పు లేకుండా రూ.6.66 లక్షల కోట్లుగా ప్రభుత్వం ప్రతిపాదించింది.

సిటీ ఎకనమిక్ రీజియన్స్..

న్యూఢిల్లీ: భారతదేశ వృద్ధి, ఆవిష్కరణలు, అవకాశాలను నడిపించే చోదకాలుగా నగరాలను అభివర్ణించిన ప్రభుత్వం.. ఇప్పుడు ఆధునిక మౌలిక సదుపాయాలు, ప్రాథమిక సౌకర్యాలు అవసరమయ్యే ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు, ఆధ్యాత్మిక పట్టణాలపై కూడా దృష్టి సారిస్తుందని ప్రకటించింది. నిర్దిష్ట వృద్ధి అవకాశాల ఆధారంగా నగర ఆర్థిక ప్రాంతాలను (సిటీ ఎకనమిక్ రీజియన్స్) గుర్తించి.. వీటి సామర్థ్యాన్ని మరింత విస్తరించడం లక్ష్యం అని బడ్జెట్ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. సంస్కరణ ఫలితాల ఆధారిత ఫైనాన్సింగ్ విధానంలో ప్రణాళికలను అమలు చేయడానికి ఐదు సంవత్సరాల కాలానికి ప్రతి సిటీ ఎకనమిక్ రీజియన్‌కు రూ.5,000 కోట్ల నిధులు ప్రతిపాదిస్తున్నట్టు మంత్రి చెప్పారు. మొత్తం ఏడు సిటీ ఎకనమిక్ రీజియన్స్ రానున్నాయి. వీటిలో వైజాగ్, బెంగళూరు, పుణే, సూరత్, వారణాసితోపాటు ట్రై సిటీస్ అయిన భువనేశ్వర్–పూరీ–కటక్, కోయంబత్తూరు–ఈరోడ్–తిరుప్పూర్ ఉన్నాయి.

పీఆర్‌వోఐ పెట్టుబడులకు ఓకే

భారత్ వెలుపల నివసించే వ్యక్తులు(పీఆర్‌వోఐలు) దేశీ లిస్టెడ్ కంపెనీలలో ఇన్వెస్ట్ చేసేందుకు బడ్జెట్‌లో అనుమతించారు. పోర్ట్‌ఫోలియో ఇన్వెస్ట్‌మెంట్ పథకం ద్వారా ఈక్విటీ సాధనాలలో పెట్టుబడికి వీలు కల్పించారు. ఈ పథకంలో భాగంగా వ్యక్తిగత పెట్టుబడుల పరిమితిని 5 శాతం నుంచి 10 శాతానికి పెంచారు. పోర్ట్‌ఫోలియో ఇన్వెస్ట్‌మెంట్ పథకం(పీఐఎస్) తదితర మార్గాలలో చేపట్టనున్న పెట్టుబడులు కలిపి మొత్తంగా 24 శాతం వరకూ అనుమతి ఉంటుంది. ప్రస్తుతం ఈ లిమిట్ 10 శాతంగా అమలవుతోంది. వెరసి ఈక్విటీ క్యాపిటల్ మార్కెట్లలో లిక్విడిటీకి బూస్ట్ లభించనుంది. దీంతో దేశీయంగా పెట్టుబడులు పెరిగి రూపాయి సైతం బలపడేందుకు వీలుంటుందని విశ్లేషకులు పేర్కొన్నారు.

అప్పుడు శ్యామలరావు.. ఇప్పుడు సింఘాల్

చంద్రబాబు రాజకీయ కుతంత్రాలకు ఐఏఎస్ అధికారుల బలి

- తమ ఆరోపణలు నిజమని నిరూపించుకునేందుకు తాజాగా టీటీడీ ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్‌పై బదిలీ వేటు
- తిరుమల లడ్డూ నెయ్యిలో జంతు కొవ్వు కలిసిందంటూ చంద్రబాబు విషప్రచారం
- సీఎం వ్యాఖ్యలకు భిన్నంగా నాటి టీటీడీ ఈఓ శ్యామలరావు ప్రకటన
- ఫలితంగా ఆ బాధ్యతల నుంచి ఆయన బదిలీ
- తాజాగా.. లడ్డూ నెయ్యిలో జంతు కొవ్వు లేదని తేల్చిన సీబీఐ
- చంద్రబాబు తీరుపై విమర్శలు వెల్లువెత్తుతుండడంతో సింఘాల్‌పై చర్యలు
- ఆయన స్థానంలో సీఎం స్పెషల్ సీఎస్ రవిచంద్రకు అదనపు బాధ్యతలు

సాక్షి, అమరావతి/తిరుపతి, అన్నమయ్య సర్కిల్: తిరుమల లడ్డూ వ్యవహారంలో ఎలాంటి జంతు కొవ్వులేదని, తిరుమల ప్రసాదానికి మహాపచారం జరగలేదని సీబీఐ సిట్ తేల్చిచెప్పడంతో తీవ్ర విమర్శలు మూటగట్టుకుంటూ అభాసుపాలవుతున్న సీఎం చంద్రబాబు తాము ఇప్పటివరకు చేసిన దుష్ప్రచారాన్ని నిజమని యావత్ భక్తకోటిని నమ్మించేందుకు ఆయన ఐఏఎస్ అధికారులను బలితీసుకుంటున్నారు. మొన్న టీటీడీ ఈఓ శ్యామలరావు అయితే.. తాజాగా ఆదివారం అనిల్‌కుమార్ సింఘాల్ బదిలీ అయ్యారు. ఇలా ఐదు నెలల వ్యవధిలోనే ఆయన ఇద్దరు టీటీడీ ఈఓలపై వేటు వేశారు. దీంతో.. తన రాజకీయ కుతంత్రాలకు చంద్రబాబు టీటీడీని వాడుకుంటూ ఐఏఎస్ అధికారులపై ఒత్తిళ్లు తెస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే, సింఘాల్ బదిలీ ఉత్తర్వులను ప్రభుత్వం ఆదివారం హడావుడిగా జారీచేసింది. ఆయన వెంటనే జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ (జీఏడీ)లో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఆయన స్థానంలో ప్రస్తుతం సీఎం స్పెషల్ సీఎస్‌గా పనిచేస్తున్న ముద్దాడ రవిచంద్రను టీటీడీ ఈఓగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతల్లో ప్రభుత్వం నియమించింది.

తమ ఆరోపణలు నిజమని నమ్మబలికేందుకే..

19 నెలల క్రితం చంద్రబాబు ముఖ్యమంత్రిగా



IN THE COURT OF HON'BLE SPECIAL JUDGE FOR SPE & ACB CASES-CUM-II ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE, NELLORE

SUPPLEMENTARY CHARGE SHEET
(FINAL REPORT FORM)
(U/s 193 BNSS)

FIR No.470/2024-Tirupati East PS
Year: 2024, Dt.25/09/2024

1.	Name of Branch	:	Tirupati East Police Station
2.	Charge Sheet No.	:	SIT 01/2025- Supplementary Chargesheet
3.	Dated	:	23.01.2026
4.	(i) Act BNS/IPC Sections	:	Sec.61(2), 274,275, 299, 316(5), 318(3),318(4), 336 (3), 340 (2), 238 r/w 49 r/w 3(5) BNS. Sec.120-B, 272, 273, 295A, 409, 418, 420, 468, 471,201 IPC r/w 109 r/w 34 IPC (offences committed prior and after July 1st, 2024).
	(ii) Act PC Act, 1988	:	U/s 7, 7A, 8, 9, 10, 13(2) r/w 13(1)(a) of PC Act 1988 (As amended in 2018) U/s 13(2) r/w 13(1) (c) & (d) of PC Act 1988.
	(iii) Other Acts Sections	:	NA
5.	Type of Final Form/Report	:	Supplementary Charge Sheet
6.	If Final Report un-occurred	:	Not Applicable
7.	If charge sheeted : Original/ Supplementary	:	Supplementary

అనిల్ కుమార్ సింఘల్ బదిలీకి కారణమని భావిస్తున్న చార్జ్ షీట్ ఇదే

బాధ్యతలు చేపట్టిన వెంటనే టీటీడీ ఈఓగా శ్యామలరావును నియమించారు. అప్పట్లో.. అధికారికంగా ఏ విచారణ జరగకుండానే చంద్రబాబు 'తిరుమల లడ్డూ తయారీలో జంతు కొవ్వు కలిపార'ని వ్యాఖ్యానించి రాజకీయ వివాదానికి తెరలేపిన విషయం తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది హిందువులు పరమ పవిత్రంగా భావించే ఆ ప్రసాదంలో కల్తీ జరిగిందని విషప్రచారం చేస్తూ వస్తున్నారు. కానీ, సుప్రీంకోర్టు ప్రత్యేక ఆదేశాలతో సీబీఐ ఆధ్వర్యంలో ఏర్పాటైన సిట్ విచారణానంతరం తిరుమల లడ్డూలో ఎలాంటి జంతు కొవ్వు లేదని నిర్ధారించింది. దీంతో.. అప్పట్లో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ తదితరులు లడ్డూ నెయ్యిలో జంతు కొవ్వు, పంది కొవ్వు కలిపారంటూ అడ్డగోలుగా చేసిన ఆరోపణలను నిజమని ఎలాగైనా నిరూపించేందుకే అప్పుడు శ్యామలరావును.. ఇప్పుడు అనిల్‌కుమార్ సింఘాల్‌ను బదిలీ చేసినట్లు చర్చ జరుగుతోంది. ఇక సాధారణంగా ఒకరి స్థానంలో మరొకరిని నియమించినప్పుడు కొత్తగా వచ్చే అధికారి వచ్చాక ఆయనకు బాధ్యతలు అప్పగించడం పరిపాటి. కానీ, సింఘాల్‌ను ఉన్నపళంగా తప్పుకుని టీటీడీ అదనపు ఈఓ వెంకయ్యచౌదరికి బాధ్యతలు అప్పగించాలని ఆదేశించి ఆయన్ను ఘోరంగా అవమానించింది. రాజకీయ లబ్ధికోసమే అనిల్‌కుమార్ సింఘాల్‌ను వాడుకుని, ఇప్పుడు పక్కకు తోసేశారంటూ ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.

బాబు బాధ్యతలు చేపట్టినప్పటి నుంచే తిరుమల లక్ష్యంగా..

2024 జూన్‌లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే కూటమి ప్రభుత్వం తిరుమల పవిత్రత అనే సాకుతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై గురిపెట్టింది. తిరుమల పవిత్రతను పట్టించుకోనందున అక్కడి పరిస్థితులను చక్కబెట్టేందుకు టీటీడీ ఈఓగా శ్యామలరావును నియమిస్తున్నట్లు అప్పట్లో ప్రభుత్వ పెద్దలు పలుమార్లు ప్రకటించారు. అయితే, టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2024 జూలై 6న, జూలై 12న తిరుమలకు సరఫరా అయిన నెయ్యి టీటీడీ ప్రమాణాలకు తగ్గట్లుగా లేకపోవడంతో అధికారుల స్థాయిలోనే వాటిని వెనక్కు పంపడానికి సిద్ధంచేశారు. ఆ శాంపిళ్లను పరీక్షించేందుకు టీటీడీ చరిత్రలో తొలిసారి గుజరాత్‌లోని ఎన్‌డీడీబీ (నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు)కి పంపారు. జూలై 23న ఎన్‌డీడీబీ తన నివేదికలో నెయ్యిలో కల్తీ ఉందని వెల్లడించింది. దాంతో.. ఆ ట్యాంకర్లను వెనక్కు పంపించారు. అలా నాలుగు ట్యాంకర్లను వెనక్కు పంపడంతో పాటు, ఆ కంపెనీకి షోకాజ్ నోటీసు కూడా ఇచ్చారు. ఆ నాలుగు ట్యాంకర్ల నెయ్యి వాడకపోయినా, రెండు నెలల తర్వాత 2024 సెప్టెంబరు 18న ఎమ్మెల్యేల సమావేశంలో 'శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రసాదానికి నాసిరకం పదార్థాలు వాడారు.. లడ్డూ తయారీలో ఉపయోగించే నెయ్యిలో జంతు కొవ్వు కలిసింది' అని చంద్రబాబు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అప్పటి నుంచి ఈ అంశం రాష్ట్ర రాజకీయాల్లో నిత్యం పెను దుమారం రేపుతూనే ఉంది.

బాబు వ్యాఖ్యలకు భిన్నంగా శ్యామలరావు ప్రకటనతో..

అయితే, 2024 జూలై 23నే నాటి టీటీడీ ఈఓ శ్యామలరావు చంద్రబాబు వ్యాఖ్యలకు భిన్నంగా మీడియాతో మాట్లాడుతూ.. 'నెయ్యి శాంపిళ్లలో కల్తీ ఉందని తేలింది. అందులో వెజిటబుల్ ఫ్యాట్.. అంటే వనస్పతి కలిసిందని తెలిసింది. ఆ సప్లయర్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టేందుకు నోటీసులిచ్చి రెండు ట్యాంకర్లను రిజెక్ట్ చేశాం'.. అని వెల్లడించారు. ఆ తర్వాత.. 2024 సెప్టెంబరు 18 నాటి చంద్రబాబు ప్రకటన తర్వాత సెప్టెంబరు 20న శ్యామలరావు మరోసారి జంతు కొవ్వు కలిపారన్న చంద్రబాబు వ్యాఖ్యలకు భిన్నంగా 'అడల్ట్రేటెడ్ నెయ్యి అని తేలిన నాలుగు ట్యాంకర్లను పక్కన పెట్టాం. రిపోర్టు వచ్చిన తర్వాత వాడాలని నిర్ణయించాం. రిపోర్టు క్లియర్ కాకపోవడంతో వాటిని రిజెక్టు చేశాం. వాటిని తిప్పి పంపించేశాం, సరఫరా నిలిపివేశాం' అని ప్రకటించి ప్రభుత్వానికి టార్గెట్ అయ్యారు. దీంతో.. అప్పటికప్పుడు ఆయనను బదిలీచేస్తే విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందని భావించిన చంద్రబాబు సర్కారు దాదాపు ఏడాది తర్వాత 2025 సెప్టెంబరులో ఆయనపై బదిలీ వేటువేసింది. ఇప్పుడు సీబీఐ సిట్ నివేదికతో ఉక్కిరిబిక్కిరి అవుతూ తమ ఆరోపణలను నిజమని ఎలాగైనా నమ్మించాలని అనిల్‌కుమార్ సింఘాల్‌ను బలిచేసింది.

సాక్షి టెన్త్‌క్లాస్ స్పెషల్



మ్యాథమెటిక్స్ ముఖ్యమైన ప్రశ్నలు- సమాధానాలు, క్విజ్

- వివరాలు నేటి ఈపేపర్‌లో ▸

వారందరి పేర్లూ డిజిటల్ బుక్‌లో నమోదు చేస్తాం

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి
- అంబటి కుటుంబ సభ్యులకు పరామర్శ.. పార్టీ అండగా ఉంటుందని భరోసా
- శ్రీవారి లడ్డూ నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే అంబటిపై హత్యాయత్నం
- విధ్వంసాన్ని నిలువరించాల్సిన పోలీసులు కళ్లప్పగించి చూడటం దారుణం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్నందుకే వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కూటమి ప్రభుత్వం దాడులకు తెగబడుతోందని ఆ పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. అంబటి ఇంటిపై దాడి చేసి, విధ్వంసం సృష్టించిన వారితో పాటు వారికి సహకరించిన పోలీసులనూ వదిలిపెట్టబోమని, అందరి పేర్లు వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్‌లోకి ఎక్కిస్తామని చెప్పారు. గుంటూరులోని సిద్ధార్థనగర్‌లో శనివారం టీడీపీ రౌడీమూకల దాడిలో ధ్వంసమైన మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు నివాసం, కార్యాలయంలో ధ్వంసమైన ఫర్నిచర్, కాలిపోయిన కారు, చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు, పుస్తకాలు, ఎలక్ట్రానిక్ సామగ్రిని ఆదివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. అంబటి రాంబాబు సతీమణి విజయలక్ష్మి, కుమార్తెలు మౌనిక, మనోజ్ఞను పరామర్శించారు. అధైర్య పడవద్దని, పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అంబటి రాంబాబుపై పథకం ప్రకారం దాడి జరిగిందని, అంబటిని అంతమొందించేందుకు వందలాదిగా వచ్చిన టీడీపీ రౌడీ మూకలను పెద్ద సంఖ్యలో ఉన్న పోలీసులు నిలువరించే ప్రయత్నం చేయలేదన్నారు. తిరుమల లడ్డూలో కల్తీ జరగలేదని తేలడంతో గోరంట్లలోని వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో పూజలు చేసి వస్తున్న అంబటి.. గోరంట్లలో టీడీపీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై అభ్యంతరం వ్యక్తం చేశారని చెప్పారు. ఫ్లెక్సీని తొలగించాలని కోరితే ఆయనపై అక్కడే దాడికి పాల్పడ్డారని, టీడీపీ మూకలు నడిరోడ్డుపై బహిరంగంగా కర్రలు, రాడ్లతో తిరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారని దుయ్యబట్టారు. గంటల తరబడి కొనసాగిన రౌడీ మూకల దాడిపై శాసన మండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ.. డీజీపీ, అదనపు డీజీపీలకు ఫిర్యాదు చేసేందుకు ఫోన్లు చేసినా స్పందించలేదన్నారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీని కలిసేందుకు వెళితే మాజీ హోం మంత్రి మేకతోటి సుచరితను ఎస్పీ ఇంటి గేటు బయటే నిలబెట్టారని చెప్పారు. గతంలో స్కిల్ స్కామ్ కేసులో దోషిగా తేలిన చంద్రబాబును చట్ట పరంగా అరెస్టు చేయించామని, అంబటి రాంబాబుపై జరిగిన దాడిపై చట్ట పరంగా న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సజ్జల ఇంకా ఏమన్నారంటే..

దాడి జరిగిన తీరును సజ్జల రామకృష్ణారెడ్డికి వివరిస్తున్న అంబటి రాంబాబు కుటుంబ సభ్యులు

జంతువుల కొవ్వు కలవలేదని స్పష్టం

- సీబీఐ సిట్ దాఖలు చేసిన చార్జిషీట్‌లో తిరుమల లడ్డూ తయారీకి వాడిన నెయ్యిలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ఆరోపించినట్టుగా ఆవు, పంది కొవ్వు, చేపల నూనెలు కలవలేదని దేశంలోనే ప్రతిష్టాత్మక ల్యాబ్‌లు ఎన్‌డీడీబీ, ఎన్‌డీఆర్‌ఐ రిపోర్టుల ఆధారంగా నిర్ధారణ అయ్యింది. దేవుడ్ని అడ్డం పెట్టుకుని చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేశ్, ఇతర కూటమి నాయకులు చేసిన క్షుద్ర రాజకీయాలను చూసి ప్రజలు చీదరించుకుంటున్నారు.
- దీని నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే మాజీ మంత్రి అంబటి రాంబాబుపై ఉద్దేశ పూర్వకంగా దాడికి టీడీపీ వ్యూహరచన చేసి, అమలు చేసింది. పోలీసుల సమక్షంలోనే జరిగినా వారు ఎక్కడా అడ్డుకోలేదు. మాజీ మంత్రి విడదల రజిని, మాజీ ఎమ్మెల్యేలు బొల్లా బ్రహ్మనాయుడు, భూమన కరుణాకర్ రెడ్డిపై ఇదే విధంగా దాడి చేశారు. టీడీపీ ఎమ్మెల్యే గళ్లా మాధవి భర్త సహా పలువురు నాయకులు స్వయంగా దాడిలో పాల్గొన్నారు.
- అంబటి నిజంగా తప్పు చేసి ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చు. నాడు వైఎస్ జగన్‌ను పలు సందర్భాల్లో చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేశ్ సహా పలువురు టీడీపీ, జనసేన నాయకులు తీవ్రమైన భాషతో దూషించారు. వాటిపై పోలీసులు ఏం చర్యలు తీసుకున్నారు? వారు ఇప్పటికీ అలాగే దూషణల పర్వం కొనసాగిస్తున్నారు. వాటిపై ఆధారాలతో సహా పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఏ ఒక్కరిపైనా చర్య లు తీసుకున్న దాఖలాలు లేవు.

వారందరినీ శిక్షించి తీరుతాం

- అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా రాష్ట్రంలో అశాంతిని సృష్టించడం చంద్రబాబుకు అలవాటే. గతంలో మేం అధికారంలో ఉన్నప్పుడు పట్టాభితో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి పదే, పదే తీవ్రంగా తిట్టించారు. ఫలితంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ప్రతిఘటించారు. దానిని మనసులో పెట్టుకుని అంబటి రాంబాబును చంపాలన్న కుట్రతోనే టీడీపీ గూండాలు దాడికి తెగబడ్డారని కచ్చితంగా తెలుస్తోంది.
- టీడీపీ గూండాల దాడిపై వైఎస్సార్‌సీపీ చట్టపరంగా న్యాయ పోరాటం చేస్తుంది. పార్లమెంటులో సైతం దీనిపై గళమెత్తుతాం. వీడియోలన్నీ తీసిపెట్టుకున్నాం. దాడి వెనుక ఉన్న వారు, దాడిలో పాల్గొన్న వారి పేర్లూ డిజిటల్ డైరీలో ఎక్కిస్తాం. నిందితులను చట్టపరంగా శిక్షించి తీరుతాం.
- ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి విడదల రజిని, మాజీ ఎంపీలు మోదుగుల వేణుగోపాలరెడ్డి, నందిగం సురేష్, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అన్నాబత్తుని శివకుమార్, ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి, మురుగుడు హనుమంతరావు, రుహుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గళ్లా మాధవి దగ్గరుండి దాడి చేయించారు : అంబటి మౌనిక

గుంటూరు పశ్చిమ టీడీపీ ఎమ్మెల్యే గళ్లా మాధవి నాయకత్వంలో ఇంట్లో ఉన్న మహిళలపై కూడా దాడి జరిగిందని మాజీ మంత్రి, కాపు నాయకుడు, వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు కుమార్తె అంబటి మౌనిక స్పష్టం చేశారు. టీడీపీ గూండాల దాడిలో దెబ్బతిన్న వస్తువులను ఆదివారం ఆమె పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డికి చూపించారు. శనివారం సాయంత్రం టీడీపీ మూకలు ఒక్కసారిగా ఇల్లు, కార్యాలయంపై దాడులకు తెగబడ్డారని చెప్పారు. టీడీపీ నాయకులు తన తండ్రిని ఉద్దేశ పూర్వకంగా రెచ్చగొట్టారన్నారు. గుంటూరు వెస్ట్ టీడీపీ ఎమ్మెల్యే గళ్లా మాధవి వెంట పెద్ద సంఖ్యలో వచ్చిన మహిళలు బూతులు తిడుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, కేకలు వేస్తూ భయభ్రాంతులకు గురి చేశారన్నారు. గళ్లా మాధవి ఉసికొల్పిన తర్వాతే ఇంటితో పాటు కార్యాలయంపై దాడి జరిగిందని తెలిపారు. అంబటి రాంబాబు క్యాంపు కార్యాలయంలో ఉన్నారని తెలిసీ, టీడీపీ రౌడీమూకలు విధ్వంసానికి దిగాయన్నారు. ఆ సమయంలో తాము పిల్లలతో బిక్కుబిక్కుమంటూ గడిపామని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల సహాయ, సహకారాలతోనేక ఈ దాడులు జరిగాయన్నారు.

గ్రూప్‌-1, 2 ఫలితాల్లో ఆర్‌సీ రెడ్డి ఐఏఎస్ స్టడీ సర్కిల్ హవా

- గ్రూప్‌–1 ఫలితాల్లో 50 శాతం విజేతలు
- గ్రూప్‌–2లో రాష్ట్ర స్థాయిలో అత్యధిక ర్యాంకులు

సాక్షి ఎడ్యుకేషన్: ఇటీవల ప్రకటించిన ఏపీపీఎస్సీ గ్రూప్‌–1, గ్రూప్‌–2 ఫలితాల్లో ఆర్‌సీ రెడ్డి ఐఏఎస్ స్టడీ సర్కిల్ సత్తా చాటింది. 40 ఏళ్ల సుదీర్ఘ విజయ పరంపరలో భారతదేశంలోనే ప్రముఖ పోటీ పరీక్షల శిక్షణ సంస్థగా నిలిచిన ఆర్‌సీ రెడ్డి ఐఏఎస్ స్టడీ సర్కిల్ మరోసారి తన ప్రతిభను నిరూపించుకుంది. ఇటీవల ప్రకటించిన ఏపీపీఎస్సీ గ్రూప్‌–1 ఫలితాల్లో మొత్తం విజేతల్లో 50 శాతం మంది ఈ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులే. ఏపీ గ్రూప్‌–2 ఫలితాల్లో కూడా రాష్ట్ర స్థాయిలో ఆర్‌సీ రెడ్డి ఐఏఎస్ స్టడీ సర్కిల్ అత్యధిక ర్యాంకులను సాధించింది. అపార అనుభవజ్ఞులైన అధ్యాపకుల మార్గనిర్దేశంలో ఈ సంస్థలో చదువుకున్న విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల్లో అత్యున్నత ఫలితాలను సాధిస్తున్నారు.

రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా చంద్రబాబు ప్రభుత్వం

- అడ్డగోలు భూ సమీకరణను ఆపాలి
- రైతు ఉద్యమనేత, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా పనిచేస్తోందని రైతు ఉద్యమనేత, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నగర ప్రణాళిక రూపకల్పన పేరుతో ఇప్పటికే తీసుకున్న భూములకు అదనంగా 1.54 లక్షల ఎకరాల భూమిని ప్రైవేటు డెవలపర్స్‌కు అప్పగించాలని ఆలోచించడం దుర్మార్గమన్నారు. ఇకనైనా ప్రభుత్వం అడ్డగోలు భూ సేకరణను ఆపాలని, లేకుంటే లోకేశ్, చంద్రబాబుకు కష్టాలు తప్పవని హెచ్చరించారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 2014లో అమరావతి పరిసర గ్రామాల ప్రజలు 33 వేల ఎకరాలిస్తే నేటికీ అక్కడ రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్ సదుపాయాలు కల్పించలేదని ధ్వజమెత్తారు. ఇటీవల రైతుల నుంచి సుమారు 16 వేల ఎకరాలు, ప్రభుత్వ భూమి 4 వేల ఎకరాలతో పాటు ల్యాండ్ పూలింగ్ – 3 కింద మరో 24 వేల ఎకరాలు తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకూ అమరావతి ప్రాంతంలో జనాభా పెరుగుదల చాలా స్వల్పమేనన్నారు. అటువంటి చోట అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు 189 కిలో మీటర్ల నిడివితో నిర్మించాలనుకోవడం సరికాదన్నారు. 20 సంవత్సరాల తర్వాత అవసరమయ్యే ఔటర్ రింగ్ రోడ్డుకు ఇప్పుడే భూ సేకరణ చేయాల్సిన అవసరం లేదన్నారు. నత్తనడకన సాగుతున్న గాలేరు – నగరి, హంద్రీ – నీవా ప్రాజెక్టులతోపాటు వెలిగొండ, వంశధార ఫేజ్ – 3, చింతలపూడి వంటి వాటికి నిధులు కేటాయించాలని కోరారు.

నాకు న్యాయం చేయండి

- రైల్వేకోడూరు కూటమి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ బాధితురాలు

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు కూటమి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ చేతిలో మోసపోయిన తనకు న్యాయం చేయాలని బాధితురాలు సోషల్ మీడియా వేదికగా వేడుకున్నారు. ఆమె ఆదివారం ఓ వీడియో విడుదల చేశారు. 'ఎమ్మెల్యే అరవ శ్రీధర్ గురించి ముక్కా కుటుంబానికి బాగా తెలుసు. శ్రీధర్ తప్పు చేశారని కూడా తెలుసు. అందుకే వారు ఇప్పటివరకు స్పందించలేదు. ఒక వేళ శ్రీధర్ మంచివాడైతే మొదట ముక్కా కుటుంబమే నాపై తిరగబడేది' అని ఆమె చెప్పారు. ఈ వ్యవహారాన్ని రాజకీయం చేయొద్దని చెప్పినా కూడా కూటమి నేత తాతంశెట్టి నాగేంద్ర మానుకోవడం లేదని మండిపడ్డారు. 'నువ్వొక పార్టీ బ్రోకర్‌వి. నీ రాజకీయాలు నువ్వు చూసుకో. మా విషయానికి రాజకీయాలు అంటగట్టొద్దు' అని తాతంశెట్టికి బాధితురాలు స్పష్టం చేశారు.

మాట్లాడుతున్న బాధితురాలు

తనకు శ్రీధర్ చేసిన అన్యాయంపై మాట్లాడకుండా పాత కేసులు అంటూ ఏవేవో కథలు అల్లుతున్నారని వాపోయారు. తాను యూపీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నానని చెబితే అది నమ్మి శ్రీధర్ పెళ్లి చేసుకుంటానని అనలేదన్నారు. అదంతా అసత్య ప్రచారమని ఖండించారు. తనకు ఇష్టం లేకపోయినా.. ప్రేమిస్తున్నానంటూ వెంటపడి.. పెళ్లి చేసుకుంటానంటూ మాయమాటలు చెప్పి ఎమ్మెల్యే శ్రీధర్ మోసం చేశారని వాపోయారు.

ఎమ్మెల్యే అరవ శ్రీధర్ బాధితురాలి వీడియో కోసం ఈ క్యూ ఆర్ స్కాన్ చేయండి

తూర్పుపాలెంలో గ్యాస్ లీక్

మలికిపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం తూర్పుపాలెంలో ఆదివారం గ్యాస్ లీకేజీ కలకలం రేపింది. గ్రామంలోని కేశనపల్లి వెస్ట్–01 ఓఎన్జీసీ బావిలో కొత్త జోన్లను గుర్తించేందుకు నెల రోజులుగా డీప్ ఇండస్ట్రీ సంస్థ రిగ్‌తో డ్రిల్లింగ్ నిర్వహిస్తోంది. డ్రిల్లింగ్ పూర్తిచేసి గ్యాస్ సరఫరాను పునరుద్ధరించిన అనంతరం వారం రోజులుగా ఆ రిగ్‌ను వేరే బావి వద్దకు తరలించే పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సైట్ నుంచి బంకర్లను తరలించేందుకు ఓఎన్జీసీ ట్రాలీలు ఆదివారం అక్కడకు చేరుకున్నాయి. ఒక ట్రాలీ గ్యాస్ పైప్‌లైన్‌ను బలంగా ఢీకొంది. దీంతో బావికి చెందిన క్రిస్మస్ ట్రీ నుంచి వెళ్లిన పైప్‌లైన్ పేలిపోయి భారీ ఎత్తున గ్యాస్ ఎగజిమ్మింది. ఇంజినీర్లు ఘటనా స్థలానికి చేరుకుని గ్యాస్ లీకేజీని నియంత్రించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. మలికిపురం తహసీల్దార్ టి.శ్రీనివాసరావు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.

మత్తు పదార్థాలిచ్చి బాలికపై అఘాయిత్యం

కోవూరులో గంజాయి బ్యాచ్ దారుణం

కోవూరు: గంజాయి మత్తులో ఇద్దరు బాలురు ఓ చిన్నారి జీవితాన్ని చిదిమేశారు. విచక్షణ మరిచి బాలికపై సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు పంచాయతీలోని కొత్తకాలనీలో జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. కోవూరుకు చెందిన మైనార్టీ బాలిక(12)పై అదే కాలనీకి చెందిన ఇద్దరు మైనర్లు కన్నేశారు. శుక్రవారం గంజాయి మత్తులో ఉన్న వీరు బాలిక దుకాణానికి వెళ్లొస్తుండగా మాటేసి సమీపంలోని చెట్ల పొదల్లోకి లాక్కెళ్లారు. అప్పటికే వైటనర్‌ను కలిపి సిద్ధం చేసిన నీటిని తాగించారు. బాలిక స్పృహ కోల్పోగానే మృగాల్లా మారి లైంగిక దాడి చేశారు. మత్తు దిగిన తర్వాత బాధిత బాలిక ఏడుస్తూ ఇంటికి చేరుకుని, తల్లిదండ్రులకు తనపై జరిగిన అమానుషాన్ని వివరించింది. పోలీసులకు సమాచారం అందించడంతో బాలికను నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి, నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

కేసీఆర్‌ను ప్రశ్నించిన సిట్

- ఫోన్ ట్యాపింగ్ కేసులో నాలుగున్నర గంటలపాటు విచారణ

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసును దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను ఆదివారం ప్రశ్నించింది. నందినగర్‌లో ఉన్న ఆయన నివాసంలో మధ్యాహ్నం 3.30 గంటల నుంచి నాలుగున్నర గంటలపాటు వివిధ అంశాలపై విచారించింది. దీనికోసం కేసీఆర్ నివాసంలోకి మొత్తం 15 మందితో కూడిన సిట్ బృందం వెళ్లింది. అక్కడి రెండో అంతస్తులోని ఓ గదిలో నగర సంయుక్త సీపీ ఎస్ఎం విజయ్‌కుమార్ నేతృత్వంలో కేసు దర్యాప్తు అధికారిగా ఉన్న జూబ్లీహిల్స్ ఏసీపీ పి.వెంకటగిరి, ఐపీఎస్ అధికారి నారాయణరెడ్డి, నాన్ కేడర్ ఎస్పీ ఎం.రవీందర్‌రెడ్డి, అదనపు ఎస్పీ కేఎస్ రావు, ఏసీపీ సీహెచ్ శ్రీధర్‌లు కేసీఆర్‌ను ప్రశ్నించారు. విచారణ మొత్తాన్ని వీడియో రికార్డింగ్ చేసిన అధికారులు కేసీఆర్ వాంగ్మూలాన్నీ నమోదు చేసుకొని వెళ్లారు.

తప్పు చేయనందునే సిట్ విచారణకు: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో 'సిట్' నిబంధనలు పాటించకున్నా, తెలంగాణ ప్రజల ప్రతినిధిగా చట్టం, న్యాయం మీద ఉన్న గౌరవంతో తమ పార్టీ అధినేత కేసీఆర్ విచారణకు హాజరయ్యారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. సిట్ నోటీసులపై కోర్టును ఆశ్రయించే అవకాశమున్నా ఏ తప్పు చేయనందునే కేసీఆర్ విచారణకు సహకరించి అన్ని ప్రశ్నలకు సమాధానం ఇచ్చారన్నారు. పార్టీ నేతలతో కలిసి కేటీఆర్ ఆదివారం రాత్రి నందినగర్ నివాసంలో మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ ఎలాంటి తప్పు చేయలేదని డీజీపీ, సిట్ పెద్దలకు తెలిసి ఉంటుందని వ్యాఖ్యానించారు. రెండేళ్లుగా పుకార్లు, అపోహలు సృష్టిస్తూ లీకులు ఇస్తూ కాంగ్రెస్ పొందుతున్న పైశాచిక ఆనందానికి తెర పడుతుందని ఆశిస్తున్నట్టు కేటీఆర్ పేర్కొన్నారు.

రాష్ట్రానికి కేటాయింపులు శూన్యం

- జీడీపీలో 4.3 శాతానికి తగ్గిన కేంద్రం అప్పు
- రాష్ట్రంలో మాత్రం చంద్రబాబు సర్కార్ భారీ అప్పు
- గతంలో రాష్ట్రం శ్రీలంక అవుతుందన్న బాబు..
- మరి ఇప్పుడు ఏపీ.. సూడాన్ అవుతుందా?
- మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ధ్వజం

సాక్షి, అమరావతి: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ నిరాశాజనకంగానే ఉందని.. ఆంధ్రప్రదేశ్‌కు ఒరిగిందేమీ లేదని వైఎస్సార్‌సీపీనేత, రాష్ట్ర మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ అన్నారు. ముఖ్యంగా పోలవరం ప్రాజెక్ట్‌కు రూ.3,300 కోట్లు మాత్రమే విదిల్చారని, అంతకు మించి రాష్ట్రానికి కేటాయింపులు శూన్యమన్నారు. కేంద్రం అప్పులు మాత్రం జీడీపీలో 4.3 శాతానికి తగ్గించుకున్నారని, కానీ అందుకు భిన్నంగా రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం మాత్రం గత బడ్జెట్‌లో చెప్పిన దానికన్నా ఇప్పటికే రూ.16 వేల కోట్లు ఎక్కువగా అప్పులు చేసిందంటూ ఆక్షేపించారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం బుగ్గన రాజేంద్రనాథ్ మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. కేంద్ర బడ్జెట్ చరిత్రలోనే ఇది అతి పెద్దది. ఇందులో ఆదాయ, వ్యయ అంచనాలు రూ.53,47,315 కోట్లు కాగా, రూ.16,95,768 కోట్లు అప్పుగా చూపారు. మూలధన వ్యయం రూ.12,21,821 కోట్లుగా, ద్రవ్యలోటు రూ.16,95,765 కోట్లుగా చూపారు. గత సంవత్సరాలతో పోలిస్తే జీడీపీలో అప్పు 4.3 శాతానికి తగ్గడం ఒక్కటే ఊరట. సమగ్ర శిక్ష, జల్ జీవన్ మిషన్ వంటి పథకాలకు భారీ కేటాయింపులు చేసినా, ఖర్చు మాత్రం చేయడం లేదు. గతేడాది జల్ జీవన్ మిషన్‌కు రూ.67వేల కోట్లకు పైగా కేటాయించినా, కేవలం రూ.17 వేల కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు. రోడ్డు, రైలు మార్గాలకు రూ.5,98,520 కోట్లు ఖర్చుపెడతామని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి పోలవరానికి కేవలం రూ.3,300 కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు.

అప్పుల్లో కేంద్రానికి రివర్స్‌లో ఏపీ సర్కార్

కేంద్ర ప్రభుత్వం అప్పు తగ్గించుకుంటూ వస్తుంటే... ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం మాత్రం అప్పులు పెంచుకుంటూ పోతోంది. చంద్రబాబు 2024లో అధికారంలోకి వచ్చాక కేవలం 20 నెలల్లోనే రాష్ట్ర అప్పు, కార్పొరేషన్ల ద్వారా తీసుకున్న రుణాలు అన్నీ కలిపి ఏకంగా రూ.3,14,644 కోట్లు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కోవిడ్ వంటి సంక్షోభం రెండేళ్లు ఉన్నా కూడా రూ.3 లక్షల కోట్ల అప్పు మాత్రమే చేసింది. అదే చంద్రబాబు ప్రభుత్వం రెండేళ్లు కూడా పూర్తి కాకముందే ఆ సంఖ్యను దాటేశారు. కాగ్ లెక్కల ప్రకారం కేవలం ఆర్బీఐ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకూ రూ.81,597 కోట్లు అప్పు చేశారు. ఇది బడ్జెట్‌తో పోలిస్తే రూ.10 వేల కోట్లు ఎక్కువ. మరో రూ.3,300 కోట్లను వచ్చే మంగళవారం(ఫిబ్రవరి 3న) తీసుకుంటున్నారు. ఇలా అన్ని కలిపి బడ్జెట్‌లో చెప్పిన దానికన్నా రూ.16 వేల కోట్లకు పైగా అదనంగా అప్పులు చేస్తున్నారు. అప్పట్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అప్పులు చేస్తే రాష్ట్రం శ్రీలంక అవుతుందన్నారు. ఇప్పుడు మీ అప్పులకు రాష్ట్రం వెనెజువెలా అవుతుందా? సూడాన్ అవుతుందా? చంద్రబాబు చెప్పాలి.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి గుంటూరు

సోమవారం । 2 । ఫిబ్రవరి । 2026



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు 2900 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నీటి నిల్వ 36.6403 టీఎంసీలు.

తిరుపతమ్మ కళ్యాణం

మాచర్ల: 24వ వార్డు తిరుపతమ్మ ఆలయంలో మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని అమ్మవారు, గోపయ్యకి కల్యాణ మహోత్సవం నిర్వహించారు.

గోగులమ్మకు విశేష పూజలు

భట్టిప్రోలు: వ్యాఘ్రపుర క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామ దేవత గోగులమ్మకు మాఘ పౌర్ణమి సందర్భంగా ఆదివారం ప్రాతఃకాల విశేష పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

లలితాంబకు కుంకుమ పూజలు

మాచర్ల: స్థానిక సాయిబాబా ఆలయంలోని లలితాంబ అమ్మవారి 9వ వార్షికోత్సవ కార్యక్రమం ఆదివారం జరిగింది. మహిళలు కుంకుమ పూజలు జరిపారు.

భక్తి శ్రద్ధలతో గాయత్రీ మహాయజ్ఞం

పొన్నూరు: అఖిల విశ్వ గాయత్రీ పరివార్ పొన్నూరు శాఖ ఆధ్వర్యంలో స్థానిక సాక్షి భావ నారాయణ స్వామి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం 24 కుండముల గాయత్రీ మహా యజ్ఞం నిర్వహించారు. గోపూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గాయత్రీ మహా యజ్ఞాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా అఖిల గాయత్రి పరివార్ సంఘ ప్రధాన్ డీవీఆర్ మూర్తి మాట్లాడుతూ ఆధ్యాత్మికతను కులమతాలకతీతంగా విశ్వవ్యాప్తి చేయడమే గాయత్రి పరివార్ ముఖ్య లక్ష్యమని చెప్పారు. గాయత్రి మహామంత్రం జపిస్తే గాయత్రీ మాత అనుగ్రహాన్ని పొందవచ్చని చెప్పారు. పరివార్ సభ్యులు దమ్మాల వెంకటేశ్వర్లు, పులిపాటి శ్రీనివాసరావు, పులిపాటి భవాని శంకర్, నారాకోడూరు గాయత్రి పీఠం నిర్వాహకులు చుండూరు వెంకట చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా ఆదికేశవస్వామి గరుడ సేవ

చేబ్రోలు: చారిత్రక ప్రసిద్ధి చెందిన చేబ్రోలులోని భూనీలా సమేత ఆదికేశవ స్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి పున్నమి గరుడ సేవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఫణిహారం శ్రీధర్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు జరిగాయి. మాఘపౌర్ణమి సందర్భంగా నిర్వహించిన గరుడ సేవ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆదికేశవ స్వామికి ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారి గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది.

వైభవంగా సత్యదేవుని రథోత్సవం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : స్థానిక పట్టాభిపురం సత్యనారాయణస్వామి ఆలయ 49వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రమాసమేత సత్యనారాయణ స్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. మూల విరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణ జరగ్గా, ఆంజనేయస్వామికి మన్యసూక్తంతో అభిషేకం, సిందూరార్చన చేపట్టారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై రమా సమేత సత్యనారాయణస్వామి ఉత్సవ మూర్తులకు రథోత్సవం పురవీధుల్లో నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, నామ సంకీర్తన బృందాలు, దేవత వేషధారణలో కళాకారులు, విద్యుత్ దీప కాంతుల నడుమ నగరోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామికి ఊంజల్ సేవ చేపట్టారు. ప్రముఖ సంగీత విద్వంసరాలు శ్రోతస్విని (బెంగళూరు) నిర్వహించిన స్వరార్చన అలరించింది. ఆలయ కమిటీ చైర్మన్ చావలి గణపతి, ఉత్సవ కమిటీ కన్వీనర్ రాయపాటి సత్యనారాయణ భక్తులు పాల్గొన్నారు.

గుంటూరులో పార్టీ నేతలతో సమావేశమైన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి

టీడీపీ గూండాల దాడిలో ధ్వంసమైన అంబటి కార్యాలయాన్ని పరిశీలిస్తున్న సజ్జల

పచ్చమూకలు ధ్వంసం చేసిన కారును పరిశీలిస్తున్న సజ్జల, పార్టీ నేతలు

టీడీపీ మూకల విధ్వంసం

● వైఎస్సార్‌సీపీ శ్రేణులపై క్రూరంగా దాడి ● కార్లను ధ్వంసం చేసిన టీడీపీ గూండాలు ● ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి ఇంటిపై, కార్యాలయంపైకి శనివారం వేలాదిగా వచ్చిన టీడీపీ మూకలు పక్కా వ్యూహంతో విచక్షణరహితంగా దాడికి పాల్పడ్డాయి. ఆ సమయంలో అడ్డుగా ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను, మహిళలపైనా దాడి చేశారు. దీంతో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

– లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్)

కోర్టు వద్ద అంబటి

విచక్షణరహితంగా దాడి

అంబటి ఇంటి వద్దకు పోలీసులు వచ్చారన్న సమాచారం తెలుసుకుని అక్కడకు చేరుకున్నాను. ఒక్కసారిగా కర్రలతో, రాళ్లతో, ఇనుప రాడ్లతో టీడీపీ గూండాలు అంబటి కార్యాలయంలోకి చొరబడ్డారు. అడ్డుగా ఉన్న నాపై కర్రలతో దాడి చేసి గాయపరిచారు. వారి నుంచి తప్పించుకుని రాత్రి 11.45 గంటల వరకు అంబటి రాంబాబు కార్యాలయంలో తలదాచుకున్నాను. నేను పల్నాడు జిల్లా నుంచి వచ్చి గుంటూరు పట్టాభిపురంలో నివాసం ఉంటున్నాను.

– గుంజి శివ, పల్నాడు జిల్లా

గాయాలపాలై జీజీహెచ్‌లో చేరా

అంబటి రాంబాబు ఇంటిపై దాడి చేస్తున్నారన్న సమాచారం తెలుసుకుని నాతోపాటు మా నాన్న, ప్రస్తుత వైఎస్సార్ సీపీ కో ఆప్షన్ సభ్యుడు పూనూరి నాగేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ తుమ్మేటి శ్రీను, మరికొంత మందితో వెళ్లాం. అక్కడ ఉన్న టీడీపీ గూండాలు అడ్డుకున్నారు. నాపై చేతులతో, కర్రలతో తీవ్రంగా దాడి చేసి గాయపరిచారు. అక్కడే ఉన్న పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం కూడా చేయలేదు. సొమ్మసిల్లి పడిపోవడంతో స్థానికులు జీజీహెచ్‌కు తరలించారు.

– పూనూరి చంద్ర ప్రకాష్

మహిళలని కూడా చూడలేదు..

అంబటి ఇంటిపై , కార్యాలయంపై దాడి చేస్తున్నారన్న విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్నా. టీడీపీ గూండాలు మమ్మల్ని మహిళలు అని కూడా చూడకుండా అసభ్యకరంగా ప్రవర్తించారు. దాడి చేయడంతో కింద పడిపోయాం. అక్కడే ఉన్న తోటి పార్టీ శ్రేణుల సహాయంతో వారి బారి నుంచి బయట పడ్డాం. ఇంతటి రాక్షసంగా వ్యవహరిస్తుంటే పోలీసులు మాత్రం ప్రేక్షకపాత్ర పోషించడం చాలా బాధగా ఉంది.

– భాగ్యలక్ష్మి, త్రివేణి

ప్రజాస్వామ్యంలో దాడులకు తావులేదు

నెహ్రూ నగర్: ప్రజాస్వామ్యంలో దాడులకు తావులేదని, భౌతిక దాడులతో వైఎస్సార్ సీపీ శ్రేణులను భయపెట్టలేరని ఆ పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా పేర్కొన్నారు. శనివారం రాత్రి మాజీ మంత్రి అంబటి రాంబాబు నివాసం వద్ద జరిగిన దురదృష్టకర ఘటనలో గాయపడిన మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ నాగేశ్వరరావు కుమారుడు పూనూరు చంద్రప్రకాష్‌ను జీజీహెచ్‌కు వెళ్లి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని అక్కడి వైద్యులను కోరారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీలో ఏ కార్యకర్తకూ అన్యాయం జరగనివ్వమని.. పార్టీ అధిష్టానం.. నాయకత్వం ప్రతి కార్యకర్తకు అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

చంద్ర ప్రకాష్‌ను పరామర్శిస్తున్న నూరిఫాతిమా

కార్యకర్తలకు అండగా ఉంటాం

గుంటూరు రూరల్: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ఇంటిపై శనివారం అర్ధరాత్రి టీడీపీ గుండాల దాడిలో గాయపడిన ప్రత్తిపాడు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు దారం అశోక్ కుమార్ యాదవ్, పార్టీ కార్యకర్త లక్ష్మణ్‌ని మాజీ మంత్రి, పార్టీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యురాలు మేకతోటి సుచరిత, ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ఆదివారం పరామర్శించారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి, అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం, సంబంధిత వైద్యాధికారులతో మాట్లాడి అశోక్‌కు అవసరమైన మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

అశోక్‌కుమార్‌ను పరామర్శిస్తున్న సుచరిత, బలసాని

కనుల పండువగా
నృసింహుని తెప్పోత్సవం

పట్టు వస్త్రాలు సమర్పించిన ఇంద్రకీలాద్రి వేదపండితులు

తెప్పోత్సవంలో నృసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

దేపల్లి రూరల్ : ప్రసిద్ధి గాంచిన మంగళగిరి లక్ష్మీ నరసింహస్వామి తెప్పోత్సవం ఆదివారం వేదమంత్రాల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున లక్ష్మీ నరసింహస్వామి వారిని సీతానగరంలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో ఉత్సవ విగ్రహాలు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయవాడ ఇంద్రకీలాద్రి పర్వతంపై వేంచేసి యున్న కనకదుర్గ ఆలయం నుంచి నరసింహస్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం నృసింహస్వామి ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు ప్రకాశం బ్యారేజ్ ఎగువ ప్రాంతానికి తీసుకువెళ్లి ప్రత్యేకంగా అలంకరించిన పంటు వాహనంలో స్వామివారిని ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి తెప్పోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ప్రత్యేక భద్రతా చర్యల మధ్య ఇ.వో. సునీల్‌కుమార్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

తెప్పోత్సవానికి బయలుదేరిన నృసింహస్వామి వారు

కోటప్పకొండలో భక్తుల రద్దీ

నరసరావుపేట రూరల్: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి త్రికోటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా అభిషేక మండపంలో ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణలో త్రికోటేశ్వరస్వామి

పోలీసుల పచ్చపాతం!

● అంబటి ఇంటి వద్ద పోలీసుల ఓవర్ యాక్షన్
● నివాసానికి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు
● నిన్న ఇదంతా ఏమైందంటూ వైఎస్సార్ సీపీ శ్రేణుల నిలదీత
● అంబటి కార్యాలయం, ఇంటి వద్ద పార్టీ నాయకులకు అడ్డంకులు

అంబటి ఇంటి వద్ద ఎగురుతున్న డ్రోన్

అంబటి రాంబాబు ఇంటి వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి వైఎస్సార్ సీపీ నాయకులను, కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

అంబటి ఇంటి వద్ద డ్రోన్ ఎగుర వేస్తూ పర్యవేక్షిస్తున్న కానిస్టేబుల్

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటి వద్ద శనివారం పోలీసులు పూర్తిగా ప్రేక్షక పాత్ర పోషిస్తూ టీడీపీ గూండాలకు అండగా నిలిచారు. అంతులేని నిర్లక్ష్యంగా వ్యవహరించిన అదే పోలీసులు... ఆదివారం ఉదయం నుంచి అంబటి ఇంటి వద్ద ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేసి వైసీసీ శ్రేణులతోపాటు అంబటి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వచ్చే వారిని కూడా అడ్డుకుంటూ అనధికారిక ఆంక్షలు విధించారు. అంబటిపై, ఆయన కార్యాలయంపై, ఇంటిపై, కుటుంబ సభ్యులపై టీడీపీ గూండాలు దాడి చేసిన విషయం తెలుసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల రెడ్డి, మాజీ మంత్రి విడుదల రజిని, వివిధ నియోజకవర్గాల సమన్వయకర్తలు నూరి ఫాతిమా, వనమా బాల వజ్రబాబు, బలసాని కిరణ్, నాయకులు గుజ్జుల నాగార్జునరెడ్డి, పోతుల మహేష్, నాగార్జున యాదవ్, కారుమూరు వెంకటరెడ్డి, గులాం రసూల్, నిమ్మకాయల రాజనారాయణ, కార్పొరేటర్లు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అంబటి ఇంటి వద్దకు చేరుకున్నారు. పోలీసులు అంబటి ఇంటికి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేసి భారీ సంఖ్యలో పోలీసులు మోహరించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులను లోపలికి రానివ్వకుండా అడ్డుకునే యత్నం చేశారు. దీంతో పోలీసులను పార్టీ కార్యకర్తలు నిలదీశారు. శనివారం రాత్రి అంబటి ఇంటి వద్ద సుమారు 7 గంటలకుపైగా టీడీపీ మూకలు విధ్వంసం సృష్టిస్తూ ఉంటే పోలీసు శాఖ వారికి అండగా నిలబడి మరీ దాడులు చేయించిన విషయాన్ని గుర్తుచేశారు. కనీసం అడ్డుకునే యత్నం చేయకుండా వారికి పూర్తి మద్దతుగా నిలిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ బారికేడ్లు అప్పుడు ఏమయ్యాయని నిలదీశారు. పోలీసులు ఇలా శనివారం కూడా వ్యవహరించకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని పేర్కొన్నారు. పక్కా వ్యూహంతోనే ఇంతటి విధ్వంసం సృష్టించారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఇరువైపుల బారికేడ్ల వద్ద లేళ్ళ అప్పిరెడ్డి, నాగార్జున రెడ్డి, బలసాని కిరణ్, గులాం రసూల్‌లను అడ్డుకోవడంతో పార్టీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులు వెంటనే నిలదీయడంతో కార్యకర్తలను ఆపి, నేతలను మాత్రమే లోపలికి పంపించారు.

అంబటిపై రాళ్ల వర్షం.....

అంబటిని అరెస్ట్ చేసేందుకు పోలీసులు వజ్ర వాహనాన్ని ఆయన ఇంటి ముందుకు తీసుకొచ్చారు. టీడీపీ గూండాలను తరిమి కొట్టకుండా రెండు గంటలపాటు అలాగే ఉన్నారు. అంబటిని వాహనంలోకి ఎక్కించలేకపోయారు. తర్వాత రాంబాబు చుట్టూ పోలీసులు రక్షణ వలయంగా ఏర్పడి తీసుకు వెళుతున్న సమయంలో టీడీపీ మూకలు రాళ్లు, సోడా బుడ్డులు విసురుతూ విధ్వంసం సృష్టించారు. వజ్ర వాహనంలోకి పోలీసులు అంబటిని ఎక్కించిన తరువాత కూడా వారు వాహనాన్ని వెంటాడారు. అప్పటికి కూడా పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేయలేదు.

ఇంటి ముందు ఏడున్నర గంటల హైడ్రామా

శనివారం సాయంత్రం 4 గంటల నుంచి తెలుగు దేశం పార్టీ గూండాలు అర్ధరాత్రి 11.45 గంటల వరకు గంటలకుపైగా విధ్వంసం సృష్టించారు. టీడీపీ మూకలు, పార్టీ సామాజిక వర్గ నాయకులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు ఇష్టానుసారంగా అంబటి కార్యాలయం ముందు అసభ్య పదాలతో విరుచుకుపడ్డారు. స్వయంగా దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ కోటేశ్వరరావు మైక్ సెట్‌తో, హిజ్రాలను తీసుకు వచ్చి పశ్చిమ ఎమ్మెల్యే... అంబటి ఇంటి ముందు తిష్ట వేశారు. మైక్‌లో అంబటిని, ఆయన కుటుంబ సభ్యులను అసభ్య పదజాలంతో సంభోదించారు. మరో వైపు టీడీపీ మూకలు గుణపాలు, రాళ్లు, కర్రలతో అంబటి ఇంటిపై, కార్యాలయంపై దాడి చేస్తుంటే పోలీసులు మాత్రం చోద్యం చూశారు. అంబటితోపాటు ఉన్న తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరి ఫాతిమా, రాష్ట్ర కార్యదర్శి గులాం రసూల్, నిమ్మకాయల రాజనారాయణలతోపాటు మరో 50 మంది లోపల బిక్కుబిక్కుమంటూ ఉన్నారు. పోలీసులు లోపలికి వచ్చి లైట్లు ఆపాలని, బయటకు కనిపించకుండా ఉండాలని చెప్పారేగానీ టీడీపీ మూకలను నిలురించేందుకు కనీస ప్రయత్నం కూడా చేయలేదు.

డ్రోన్‌లతో నిఘా

అంబటి ఇంటి వద్దకు భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు చేరుకోవడంతో పోలీసులు భారీ సంఖ్యలో మోహరించడంతోపాటు డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించడంపై పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ డ్రోన్ కెమెరాలో విజువల్స్ ఎవరికి చూపించడానికి లైవ్ కనెక్షన్ పెట్టారంటూ పార్టీ నాయకులు ప్రశ్నించారు. అంబటి ఇంటి ముందు నిలబడి ఓ పోలీస్ కానిస్టేబుల్ డ్రోన్‌ను ఎగురవేస్తూ ఎంతో శ్రద్ధగా వైఎస్సార్ సీపీ నాయకుల వీడియోను, ఫొటోలను తీయడంపై శనివారం ఎందుకు ఇలా కనిపించలేదని మండిపడ్డారు. పోలీసులు చోద్యం చూస్తూ ఉండటంపై ప్రజాసంఘాలు ఆగ్రహించాయి. రాష్ట్రంలో అసలు ఏం జరుగుతోందని నిలదీశారు. రెడ్ బుక్ పాలనను పోలీసులు అనుసరిస్తున్నారా.. అంటూ ప్రజా సంఘాలు పోలీసు శాఖపై మండిపడుతున్నాయి.

మార్కెట్ కమిటీలు డీలా

- ఫీజు వసూలులో వెనుకంజ
- గడిచిన తొమ్మిది నెలల కాలానికి లక్ష్య సాధనలో 47.68 శాతంతో సరి
- ఆర్జేడీ, డీడీఎం, ఏడీఎంల ఉదాసీనతే కారణమని వినిపిస్తున్న విమర్శలు

గుంటూరు మార్కెట్ యార్డు (ఫైల్)

కొరిటెపాడు(గుంటూరు): వివిధ రకాల ఫీజు వసూలులో మార్కెట్ కమిటీలు డీలా పడ్డాయి. తెనాలి, దుగ్గిరాల, పొన్నూరు, మంగళగిరి, ప్రత్తిపాడు మార్కెట్ యార్డుల పరిస్థితి కొంత మేరకు మెరుగ్గానే ఉన్నా.. మిగిలిన తాడికొండ, ఫిరంగిపురం, గుంటూరు మార్కెట్ కమిటీల్లో వసూళ్లు బాగా తగ్గాయి. గుంటూరు జిల్లాలో ఉన్న 8 మార్కెట్ కమిటీలు, వాటి పరిధిలో ఉన్న 15 చెక్ పోస్టుల ద్వారా ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరానికి వివిధ రకాల ఫీజులు, అద్దెలు, సంతల ద్వారా రూ.146.31 కోట్లు వసూలు చేయాలని దిశానిర్దేశం చేశారు.

- డిసెంబర్ మాసం చివరి నాటికి అంటే తొమ్మిది నెలల కాలానికి 47.68 శాతంతో రూ.69.76 కోట్లు వసూలయ్యాయి. ఇందులో రూ.51.15 కోట్లు గుంటూరు మార్కెట్ కమిటీ నుంచి వసూలు కాగా మిగిలిన ఏడు మార్కెట్ కమిటీల ద్వారా కేవలం రూ.18.61 కోట్లు వసూలు కావడం విశేషం.
- గుంటూరు మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.115 కోట్లు కాగా, ఇప్పటి వరకు 44.48 శాతంతో రూ.51.15 కోట్లు సాధించారు.
- దుగ్గిరాల లక్ష్యం రూ.3.75 కోట్లు కాగా 74.23 శాతంతో రూ.2.78 కోట్లు వసూలు చేసి అగ్రస్థానంలో కొనసాగుతోంది.
- తెనాలి లక్ష్యం రూ.7.65 కోట్లు కాగా 72 శాతంతో రూ.5.54 కోట్లు, పొన్నూరు లక్ష్యం రూ.8.38 కోట్లు కాగా 62.51 శాతంతో రూ.5.24 కోట్లు, ప్రత్తిపాడు లక్ష్యం రూ.4.45 కోట్లు కాగా 57.87 శాతంతో రూ.2.58 కోట్లు, ఫిరంగిపురం లక్ష్యం రూ.1.88 కోట్లు కాగా 24.90 శాతంతో రూ.0.47 కోట్లు, మంగళగిరి లక్ష్యం రూ.3.03 కోట్లు కాగా 59.87 శాతంతో రూ.1.81 కోట్లు, తాడికొండ లక్ష్యం రూ.2.17 కోట్లు కాగా 8.98 శాతంతో రూ.0.19 కోట్లు వసూలు చేశాయి.
- గత ఏడాది ఇదే సమయానికి రూ.83.44 కోట్లు మార్కెట్ ఫీజు వసూలు చేస్తే ఈ ఏడాది రూ.69.76 కోట్లు మాత్రమే వసూలు కావడం గమనార్హం.
- గత ఆర్థిక సంవత్సరంలో కన్నా ఈ ఏడాది రూ.13.68 కోట్లు మార్కెట్ ఫీజు వసూలు తగ్గింది. ఈ నేపథ్యంలోనే లక్ష్య సాధన దిశగా నడిపించడంలో ఆర్జేడీ, డీడీఎం, ఏడీఎంలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

క్లుప్తంగా

ఉద్యోగ, ఉపాధ్యాయులను నిరాశపరిచిన కేంద్ర బడ్జెట్

ఏపీటీఎఫ్ నేతలు

గుంటూరు ఎడ్యుకేషన్: పార్లమెంటులో ఆదివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ఉద్యోగ, ఉపాధ్యాయులను నిరాశపర్చిందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగా రావు, మహమ్మద్ ఖాలీద్ ఒక ప్రకటనలో తెలిపారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ఆకాశాన్ని తాకుతున్న నిత్యావసరాల ధరలతో ఆదాయపు పన్ను పరిధి పెంపుతారని ఆశించిన మధ్యతరగతి, వేతన జీవులకు ఈ బడ్జెట్ పెద్ద షాక్ ఇచ్చిందన్నారు. పన్ను శ్లాబుల్లో ఎటువంటి మార్పు చేయకపోవడం, స్టాండర్డ్ డిడక్షన్ను పెంచకపోవడంతో అదనపు భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 8వ వేతన సంఘ నిర్ణయాల ఊసే లేకపోవడం, కేంద్ర ప్రభుత్వానికి ఉద్యోగులపై ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. విద్యారంగానికి బడ్జెట్లో ఆశించిన స్థాయిలో కేటాయింపులు జరగలేదని, రూ.1.39 లక్షల కోట్లు నామమాత్రమేనని, ఇది జీడీపీలో కనీసం 6 శాతానికి ఉండాలన్న నిపుణుల సూచనలను తుంగలో తొక్కినట్లు ఉందని పేర్కొన్నారు. డిజిటల్ ఎడ్యుకేషన్ ప్రచారానికే ప్రచారానికే పరిమితమవగా, క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి నిధులు కరువయ్యాయన్నారు. అదే విధంగా బడ్జెట్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు తీవ్ర నిరాశ కలిగిందని ఏపీటీఎఫ్ (1938) రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు విమర్శించారు.

గ్రామస్థాయి నుంచి రైతులు ఉద్యమించాలి

మాట్లాడుతున్న ఏఐకేఎస్ ఫైనాన్స్ సెక్రటరీ కృష్ణ ప్రసాద్, వేదికపై మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, రైతు సంఘ నాయకులు

ఏఐకేఎస్ ఫైనాన్స్ సెక్రటరీ కృష్ణ ప్రసాద్

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ విధానం తొలగిపోవాలంటే రైతులు గ్రామస్థాయి నుంచి ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అఖిలభారత కిసాన్ సభ ఫైనాన్స్ సెక్రటరీ కృష్ణ ప్రసాద్ చెప్పారు. ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం రాత్రి ఏపీ కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు అధ్యక్షతన 'కార్పొరేట్ వ్యవసాయం – రైతాంగం పై ప్రభావం' అనే అంశంపై జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. ఏ పంట వెయ్యాలో రైతులకు కార్పొరేట్లే దిశా నిర్దేశం చేస్తున్నారని తెలిపారు. ఎక్కువ విస్తీర్ణంలో ఒకే పంట పండించడం వల్ల ధరలు తగ్గి రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ఇందుకు గుంటూరులో గత రెండేళ్ల కాలంలో మిర్చి ధరల హెచ్చుతగ్గులే నిదర్శనం అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా గ్రామస్థాయి నుంచి ఉద్యమాలు రావాలన్నారు. 'కేంద్ర బహుళ సహకార చట్టం – రైతాంగం పై ప్రభావం' అనే అంశంపై రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకుడు వై. కేశవరావు, 'వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి –సాగునీటి ప్రాజెక్టుల ఆవశ్యకత' అనే అంశంపై ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు డి.హరనాథ్ తదితరులు ప్రసంగించారు.

5న ఏఐ-జాక్టో ఆధ్వర్యంలో 'మార్చ్ టు పార్లమెంట్'

మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మల్లు రఘునాథరెడ్డి, పక్కన కత్తి నరసింహారెడ్డి, నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: దేశవ్యాప్తంగా ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ జాతీయస్థాయిలో ఏడు ప్రధాన ఉపాధ్యాయ సంఘాలతో ఆవిర్భవించిన ఏఐ - జాక్టో ఆధ్వర్యంలో ఈనెల 5న చేపడుతున్న మార్చ్ టు పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐఎస్టీఎఫ్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మల్లు రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం గుంటూరు కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్లో ఎస్టీయూ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యవర్గ సమావేశాన్ని సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు షేక్ బాజీ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఇరువురు నాయకులు మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత నుంచి మినహాయింపు ఇవ్వాలని, పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో చట్ట సవరణ దిశగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ జాతీయ స్థాయిలో ఉమ్మడి పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. దేశవ్యాప్తంగా ఏకోపాధ్యాయ పాఠశాలలు 1,04,125 ఉండగా, మన రాష్ట్రంలో 12,912 ఏకోపాధ్యాయ పాఠశాలలతో దేశంలో ప్రథమ స్థానంలో ఉందన్నారు. బోధన కోసమే నియమించబడిన ఉపాధ్యాయులతో బోధనేతర కార్యక్రమాల భారం పెంచటం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, 12వ పీఆర్సీ కమిటీ ఏర్పాటు, 30 శాతం మధ్యంతర భృతి మంజూరు చేయాలన్నారు. ఈనెల 10న జిల్లా కలెక్టరేట్ల దగ్గర చేపడుతున్న ధర్నాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసెఫ్ సుధీర్బాబు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు డి.పెదబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాకుమాను జోజప్ప, ఎం.శ్రీధర్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్యాంబాబు, ఉమ్మడి గుంటూరు జిల్లా, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో గుంటూరు వైద్యుడి ప్రతిభ

- అరుదైన రికార్డు సృష్టించిన స్పయిన్ సర్జన్ డాక్టర్ నరేష్బాబు
- ఒకేసారి రెండు జాతీయ అవార్డులు సొంతం

జాతీయ అవార్డులు అందుకుంటున్న డాక్టర్ జె.నరేష్బాబు

గుంటూరు మెడికల్: వెన్నుముక పరిశోధనల్లో జాతీయ స్థాయిలో గుంటూరు వైద్యుడు ప్రతిభ చూపించి రెండు జాతీయ అవార్డులు ఒకేసారి సొంతం చేసుకుని అరుదైన రికార్డు సృష్టించారు. గుంటూరుకు చెందిన సీనియర్ స్పయిన్ సర్జన్, మల్లిక సెంటర్ అధినేత డాక్టర్ జె.నరేష్బాబు వెన్నుపై చేసిన పరిశోధనలకు రెండు జాతీయ అవార్డులు సొంతం చేసుకున్నారు. ఆదివారం గుంటూరు కొత్తపేటలోని మల్లిక స్పయిన్ సెంటర్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు ఆయన మీడియాకు వెల్లడించారు.

ప్రతిష్టాత్మక అస్సి బేసిక్ స్పయిన్ రీసెర్చ్ అవార్డు ..

అసోసియేషన్ ఆఫ్ స్పయిన్ సర్జన్స్ ఆఫ్ ఇండియా గత వారం పూణేలో నిర్వహించిన స్పయిన్ సర్జన్స్ 2026 జాతీయ సదస్సులో మల్లిక స్పయిన్ సెంటర్ అరుదైన ఘనత సాధించింది. ఎంఆర్ఐలో కంటికి కనిపించని మార్పులను రేడియోమిక్స్అనే ఆర్టిఫి షల్ ఇంటెలిజెన్స్ విధానాన్ని వాడడం ద్వారా డిస్క్ అరుగుదలను ముందుగానే గుర్తించి నివారణోపాయాలను సూచించవచ్చు అని నిరూపించిన పరిశోధనకు అత్యంత ప్రతిష్టాత్మక అస్సి బేసిక్ స్పయిన్ రీసెర్చ్ అవార్డు 2026ను నరేష్ బాబు అందుకున్నారు. బేసిక్ స్పయిన్ రీసెర్చ్ అవార్డు తో పాటు క్లినికల్ స్పయిన్ రీసెర్చ్ అవార్డు కూడా మల్లిక స్పయిన్ సెంటర్ గెలుచుకోవడం విశేషం. ఒకే సమయంలో ఈ రెండింటినీ సొంతం చేసుకున్న తొలి స్పయిన్ సెంటర్గా గుంటూరు మల్లిక స్పయిన్ సెంటర్ రెండు తెలుగు రాష్ట్రాలలో చరిత్ర సృష్టించింది. సదస్సులో మల్లిక స్పయిన్ సెంటర్ నుంచి మొత్తం 11 పోడియం ప్రెజెంటేషన్లు జరగడం విశేషం. ఈ సందర్భంగా మల్లిక స్పయిన్ సెంటర్ చీఫ్ ఆఫ్ స్పయిన్ సర్వీసెస్ డాక్టర్ జె.నరేష్ బాబు మాట్లాడుతూ ఈ విజయాలు మొత్తం వైద్య బృందం, సహాయక సిబ్బంది అందరి కృషికి ప్రతిఫలమని పేర్కొన్నారు. అవార్డు గెలుచుకున్న తమ విద్యార్థి డాక్టర్ పృథ్వీకుమార్ రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

ఏఐ ఆలంబనగా సాయిశ్రీకర్ సృజన

అచ్యుతుని సాయిశ్రీకర్

SOMETHING SPECIAL

తెనాలి: కత్తితో కూరగాయలు కోసుకోవచ్చు...అదే కత్తితో పీకలు కోయొచ్చు...అంటారు! సోషల్మీడియా కూడా అటువంటిదే. ఎందరో దుర్వినియోగం చేసుకుంటూ జీవితాలను పాడు చేసుకుంటున్నారు. కొందరు ప్రాణాలను కోల్పోతున్నారు. సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకుంటే ఎన్నో సాధించవచ్చు...ఎందరి ప్రశంసలనో అందుకోవచ్చు...జీవితానికో బాట వేసుకోవచ్చు... అనేందుకు ఎన్నో ఉదాహరణలు. తెనాలి నాజరుపేటకు చెందిన అచ్యుతుని సాయిశ్రీకర్ ఇందుకో నిదర్శనం. బీకాం చదివి, షార్ట్హ్యాండ్ ఉత్తీర్ణుడైన సాయి శ్రీకర్ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఔట్సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. షార్ట్హ్యాండ్, కంప్యూటర్ పరిజ్ఞానం మెండుగా ఉన్న ఈ యువకుడి దృష్టి, ఇటీవల అత్యంత ప్రాచుర్యంలోకి వచ్చిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై పడింది. స్వయంగా అధ్యయనం చేశాడు. తెలుగు భాషా పరిజ్ఞానం, పదాలతో పట్టు కలిగిన సాయి శ్రీకర్ తెలుగులో కవితాగానం చేయగలడు. కమ్మని పాటలను రచించగలడు. తన భాషా ప్రావీణ్యానికి ఏఐని ఆలంబన చేసుకున్నాడు. చక్కని పాట రాయడం, ఏఐతో ఆ పాటకు గానం, సంగీతం సమకూర్చటం, వీడియో ఎడిటింగ్ ప్రవేశం కూడా ఉండటంతో ఆ పాటకు సందర్భోచితమైన వీడియోలను తానే జత చేస్తున్నాడు. సినిమా పాటలను పోలిన గీతాలతో ఇప్పుడు అందరినీ ఆకర్షిస్తున్నాడు. ఎవరి సాయం లేకుండా స్వయంసాధనతో చేసిన కృషికి అద్భుతమైన ప్రశంసలను అందుకుంటున్నాడు. తన తండ్రి జర్నలిస్టు కావటంతో తెలుగు పదాలతో చక్కని పాటలను రూపకల్పన చేయగలుగుతున్నానని తెలిపారు. నటన, సినిమా రంగంపై అభిలాష కలిగిన తాను, గీత రచయితగానూ అదృష్టాన్ని పరీక్షించుకోవాలనే భావనతో ఉన్నట్టు చెప్పాడు. ...మనమూ బెస్టాఫ్ లక్ చెబుదాం...

ఆర్ఓబీ స్థలసేకరణకు నోటిఫికేషన్ జారీ

గుంటూరు రూరల్: మండలంలోని చిన్నపలకలూరు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నంబరు 6 నిర్మాణానికి స్థల సేకరణకు రైల్వేశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. 1.2693 హెక్టార్ల భూమిని సేకరించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఇందులో ప్రభుత్వ భూమితో పాటు పట్టా భూములు కూడా ఉన్నాయి. సర్వే నంబర్ 98, 99, 100, 106, 107, 110, 117లోని పట్టా భూములు సేకరించనున్నారని సమాచారం. 108లోని 0.3133 హెక్టార్లు, 120 సర్వే నంబర్ 0.4668 హెక్టార్ల ప్రభుత్వ భూమి ఉంది. నోటిఫికేషన్ వెలువడిన నాటినుంచి 30 రోజుల్లోగా అభ్యంతరాలు తెలపవచ్చని అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పోలీసుల అదుపులో మాజీ ఎంపీపీ!

- ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానని హామీ
- నగదు తీసుకుని మోసం చేశారంటూ ఫిర్యాదు

మంగళగిరి టౌన్: మంగళగిరి మాజీ ఎంపీపీ మున్నంగి గోపిరెడ్డిని కర్నూలు పట్టణ 3వ పోలీస్ స్టేషన్ పోలీసులు శనివారం మంగళగిరిలో అదుపులోకి తీసుకున్నారు. సేకరించిన వివరాల మేరకు కర్నూలు పట్టణానికి చెందిన నేశిపోగు కిరణ్మయికి కర్నూలు పార్లమెంట్ పరిధిలో ఎమ్మెల్యే సీటు ఇప్పిస్తానంటూ కర్నూలుకు చెందిన అజయ్ మాథ్యూ మంగళగిరికి చెందిన మాజీ ఎంపీపీ గోపిరెడ్డిలు ఆమె వద్ద రూ.3కోట్లు తీసుకున్నారు. 2024 ఎన్నికల్లో ఎక్కడా ఎమ్మెల్యే టికెట్ ఇప్పించకపోవడంతో తన డబ్బును తిరిగి ఇవ్వమని కోరింది. వారి నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో కర్నూలు పట్టణం 3వ పోలీస్స్టేషన్లో కిరణ్మయి ఇటీవల ఫిర్యాదు చేసింది. జనవరి 30వ తేదీన కర్నూలు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా మంగళగిరిలో నివాసముంటున్న మున్నంగి గోపిరెడ్డిని శనివారం అదుపులోకి తీసుకుని కర్నూలుకు తీసుకువెళ్లి విచారిస్తున్నట్లు సమాచారం.

ఉద్దేశపూర్వకంగా ఇరికించారు..

కర్నూలు పట్టణం 3వ పోలీస్ స్టేషన్లో కిరణ్మయి అనే మహిళ పెట్టిన కేసులో తనకు ఎటువంటి సంబంధం లేదని మంగళగిరి మాజీ ఎంపీపీ మున్నంగి గోపిరెడ్డి వివరణ ఇచ్చారు. ఈ కేసు విషయమై ఆదివారం కర్నూలు పోలీస్స్టేషన్లో అధికారులకు వివరణ ఇవ్వడం జరిగిందని, తనను అరెస్ట్ చేశారనేది అసత్య ప్రచారమని, ప్రజాప్రయోజనాల దృష్ట్యా కోర్టులో పిటీషన్ వేశానని, దానిని మనసులో పెట్టుకుని పలువురు నాయకులు తనను ఈ కేసులో ఉద్దేశపూర్వకంగా ఇరికించారని తెలిపారు. దీనిపై త్వరలో మీడియా సమావేశం ఏర్పాటు చేస్తానని స్పష్టం చేశారు.

గంజాయి దాడులను ప్రభుత్వాలు కట్టడి చేయాలి

తాడేపల్లి రూరల్: రెండు తెలుగు రాష్ట్రాల్లో గంజాయి దాడులు ఎక్కువయ్యాయని.. ఇద్దరు ముఖ్యమంత్రులు గంజాయిని నివారించి అమాయక ప్రజలు, ఉద్యోగులపై దాడులు జరగకుండా కాపాడాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు శ్రీదేవి, సావిత్రి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య స్మగ్లర్ల దాడిలో మరణించారని.. ఆమె స్వగ్రామం నిజామాబాద్ జిల్లా మోస్రా మండల కేంద్రమని అన్నారు. ఆమె తల్లిదండ్రులు మసాలా పొడులు తయారు చేస్తూ జీవిస్తున్నారని తెలిపారు. సౌమ్య కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం రూ.కోటి పరిహారం, ఉద్యోగం ఇస్తామని ప్రకటించినట్లు పేర్కొన్నారు. నెల్లూరు జిల్లాలో పెంచలయ్యను గంజాయి స్మగ్లర్ దాడి చేసి హత్యచేయడం సంచలనం రేకెత్తించిందని.. ప్రభుత్వం పెంచలయ్య కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పినా ఇప్పటి వరకు ఆయన భార్య, కుటుంబాన్ని పరామర్శించలేదని విమర్శించారు. మద్యం, గంజాయి, మాదక ద్రవ్యాలను అరికట్టకపోతే పెద్ద ఎత్తున రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆందోళన చేస్తామని వారు ఆ ప్రకటనలో హెచ్చరించారు.

మద్యానికి డబ్బు దొరక్క కూలీ ఆత్మహత్య

తెనాలిరూరల్: మద్యానికి డబ్బు దొరక్క కూలీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. తెనాలి మారిస్పేట సీఎం కాలనీకి చెందిన దేవరకొండ వెంకటేష్(32)కు 12 ఏళ్ల క్రితం వివాహమై భార్య, పిల్లలతో కలసి తాడేపల్లిలో నివసించేవాడు. కూలి పనులు చేసుకునే వెంకటేష్ మద్యానికి బానిసై తరచూ భార్యతో ఘర్షణ పడుతూ ఉండేవాడు. ఆరు నెలల క్రితం కుమారుడిని తీసుకుని వచ్చి ఇక్కడి సీఎం కాలనీలో తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. జనవరి 30న మద్యానికి డబ్బులు కావాలని తల్లిదండ్రులను అడగ్గా వారు లేవని చెప్పారు. ఎలుకల మందు తిన్న అతని 31వ తేదీ ఉదయం కడుపులో మంటగా ఉందని చెప్పడంతో కుటుంబసభ్యులు తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారంతో త్రీ టౌన్ పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిభావంతులు సమాజాభివృద్ధికి తోడ్పడాలి

- తులసి గ్రూప్ కంపెనీస్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు
- 270 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ

విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేస్తున్న తులసి రామచంద్ర ప్రభు, ఉగ్గిరాల సీతారామయ్య, నరేంద్ర

కొరిటెపాడు(గుంటూరు): దాతల సహకారంతో ఉపకార వేతనాలు పొందిన విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకున్నాక సమాజాభివృద్ధికి తమవంతు తోడ్పాటు అందించాలని తులసి గ్రూప్ కంపెనీస్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు అన్నారు. ఆదివారం గుంటూరు నగరం ఆర్.అగ్రహారంలోని రామనామ క్షేత్రం ప్రాంగణంలో కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలైజ్డ్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం తులసి రామచంద్ర ప్రభు, ట్రస్టు సభ్యుల చేతుల మీదుగా జరిగింది. 270 మంది విద్యార్థులకు రూ.12,12,500 చెక్కుల రూపంలో ఉపకార వేతనాలను అందజేశారు. తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ 1995-96లో ఇద్దరు విద్యార్థులతో మొదలుపెట్టి నేటికి సుమారు 40 వేల మంది విద్యార్థులకు రూ.23 కోట్లు ఉపకార వేతనాలుగా ట్రస్టు ద్వారా పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. దీనికి మేజర్ కాంట్రిబ్యూషన్ తులసి సీడ్స్ సమకూరుస్తుందని, దీంతో పాటు నగరంలోని కొంతమంది సమాజ హితం కోరే పెద్దలు ఈ కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలైజ్డ్ ట్రస్టులో సభ్యులుగా చేరి సహాయ సహకారాలు అందిస్తున్నారని వెల్లడించారు. అనంతరం విద్యార్థులకు ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు తులసి రామచంద్ర ప్రభును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏటుకూరు మాజీ సర్పంచ్ ఉగ్గిరాల సీతారామయ్య, ట్రస్ట్ సభ్యులు నారదాసు శ్రీహరిరావు, తిమ్మిశెట్టి నారాయణరావు, పసుపులేటి రమణయ్య, అంకిరెడ్డి సాంబశివరావు, నారదాసు కోటేశ్వరరావు, పుచ్చకాయల ఆనంద్, కనదం నరేంద్రనాథ్, దళవాయి సుబ్రమణ్యం, మిరియాల శ్రీనివాస్, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank
భారత ప్రభుత్వ రంగ సంస్థ A Government of India Undertaking

ప్రాంతీయ కార్యాలయం : గుంటూరు
విజయపురి 5వ లేను ఎదురుగా, జెకెసి కాలేజ్ రోడ్డు, గుంటూరు-522006, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

స్థిరాస్తులు అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్మెంట్) రూల్సు, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్, తెనాలి-I బ్రాంచ్ (0774) వారికి ఋణగ్రహీత(లు): M/s సౌందర్య జ్యూయలర్స్, ప్రాతినిధ్యం వహిస్తున్నవారు ప్రొప్రయిటర్ : శ్రీ సీదా దేవి శివ సాయి ప్రకాష్ గారు చెల్లించవలిసిన బకాయి రూ. 5,84,635.28/- (అక్షరాల ఐదు లక్షల ఎనభై నాలుగు వేల ఆరు వందల ముప్పై ఐదు రూపాయల ఇరవై ఎనిమిది పైసలు) + తేది 31.12.2025 నుండి తదుపరి వడ్డీ మరియు ఛార్జీలు మొత్తమును రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్, తెనాలి-I బ్రాంచ్ (0774) అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్కు ఛార్జ్/తనఖాపెట్టిన దిగువ వివరించిన స్థిరాస్తిని తేది 10.03.2026 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని ప్రజానీకానికి మరియు ముఖ్యంగా పైన తెలిపిన ఋణగ్రహీతలు & హామీదారులకు తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది & సమయం: 10.03.2026, మ॥ 02.00 గం. నుండి సా॥ 4:00 గం. వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్లో నేరుగా గాని లేదా ధరావత్తును RTGS/NEFT ద్వారా చలాన్లోని ఖాతా వివరములుకు తేది: 10.03.2026, మ॥ 12.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

ఒకవేళ ఎన్కంబ్రెన్స్లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:
గుంటూరు జిల్లా, తెనాలి సబ్ జిల్లా, తెనాలి మున్సిపాలిటీ, 14వ బ్లాక్, 2వ వార్డు, తెనాలి టౌన్, సమీప డోర్ నెం.14-64-7/A, 1464-4/1/5, తెనాలి యొక్క డి నెం.449/5 సందు విస్తీర్ణం 205-2 చ॥గ॥లులోని రెసిడెన్షియల్ ఆర్సిసి రూఫ్ గ్రౌండ్ & మొదటి అంతస్తు భవనం. హద్దులు : తూర్పు : షేక్ అబ్దుల్ రెహమాన్ గారి ఆస్తి 38-09 అ॥లు, దక్షిణం : చల్లా సుబ్బారావు గారి ఆస్తి 46-0 అ॥లు, పడమర : వాసల సాంబయ్య గారి ఆస్తి 39-06 అ॥లు, ఉత్తరం : 3 అ॥ల రోడ్డు కొంతవరకు మరియు మొహమ్మద్ ముస్తాఫా మాల్ పాషా గారి ఆస్తి కొంతవరకు 48-04 అ॥లు.

రిజర్వు ధర: రూ. 72,00,000/- **ధరావత్తు సొమ్ము: రూ. 7,20,000/-**

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, తెనాలి-I బ్రాంచ్ (0774), మేనేజర్ గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 83310 15702.
ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్బి అలయన్స్ (Baanknet), వెబ్పోర్టల్ https://baanknet.com, హెల్ప్డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com.

తేది: 30.01.2026, ప్రదేశం: గుంటూరు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank
భారత ప్రభుత్వ రంగ సంస్థ A Government of India Undertaking

ప్రాంతీయ కార్యాలయం : గుంటూరు
విజయపురి 5వ లేను ఎదురుగా, జెకెసి కాలేజ్ రోడ్డు, గుంటూరు-522006, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

స్థిరాస్తులు అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్మెంట్) రూల్సు, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్, బృందావన్ గార్డెన్స్ బ్రాంచ్ (13276) వారికి ఋణగ్రహీత(లు): శ్రీ షేక్ మోయినుద్దీన్ మరియు శ్రీమతి షేక్ నసీమ్ అరా చెల్లించవలిసిన బకాయి రూ. 33,12,829.96/- (అక్షరాల ముప్పై మూడు లక్షల పన్నెండు వేల ఎనిమిది వందల ఇరవై తొమ్మిది రూపాయల తొంభై ఆరు పైసలు) + తేది 31.12.2025 నుండి తదుపరి వడ్డీ మరియు ఛార్జీలు మొత్తమును రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్, బృందావన్ గార్డెన్స్ బ్రాంచ్ (13276) అధీకృత అధికారిచే నిర్మాణాత్మక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్కు ఛార్జ్/తనఖాపెట్టిన దిగువ వివరించిన స్థిరాస్తిని తేది 20.02.2026 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని ప్రజానీకానికి మరియు ముఖ్యంగా పైన తెలిపిన ఋణగ్రహీతలు & హామీదారులకు తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది & సమయం: 20.02.2026, మ॥ 02.00 గం. నుండి సా॥ 4:00 గం. వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్లో నేరుగా గాని లేదా ధరావత్తును RTGS/NEFT ద్వారా చలాన్లోని ఖాతా వివరములుకు తేది: 20.02.2026, మ॥ 12.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

ఒకవేళ ఎన్కంబ్రెన్స్లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:
ఎ షెడ్యూల్: గుంటూరు జిల్లా, గుంటూరు సబ్-జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, కంకరగుంట ఏరియా, మున్సిపల్ పాత వార్డ్ నెం. 17, బ్లాక్ నెం. 4, డోర్ నెం. 28-1-79, టి.యస్.నెం. 67, సబ్ డివిజన్ సర్వే నెం. 67/1 మరియు 67/2 లో 541-5 చ॥గ॥ల స్థలం మరియు MID సిటీ అపార్ట్మెంట్ హద్దులు: తూర్పు: ప్రభుత్వ డొంకా - 63-9 అ॥లు, దక్షిణం: 15 అ॥లు గల్లి బజార్ - 93-6 అ॥లు, పడమర: పొచిపులుసు సుబ్రహ్మణ్యం ఆస్తి - 35-6 అ॥లు, ఉత్తరం: పుదోట సుబ్బయ్య యొక్క ఆస్తి - 103-0 అ॥లు.
బి షెడ్యూల్: అవిభాజ్యపు మరియు అనిర్దేశపు స్థలం 67.6875 చ॥గ॥ లేదా 56.59 చ॥మీ॥ వాటాతో "మిడ్ సిటీ హోమ్స్", 2వ అంతస్తు సందు ఫ్లాట్ నెం. 301. హద్దులు: తూర్పు: గ్రౌండ్లో ఒపెన్ ఏరియా, దక్షిణం: మున్సిపల్ రోడ్డు అనుకొని గ్రౌండ్లో ఒపెన్ ఏరియా, పడమర: ఉమ్మడి మెట్లు ఉమ్మడి వరండా మరియు ఉమ్మడి లిఫ్ట్, ఉత్తరం: గ్రౌండ్లో ఒపెన్ ఏరియా. ఈ హద్దులలో నిర్మించిన అపార్ట్మెంట్ "మిడ్ సిటీ హోమ్స్", 2వ అంతస్తు, ప్లింత్ ఏరియా 1500 చ॥అ॥ (ఉమ్మడి ఏరియాలు కలుపుకొని) ఫ్లాట్ నెం. 301 ఉమ్మడి సౌకర్యాలతో మరియు ఉమ్మడి దారి హక్కులతో, స్టిల్ట్ ఫ్లోర్లో ఒక కారు పార్కింగ్ & ఉమ్మడి పార్కింగ్ సౌకర్యాలతో.

రిజర్వు ధర: రూ. 44,30,000/- **ధరావత్తు సొమ్ము: రూ. 4,43,000/-**

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, బృందావన్ గార్డెన్స్ బ్రాంచ్ (13276). మేనేజర్ గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 9440905117.
ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్బి అలయన్స్ (Baanknet), వెబ్పోర్టల్ https://baanknet.com, హెల్ప్డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com.

తేది: 30.01.2026, ప్రదేశం: గుంటూరు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

GOLD FINANCE

- బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071 [G-370]
- బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టు లో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు.తీసుకుంటాం ✆ 83338 33368 [B-2676]
- బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు. కొనబడును సంప్ర॥✆ 87907 41166 [B-707]

WANTED

- గుంటూరు మాస్టర్మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్ఛార్జెస్ వార్డెన్స్గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12,000/- నుండి 15,000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు : 22 సంవత్సరములపైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్ : 8978480435 [G-6440]
- గుంటూరు మాస్టర్మైండ్స్ కాలేజి నందు SR Construction Site Inchargesగా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 35,000/- నుండి 45,000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: Civil Diploma మరియు Civil Engineering, వయస్సు : 30 సంవత్సరములపైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్ : 8978480429 [G-6442]
- గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు విశ్రాంత ఉద్యోగులు, హౌస్ వైఫ్స్, 10th పాస్, 50సం॥ వయస్సు వారు కావలెను. 7036761665 [G-779407]
- AGM / RM / BM కావలెను. P.G, వివిధ రంగాలలో 10సం॥ అనుభవం, 45సం॥లోపు వారు గుంటూరులో పనిచేయుటకు రెజ్యూములను kamathamjob@gmail.comకు పంపగలరు. [G-518]
- ఫ్రీ కంప్యూటర్ స్పోకెన్ ఇంగ్లీష్, MS ఆఫీస్ కోర్సు 3నెలల శిక్షణఇచ్చి జాబ్ చూపబడును. ఫ్రీ భోజనం & హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ. వ:18-28 సం॥లోపు ✆ 9133444985 / 89 [G-779321]
- తెనాలి, మంగళగిరి ఏరియాలో పురుగు మందు కంపెనీలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అ:డిగ్రీ, జీ: 15000+3000. సంప్ర: 91214 69383 [SCA26011523]
- తెనాలి రేపల్లె గుంటూరులో పని చేయుటకు ఆయాలు నర్సులు కేర్ టేకర్స్ (M/F) కావలెను. జీతం: 18000/-. సం॥ 7991523705, 7893145549 [SCA26011529]
- గుంటూరులో గల నర్సింగ్ కాలేజి నందు పని చేయుటకు ఆటో, కారు నడుపుటకు డ్రైవర్ కావలెను. ఆకర్షణీయమైన జీతము ఇవ్వబడును. వివరముల కొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్ : 8122461164 [G-6437]
- తుమ్మలపాలెం ప్రముఖ కంపెనీలో ASO లుగా పనిచేయుటకు Ex సర్వీస్మెన్లు కావలెను. మంచి జీతం PF / ESI Q:12th, 26రో 8గం॥వ.48 లోపు ✆ 944185 3786 [B-755644]
- డ్వాక్రా మహిళలకు, నిరుద్యోగులకు ఇంట్లో ఉంటూ పెట్టుబడి మీరే పెట్టుకొని కొవ్వొత్తులు, పెన్సిల్స్ తయారుచేసి మాకు ఇవ్వండి వీక్లీ పేమెంట్ 9640729906 [SCA26011554]

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4లైన్లు)
ప్రతి అదనపు లైను రూ॥100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
ఈ సెక్షన్లో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

అంబటిపై దాడి హేయం

ఫిరంగిపురం: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ఆయన కుటుంబ సభ్యులపై కూటమి నాయకులు దాడి చేయడం హేయమని జెడ్పీటీసీ సభ్యురాలు, పార్టీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి దాసరి కత్తిరేణమ్మ అన్నారు. మండల కేంద్రం లోని శాంతిపేటలో గల తన నివాసంలో ఆదివారం ఆమె మాట్లాడారు. తిరుపతి లడ్డూ ప్రసాదంలో కల్తీ లేదనే విషయాన్ని సీబీఐ చెప్పడంతో దానిపై పార్టీ అధినాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో గోరంట్లలోని ఆలయంలో పూజా కార్యక్రమంలో అంబటి పాల్గొన్నారని వివరించారు. ఈ క్రమంలో అంబటి రాంబాబు కారుపై టీడీపీ నేతలు దాడి చేసి కారు అద్దాలు పగులగొట్టడం సరి కాదన్నారు. ఆ సమయంలో అక్కడనే ఉన్న పోలీసులు టీడీపీ నేతలకు వత్తాసుగా వ్యవహరించడం దారుణమన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందనేందుకు ఇదొక ఉదాహరణగా చెప్పొచ్చన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆమె పేర్కొన్నారు.

శివభక్త బృందం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం

మంగళగిరి టౌన్: మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం వద్ద ఆదివారం శివభక్త బృందం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. శివభక్త బృందం ప్రతినిధులు మాట్లాడుతూ.. సుమారు 35 ఏళ్ల నుంచి ప్రతినెలా మొదటి ఆదివారం భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అన్నదాన కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో శివభక్త బృందం ప్రతినిధులు రామకృష్ణ, వెంకటరెడ్డి, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరుపతమ్మ కల్యాణం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గోపయ్య సమేత శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ 24వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు వెలగలేటి పూర్ణ నాగసాయి చారి, ఉదయభాస్కర్‌లు సుప్రభాత సేవలు చేసి ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం అష్టోత్తర, సహస్ర నామాలతో కుంకుమ, పుష్పార్చనలు చేశారు. ముఖమండపం వద్ద ఏర్పాటు చేసిన యాగశాలలో గణపతి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. గోపయ్య సమేత శ్రీలక్ష్మీ తిరుపతమ్మ శాంతి కల్యాణం చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. దేవస్థాన పాలకవర్గం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాలను పాలకవర్గ నిర్వాహకుడు టి.గోవింద్ పర్యవేక్షించారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం నుంచి శుక్రవారం వరకూ ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.శివసుబ్రహ్మణ్యం తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో శిశువు నుంచి 15 ఏళ్ల లోపు వారికి ఈ క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. 2, 3 తేదీల్లో కండ్రిక పంచాయతీ కార్యాలయం, పొనుగుపాడు జెడ్పీ హైస్కూల్, అమీనాబాద్ ఎంపీపీఎస్(హెచ్ఈ)లో క్యాంపులు ఉంటాయన్నారు. 2 నుంచి 6వ తేదీ వరకు ఫిరంగిపురం మార్నింగ్‌స్టార్ కళాశాలలో, 4, 5 తేదీల్లో బేతపూడి పంచాయతీ, 4న మేరికపూడి సచివాలయం, 5న జెడ్పీ హైస్కూల్ నుదురుపాడు, 6న 113.తాళ్లూరు, తక్కెళ్లపాడు సచివాలయం, 4 5, 6 తేదీల్లో వేములూరిపాడు జెడ్పీ పాఠశాలలో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. ప్రజలు క్యాంపులను వినియోగించుకోవాలన్నారు.

చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఫిరంగిపురం: మండల పరిధి రేపూడి గ్రామంలోని తాగునీటి చెరువులో గుర్తు తెలియని మృతదేహం ఆదివారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెరువులో గుర్తుపట్టలేని విధంగా ఉన్న సుమారు 50 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతదేహాన్ని వాకర్లు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ సురేష్‌బాబు, పోలీసు సిబ్బంది నీటిపై తేలుతున్న మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియలేదని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్ట్

తెనాలిరూరల్: భార్య హత్య కేసులో భర్తను పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ రామలింగేశ్వరపేట పాత డిపో ప్రాంతానికి చెందిన బండా శిరీషను ఆమె భర్త సాయిబాబు జనవరి 27న హత్య చేశాడు. అనుమానంతో హత్య చేసినట్టు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. నిందితుడిని శనివారం రాత్రి అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

మురుగు పారేందుకు దారేది!

రోడ్డు విస్తరణకు తవ్వుతున్న మార్జిన్‌లు

ఉండవల్లి సెంటర్ నుంచి తాడేపల్లికి వెళ్లే మార్గంలో నిర్మిస్తున్న కాంక్రీట్ వాల్

రహదారి విస్తరణ సమయంలోనూ కనిపించని డ్రెయిన్ నిర్మాణాలు

తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి ఉండవల్లి సెంటర్ నాలుగు రోడ్ల కూడలిలో జంక్షన్ అభివృద్ధికి కార్పొరేషన్ అధికారులు శ్రీకారం చుట్టారు. ప్రకాశం బ్యారేజీ రోడ్డుకు ఇరువైపులా షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉండడంతో దుకాణాల్లో నుంచి మురుగు బయటకు వెళ్లే మార్గం లేక షాపు యజమానులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షం వస్తే రోడ్డు పల్లంగా ఉండడంతో వర్షపునీరు నిలిచిపోతోంది. వర్షం కురిసిన సమయంలో షాపింగ్ కాంప్లెక్స్‌ల నుంచి మురుగు, వర్షపునీరు కలిసి ప్రకాశం బ్యారేజీ రోడ్డుపై నిలుస్తోంది. రోజూ రద్దీగా ఉండే ఈ రహదారిలో ద్విచక్ర వాహనాలపై ప్రయాణాలు కొనసాగిస్తూ వర్షం పడిన సమయంలో వర్షపు నీరు, మురుగుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డుపై వర్షం నీటితో ఇబ్బందులు..

మూడు బొమ్మల సెంటర్ నుంచి ఉండవల్లి సెంటర్ వరకు ప్రధాన డ్రైనేజీ లేకపోవడంతో వర్షం కురిసిన సమయంలో భారీగా వర్షపు నీరు రోడ్డుపైకి చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు జంక్షన్ అభివృద్ధితో పాటు హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద ఉన్న కాంప్లెక్స్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. దీంతో పాటు డ్రెయినేజీ ఏర్పాటు చేసి రెండు వైపులా మురుగు, వర్షపునీరు ఉండవల్లి ప్రధాన రహదారిలోకి వెళ్లే విధంగా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. రోడ్డు నిర్మిస్తే భవిష్యత్తులో ఎంత పెద్ద వర్షాలు కురిసినా వర్షపునీరు, మురుగు రోడ్లపై నిలవదన్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో ఉన్న వారికి కూడా మురుగు సమస్య తీరుతుందని వ్యాపారస్తులు తెలియజేస్తున్నారు.

డ్రెయినేజీ మాటేంటి..

అధికారులు రోడ్డును మాత్రమే ఏర్పాటు చేస్తున్నామని, డ్రెయినేజీ ఏర్పాటు చేయడం లేదని చెబుతున్నారు. ఉండవల్లి సెంటర్ నాలుగు రోడ్ల కూడలి నుంచి తాడేపల్లి వెళ్లే ప్రధాన రహదారిలో వర్షపు నీరు నిలుస్తోంది. వర్షం కురిసిన సమయంలో ఆ నీరు రోడ్డుపైకి వస్తోంది. తాడేపల్లికి వెళ్లే రహదారిలో జంక్షన్ అభివృద్ధికి బకింగ్‌హామ్ కెనాల్ వైపు భారీగా కాంక్రీట్ వాల్ నిర్మించారు. ఈ నిర్మాణం వల్ల వర్షపునీరు బయటకువెళ్లే మార్గం కనిపించడం లేదని.. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇంజినీరింగ్ అధికారులు రోడ్డు నిర్మాణ పనులు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

తాగునీరు రోడ్డుపాలు!

పబ్లిక్ ట్యాప్ వదిలివేయడంతో వృథాగా పోతున్న తాగునీరు

పాత జాతీయ రహదారిపై పారుతున్న తాగునీరు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పాత జాతీయ రహదారి వెంబడి ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే మార్గంలో ప్రజా అవసరాల కోసం ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాప్‌ను ప్రతిరోజు గుర్తు తెలియని వ్యక్తులు వదిలివేయడంతో తాగునీరు వృథాగా రోడ్డుపాలు అవుతోంది. ఆ ప్రాంతంలో రోడ్డుపై నీరు నిలబడడంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఫీట్లు చేయాల్సి వస్తోంది. మంగళగిరి ప్రకాశం బ్యారేజీ పాత జాతీయ రహదారికి దగ్గరలో నీరు పారుతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ట్యాప్ వదిలేసి వెళుతున్నారని.. దీంతో నీరు వృథాగా పోతోందని స్థానికులు చెబుతున్నారు. కాగా ట్యాప్‌ను కట్టేసేందుకు వాల్ కూడా లేకపోవడంతో నీటికట్టడి చేయలేకపోతున్నామని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

తెనాలిలో యథేచ్ఛగా గుట్కా వ్యాపారం

పట్టించుకోని పోలీసులు, అధికారులు

జిల్లా వైద్యశాల ఎదుట గల దుకాణంలో బహిరంగంగా విక్రయిస్తున్న గుట్కా, ఖైనీ

తెనాలిరూరల్: తెనాలి పట్టణం నిషేధిత గుట్కా, ఖైనీ వ్యాపారాలకు నిలయంగా మారింది. డెల్టా ప్రాంతంలో వ్యాపార కేంద్రం కావడం, సుమారు 25 కి.మీ పరిధిలోని గ్రామాలకు కేంద్రం కావడంతో ఇక్కడి నుంచే పెద్ద ఎత్తున నిషేధిత గుట్కా, ఖైనీల వ్యాపారం జోరుగా నడుస్తోంది. గుట్టుచప్పుడు కాకుండా అక్రమార్కులు తమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. గుట్కాలు, పొగాకు కలిగి ఉన్న పాన్ మసాలాలు, ఖైనీ వంటివి ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పలు అధ్యయనాల్లో తేలడంతో వీటి అమ్మకాలను నిషేధించారు. అయినా అమ్మకాలు మాత్రం జోరుగానే సాగుతున్నాయి. గతంలో పొగాకు కలిగి ఉన్న గుట్కాను తయారు చేసిన ప్రముఖ సంస్థ ఇప్పుడు పొగాకు లేకుండా కేవలం ఫ్లేవర్డ్ పాన్‌మసాలాను విక్రయిస్తోంది. ఇందులో గతంలో వాడిన మిశ్రమంలో పొగాకు మాత్రమే ఉండదు. దాన్ని విడిగా విక్రయిస్తున్నారు. వ్యసనపరులు రెండు ప్యాకెట్లను కొనుగోలు చేసి కలుపుకుని తింటారు. ఫలితంగా దీన్ని 'మిక్సింగ్' అనే పేరుతో చలామణి చేస్తున్నారు. ఇవి కాక ఇతర గుట్కాలు, ఖైనీల అమ్మకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు, ప్రజారోగ్య శఖకు సంబంధించిన అధికారులు పటిష్ట చర్యలు తీసుకుని, ప్రజల ఆరోగ్యానికి హానికరమైన గుట్కా, ఖైనీల వ్యాపారాన్ని నిలిపి వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

కనులవిందుగా సువర్చలా హనుమత్ కల్యాణోత్సవం

కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

తెనాలిటౌన్: స్థానిక షరాఫ్ బజార్‌లోని సువర్చల సమేత శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శ్రీసువర్చల హనుమత్ కల్యాణోత్సవం...చూసినవారి కనులదే భాగ్యంబు...అన్నట్టుగా కమనీయంగా, కనువిందుగా సాగింది. ఏడాదికోసారి జరిగే వేడుకను పెద్దసంఖ్యలో భక్తులు తిలకించారు. తీర్థప్రసాదాలను స్వీకరించి తరించామంటూ ఇంటిదారి పట్టారు. స్థానిక షరాఫ్ బజార్‌లోని శ్రీ సువర్చలసమేత శ్రీపంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల సంరంభమిది. ప్రత్యేక అలంకరణతో, విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దిన ఆలయంలో వార్షిక వేడుకల్లో భాగంగా శనివారం రాత్రి శ్రీ సువర్చల హనుమత్ కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. స్వామివారిని గజ వాహనంపై, అమ్మవారిని గరుడవాహనంపై వేంచేసి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయానికి చేరుకున్నాక, అక్కడి ప్రాంగణంలో ఎదురుకోల ఉత్సవం నిర్వహించారు. అనంతరం కల్యాణోత్సవాన్ని అర్చకులు, పండితులు వైఖానస ఆగమోక్తంగా జరిపారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి హరిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో భక్తులు విశేషంగా పాల్గొని శ్రీ సువర్చల హనుమత్ కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఆదివారం ఉదయం ఉష్ట్ర వాహన సేవ జరిపారు. ఆలయ వంశ పారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి పర్యవేక్షించారు.

డాక్టర్ నాగవరప్రసాద్‌కు బంగారు పతకం

డాక్టర్ నాగవరప్రసాద్‌కు బంగారు పతకాన్ని అందజేస్తున్న తెనాలి వైద్యులు

తెనాలిరూరల్: పట్టణానికి చెందిన ప్రఖ్యాత సర్జన్ డాక్టర్ చదలవాడ కృష్ణయ్య చౌదరి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన సంస్మరణ సభను ఆదివారం నిర్వహించారు. స్థానిక బోస్‌రోడ్డులోని ఐఎంఏ హాలులో రాత్రికి జరిగిన కార్యక్రమంలో విజయవాడ స్వర్ణ స్కాన్స్ అధినేత డాక్టర్ నాగవరప్రసాద్ వేమూరికి బంగారు పతకాన్ని తెనాలి వైద్యులు అందజేశారు. 'ఫ్యూచర్ ఆఫ్ రేడియాలజీ–ఇట్స్ ఇంపాక్ట్ ఆన్ మెడికల్ ప్రాక్టీస్' అనే అంశంపై డాక్టర్ నాగవరప్రసాద్, డాక్టర్ చదలవాడ కృష్ణయ్య స్మారకోపన్యాసం చేశారు. డాక్టర్ కె.శ్యామ్ ప్రసాద్, డాక్టర్ జి.రవిశంకర రావు, డాక్టర్ జి.కోటేశ్వరప్రసాద్, డాక్టర్ టి.రాకేష్, డాక్టర్ టి.అఖిలేష్, డాక్టర్ కె.అనిల్‌కుమార్, డాక్టర్ శ్రీకాంత్‌బాబు తదితర వైద్యులు, డాక్టర్ కృష్ణయ్య కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

దుగ్గిరాల: నూతన విద్యుత్ లైన్‌ల ఏర్పాటు నిమిత్తం దుగ్గిరాల మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఆ శాఖ ఏఈ గోపి ఆదివారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు చిలువూరు, తుమ్మపూడి, కంఠంరాజుకొండూరు, మంచికలపూడి, పెనుమూలి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని.. ప్రజలు, రైతులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పెనుమూలిలో పేరంటాళ్లమ్మ తిరునాళ్లు

దుగ్గిరాల: దుగ్గిరాల మండలం పెనుమూలి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పేరంటాళ్లమ్మ అమ్మవారికి ఆదివారం విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలి వచ్చి అమ్మను దర్శించారు. ఉత్సవానికి వచ్చిన వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

వైభవంగా తిరుపతమ్మ, గోపయ్య కల్యాణం

కొల్లిపర: స్థానిక కృష్ణానది ఒడ్డున వేంచేసియున్న లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్యస్వామి వార్ల కల్యాణ మహోత్సవం ఆదివారం భక్తులు, అర్చకులు కమిటీ వారు ఘనంగా నిర్వహించారు. శ్రీనివాసరావు దంపతుల చేతుల మీదగా అమ్మవారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రక్షణసైన్యం చర్చి ఆరో వార్షికోత్సవం

తెనాలి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక జీవితంలో శక్తివంతులుగా ఉండాలని రక్షణసైన్యం చర్చి టెరిటోరియల్ కమాండర్, కమిషనర్ డేనియల్ రాజు దాసరి చెప్పారు. పట్టణ అయితానగర్‌లోని రక్షణ సైన్యం చర్చి ఆరో వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. చర్చి రాష్ట్రీయ నాయకులైన కమిషనర్ డేనియల్ రాజు దాసరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆధ్యాత్మిక జీవితం ప్రాముఖ్యతను, ప్రతివారు ఆ జీవితంలో ఎంత శక్తివంతులుగా ఉండాలనే అంశంపై ఆయన వివరించారు. తొలుత డేనియల్ రాజు దాసరికి చర్చి వద్ద ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో సంఘ కాపరి జే.క్రీస్తుదాసు, సంఘ పెద్దలు ఎం.ఆగ్నేసుబాబు, కె.రాంబాబు, బి.శివప్రసాద్, డి.గోపి, ఎం.నాంచారయ్య, పి.సాంబయ్య, కమిటీ సభ్యులు, యూత్, హెచ్‌ఎల్, సండే స్కూలు టీచర్లు పాల్గొన్నారు.

బెదిరింపులపై కేసు నమోదు

మంగళగిరి టౌన్: బెదిరింపుల విషయమై నిందితుడిపై మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయిన ఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు.. యర్రబాలెంకు చెందిన లేళ్ల శివనాగ కోటేశ్వరరావు పాత ట్రాక్టర్లు కొని అమ్ముతూ జీవనం కొనసాగిస్తున్నారు. దీంతో పాటు సోషల్ వర్కర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో జనవరి 30న యర్రబాలెం గ్రామానికి చెందిన యశ్వంత్ సాయికృష్ణ అనే వ్యక్తి ఫోన్ చేసి ఉద్యోగాలు ఇప్పిస్తానని నలుగురి వద్ద డబ్బులు తీసుకున్నావని.. అందులో వాటా ఇవ్వాలని కోటేశ్వరరావుపై బెదిరింపులకు పాల్పడ్డాడు. తిరిగి అదేరోజు సాయంత్రం ఫోన్ చేసి ఒక ఎంపీ సంతకాన్ని ఫోర్జరీ చేసి సీఎం రిలీఫ్ ఫండ్ పెట్టావంటూ దానికి సంబంధించి ఆధారాలు నా దగ్గర ఉన్నాయని.. నా వాటా నాకు ఇస్తే వదిలేస్తానంటూ బెదిరించాడు. అదేరోజు రాత్రి బైక్‌పై వెళుతుండగా సాయికృష్ణ కోటేశ్వరరావు బండికి అడ్డుగా వచ్చి తన వాటా ఇవ్వాలని కదలనివ్వలేదు. దీంతో సాయికృష్ణ గతంలో జర్నలిస్టుగా పనిచేశాడని, అక్రమంగా అమాయకులను బెదిరించి డబ్బులు తీసుకునేవాడని శివనాగ కోటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సాయిబాబా మందిరం వార్షికోత్సవం రేపు

మందిరంలోని షిర్డీ సాయిబాబా

ఏర్పాట్లను పరిశీలిస్తున్న పాతూరి నాగభూషణం

మంగళగిరి టౌన్: మంగళగిరి మండలంలోని పెదవడ్లపూడిలో గల భగవాన్ శ్రీ సత్య షిర్డీ సాయిబాబా మందిరం 20వ వార్షికోత్సవ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర ప్రోగ్రామ్ అండ్ ప్రోటోకాల్ ఇన్‌చార్జి పాతూరి నాగభూషణం తెలిపారు. రామినేని ఫౌండేషన్ చైర్మన్ ధర్మ ప్రచారక్‌తో కలిసి ఆయన ఆదివారం వార్షికోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ.. 20వ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం 5.15 గంటలకు బాబాకు కాగడ హారతి, 6 గంటలకు క్షీరాభిషేకం, 8 గంటలకు అన్నాభిషేకం, 9 గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 10 గంటల నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని, సినీ సంగీత గాయనీ గాయకులతో సంగీత విభావరి, ప్రముఖ కళాకారులతో హాస్యవల్లరి వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వార్షికోత్సవ కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతుందని.. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని బాబా కృపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు.

ప్రజా కాపునాడు ఆధ్వర్యంలో సన్మానం

సన్మాన కార్యక్రమంలో ప్రజా కాపునాడు నాయకులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధి వారధి సమీపంలో గల ప్రజా కాపునాడు కార్యాలయంలో ప్రజా కాపునాడు ఆధ్వర్యంలో పలువురిని ఆదివారం ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి అంజిబాబు మాట్లాడుతూ.. కాపులంతా ఐక్యంగా ఉండాలని అన్నారు. కాపుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పేద కాపు మహిళల పెళ్లి కానుక పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కాపు కార్పొరేషన్ డైరెక్టర్ విన్నకోట శ్రీనివాసరావు, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మెంబర్ శంకర్‌శెట్టి పిచ్చయ్య, టీడీపీ తాడేపల్లి మండల అధ్యక్షులు దాసరి కృష్ణ తదితరులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రజా కాపునాడు సంఘం నాయకులు పుల్లెపు భాస్కరరావు, వలివేటి రమేష్ నాయుడు, పెండ్యాల వెంకట రమణ, వీరిశెట్టి శివజ్యోతి, నంద్యాల హిమబిందు, వనిత, వీరకుమారి, వెంకట అనుసూయ దేవి తదితరులు పాల్గొన్నారు.

425వ రోజుకు చేరిన కార్మికుల దీక్షలు

దీక్షా శిబిరంలో కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: కార్మికుల కష్టంతో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం కోట్ల రూపాయలు సంపాదించిందని ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 425వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని నాయకులు గురవయ్య, సుభాని, సాంబశివరావు, నాగేశ్వరరావులతో కలిసి స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కార్మికుల కష్టాన్ని యాజమాన్యం దోపిడీ చేసిందని విమర్శించారు. కార్మికులు కష్టపడి పనిచేసి యాజమాన్యానికి కోట్లాది రూపాయలు సంపాదించుకునేలా చేశారన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల సమస్య పరిష్కారం కావడంలేదని వాపోయారు. కార్యక్రమంలో నవనీతమ్మ, విజయశ్రీ, ఆదినారాయణ, సుబ్బారావు, హగ్గయ్య నాగేశ్వరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు తెలుగు తప్పనిసరి

తెనాలి: విశ్రాంత ఉపాధ్యాయుడు పీటీ అవధాని నేతృత్వంలో స్థానిక నందులపేట కాజావారివీధిలో 'ప్రతి ఆదివారం–తెలుగువారం' కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు అతిథులచే మంచి మాటలు చెప్పించే 'నెలపొడుపు' జరిగింది. ఆదివారం సాయంత్రం జరిగిన కార్యక్రమానికి కవి పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. తల్లిదండ్రుల తమ పిల్లలకు క్రమం తప్పకుండా తెలుగు నేర్పించాలని సూచించారు. విశ్రాంత ఉప విద్యాశాఖాధికారి తల్లం వెంకట సుబ్బారావు, ఈఎల్‌వీ అప్పారావు, గీతాంజలి మూర్తి, డాక్టర్ ఆలపాటి భానుప్రసాద్, బాలసాహితీవేత్త షేక్ అబ్దుల్ హకీంజాని పాల్గొన్నారు. విద్యార్థులు తాము నేర్చుకున్న సామెతలు, సూక్తులు, శ్లోకాలు, దేశభక్తి గీతాలను పాడి వినిపించారు. 3వ తరగతి విద్యార్థి ఎస్.హవీష్ పియానో వాయించి అందరినీ ఆనందింపజేశారు. బెంగళూరుకు చెందిన సురేంద్రనాథ్, మాధురి దంపతులు చిన్నారులకు మిఠాయిలు పంచారు.

మురుగు సమస్య తలెత్తకుండా జాగ్రత్త వహించాలి

మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు

తెనాలిటౌన్: రోడ్లపై మురుగు సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు సిబ్బందికి సూచించారు. పట్టణ యడ్లలింగయ్య కాలనీలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఆ ప్రాంతంలో రైల్వేట్రాక్ కింద జరుగుతున్న కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ ప్రాంతం గుండా మురుగు పారుదల జరిగే ప్రధాన కాల్వకు ఇబ్బందులు తలెత్తకుండా ఆయిల్ ఇంజన్ల ద్వారా నీటిని తోడుతున్నారు. ఈ పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రోడ్లపైకి మురుగు చేరకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ-1, కోటంరాజు వారి వీధి, డోర్ నెం: 11-35-3, రు, లోని అజేయ్ డగ్ర్ అండ్ పార్మసూటికల్ ప్రొప్రయిటర్ వై.వి.ఆర్.ఎన్.పి సతీష్ గారి సంజాయిషీతో ఇందు మూలంగా యావన్మంది ప్రజానికానికి తెలియ జేయునది ఏమనగా......
గుంటూరు జిల్లా, తాడేపల్లి గ్రామం, డోర్ నెం: 5-104/3, లోని హానేస్ట్ పార్ములేషన్ ఫాక్టరీ ప్రొప్రయిటర్ ఎ.వి.ఆర్. ఎస్ సత్యనారాయణ గారి నుండి నాక్లయింటు ఆన్ రిజిష్టర్డు లీజు అగ్రిమెంట్ కలిగియున్నారు. నా క్లయింటు యొక్క సొంత మిషనరీతో సదరు ఫాక్టరీ లో అమల్ల ప్రొడక్షన్ చేయుచున్నారు. మా క్లయింటు యొక్క మిషనరీని తనది గా చెప్పుకోనుచు, సదరు సత్యనారాయణ గారు ఈ దిగువ తెలిపిన నాక్లయింటు మిషనరీని ఇతరులకు అమ్మమాపు చున్నట్లుగా తెలియవచ్చినది. ఎవరైన సదరు మిషనరీని పై వారి నుండి కొనుగోలు చేసిన, మరియు ఇతర లావాదేవిలు జరిపినచో నా క్లయింటు తీసుకోను సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యలగుదురని తెలియజేయుట మైనది.
నా క్లయింటు యొక్క మిషనరీ వివరాలు:-
1) టాబ్లెట్ కంపెషన్-3, 2) ట్రే డైయర్-2, 3) రిబ్బన్ మిక్సర్-2, 4) మల్టీమిల్-1, 5) గ్రాన్యులేటర్-2, 6) బిస్టర్‌పాక్ మెషిన్-3, 7) అలుఅలు పాక్-1, 8) కోన్ బ్లెండర్-2, 9) స్ట్రిప్ పాక్-2, 10) తూకం కాటా-3, 11) కోటింగ్ పాన్-3, 12) ఎయిర్ కంప్రసర్ 20 హెచ్‌పి 600 లీటర్స్-1, చిన్నవి-3, 13) టానిక్ మిక్స్ ట్యాంక్స్-6, 14) పెల్టర్ ప్రెస్-2, 15) క్యాప్ సీలింగ్-2, 16) కాప్స్యూల్ ఫిల్లింగ్-3, 17) ఎయిర్ హ్యాండ్లింగ్ యూనిట్స్-8, 18) ఈ మెషిన్ తాలుకా చేంజ్ పార్ట్‌లు, 19) ల్యాబ్‌కు సంబంధించిన వస్తువులు, 20) ఎలక్ట్రికల్ ఫిట్టింగులు మరియు వగైరాలు కలవు
ఇట్లు:- షేక్ ఖాదర్, న్యాయవాది
విజయవాడ-1. ఫోన్ 9246474898

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

కేంద్ర బడ్జెట్‌లో క్రీడలకు రూ.4479.88 కోట్లు

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో ఈసారి క్రీడలకు కాస్త ప్రాధాన్యం పెరిగింది. గతంతో పోలిస్తే సుమారు రూ.1133 కోట్లకు పైగా నిధుల్ని పెంచారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో క్రీడలు, యువజన సర్వీసులకు రూ. 4479.88 కోట్లు కేటాయించారు. గత ఆర్థిక సంవత్సరం రూ. 3346.54 కోట్లు నిధులివ్వగా తాజా బడ్జెట్‌లో రూ.1133.34 కోట్ల మేర హెచ్చింపు చేశారు. దేశ వ్యాప్తంగా క్రీడా కేంద్రాల నిర్వహణ, శిబిరాలు ఏర్పాటు చేసే భారత స్పోర్ట్స్ అథారిటీకి రూ. 917.38 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో రూ.880 కోట్లు ఇవ్వగా కాస్త పెంచారు. అయితే డోప్ పరీక్షల ల్యాబొరేటరీతో పాటు జాతీయ డోపింగ్ నిరోధక ఏజెన్సీ (నాడా) నిధుల్లో కోత పెట్టారు. డోపింగ్ టెస్టులకు క్రితం ఏడాది రూ.28.55 కోట్లు ఇస్తే... ప్రస్తుతం రూ.23 కోట్లకు కుదించారు. జాతీయ స్పోర్ట్స్ యూనివర్సిటీకి గతంలో రూ. 78.64 కోట్లు విదిల్చిన ఆర్థికమంత్రి తాజాగా రూ.46.98 కోట్లే కేటాయించారు. 1998లో ఏర్పాటు చేసిన జాతీయ క్రీడాభివృద్ధి నిధిని రూ. 3 కోట్ల నుంచి రూ.5 కోట్లకు పెంచారు. అలాగే క్రీడాకారుల ప్రోత్సాహకాలను రూ. 28 కోట్ల నుంచి రూ. 40 కోట్లకు పెంచారు. జాతీయ క్రీడా సమాఖ్యలకు ఇచ్చే నిధుల్ని రూ. 400 కోట్ల నుంచి 425 కోట్లకు హెచ్చింపు చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం 'ఖేలో ఇండియా'కు రూ.924.35 కోట్లు కేటాయించారు. గతేడాది రూ. 1000 కోట్లు నిధులివ్వగా... కేవలం రూ.700 కోట్లే వెచ్చించడంతో ఇప్పుడు తగ్గించారు.

అల్‌కరాజ్ కొత్త చరిత్ర

'కెరీర్ గ్రాండ్‌స్లామ్' పూర్తి చేసుకున్న స్పెయిన్ స్టార్

- ఈ ఘనత సాధించిన అతిపిన్న వయస్కుడిగా రికార్డు
- తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ హస్తగతం
- ఫైనల్లో సెర్బియా దిగ్గజం జొకోవిచ్‌పై విజయం
- రూ. 26 కోట్ల 55 లక్షల ప్రైజ్‌మనీ సొంతం

రన్నరప్ ట్రోఫీతో జొకోవిచ్
అల్‌కరాజ్ గెలుపు సంబరం

మెల్‌బోర్న్: పురుషుల టెన్నిస్ చరిత్రలో స్పెయిన్ స్టార్, ప్రపంచ నంబర్‌వన్ అల్‌కరాజ్ కొత్త రికార్డు నెలకొల్పాడు. టెన్నిస్‌లోని నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీల టైటిల్స్‌ను సాధించిన అతిపిన్న వయస్కుడిగా (22 ఏళ్ల 272 రోజులు) అల్‌కరాజ్ చరిత్ర సృష్టించాడు. ఆదివారం ముగిసిన ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీలో ఈ స్పెయిన్ స్టార్ తొలిసారి విజేతగా అవతరించాడు. 10 సార్లు చాంపియన్, 24 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన సెర్బియా దిగ్గజం జొకోవిచ్‌తో జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో అల్‌కరాజ్ 2–6, 6–2, 6–3, 7–5తో గెలుపొందాడు. విజేత అల్‌కరాజ్‌కు 41,50,000 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 26 కోట్ల 55 లక్షలు), రన్నరప్ జొకోవిచ్‌కు 21,50,000 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 13 కోట్ల 75 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. అల్‌కరాజ్ కెరీర్‌లో ఇది ఏడో గ్రాండ్‌స్లామ్ టైటిల్. ఇప్పటికే అతను ఫ్రెంచ్ (2024, 2025), వింబుల్డన్ (2023, 2024), యూఎస్ ఓపెన్ (2022, 2025)లను రెండుసార్లు చొప్పున గెలిచాడు. తాజా ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌తో అల్‌కరాజ్ 'కెరీర్ గ్రాండ్‌స్లామ్' పూర్తి చేసుకున్న అతిపిన్న వయస్కుడిగా గుర్తింపు పొందాడు. ఓవరాల్‌గా డాన్ బడ్జ్ (అమెరికా; 22 ఏళ్ల 363 రోజులు; 1938లో) పేరిట ఉన్న రికార్డును.... ఓపెన్ శకం (1968) మొదలయ్యాక నాదల్ (స్పెయిన్; 24 ఏళ్ల 88 రోజులు; 2010లో) పేరిట ఉన్న రికార్డులను ఈ స్పెయిన్ స్టార్ సవరించాడు. తాజా ఓటమితో అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ (25) నెగ్గిన ఏకైక ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పాలని ఆశించిన జొకోవిచ్‌కు నిరాశ ఎదురైంది.

ఫైనల్ మ్యాచ్ గణాంకాలు

అల్‌కరాజ్		జొకోవిచ్
9	ఏస్‌లు	4
2	డబుల్ ఫాల్ట్‌లు	2
5/16	బ్రేక్ పాయింట్లు	2/6
36	విన్నర్స్	32
27	అనవసర తప్పిదాలు	46
14/20	నెట్ పాయింట్లు	20/32
118	మొత్తం పాయింట్లు	106

9 పురుషుల టెన్నిస్‌లో 'కెరీర్ గ్రాండ్‌స్లామ్' పూర్తి చేసుకున్న 9వ ప్లేయర్ అల్‌కరాజ్. ఈ జాబితాలో ఫ్రెడ్ పెర్రీ (బ్రిటన్; 1935లో), డాన్ బడ్జ్ (అమెరికా; 1938లో), రాడ్ లేవర్ (ఆస్ట్రేలియా; 1962లో), రాయ్ ఎమర్సన్ (ఆస్ట్రేలియా; 1964లో), అగస్సీ (అమెరికా; 1999లో), ఫెడరర్ (స్విట్జర్లాండ్; 2009లో), నాదల్ (స్పెయిన్; 2010లో), జొకోవిచ్ (సెర్బియా; 2016లో) ఉన్నారు.

తొలి సెట్ కోల్పోయినా...

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఫైనల్ చేరిన 10 సార్లూ విజేతగా నిలిచిన జొకోవిచ్‌కు తుది పోరులో తొలిసారి ఓటమి ఎదురైంది. సెమీస్‌లో డిఫెండింగ్ చాంపియన్ సినెర్ (ఇటలీ)పై ఐదు సెట్‌ల పోరులో గెలిచిన జొకోవిచ్ తొలి సెట్‌ను గెలిచి ఫైనల్లో శుభారంభం చేశాడు. అయితే 38 ఏళ్ల జొకోవిచ్‌తో పోలిస్తే ఎక్కువ ఫిట్‌గా ఉన్న అల్‌కరాజ్ రెండో సెట్ నుంచి తన అసలు ఆటతీరును ప్రదర్శించాడు. రెండో సెట్‌లో రెండుసార్లు... మూడో సెట్‌లో రెండుసార్లు జొకోవిచ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి అతను ఈ రెండు సెట్‌లు గెలిచాడు. నాలుగో సెట్‌లోని 12వ గేమ్‌లో జొకోవిచ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన అల్‌కరాజ్ సెట్‌తోపాటు విజయాన్ని ఖాయం చేసుకున్నాడు.

ప్రపంచకప్‌లో ఆడతాం... కానీ భారత్‌తో ఆడం

పాకిస్తాన్ ప్రభుత్వ ప్రకటన


భారత్, పాక్ టి20 జట్ల కెప్టెన్‌లు సూర్యకుమార్, సల్మాన్ ఆఘా (ఫైల్)

లాహోర్: మరో ఐదు రోజుల్లో మొదలయ్యే పురుషుల టి20 ప్రపంచకప్‌పై పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) తమ నిర్ణయాన్ని వెల్లడించింది. కొన్నాళ్లుగా బంగ్లాదేశ్‌కు బాసటగా నిలిచేందుకు ఈ మెగా ఈవెంట్‌నే బహిష్కరిస్తామని బీరాలు పలికిన పాక్ ఇప్పుడు ప్రపంచకప్ ఆడేందుకు సిద్ధమైంది. అయితే భారత్‌తో మాత్రం మ్యాచ్ ఆడబోమని ప్రకటించింది. నిజానికి జట్లు ఎంపిక, ప్రకటనకు ఐసీసీ ఇచ్చిన తుదిగడువుకు ముందే పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) తమ జట్టును ప్రకటించింది. అయితే తమ ప్రభుత్వం ఆమోదం తెలిపితేనే ప్రపంచకప్ ఆడతామని జట్టును ఎంపిక చేసిన సందర్భంలో తెలిపింది. ప్రపంచకప్‌లో ఆడేందుకు అనుమతి ఇచ్చిన పాకిస్తాన్ ప్రభుత్వం భారత్‌తో జరిగే మ్యాచ్‌ను మాత్రం బహిష్కరించాలని నిర్ణయం తీసుకుంది. దాంతో వరల్డ్‌కప్ ఆడతామని ఆదివారం స్పష్టం చేసిన పీసీబీ ఈ నెల 15న కొలంబో (శ్రీలంక) వేదికగా భారత్‌తో జరిగే మ్యాచ్‌లో బరిలోకి దిగబోమని తెలిపింది. ఈ నేపథ్యంలో పీసీబీపై ఐసీసీ తీసుకోబోయే చర్యలెలా ఉంటాయో తెలియదు కానీ... దాయాదుల 'ప్రపంచ' సమరంపై ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న క్రికెట్ అభిమానులకు ఇది కచ్చితంగా గుండెకోతే! ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌ల మధ్య జరిగే ప్రతిష్టాత్మక 'యాషెస్' కంటే కూడా భారత్, పాక్ మ్యాచ్‌లకు ఉండే ప్రేక్షకాదరణే ఎక్కువ! కోట్లాది మంది వీక్షణతో ఎన్నోమార్లు ఇది రుజువైంది కూడా! ఫ్యాన్స్‌పైనే కాదు తక్షణ ప్రభావం గ్లోబల్ బ్రాడ్‌కాస్టర్లపై కూడా పడుతుంది. అసలే 20 జట్లు ఆడుతున్న ఈ మెగా టోర్నీలో ఇక ఒక్క మ్యాచ్‌కు కూడా కిక్కిరిసే మైదానం కనబడక... టికెట్ రెవెన్యూ యాడ్ రెవెన్యూ, ఓ ప్రపంచకప్‌కు వీక్షకుల సంఖ్య, ఇలా అన్నింటిపైనా తక్షణ ప్రభావం పడుతుంది.

రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్లో ఆంధ్ర

సొవిమా (నాగాలాండ్): దేశవాళీ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ రంజీ ట్రోఫీలో ఆంధ్ర జట్టు నాకౌట్ దశకు దూసుకెళ్లింది. నాగాలాండ్‌తో గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌ను 'డ్రా' చేసుకున్న ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ద్వారా 3 పాయింట్లు సాధించింది. గ్రూప్ 'ఎ'లో ఆంధ్ర, జార్ఖండ్, విదర్భ జట్లు 31 పాయింట్లతో ఉమ్మడిగా అగ్రస్థానంలో నిలిచాయి. అయితే మెరుగైన రన్‌రేట్ ఆధారంగా రికీ భుయ్ సారథ్యంలోని ఆంధ్ర జట్టుతో పాటు జార్ఖండ్ జట్టు క్వార్టర్ ఫైనల్‌కు చేరాయి. డిఫెండింగ్ చాంపియన్ విదర్భకు నిరాశ ఎదురైంది. ఓవర్‌నైట్ స్కోరు 85/4తో ఆఖరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన నాగాలాండ్ జట్టు చివరకు 104 ఓవర్లలో 342 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో రాణించిన వికెట్ కీపర్ బ్యాటర్ చేతన్ బిస్త్ (100; 6 ఫోర్లు, 1 సిక్స్) మరో శతకంతో అదరగొట్టాడు. ఆంధ్ర బౌలర్లలో త్రిపురాణ విజయ్ 5 వికెట్లు పడగొట్టగా... సౌరభ్ కుమార్ 4 వికెట్లు తీశాడు. అనంతరం 173 పరుగుల విజయలక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు 8.3 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 64 పరుగులు చేసింది. ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇరు జట్ల కెప్టెన్‌లు 'డ్రా'కు అంగీకరించారు. ఛత్తీస్‌గఢ్‌తో గ్రూప్ 'డి'లో చివరి లీగ్ మ్యాచ్‌ను హైదరాబాద్ 'డ్రా' చేసుకొని 16 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. శుక్రవారం నుంచి జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో జార్ఖండ్‌తో ఉత్తరాఖండ్; మధ్యప్రదేశ్‌తో జమ్మూ కశ్మీర్; బెంగాల్‌తో ఆంధ్ర; ముంబైతో కర్ణాటక తలపడతాయి.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సెమీస్‌లో భారత్

- 'సూపర్ సిక్స్'లో పాకిస్తాన్‌పై గెలుపు
- 4న రెండో సెమీస్‌లో అఫ్గానిస్తాన్‌తో 'ఢీ'

కనిష్క్ చౌహాన్

బులవాయో: అండర్–19 ప్రపంచ కప్ టోర్నీలో ఆయుశ్ మాత్రే సారథ్యంలోని యువ భారత జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. పాకిస్తాన్‌తో ఆదివారం జరిగిన 'సూపర్ సిక్స్' మ్యాచ్‌లో ఓడినా ముందుకెళ్లే అవకాశముండగా... భారత జట్టు 58 పరుగుల తేడాతో దర్జాగా గెలిచి సెమీస్ చేరింది. ముందుగా భారత్ 49.5 ఓవర్లలో 252 పరుగులకు ఆలౌటైంది. వేదాంత్ త్రివేది (68; 2 ఫోర్లు, 1 సిక్స్), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కనిష్క్ చౌహాన్ (35; 4 ఫోర్లు, 1 సిక్స్), వైభవ్ సూర్యవంశీ (30; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. తర్వాత 33.3 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదిస్తేనే సెమీస్ అర్హత సాధించే క్రమంలో పాక్ తేలిపోయింది. 46.2 ఓవర్లలో 194 పరుగులకే కుప్పకూలింది. భారత బౌలర్లలో ఖిలాన్ పటేల్, ఆయుశ్ మాత్రే చెరో 3 వికెట్లు తీశారు. బుధవారం హరారేలో జరిగే రెండో సెమీఫైనల్లో అఫ్గానిస్తాన్‌తో భారత్; మంగళవారం జరిగే తొలి సెమీఫైనల్లో ఇంగ్లండ్‌తో ఆస్ట్రేలియా తలపడతాయి.

'ఎలిమినేటర్'కు ఢిల్లీ క్యాపిటల్స్

చివరి లీగ్ మ్యాచ్‌లో యూపీ వారియర్స్‌పై విజయం

శ్రీచరణి, జెమీమా

వడోదర: మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ 'ఎలిమినేటర్' పోరుకు అర్హత పొందింది. ఆదివారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో జెమీమా రోడ్రిగ్స్ సారథ్యంలోని ఢిల్లీ 5 వికెట్ల తేడాతో యూపీ వారియర్స్‌పై నెగ్గింది. తొలుత యూపీ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది. దీప్తి శర్మ (24; 4 ఫోర్లు, 1సిక్స్), సిమ్రన్ షేక్ (22; 3 ఫోర్లు), శిఖా పాండే (23; 3 ఫోర్లు) రెండు పదుల స్కోర్లు చేశారు. మరిజాన్ కాప్ 3, హెన్రీ, శ్రీచరణి చెరో 2 వికెట్లు తీశారు. తర్వాత ఢిల్లీ 18.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 126 పరుగులు చేసి గెలిచింది. వోల్వార్డ్ (47; 7 ఫోర్లు) రాణించింది. వరుసగా నాలుగోసారి ఫైనల్ చేరేందుకు ఢిల్లీ క్యాపిటల్స్ మంగళవారం జరిగే గుజరాత్‌తో ఎలిమినేటర్ మ్యాచ్ ఆడుతుంది. ఇప్పటికే బెంగళూరు నేరుగా ఫైనల్ చేరింది.

సాక్షి సినిమా

మన జీవితాల్లోని మహిళలే మనకు బలం - రామ్‌చరణ్

రామ్‌చరణ్, ఉపాసన

జనవరి 31న (శనివారం) రామ్‌చరణ్–ఉపాసన కవలలకు తల్లిదండ్రులైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రామ్‌చరణ్ తన సంతోషాన్ని సోషల్ మీడియా వేదికగా వ్యక్తపరచి, ఓ స్పెషల్ ఫొటోను షేర్ చేశారు. ''మాకు బాబు, పాప జన్మించారన్న విషయాన్ని మీతో పంచుకుంటున్నందుకు హ్యాపీగా ఉంది. ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండటాన్ని ఎంతో కృతజ్ఞతగా భావిస్తున్నాం. మన జీవితాల్లోని మహిళలే మనకు అత్యంత బలం. ప్రతి క్షణం మాకు అండగా నిలుస్తున్న మా అభిమానులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు'' అని రామ్‌చరణ్ షేర్ చేశారు. ఇక 2023 జూన్ 20న ఈ దంపతులకు తొలి సంతానంగా కుమార్తె క్లింకార జన్మించిన విషయం తెలిసిందే.

చాలా సంతోషంగా ఉన్నాం: చిరంజీవి

ఆదివారం మీడియాతో చిరంజీవి మాట్లాడుతూ– ''భగవంతుడు, హనుమాన్ కృప వల్ల ఒక పాప, ఒక బాబు జన్మించారు. ఉపాసన, బిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారు. మా అభిమానులు, మా మంచి కాంక్షించే ప్రతి ఒక్కరితో ఈ శుభ వార్తను పంచుకోవడం చాలా సంతోషంగా ఉంది. కొణిదెల, కామినేని... రెండు కుటుంబాల సభ్యులు సంతోషంగా ఉన్నాం. ఇంత సుఖ ప్రసవం జరిగినందుకు అపోలో వైద్యులకు, వారి సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను'' అని చెప్పారు.

చలో జార్జియా

మహేశ్‌బాబు

హీరో మహేశ్‌బాబు జార్జియా వెళ్లనున్నారట. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో రూపొందుతున్న చిత్రం 'వారణాసి'. ఈ సినిమాలో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రకాశ్‌రాజ్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. మహేశ్‌బాబు–ప్రియాంకా చోప్రా పాల్గొంటుండగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. కాగా, 'వారణాసి' సినిమా నెక్ట్స్ షెడ్యూల్ జార్జియాలో మొదలు కానుందని సమాచారం. అక్కడ షూటింగ్ చేసేందుకు సంబంధించిన కార్యాచరణను ఆల్రెడీ ప్రారంభించారట రాజమౌళి. అలాగే ఓ కీలక షెడ్యూల్‌ను అంటార్కిటికాలోనూ ప్లాన్ చేశారని ఫిల్మ్‌నగర్ భోగట్టా. ఒకవేళ అంటార్కిటికా లొకేషన్స్‌లో చిత్రీకరణ జరిగితే, అక్కడి క్లిష్టమైన లొకేషన్స్‌లో చిత్రీకరణ జరుపుకునే తొలి భారతీయ చిత్రంగా 'వారణాసి' సినిమా నిలుస్తుందనే ప్రచారం జరుగుతోంది. కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్న ఈ సినిమా 2027 ఏప్రిల్ 7న రిలీజ్ కానుంది.

దసరాకి కింగ్


నాగార్జున

హీరో నాగార్జున ఒక స్పెషల్ మూవీ చేస్తున్నారు. మరి... కెరీర్‌లో నూరవ చిత్రం అంటే ప్రత్యేకమే కదా. అందుకే దసరా పండగకి సందడి చేయాలని నిర్ణయించుకున్నట్లున్నారు. అభిమానులు కూడా తమ కింగ్ (నాగార్జునని అలానే పిలుస్తారు) సెంచరీ సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. 'కింగ్ 100' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ చిత్రం రూపొందుతోంది. తమిళ చిత్రం 'నిదమ్ ఒరు వానమ్'తో దర్శకుడిగా పరిచయమైన ఆర్ఏ కార్తీక్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఫ్యామిలీ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారని సమాచారం. లాటరీ నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుందని భోగట్టా. అందుకే 'లాటరీ కింగ్' అనే టైటిల్‌ని అనుకుంటున్నారట. ఇంకా 'కింగ్ 100, కింగ్ 100 నాటౌట్' టైటిల్స్‌ని కూడా పరిశీలిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రంలో టబు నటిస్తున్నారు. టబు ఎంట్రీని అధికారికంగా ప్రకటించారు. అలాగే అనుష్క కూడా ఓ కీలక పాత్రలో కనిపిస్తారట. అయితే ఈ విషయంపై ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై నాగార్జున నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని దసరా సందర్భంగా విడుదల చేయాలనుకుంటున్నారనే వార్త తెరపైకి వచ్చింది.

మౌత్ టాక్‌తో నిలబడే చిత్రం ఇది - నవీన్ చంద్ర

దివి, దివ్యా పిళ్లై, నవీన్ చంద్ర

''హనీ' మంచి థియేట్రికల్ ఫిల్మ్. మౌత్ టాక్‌తో నిలబడే చిత్రం అవుతుంది. ప్రేక్షకుల్లో ఆలోచన రేకెత్తిస్తుంది'' అని నవీన్ చంద్ర చెప్పారు. కరుణకుమార్ దర్శకత్వంలో నవీన్ చంద్ర, దివ్యా పిళ్లై నటించిన చిత్రం 'హనీ'. శేఖర్ స్టూడియోస్ సమర్పణలో ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 6న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో నవీన్ చంద్ర మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో ఓ డార్క్ సొసైటీని చూపించాం. మంచి ఇంటెన్సిటీ ఉన్న ఆనంద్ (నవీన్ చంద్ర పాత్ర) క్యారెక్టర్‌ను క్రియేట్ చేసిన కరుణకుమార్ గారికి థ్యాంక్స్'' అని చెప్పారు. ''నిజజీవిత సంఘటనల నేపథ్యంలో ఈ సినిమా తీశాం. మెదడు అంతా చీకటి ఉన్న మనుషుల మధ్య జరిగే కథే ఈ చిత్రం. మనిషి మెదడు కంటే పెద్ద దెయ్యం లేదనేది ఈ సినిమా సారాంశం. పిల్లి మాయ అనే ఓ వస్తువును శోధించి, సాధించే ఒక వ్యక్తి జీవితాన్ని ఈ సినిమాలో చూపించాం. అందరికీ చెప్పాల్సిన కథ ఇది. సినిమా ఒకరి జీవితాన్ని మార్చలేదు, అలాగే సందేశాన్ని కూడా ఇవ్వలేదు. కానీ తప్పు జరుగుతున్నప్పుడు దాన్ని టార్చి వేసి చూపించగలదు. నేను అదే చేశానని నమ్ముతున్నాను'' అని అన్నారు కరుణకుమార్. ''ఈ సినిమా చూసి షాక్ అయ్యాను'' అని చెప్పారు రాజా రవీంద్ర. ''చాలా కొత్త కథ ఇది. కథ విని భయపడ్డాను'' అని తెలిపారు దివ్యా పిళ్లై. ''ప్రేక్షకులను వెంటాడే చిత్రం ఇది'' అని చెప్పారు దివి.

ప్రముఖ నటుడు రఘునాథ్ రెడ్డి కన్నుమూత



ప్రముఖ నటుడు కలకోట రఘునాథ్ రెడ్డి (83) కన్నుమూశారు. హైదరాబాద్ కాప్రా డివిజన్ ప్రథమపురి కాలనీలో నివాసం ఉండే రఘునాథ్ రెడ్డి శనివారం తీవ్ర అనారోగ్యానికి (బ్రెయిన్ స్ట్రోక్) గురయ్యారు. కుటుంబ సభ్యులు ఆయన్ను సికింద్రాబాద్ అపోలో ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూనే తుది శ్వాస విడిచినట్లు వైద్యులు నిర్ధారించారు. రఘునాథ్ రెడ్డి స్వగ్రామం కృష్ణా జిల్లా కుందేరు. పీయూసీ చదివిన రఘునాథ్ రెడ్డికి రైల్వేలో ఉద్యోగం వచ్చింది. అయితే నాటకాలంటే మక్కువతో చదువుకునే సమయంలోనే నాటక ప్రదర్శనలు వేసేవారు. అలా నటనపై ఉన్న ఇష్టంతో తొమ్మిదేళ్ల ముందుగానే వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుని సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాడు. 1988లో 'కళ్లు' సినిమాతో అరంగేట్రం చేశారు. తెలుగులోనే కాకుండా హిందీ, తమిళంలో దాదాపు 350కి పైగా సినిమాల్లో నటించారు. టీవీ సీరియల్స్‌లోనూ నటించారు. 'ఒసేయ్ రాములమ్మ, ఇంద్ర, డాన్, తమ్ముడు, రాయలసీమ రామన్న చౌదరి, మల్లీశ్వరి, సంక్రాంతి, శ్రీరామ రాజ్యం' వంటి సూపర్ హిట్ సినిమాల్లో రఘునాథ్ రెడ్డి కీలక పాత్రలు చేశారు. ఆయన నటించిన చివరి సినిమా 'సుబ్రహ్మణ్యపురం'. ఆ తరువాత తన స్నేహితులతో కలిసి ఓ చిన్న సినిమాలో కూడా నటించినట్లు కటుంబ సభ్యులు పేర్కొన్నారు. రఘునాథ్ రెడ్డికి భార్య అన్నపూర్ణ, కొడుకు సుధాకర్ రెడ్డి, ఇద్దరు కుమార్తెలు అరుణ, సుధాలక్ష్మి. నెల రోజుల క్రితం కుమారుడు సుధాకర్ గుండెపోటుతో కన్నుమూయడంతో రఘునాథ్ రెడ్డి మనోవేదనకు గురయ్యారు. కొడుకు మరణంతో ఆయన ఆరోగ్యం మరింత క్షీణించింది. శనివారం ఆయన కన్నుమూశారు. రఘునాథ్ రెడ్డి మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం లాలాపేట్‌లోని స్మశానవాటికలో ఆయన అంత్యక్రియలు జరిగాయి.

– కాప్రా (హైదరాబాద్)

హాయిగా నవ్వుతారు - కె. హిమబిందు


రాజేష్, హిమబిందు, ప్రజోత్

రాజేష్ మేరు, నవ్య చిట్యాల నటించిన సినిమా 'లగ్గం టైం'. కె. యశ్వంత్ కుమార్ సమర్పణలో ప్రజోత్ కె. వెన్నం దర్శకత్వంలో కె. హిమబిందు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 6న రిలీజ్ కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రాజేష్ మాట్లాడుతూ– ''కథ విన్న వెంటనే ఈ సినిమా చేయాలనిపించింది'' అని అన్నారు. ''మేం కొత్తవాళ్లమే అయినా మేకింగ్‌లో ఎక్కడా తప్పులు జరగకుండా ఈ సినిమా చేశాం'' అని చెప్పారు ప్రజోత్. ''ప్రేక్షకులు ఈ సినిమా చూసిన తర్వాత వారి అభిప్రాయాన్ని చెబుతారు. అయితే రీ–రిలీజ్‌లను శుక్రవారం, వీకెండ్ సమయాల్లోనే రిలీజ్ చేస్తుంటే చిన్న చిత్రాలకు అంతగా ఆదరణ లభించడం లేదు. ఈ రీ–రిలీజ్‌ల విషయంలో ఓసారి అందరూ ఆలోచించాలి. మా 'లగ్గం టైం'ను చూసిన ఆడియన్స్ హాయిగా థియేటర్స్ నుంచి నవ్వుతూ వెళ్తారని చెప్పగలను'' అన్నారు కె. హిమబిందు.

వ్యవసాయం విలువ తెలిపేలా...

త్రిగుణ్, మధు, పాయల్

త్రిగుణ్ హీరోగా పాయల్ రాధాకృష్ణ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'వర్క్ ఫ్రమ్ హోమ్'. మధు దర్శకత్వంలో అరవింద్ నిర్మించారు. వైజాగ్‌లో జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో మధు మాట్లాడుతూ– ''వ్యవసాయంలో నూతన యంత్ర పరికరాల వినియోగ ఆధారిత నేపథ్యంలో ఈ చిత్రం సాగుతుంది. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన ఓ యువతి, యువకుడి ప్రేమ, పెళ్లి, కుటుంబం నేపథ్యంలో ఈ సినిమా అందర్నీ అలరించేలా ఉంటుంది. ''నేటి తరానికి అవసరమైన ఈ సినిమా భావితరాలకు సందేశం ఇచ్చేలా ఉంటుంది'' అని త్రిగుణ్ పేర్కొన్నారు. ''వ్యవసాయం విలువ తెలిపే మంచి కథాంశంతో రూపొందించిన మా సినిమాని ఫిబ్రవరి 13న రిలీజ్ చేస్తాం'' అని నిర్మాత చెప్పారు.

హైకూ ఆరంభం

అపర్ణ, ఏగన్, ఫెమీనా

ఏగన్ హీరోగా ఫెమీనా జార్జ్, తెలుగు మూవీ 'కోర్ట్' ఫేమ్ శ్రీదేవి అప్పల్ల హీరోయిన్లుగా 'హైకూ' అనే చిత్రం ఆరంభం అయింది. కేరళలోని ఇడుక్కి ప్రాంతంలో ఆదివారం పూజా కార్యక్రమాలతో ప్రారంభించి, అనంతరం షూటింగ్ కూడా మొదలుపెట్టారు. యువరాజ్ చిన్నసామి దర్శకత్వంలో డా. డి. అరుళనందు, మ్యాథ్యూ అరుళ నందు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'జో' వంటి సూపర్ హిట్ మూవీతో గుర్తింపు పొందిన హరిహరన్ రామ్ అడిషనల్ స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. ''సాధారణంగా థియేట్రికల్ రన్ చూసిన తర్వాతే ఓటీటీ సంస్థలు డిజిటల్ హక్కుల కోసం ప్రయత్నిస్తాం. కానీ మా సినిమా షూటింగ్ పూర్తి కాక ముందే డిజిటల్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకోవడం విశేషం. ఇలా మా సినిమా విడుదలకు ముందే డిజిటల్ డీల్ క్లియర్ కావడం మాకు చాలా ఆనందంగా ఉంది'' అని నిర్మాతలు పేర్కొన్నారు.

క్లుప్తంగా...

రాష్ట్రంలో బలవంతపు భూ సేకరణ ఆపివేయాలి

అఖిల భారత కిసాన్ కౌన్సిల్ డిమాండ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం విచ్చలవిడిగా చేస్తున్న బలవంతపు భూ సేకరణను వెంటనే ఆపివేయాలని అఖిల భారత కిసాన్ కౌన్సిల్ డిమాండ్ చేసింది. అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షుడు అశోక్ థావలే అధ్యక్షతన గుంటూరులో ఆదివారం జరిగిన సమావేశం వివరాలను ప్రధాన కార్యదర్శి బీజూ కృష్ణన్ మీడియాకు విడుదల చేశారు. కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా చంద్రబాబు ప్రభుత్వం పని చేస్తోందని మండిపడ్డారు. వివిధ పేర్లతో రాష్ట్రంలో 10 లక్షల ఎకరాలకు పైగా వ్యవసాయ భూములను బాబు సర్కార్ రైతుల నుంచి బలవంతంగా తీసుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బహుళ పంటలు పండే వ్యవసాయ భూములను భూ సేకరణ నుంచి మినహాయించాలని.. అనివార్యమైతే న్యాయమైన పరిహారం చెల్లించి రైతుల ఆమోదంతోనే తీసుకోవాలని చట్టం చెబుతోందని గుర్తు చేశారు. బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా ఉద్యమించిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకుడు అప్పలరాజుపై పీడీ యాక్ట్ పెట్టి అరెస్టు చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ జైల్లో అక్రమంగా నిర్బంధించిన అప్పలరాజును తక్షణమే విడుదల చేయాలని, పీడీ యాక్ట్ కింద నమోదుచేసిన అక్రమ కేసును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

అధికార పార్టీ తీరు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం

- వి.శ్రీనివాసరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి

జోగి రమేష్ ఇంటిపై టీడీపీ శ్రేణులు దాడి చేయడాన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తోంది. ఈ విధ్వంసానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. చట్టబద్ధంగా వ్యవహరించాల్సిన అధికార పార్టీయే ఇలాంటి చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం.

తగ్గిన స్థూల జీఎస్టీ వసూళ్లు

సాక్షి, అమరావతి: రాష్ట్ర స్థూల జీఎస్టీ వసూళ్లలో స్వల్ప క్షీణత నమోదైనట్లు రాష్ట్ర పన్నుల ప్రధాన కమిషనర్ ఎ.బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది జనవరిలో రూ.3,482 కోట్లుగా ఉన్న గ్రాస్ జీఎస్టీ వసూళ్లు ఈ ఏడాది జనవరిలో రూ.3,475 కోట్లకు తగ్గాయన్నారు. నికర జీఎస్టీ వసూళ్లు 6.74 శాతం పెరిగి రూ.2,879 కోట్ల నుంచి రూ.3,073 కోట్లకు పెరిగాయని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జనవరి వరకు రాష్ట్ర మొత్తం పన్నుల ఆదాయం గతేడాదితో పోలిస్తే 4.79 శాతం పెరిగి రూ.42,201 కోట్ల నుంచి రూ.44,221 కోట్లకు పెరిగినట్లు తెలిపారు.

పేద, మధ్యతరగతిని బలోపేతం చేసేలా ఉంది

- కేంద్ర బడ్జెట్‌పై ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్పందన

సాక్షి, అమరావతి: పేదలు, మధ్యతరగతి వారిని బలోపేతం చేసేలా కేంద్ర బడ్జెట్ ఉందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు. బడ్జెట్‌పై ఆయన 'ఎక్స్'లో స్పందిస్తూ..'కేంద్ర బడ్జెట్‌ను నేను హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నాను. దేశ ఆర్థిక పునాదులను బలోపేతం చేసే బడ్జెట్ ఇది. ఈ బడ్జెట్ వికసిత్ భారత్ వైపు ప్రయాణాన్ని వేగవంతం చేస్తుంది' అని పేర్కొన్నారు.

వయ్యారి గోదారిపై మనసాయెరా!

పాపికొండల విహారానికి పోదామా..

- ప్రకృతి సోయగాలను చూద్దామా..
- జీవితానికి సరిపడ ఆనందాలను ఆస్వాదిద్దామా..
- ఇంకెందుకాలస్యం.. పదండి మరి

అందమైన పాపికొండలు ఎదురు గుడారాలు

గోదావరిలో బోటు ప్రయాణ చేస్తున్న చిత్రం

రంపచోడవరం / వీఆర్ పురం: పాపికొండలు విహార యాత్ర. ఎందరో పర్యాటకులు వారి డైరీల్లో 'టు బీ విజిట్' జాబితాలో రాసుకునే విహార స్థలం. కొండ కోనల మధ్య గోదారి నీటి అలల సవ్వడితో.. చెవుల్లో గాలి ఈలలు వేస్తుంటే.. నునుపైన దూరపు కొండలు దగ్గరయ్యే కొద్దీ చెట్లు చేమలతో.. పచ్చదనంతో కంటి ఇంపుగా కనిపిస్తుంటే.. అక్కడక్కడా లంకల్లో ఇసుక తిన్నెలు మనసులోని కోరికలకు రెక్కలు విప్పుతుంటే.. మనసు గంతులేయదా మరి.. ఎప్పుడెప్పుడు చూస్తామా అని. పదండి మరి ఇదే సరైన తరుణం. ఈ విహార యాత్రకు అక్టోబర్ నుంచి మార్చి మధ్య కాలం అనుకూలం. కారణం వాతావరణం బాగుండడం.. నీటిమట్టం బాగుండడం. పాపికొండల సౌందర్యం.. వాటి మధ్య నుంచి గాలిని.. నీటిని చీల్చుకుంటూ ముందుకు సాగిపోయే పడవ ప్రయాణం. మొదలైంది మొదలు చివరి వరకు సాగి తిరిగి మొదటికి వచ్చే వరకు లెక్కకు మించిన మధుర భావాలను మనసు మూటగట్టుకుంటుంది. ఎన్నో ఏళ్ల వరకు గోదారి అలలపై.. గోదారి గట్లపై ఆడిపాడిన ఆ సన్నివేశాలను కనులముందు తారాడుతూనే ఉంటాయి. ప్రయాణం మొదలైన కొద్ది సేపటికే బోటు నిర్వాహకులు పర్యాటకులకు ఎంతో వినోదాన్ని అందిస్తుంటారు. ఎన్నెన్నో పోటీలు పెడుతుంటారు. పడవ సాగే మార్గంలోని ప్రతి చిన్న స్థలానికీ ఉన్న చరిత్రను విజ్ఞానదాయకంగా వివరిస్తుంటారు.

రెండు బోటింగ్ పాయింట్లు..

పాపికొండల అందాలను తిలకించేందుకు పోలవరం జిల్లాలో పర్యాటక శాఖ రెండు బోట్ పాయింట్లను ఏర్పాటు చేసింది. దేవీపట్నం మండలం పోశమ్మగండి వద్ద ఒకటి, వీఆర్ పురం మండలం పోచవరం వద్ద మరొకటి. ఈ ప్రాంతాల నుంచి బోట్ల నిర్వాహకులు పర్యాటకులను ఎక్కించుకుని పాపికొండల విహార యాత్రకు తీసుకువెళ్తుంటాయి. అలాగే పాపికొండలు సందర్శనకు రాజమహేంద్రవరం నుంచి సీతానగరం, పురుషోత్తపట్నం మీదుగా పోశమ్మ గండి బోటు పాయింట్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. అక్కడి నుంచి ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య బోటు సామర్థ్యాన్ని బట్టి పర్యాటకులను ఎక్కించుకుని బయలుదేరుతుంది. పోశమ్మగండి బోటు పాయింట్‌కు చేరుకున్న పర్యాటకులు ముందుగా అక్కడి అమ్మవారిని దర్శించుకుని తమ విహారయాత్ర ప్రారంభిస్తారు. బోటు అలా కదులుతూ అనేక చిత్ర నిర్మాణాలకు వేదికైన పూడిపల్లి గ్రామాన్ని సందర్శిస్తారు. తరువాత పోలవరం ప్రాజెక్టు హెడ్‌వర్క్స్ కనిపిస్తాయి. దేవీపట్నం చేరుకున్న తరువాత అల్లూరి దాడి చేసిన పోలీస్‌స్టేషన్, పోలవరం ముంపుతో మిగిలిన దేవీపట్నం గ్రామాన్ని దాటుకుంటూ వారి ప్రయాణం సాగుతుంది. కొండమొదలు దాటిన తరువాత పాపికొండలు దర్శనమిస్తాయి. ఈ విహార యాత్ర ఏడు గంటల పాటు సాగుతుంది. చివరిగా బోటు పేరంటపల్లి చేరుకుంటుంది. అక్కడ పురాతన శివాలయంలో పర్యాటకులు స్వామివారిని దర్శనం చేసుకుంటారు. ఆ ఆలయాన్ని స్థానిక గిరిజనులు నిర్వహిస్తున్నారు. ఆలయంలోకి ఎవరు వెళ్లి మౌనంగా ధ్యానం చేసుకుని తిరిగి బోటు వద్దకు చేరుకుంటారు. ఈ గ్రామంలో గిరిజనులు తయారు చేసిన వెదురు వస్తువులు పర్యాటకులను ఆకర్షిస్తాయి.

గోదావరి అందాలను ఆస్వాదించేందుకు..

పాపికొండలు విహార యాత్రకు వెళ్లిన పర్యాటకులు కొరుటూరు వద్ద అటవీశాఖ నిర్వహిస్తున్న పర్యాటక అతిథి గృహాల్లో బస చేసే అవకాశం ఉంటుంది. బోటు పాయింట్ నుంచి బయలు దేరిన తరువాత తిరుగు ప్రయాణంలో వారిని కొరుటూరు వద్ద వదిలిపెడతారు. మరుసటి రోజులు పేరంటాలపల్లి వెళ్లి తిరిగి వచ్చే బోట్‌లో పోశమ్మగండి పాయింట్‌కు చేరుకుంటారు. సిరివాక వద్ద పర్యాటకులు రాత్రి బస చేసేందుకు ఏర్పాట్లు ఉన్నాయి.

పోచవరం పాయింట్ వద్ద నుంచి..

ఉదయం 10 గంటలకు పోచవరం బోటు పాయింట్ నుంచి బయలుదేరిన లాంచీ సాయంత్రం 5 గంటలకు తిరిగి అదే స్థలానికి వస్తుంది. ఈ పాయింట్‌లో మొత్తంగా 20 లాంచీలు అందుబాటులో ఉంటాయి. పండగ రోజుల్లో ఈ లాంచీలు పర్యాటకులతో కిక్కిరిసిపోతాయి. శని, ఆదివారాల్లో ఐదు నుంచి ఆరు బోట్లలో 700 మంది పర్యటనకు వెళ్తారు. వారికి ఉదయం అల్పాహారంగా ఇడ్లీ, ఉప్మా, గారెలు, వడ వంటివి అందిస్తారు. మధ్యాహ్నం పేరంటాలపల్లి వెళ్లే సరికి శాకాహార భోజనం పెడతారు. నైట్ హాల్ట్ చేయాలనుకునే పర్యాటకులకు సిరివాక వద్ద ఏర్పాట్లు ఉంటాయి. పేరంటాలపల్లి వద్ద కొండరెడ్ల వెదురు అల్లికాలతో తయారు చేసిన పలు రకాల బొమ్మలు అల్లికలు ఆకట్టుకుంటాయి. ఈ మొత్తం ప్రయాణం బోటింగ్ పాయింట్ నుంచి తిరిగి అదే పాయింటుకు చేరే వరకు 80 కిలో మీటర్లు ఉంటుంది. మరో విశేషం ఏంటంటే ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని 2008వ సంవత్సరంలో జాతీయ ఉద్యాన వనంగా ప్రకటించింది. భద్రాచలం రాములవారి దర్శనం అనంతరం పాపికొండల పర్యాటనకు బయలు దేరుతారు. భద్రాచలంలో టికెట్ ధర పెద్దలకు రూ.వెయ్యి. చిన్న పిల్లలకు రూ.700, ఐదేళ్ల లోపు చిన్నారులకు ఉచితం. తిరిగి వారంతా పోచవరం బోటుపాయింట్‌కు వచ్చాక పర్యాటకులను లాంచీకి 50 మంది చొప్పున పంపిస్తారు. లాంచీ బయలు దేరే ముందు ఏపీ టూరిజం, రెవెన్యూ, నీటిపారుదల, పోలీసు శాఖలు అనుమతి ఇచ్చిన తర్వాత బోటును అనుమతి ఇస్తారు.

పాపికొండలు

గుడారాలు వద్ద పర్యాటకులు

సిరివాకలో నైట్ హాల్ట్ గుడారాలు

ఎన్‌ఈపీ-2020 లక్ష్యాలకు తూట్లు

నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ విమర్శ

భారతదేశం అభివృద్ధి చెందాలంటే మానవ వనరులు, విద్యాభివృద్ధిపై ఖర్చును పెంచాలని, బడ్జెట్‌లో మరింత కేటాయింపులు ఉండాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. 2026-27 కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి చేసిన కేటాయింపులు జాతీయ విద్యావిధానం-2020 లక్ష్యాలకు దూరంగా ఉన్నాయని, జీడీపీలో 6 శాతం లక్ష్యాన్ని చేరుకోవడం అసాధ్యంగా ఉందన్నారు. భారత ప్రభుత్వం విద్యపై జీడీపీలో కేవలం 2.6 నుంచి 2.7 శాతం మాత్రమే ఖర్చు చేస్తోందని, రాష్ట్ర ప్రభుత్వాల ఖర్చు కలిపితే ఈ మొత్తం 3.8 నుంచి 4.6 శాతం మాత్రమేనన్నారు.

విద్యార్థుల ఆకాంక్షలను నీరుగార్చిన బడ్జెట్: ఎస్ఎఫ్ఐ

విద్యారంగంపై కేంద్ర ప్రభుత్వానికున్న నిర్లక్ష్యాన్ని 2026-27 బడ్జెట్ మరోసారి స్పష్టం చేసిందని, జీడీపీలో 6 శాతం నిధులను విద్యారంగానికి కేటాయించడంలో కేంద్రం మరోసారి విఫలమైందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్, కార్యదర్శి కె.ప్రసన్న కుమార్ ఓ ప్రకటనలో విమర్శించారు. నిధుల లేమితో కొన్నేళ్లుగా దేశవ్యాప్తంగా 89,441 పాఠశాలలు మూతపడ్డాయన్నారు. 'ఎడ్యుకేషన్ టు ఎంప్లాయ్‌మెంట్' కమిటీ పేరుతో కాలయాపన చేయడమే తప్ప చేసిందేమీ లేదని, ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న లక్షలాది పోస్టుల భర్తీకి నిధులు ఇవ్వలేదన్నారు.

ఈస్టర్న్ ఎయిర్ కమాండ్ చీఫ్‌గా ఎయిర్ మార్షల్ ఇంద్రపాల్

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎయిర్ మార్షల్ ఇంద్రపాల్ సింగ్ వాలియా

సాక్షి, విశాఖపట్నం: భారత వైమానిక దళ (ఐఏఎఫ్) ఈస్టర్న్ ఎయిర్ కమాండ్ ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్‌గా ఎయిర్ మార్షల్ ఇంద్రపాల్ సింగ్ వాలియా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ పూర్వ విద్యార్థి అయిన ఈయన.. 1988లో ఫైటర్ స్ట్రీమ్‌లో విధుల్లో చేరారు. మూడున్నర దశాబ్దాలకు పైగా సుదీర్ఘ కెరీర్‌లో మిగ్-21, మిగ్-23, సుఖోయ్-30 ఎంకేఐ వంటి పలు యుద్ధ విమానాల్లో 3,200 గంటలకుపైగా ప్రమాద రహితంగా ప్రయాణించిన రికార్డు ఇంద్రపాల్ సొంతం. జపాన్, దక్షిణ కొరియాల్లో డిఫెన్స్ అటాచ్‌గా, శిక్షణ విభాగం అసిస్టెంట్ చీఫ్‌గా కీలక బాధ్యతలు నిర్వహించిన ఈయన విశిష్ట సేవలకు గానూ 2008లో వాయు సేన మెడల్, 2018లో అతి విశిష్ట సేవా మెడల్ లభించాయి. జనవరి 31న పదవీ విరమణ చేసిన ఎయిర్ మార్షల్ సూరత్ సింగ్ స్థానంలో ఎయిర్ మార్షల్ ఇంద్రపాల్ బాధ్యతలు చేపట్టారు.

కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి మొండి చేయి

స్కూల్ టీచర్స్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం రూ.1,39,289 కోట్లు కేటాయించడం శోచనీయమని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొఠారి విద్యా కమిషన్ జాతీయ ఆదాయంలో కనీసం 6 శాతం విద్యకు కేటాయించాలని స్పష్టంగా సిఫార్సు చేసినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఒకవైపు 'వికసిత భారత్, 'నాణ్యమైన విద్య' అంటూ ప్రకటనలు చేస్తూ మరోవైపు విద్యారంగానికి కనీస నిధులు కేటాయించకుండా మొండి చేయి చూపిందని పేర్కొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: ఆదివాసీ గిరిజన సంఘం

సాక్షి, అమరావతి: ఏలూరు గిరిజన ప్రాంతాల్లో గత 9 నెలల్లో 281 మంది మహిళలకు అబార్షన్స్ కావడం, 319 మంది పుట్టిన పిల్లలు రికార్డుల్లో నమోదు కాకపోవడం వంటి ఘటనలపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు లోతా రామారావు, కిల్లో సురేంద్ర ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్‌సీడీ సర్వే, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులు, రక్తహీనతతో బాధపడుతున్న వారి వివరాలను వెల్లడించాలని కోరారు. ఈ ఘటనపై ఐటీడీఏ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, పర్యవేక్షణ లేకపోవడం దారుణమన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఆదివాసీల అభివృద్ధి మా లక్ష్యం అంటూ గొప్పలు చెబుతోందని, కానీ ఆచరణలో మాత్రం శూన్యమని విమర్శించారు.

బడ్జెట్‌పై అభిప్రాయాలు

కౌలు రైతుల ప్రస్తావన లేదు..

దేశంలో 50 శాతానికి పైగా భూమిలో ఆహార, వాణిజ్య, ఉద్యాన పంటలు పండిస్తూ వ్యవసాయ రంగంలో కీలకపాత్ర పోషిస్తున్న కౌలు రైతులకు కేంద్ర బడ్జెట్లో తీవ్ర అన్యాయం జరిగింది. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు కేవలం రూ.1,62,671 కోట్లు మాత్రమే కేటాయించి కేంద్రం చేతులు దులుపుకుంది. డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధర ప్రకటన, ధరల స్థిరీకరణ నిధికి రూ.50 వేల కోట్లు కేటాయింపుపై పట్టించుకోకపోవడం దారుణం.

– ఎ.కాటమయ్య, పి.జమలయ్య, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

బడ్జెట్‌లో ఉద్యోగులకు నిరాశ : ఏపీటీఎఫ్ అమరావతి

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఏమాత్రం ఆశాజనకంగా లేదని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ ఓ ప్రకటనలో విమర్శించారు. ఆదాయ పన్ను నిబంధనల్లో ఎలాంటి మార్పు లేకపోవడం నిరాశపరిచిందని, కొత్త పన్ను నిబంధనల్లో పొదుపు, ఇతర తగ్గింపులకు అవకాశం కల్పించాల్సి ఉందని, స్టాండర్డ్ డిడక్షన్ ఇంకా పెంచాలన్నారు. రూ.7 లక్షల వరకు పన్నులేని పరిమితి వస్తుందన్న ఆశ నిరాశగా మిగిలిందన్నారు.

ఉద్యోగ వర్గాలకు నిరాశే : ఏపీటీఎఫ్

కేంద్ర బడ్జెట్‌లో ఆదాయపు పన్ను మినహాయింపు, విద్యారంగ కేటాయింపులు ఆశించినంతగా లేవని, ఇది ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలను తీవ్ర నిరాశకు గురిచేసిందని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి అన్నారు. ఆదాయపు పన్నులో స్టాండర్డ్ డిడక్షన్ రూ.75 వేల నుంచి పెంచుతారని ఆశించినా కేంద్ర ఆర్థిక మంత్రి నిరాశే మిగిల్చారన్నారు. ఆదాయ పన్ను లేని పద్దు రూ.12 లక్షలలో కూడా ఏం మాత్రం పెరుగుదల లేన్నారు. విద్యకు బడ్జెట్‌లో కేవలం 2.6 శాతం మాత్రమే నిధులు కేటాయించారని, ఇవి దేనికీ సరిపోవన్నారు.

ఉద్యోగులకు ఊరటనివ్వని బడ్జెట్: ఎస్టీయూ

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగులకు ఎలాంటి ఊరట ఇవ్వలేదని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లు రఘునాథరెడ్డి, ఎల్.సాయి శ్రీనివాస్ ఓ ప్రకటనలో విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు, వైద్య ఖర్చులు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ఆదాయ పన్ను స్టాండర్డ్ డిడక్షన్ రూ.1.5 లక్షల వరకు పెంచుతారని ఆశిస్తే గత సంవత్సరం స్లాబులే అమలు చేయడం శోచనీయమన్నారు. విద్యా రంగానికి కేవలం 2.60 శాతం మాత్రమే నిధులు కేటాయించారని గుర్తు చేశారు.

లడ్డూపై ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారు?

- ప్రజా సమస్యలు రాష్ట్ర ప్రభుత్వానికి పట్టవా?
- సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ, చిత్రంలో రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

సాక్షి,అమరావతి: లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు ప్రభుత్వం రోజంతా ప్రెస్ మీట్లు , క్యాబినెట్‌లో చర్చ, మంత్రులందరూ అదే అంశంపై మాట్లాడడం ద్వారా ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ప్రశ్నించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పక్కన పెట్టి ప్రభుత్వం లడ్డూ అంశంపై దృష్టిమరల్చడం దురదృష్టకరమన్నారు. విజయవాడ దాసరి భవన్‌లో ఆదివారం రామకృష్ణ ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్యతో కలిసి మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల12న తలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్రంలో లడ్డూ కల్తీ అంశమే తప్ప నిరుద్యోగం లేదా? రైతుల సమస్యలు లేవా? ధరల పెరుగుదల లేదా? కార్మికుల కష్టాలు లేవా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. రాష్ట్రంలో మెడికల్ మాఫియాకు వ్యతిరేకంగా ఈ నెల 14న రాష్ట్ర వ్యాప్తంగా భారీ ఆందోళన కార్యక్రమానికి పిలుపునిచ్చామన్నారు. సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బి.హరినాథ్ రెడ్డి పాల్గొన్నారు.

భక్తజన 'సాగరం'

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీలక్ష్మీ నృసింహస్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం అసంఖ్యాకంగా భక్తులు స్వామితో పాటు సముద్రంలో పుణ్యస్నానాలు చేశారు. 3 లక్షల మంది భక్తులతో సముద్ర తీరం, ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ప్రధానార్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి ఆధ్వర్యంలో పేరూరు ఉద్దండ పండితులు స్వామిని శిరస్సుపై ధరించి సముద్ర స్నానం చేయించారు. – సఖినేటిపల్లి

ప్రభుత్వ స్కూళ్లలో 13 లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారు

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ ఉపాధ్యాయ నేతలు

- మీడియాతో యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్

తిరుపతి అర్బన్: ప్రభుత్వ పాఠశాలలు తగ్గిపోతున్న తరుణంలో ఉపాధ్యాయ పోస్టులు సైతం గల్లంతయ్యే ప్రమాదం పొంచి ఉందని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ వెల్లడించారు. ఆదివారం ఇక్కడ తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, అన్నమయ్య, మార్కాపురం జిల్లాలకు చెందిన యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నేతలు సమావేశమయ్యారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'ఊరి బడిని కాపాడుకుందాం.. 'ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పిద్దాం' అనే నినాదంతో సోమవారం నుంచి వచ్చే జూన్ వరకు పాఠశాలల పరిధిలో ఉపాధ్యాయులు విద్యార్థులను చేర్పించడానికి పెద్దఎత్తున కృషి చేస్తారని చెప్పారు. ఇప్పటికే క్లస్టర్ల పేరుతో ప్రభుత్వ స్కూళ్లను పెద్దఎత్తున కుదిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. మరోవైపు రెండేళ్ల కిందట 46 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివేవారని, ప్రస్తుతం ఆ సంఖ్య 33 లక్షల మందికి పడిపోయిందన్నారు. రెండేళ్ల వ్యవధిలో రాష్ట్రంలో 13 లక్షల మంది పిల్లలు తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫిబ్రవరి 5 నుంచి 20వ తేదీ వరకు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ సీఎం చంద్రబాబుకు లక్ష పోస్ట్ కార్డులను పంపిస్తామని.. అప్పటికీ సరైన స్పందన లేకపోతే ఫిబ్రవరి 17న చలో విజయవాడ చేపడతామని చెప్పారు.

కేజీహెచ్‌లో 'పెయిన్ క్లినిక్' ప్రారంభం

డాబాగార్డెన్స్(విశాఖ): రాష్ట్రంలోనే మొట్టమొదటి పెయిన్ క్లినిక్‌ను విశాఖ కింగ్ జార్జ్ ఆస్పత్రిలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదివారం ప్రారంభించారు. ఆంధ్ర మెడికల్ కాలేజ్ నార్త్ అమెరికా అలుమ్ని ఈ క్లినిక్ ఏర్పాటు కోసం రూ.కోటి విరాళం అందించడంపై మంత్రి అభినందనలు తెలిపారు. ఇటీవల గుంటూరులో 600 పడకల మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఏర్పాటులోనూ, విశాఖ, కాకినాడ ప్రభుత్వ వైద్య సంస్థల అభివృద్ధిలోనూ పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం స్ఫూర్తిదాయకమని ఆయన కొనియాడారు.

పర్యటన - తవాంగ్

కొన్ని పర్యాటక ప్రదేశాలకు వెళ్లి వచ్చాక ఎంతకాలమైనా అవి మన హృదయాన్ని వీడిపోవు. అక్కడి ప్రకృతి సౌందర్యం, అద్భుతమైన మనుషుల ప్రవర్తన మన మనసులో అలాగే నిలిచిపోతాయి. అలాంటి వాటిలో అత్యుత్తమమైన స్థానం 'తవాంగ్'కి దక్కుతుంది. అరుణాచల్‌ప్రదేశ్‌లో ఉన్న 'తవాంగ్' ఒక హిల్ స్టేషన్ మాత్రమే కాదు. మన మనసుకు ప్రశాంతతను ఇచ్చే అత్యుత్తమమైన డెస్టినేషన్. పర్వతాల మధ్యలో, మేఘాల నడుమ, బౌద్ధ మత సారాన్ని గ్రహిస్తూ సాగే ధ్యాన ప్రయాణం విశేషాల గురించి ట్రావెలర్ ఎం.జి. కిశోర్ వివరిస్తున్నారు...

ధ్యాన ప్రయాణం

పర్వతాల మధ్య జీవన ధార

'తవాంగ్'లో ఉదయ కాంతి చాలా సుతిమెత్తగా ఉంటుంది. పర్వతాల మధ్య మేఘాలు మెల్లిగా కదులుతూ, భూమిని తాకుతున్నట్టుగా అనిపిస్తాయి. గాలులు నిశ్శబ్దంగా వీస్తూ పర్యాటకుల మేనిని స్పృశిస్తాయి. ఇక్కడి వాతావరణంలో సాధారణంగా ఊపిరి తీసుకోవడం కూడా ఒక ధ్యానంలా అనిపిస్తుంది. ఇక్కడి ప్రకృతి బ్యాక్‌గ్రౌండ్ ఇమేజ్ మాత్రమే కాదు, అదే మెయిన్ ఫ్రేమ్.



మహిళా సన్యాసుల మఠాలు

తవాంగ్‌లో కొన్ని బౌద్ధ మఠాలను కేవలం మహిళా సన్యాసులు మాత్రమే నిర్వహిస్తారు. దలైలామా పుట్టిన రోజు సందర్భంగా తవాంగ్ వెళ్లాను. ఒక మహిళా మఠానికి వెళ్లినప్పుడు, అక్కడ వారు ఇచ్చిన యాక్ (జడలు బర్రె) మిల్క్‌తో చేసిన టీ తాగాను. బయటి ప్రపంచం నుంచి దూరంగా ఉన్నా, నాలాంటి ప్రయాణికులు వచ్చినప్పుడు నిష్కల్మషమైన చిరునవ్వుతో పలకరించే విధానం అరుదుగా కనిపించే విషయం.

ఇక్కడ చేయాల్సిన 5 పనులు

1. తవాంగ్‌కు బయల్దేరినప్పుడు మీకు ఊపిరి పీల్చుకోవడంలో కాస్త ఇబ్బంది అనిపిస్తే అరుణాచల్ ప్రదేశ్‌లో అతి ఎత్తైన పర్వత మార్గం 'సేలా పాస్' వచ్చిందని అర్థం. ఘనీభవించిన సేలా సరస్సు మీదుగా ప్రయాణించవచ్చు. స్వర్గ సరస్సు అని దీనికి పేరు. ఈ ప్రయాణం అత్యద్భుతంగా అనిపిస్తుంది.
2. తవాంగ్‌లో వార్ మెమోరియల్, పీ.టి.సో లేక్, ఉర్గేలింగ్ మోనాస్టరీ ... తప్పక సందర్శించదగినవి.
3. అతిపెద్ద బుద్ధుడి విగ్రహం ఉంటుంది. అక్కడికి వెళ్లి, శిలాఫలకాలపై చెక్కిన సూక్తులు చదివి, అర్థం చేసుకోవచ్చు.
4. బౌద్ధమతంలో కీలక ప్రదేశం కాబట్టి ఇక్కడ జీవహింసకు తావు ఉండదు. కాబట్టి మీరు చీకటి పడ్డాక బయటికి వెళ్తే ఒక డజను కుక్కలు కనిపిస్తే షాక్ అవ్వకండి. అలాగని ఈ కొండ కుక్కలను తేలికగా తీసుకోకండి. ఎక్కడ బయట తిరగాలన్నా చీకటి పడేలోపే అని గుర్తుంచుకోవాలి.
5. తవాంగ్ మోనాస్టరీలో మీరు బౌద్ధ సన్యాసులను జీవితం గురించి ఏమైనా ప్రశ్నలు అడగాలనుకుంటే అడగొచ్చు.

సందర్శనీయ స్థలాలు

తవాంగ్‌లో అన్ని దిశల్లో సందర్శనీయ ప్రదేశాలు ఉన్నాయి. తవాంగ్ మోనాస్టరీ నుంచి అన్నీస్ నన్నరీ అనే మహిళల మఠం, లోకల్ మార్కెట్లు, ఇక్కడి చిన్న చిన్న కేఫ్‌లు, విండ్ హార్స్ అని పిలిచే రంగురంగుల పతాకాలు, ఇవన్నీ ఎవర్‌గ్రీన్ మెమరీలుగా మిగిలిపోతాయి. ఇక టౌన్ నుంచి బయటికి వస్తే మాధురీ లేక్ చుట్టూ ఉన్న ప్రశాంతత, భారత్–చైనా సరిహద్దు వద్ద ఉన్న బూమ్లా పాస్ ప్రయాణం, మధ్య మధ్యలో కనిపించే ఎన్నో సరస్సులు, ఇవన్నీ మర్చిపోవడం దాదాపు అసాధ్యం.

చైనా బార్డర్ ఉన్న బూమ్లా పాస్ వెళ్లాలంటే మీకు ఇన్నర్ లైన్ పర్మిట్‌తో పాటు లోకల్ అధికారుల నుంచి అనుమతి కూడా అవసరం అవుతుంది. మీరు ఇక్కడ బైక్ రెంట్‌కు తీసుకుని కూడా ప్రయాణించవచ్చు. ఆర్మీ క్యాంపుల వద్ద ఫోటోగ్రఫీ నిషేధం అని తప్పక గుర్తుంచుకోవాల్సిన విషయం.



ఎలా వెళ్లాలి?!

- తవాంగ్‌కు వెళ్లే మార్గం కూడా తవాంగ్ ఎక్స్‌పీరియెన్స్‌లో భాగమే. గమ్యం కన్నా ప్రయాణాన్ని ఎంజాయ్ చేయాలని నేర్పే జర్నీ ఇది.
- గౌహతికి అన్ని ప్రాంతాల నుంచి బస్సు, రైలు, విమాన మార్గాల ద్వారా చేరుకోవచ్చు.
- గౌహతి నుంచి తవాంగ్ వెళ్లే దారిలో పర్వతాల మధ్య మెలికలు తిరిగే రహదారులు, మధ్యలో చేతికి అందేంత దూరంలో మేఘాలు, బ్రహ్మపుత్ర లోయ, దిరాంగ్ వ్యాలీ, వాటిని తడిపేస్తూ ముందుకు వెళ్తున్న బ్రహ్మపుత్ర నది.. ఇవన్నీ మనసును మరో లోకంలో విహరింపజేస్తాయి.

గమనిక : తవాంగ్ వెళ్లడం కోసం మంచి ట్రావెల్ హిస్టరీ ఉన్న బస్సు లేదా ట్యాక్సీని మాత్రమే ఎంచుకోవాలి.

ఎక్కడ ఉండాలి?

- తవాంగ్‌లో హోమ్‌స్టేలు, లోకల్ హౌసులు, మోనాస్టరీ చుట్టూ ఉన్న చిన్న చిన్న లాడ్జీలు అన్నీ కూడా ఈ టౌన్ థీమ్‌లో పర్యాటకులకు స్వాగతం పలుకుతాయి.
- హిల్ వ్యూ ఉన్న రూమ్‌లోంచి ఉదయం సూర్యోదయం చూసిన తరువాత అరుణాచల్ ప్రదేశ్‌ను ''ది ల్యాండ్ ఆఫ్ ది రైజింగ్ సన్'' అని ఎందుకు అంటారో అర్థం అవుతుంది. ఎందుకంటే భానుడి తొలికిరణం ఇక్కడే పడుతుంది.

చూరా సబ్జీ

అరుణాచల్ ప్రదేశ్‌లో ఎంటర్ అయినప్పటి నుంచి మెనూలో మార్పు కనిపిస్తుంది. ఇక్కడ తూపా, చౌమీన్, మోమోస్, అపాంగ్, చూరా సబ్జీతో పాటు అనేక రకాల కొత్త రుచులను ఆస్వాదించవచ్చు.

నేను బస చేసిన వారికే ఉదయం బ్రేక్‌ఫాస్ట్, రాత్రి డిన్నర్ ఏర్పాటు చేయమని చెప్పాను. దాంతో మధ్యాహ్నం సమయంలోనే ఫుడ్ ఎక్స్‌పెరిమెంట్స్ చేయగలిగాను. మీరు డ్రాగన్ రెస్టారెంట్‌లో ఫుడ్ ట్రై చేయొచ్చు. ఇక్కడ అన్ని రకాల నార్త్ ఈస్ట్ వెరైటీలు లభిస్తాయి.

ఇక్కడ ప్రతి ఇంటి ముందు టన్నుల కొద్దీ బంగాళాదుంపలు కనిపిస్తాయి. వాటిని కూరల్లో వినియోగించడంతో పాటు జస్ట్ ఉడకబెట్టి ఉప్పు, మసాలా వేసుకుని తినేస్తారు. ఈ అలవాటు నాకు కాస్త కొత్తగా అనిపించింది.

అతిపెద్ద మఠం

భారతదేశంలోనే అతిపెద్ద మోనాస్టరీ అనే మఠం తవాంగ్‌లో ఉంది. ఇది ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద మఠం. ఈ మోనాస్టరీలో ఉదయం, సాయంత్రం బౌద్ధ సన్యాసుల ప్రార్థనలు, యాక్ నెయ్యితో వెలిగే దీపాలు, సన్యాసులు నడిచే మార్గాలు, మోనాస్టరీ లోపల చిత్రకళ... ఇవన్నీ మనల్ని వేరే ప్రపంచంలోకి తీసుకెళ్తాయి.

పర్యటన కాలం

- పర్యటనకు సరైన సమయం అనేది సీజన్‌ను బట్టి మారుతుంది. మంచు చూడాలనుకుంటే చలికాలంలో వెళ్లొచ్చు.
- తవాంగ్‌ను ప్రశాంతంగా చూడాలంటే చలికాలానికి ముందు వెళ్లడం మంచిది.
- వర్షాకాలం మాత్రం ప్లాన్ చేయకపోవడం ఉత్తమం.
- మొత్తానికి నార్త్ ఈస్ట్ ఎంత అందంగా ఉంటుందో స్వయంగా కళ్లతో సందర్శిస్తేనే తెలుస్తుంది. ఒక్కసారి వెళ్తే ఈ ప్రయాణం మైండ్‌లో స్టోర్ అయి, గుండెలో రిపీట్ మోడ్‌లో ప్లే అవుతూనే ఉంటుంది.

- ఎం.జి.కిశోర్, ప్రయాణికుడు



లోనార్ లేక్: దక్కన్ పీఠభూమిలో అంతరిక్ష రహస్యం

భూమికి, అంతరిక్షానికి మధ్య జరిగిన ఒక భయంకరమైన ఘటనకు సాక్ష్యంగా నిలుస్తుంది మహారాష్ట్రలోని లోనార్ సరస్సు.

ఎన్నో సందేహాలతో పాటు కుతూహలం కలిగించే ప్రదేశం ఇది. అలాగే అత్యంత జాగ్రత్తగా ఉండాల్సిన ప్రదేశం కూడా. ఎందుకంటే ఇది మనకు తెలిసిన చరిత్రకు ముందు జరిగిన చరిత్ర.

ఇక్కడ ఒకానొక కాలంలో ఉల్క పడటం వల్ల భారీ గుండం ఏర్పడింది అని, అది తరువాత సరస్సుగా మారిందని చెబుతారు. సాధారణంగా ఇలాంటి క్రేటర్లు వేల నుంచి లక్షల సంవత్సరాల క్రితం ఏర్పడి ఉంటాయి. ఈ క్రేటర్లు భూమి – అంతరిక్షం మధ్య ఉన్న చరిత్రకు సాక్ష్యాలు. సౌరమండలంలో జరిగిన మార్పులకు చిహ్నాలు అని కూడా చెప్పవచ్చు. అలాగే భూమిపై జీవనం ఎలా వికసించింది అనేది తెలుసుకోవడానికి కూడా ఇవి సహాయపడతాయి.

చుట్టుపక్కల ఉన్న రాళ్లలో అయస్కాంత లక్షణాలు ఉన్నాయని స్థానికులు చెబుతుంటారు. కావాలంటే మీరూ ఒకసారి ప్రయత్నించవచ్చు. ఉదయం వేళ పక్షుల కిలకిలారావాలతో పాటు, చాలా తక్కువ సంఖ్యలో పర్యాటకులను కూడా చూడవచ్చు.

లోనార్ లేక్ పర్యావరణ వ్యవస్థ అనేది చాలా సున్నితమైనది. అందుకే దీనిని పర్యాటక ప్రాంతంగా ప్రమోట్ చేయడం లేదు. ఇక్కడ శాస్త్రవేత్తలు పరిశోధనలు చేయవచ్చు. పర్యాటకులు పరిశీలించవచ్చు. అంతే కానీ, లోనార్‌కు వెళ్లి 'చూసొచ్చాం' అని కాకుండా భూమి చరిత్రను 'తెలుసుకుని వచ్చాం' అని చెప్పడం బెస్ట్.

ఫోన్‌లో ట్రావెల్ డాక్యుమెంట్స్ ఎక్కడ సేవ్ చేయాలి?!

ప్రయాణాల్లో డాక్యుమెంట్స్ చూపించమని అధికారులు కోరితే పేపర్లు వెతికే అవసరంఈ రోజుల్లో లేదు. మీ ఫోన్‌లోనే అన్నీ సేవ్ చేసుకోండి. ఈ సింపుల్ టిప్స్ మీకోసం..

- ఈ రోజుల్లో చాలా మంది ప్రయాణికులు తమ డాక్యుమెంట్స్ అంటే ఐడీ ప్రూఫ్స్, హోటల్ బుకింగ్, ట్రైన్ వివరాలు అన్నీ కూడా ఫోన్‌లోనే సేవ్ చేసుకుని బయల్దేరుతున్నారు. పేపర్ ఫైల్స్ క్యారీ చేయడం కన్నా స్క్రీన్‌పై డిపెండ్ అవ్వడం ఇప్పుడు సాధారణం అయింది. అయితే దీని కోసం ఒక చిన్న డిజిటల్ ట్రావెల్ హ్యాబిట్‌ను మీరు అలవాటు చేసుకోవాల్సి ఉంటుంది.
- ఇంపార్టెంట్ డాక్యుమెంట్స్ అన్నీ కూడా క్లౌడ్ స్టోరేజీలో (Google Drive లాంటివి) ఒక సెపరేట్ ఫోల్డర్ క్రియేట్ చేసి స్టోర్ చేసుకోండి.
- ఇందులో ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, టికెట్లు, కన్ఫర్మేషన్స్, వీసా.. ఇలా అన్ని డాక్యుమెంట్స్ స్టోర్ చేసుకోవచ్చు. ఫోన్ పోయినా లేదా బ్యాటరీ లో అయినా గూగుల్ డ్రైవ్ నుంచి మీరు యాక్సెస్ చేసుకోవచ్చు.
- తరచూ ప్రయాణాలు చేసే వారికి ఈ టిప్స్ బాగా ఉపయోగపడతాయి. ఎయిర్‌పోర్టులో, రైల్వే కౌంటర్‌లో, హోటల్ రిసెప్షన్‌లో హఠాత్తుగా ఎవరైనా డాక్యుమెంట్స్ అడిగినప్పుడు బ్యాగ్‌లలో వెతకడం కన్నా ఫోన్‌లో డాక్యుమెంట్స్ క్షణాల్లో వారికి చూపించవచ్చు.

హంపి: ఇక్కడ ప్రతి రాయికీ ఓ కథ ఉంది

హంపి అంటే చాలా మంది శిథిలాల నగరం అని పిలుస్తుంటారు.

కానీ హంపిలో అడుగుపెట్టగానే మైండ్‌లో వచ్చే ఫస్ట్ థాట్.. ఇవి శిథిలాలు కాదు. ఇవి పురాతనమైన నగరం తాలుకూ జ్ఞాపకాలు అని!

హిస్టరీ క్లాసుల్లో వినేటప్పుడు బోర్ కొట్టిన విషయాలను ఇక్కడి శిథిలాలు నోరు తెరచి తమ కథను చెబుతున్నట్టు అనిపిస్తుంది. రాళ్లకు జీవం ఉండదు. అయితే హంపీ జీవం లేని ప్రదేశం కాదు. ఇక్కడ రాళ్లు, ఆలయాలు, నదీ శబ్దం ఇన్నీ కూడా మనల్ని పర్యాటకులుగా కాదు ఒక చరిత్రకారుడిలా ట్రీట్ చేస్తాయి. ఇక్కడ అడుగుపెట్టిన క్షణం నుంచి మనం గతంలోకి వెళ్లిపోతాం. సూర్యాస్తమయం సమయంలో హంపీ రంగులు ఒక అందమైన కవిత్వంలా కనిపిస్తాయి. రాళ్ల రంగును డామినేట్ చేసే బంగారు వర్ణం ఒక డిఫరెంట్ షేడ్‌లా మారిపోతాయి.



చరిత్రను మనం పుస్తకాల్లో చదవడం అలవాటు చేసుకున్నాం. కాని పుస్తకాలు దాటి అర్థం చేసుకునే అవకాశం మాత్రం హంపీ లాంటి ప్రదేశాల్లోనే దొరకుతుంది.

లంగ్కావి: స్ట్రెస్ నుంచి బ్రేక్... లంగ్కావి వెళ్తే సరి!

మలేషియాలోని లాంగ్కావి ద్వీపంలో అడుగుపెట్టగానే టైమ్ బ్రేక్ తీసుకుందేమో అనిపించకమానదు. అంతా కాస్త స్లో అవుతుంది. అండమాన్ సముద్ర తీరంలో ఉన్న ఈ ఐలాండ్ బీచులు చాలా ప్రశాంతంగా ఉంటాయి. క్రౌడ్, సౌండ్, హడావిడి లేని బీచ్ ఎక్స్‌పీరియెన్స్ కోసం చాలా మంది ఇక్కడికి వస్తుంటారు. మొత్తానికి, స్లో టూరిజం ఇష్టపడే వారికి ఇది బెస్ట్ ఛాయిస్.

ఎలా చేరుకోవాలంటే...

లంగ్కావికి విమానంలో సులభంగా చేరుకోవచ్చు. కౌలాలంపూర్ నుంచి ప్రతీ రోజూ డైరెక్ట్ విమాన సేవలు అందుబాటులో ఉంటాయి. అంతర్జాతీయ ప్రయాణికులు ముందుగా కౌలాలంపూర్ చేరుకుని, అక్కడి నుంచి దేశీయ విమానాల్లో లాంగ్కావికి ప్రయాణిస్తారు. అలాగే, ఇక్కడికి చేరుకునేందుకు ఫెర్రీ ఆప్షన్ కూడా ఉంది. పెనాంగ్ లేదా కౌలా కెదాహ్ నుంచి లాంగ్కావికి రెగ్యులర్ ఫెర్రీలు నడుస్తాయి.



చిరుగాలుల సవ్వడి..

లాంగ్కావిలో యాక్టివిటీస్ అంటే సుడిగాలిలా కాకుండా చిరుగాలిలా ఉంటాయి. సింపుల్ అండ్ స్మూత్ యాక్టివిటీస్ ఉంటాయి. బీచ్ వాక్, సన్‌సెట్ చూడటం, మాంగ్రోవ్ వనాల్లో బోట్.

లాంగ్కావి అనేది సాధారణ పర్యాటక ప్రదేశం కాదు. హడావిడి ఉండదు, ట్రావెల్ లిస్ట్ కంప్లీట్ చేయాలనే తొందర కూడా కనిపించదు. కాబట్టి, నిజంగా బుర్రకు బ్రేక్ కావాలి అంటే.. లాంగ్కావి బెస్ట్ ప్లేస్ అని నిస్సందేహంగా చెప్పొచ్చు.

దేవిక ధమాకా

థాయ్‌లాండ్ మాస్టర్స్ టైటిల్ గెలిచిన భారత రైజింగ్ స్టార్ షట్లర్

బ్యాంకాక్: అంచనాలకు మించి రాణించిన భారత రైజింగ్ స్టార్ షట్లర్ దేవిక సిహాగ్ తన కెరీర్‌లోనే గొప్ప విజయాన్ని అందుకుంది. ఆదివారం ముగిసిన థాయ్‌లాండ్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీలో దేవిక చాంపియన్‌గా అవతరించింది. హరియాణాకు చెందిన 20 ఏళ్ల దేవిక కెరీర్‌లో ఇదే తొలి సూపర్–300 టైటిల్ కావడం విశేషం. ప్రపంచ 68వ ర్యాంకర్, రెండుసార్లు జూనియర్ వరల్డ్ చాంపియన్ గో జిన్ వె (మలేసియా)తో జరిగిన ఫైనల్లో దేవిక తొలి గేమ్‌ను 21–8తో సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో 6–3తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఈ దశలో గాయం కారణంగా గో జిన్ వె మ్యాచ్ నుంచి వైదొలిగింది. దాంతో దేవికకు టైటిల్ ఖరారైంది. విజేత దేవికకు 18,750 డాలర్ల (రూ. 17 లక్షల 19 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 7000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. పీవీ సింధు, సైనా నెహ్వాల్ తర్వాత థాయ్‌లాండ్ సూపర్–300 టైటిల్ నెగ్గిన మూడో భారతీయ క్రీడాకారిణిగా దేవిక గుర్తింపు పొందింది. టైటిల్ గెలిచే క్రమంలో దేవిక తన ప్రత్యర్థులకు ఒక్క గేమ్ కూడా కోల్పోకపోవడం విశేషం. ఈ టైటిల్‌తో ప్రపంచ 63వ ర్యాంకర్ దేవిక మంగళ వారం విడుదల చేసే ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్–40లో చోటు సంపాదిస్తుంది.

'చాలా ఆనందంగా ఉంది. నా కెరీర్‌లో ఇదే తొలి సూపర్–300 లెవెల్ టైటిల్. ఈ సీజన్‌లో మరిన్ని టోర్నీలు ఆడతాను. థాయ్‌లాండ్ ఓపెన్‌లో అన్ని మ్యాచ్‌లు బాగా ఆడాను. కొత్త పాఠాలు నేర్చుకున్నాను. ఫైనల్లో గెలుపోట ములు గురించి ఆలోచించలేదు. నా అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలనే లక్ష్యంతో బరిలోకి దిగాను' అని దేవిక వ్యాఖ్యానించింది. బెంగళూరులోని పదుకొనే–ద్రవిడ్ సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్స్‌లెక్స్‌లో ఉమేంద్ర రాణా వద్ద దేవిక శిక్షణ తీసుకుంటోంది.

సాయికార్తీక్ విష్ణువర్ధన్

విష్ణువర్ధన్ ఖాతాలో 48వ డబుల్స్ టైటిల్

సాక్షి, హైదరాబాద్: భారత డేవిస్‌కప్ జట్టు మాజీ సభ్యుడు, లండన్ ఒలింపిక్స్‌లో పోటీపడ్డ హైదరాబాద్ టెన్నిస్ ప్లేయర్ విష్ణువర్ధన్ తన కెరీర్‌లో 48వ డబుల్స్ టైటిల్‌ను సాధించాడు. జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) ఎం15 టోర్నీలో తెలంగాణకే చెందిన గంటా సాయికార్తీక్ రెడ్డితో కలిసి విష్ణువర్ధన్ డబుల్స్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. 25 ఏళ్ల సాయికార్తీక్ రెడ్డికిది 11వ డబుల్స్ టైటిల్ కావడం విశేషం. డబుల్స్ ఫైనల్లో విష్ణువర్ధన్–సాయికార్తీక్ ద్వయం 6–1, 6–4తో ఇషాక్ ఇక్బాల్–దేవ్ జావియా (భారత్) జంటపై గెలిచింది. 67 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో విష్ణు–సాయికార్తీక్ ఐదు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తొలి సర్వీస్‌లో 23 పాయింట్లు, రెండో సర్వీస్‌లో 9 పాయింట్లు స్కోరు చేశారు. తమ సర్వీస్‌ను ఒక్కసారి కూడా కోల్పోకుండా, ప్రత్యర్థుల సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశారు. తొలి రౌండ్‌లో విష్ణు–సాయికార్తీక్ 6–3, 6–4తో నైషిక్ రెడ్డి గణగామ–మాచెర్ల తీర్థ శశాంక్ (భారత్)లపై, క్వార్టర్ ఫైనల్లో 6–3, 7–5తో అర్జున్–కహీర్ (భారత్)లపై, సెమీఫైనల్లో 5–7, 7–6 (7/4), 10–8తో ఆదిత్య–అథర్వ (భారత్)లపై విజయం సాధించారు. 38 ఏళ్ల విష్ణు వేర్వేరు భాగస్వాము లతో కలిసి 2008లో 1... 2009లో 6... 2010లో 3 ... 2011లో 5... 2012లో 1... 2013లో 1... 2014లో 3... 2015లో 4... 2016లో 5... 2017లో 10... 2018లో 2... 2021లో 1... 2023లో 3... 2024లో 2... 2026లో 1 డబుల్స్ టైటిల్ గెలిచాడు.

ఫైనల్లో అనాహత్

వాషింగ్టన్: ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ (పీఎస్‌ఏ) 'ఫైర్ ఓపెన్' టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్ మహిళా క్రీడాకారిణి అనాహత్ సింగ్ టైటిల్ పోరుకు అర్హత సాధించింది. మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో ప్రపంచ 31వ ర్యాంకర్ అనాహత్ 11–9, 11–3, 9–11, 11–5తో ప్రపంచ 23వ ర్యాంకర్ సబ్రీనా సోబీ (అమెరికా)పై సంచలన విజయం సాధించింది. పీఎస్‌ఏ టూర్‌లో భాగంగా 'బ్రాంజ్ లెవెల్' టోర్నీలో తొలిసారి తుదిపోరుకు అర్హత పొందింది. ఫైనల్లో టాప్ సీడ్, ప్రపంచ పదో ర్యాంకర్ జార్జినా కెన్నడీ (ఇంగ్లండ్)తో అనాహత్ ఆడుతుంది. క్వార్టర్ ఫైనల్లో అనాహత్ రెండో సీడ్ సనా ఇబ్రహీం (ఈజిప్ట్)పై గెలిచింది.

పడిక్కల్ ఫటాఫట్

పడిక్కల్

- 85 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లతో 120 నాటౌట్
- 250 పరుగుల లక్ష్యాన్ని 27.5 ఓవర్లలో ఛేదించిన కర్ణాటక
- పంజాబ్‌పై విజయంతో క్వార్టర్ ఫైనల్‌కు అర్హత

మొహాలీ: టీమిండియా ప్లేయర్ దేవదత్ పడిక్కల్ (85 బంతుల్లో 120 నాటౌట్; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు) అజేయ సెంచరీతో అదరగొట్టాడు. తద్వారా రంజీ ట్రోఫీ గ్రూప్ 'బి'లో భాగంగా ఆదివారం ముగిసిన చివరి మ్యాచ్‌లో కర్ణాటక జట్టు 5 వికెట్ల తేడాతో పంజాబ్‌ను మట్టికరిపించింది. పంజాబ్ తొలి ఇన్నింగ్స్‌లో 309 పరుగులు చేయగా... కర్ణాటక 316 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 119/3తో ఆదివారం చివరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పంజాబ్... 101 ఓవర్లలో 256 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ ఉదయ్ సహ్రాన్ (166 బంతుల్లో 93; 7 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... అన్‌మోల్‌ప్రీత్ సింగ్ (141 బంతుల్లో 44; 1 ఫోర్, 1 సిక్స్), హర్‌ప్రీత్ బ్రార్ (72 బంతుల్లో 29; 3 ఫోర్లు) పోరాడారు. కర్ణాటక బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ, శ్రేయస్ గోపాల్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. దీంతో కర్ణాటక ముందు 250 పరుగుల విజయ లక్ష్యం నిలిచింది. అయితే తగినంత సమయం లేక పోవడంతో కర్ణాటక విజయం కష్టమే అనుకుంటే... ఆ జట్టు ఆది నుంచే దూకుడు కనబర్చింది. కెప్టెన్ పడిక్కల్ ధనాధన్ షాట్‌లతో విజృంభించడంతో కర్ణాటక 27.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 252 పరుగులు చేసింది. మయాంక్ అగర్వాల్ (36 బంతుల్లో 53; 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. భారత ఆటగాడు కేఎల్ రాహుల్ (13), అనీశ్ (1), రవిచంద్రన్ స్మరణ్ (1) విఫలమైనా... పడిక్కల్ చివరి వరకు నిలిచి జట్టును విజయతీరాలకు చేర్చాడు. ఈ గ్రూప్ నుంచి మధ్యప్రదేశ్ 28 పాయింట్లతో అగ్రస్థానంలో నిలవగా... ఈ గెలుపుతో కర్ణాటక 7 మ్యాచ్‌ల్లో 3 విజయాలు, ఒక ఓటమి, 3 'డ్రా'లతో 27 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలిచింది.

నాకౌట్‌కు జమ్మూ కశ్మీర్

సీజన్ ఆసాంతం సమష్టి ప్రదర్శనతో సత్తా చాటిన జమ్మూ కశ్మీర్ జట్టు రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. గ్రూప్ 'డి'లో భాగంగా హిమాచల్ ప్రదేశ్‌తో ఆడిన తమ చివరి లీగ్ మ్యాచ్‌ను జమ్మూ కశ్మీర్ 'డ్రా'గా ముగించింది. హిమాచల్ ప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 168 పరుగులకు ఆలౌట్ కాగా... జమ్మూకశ్మీర్ జట్టు 771 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో హిమాచల్ 2 వికెట్లు కోల్పోయి 26 పరుగులు చేసింది. వర్షం కారణంగా చివరి రోజు ఆట సాధ్యం కాలేదు. దీంతో మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది.

ఉత్తరాఖండ్ ఆల్‌రౌండ్ షో

గ్రూప్ 'సి'లో భాగంగా అస్సాంతో జరిగిన మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ విజయం సాధించింది. ఉత్తరాఖండ్ జట్టు 460/7 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్డ్ చేయగా... అస్సాం తొలి ఇన్నింగ్స్‌లో 140 పరుగులకు ఆలౌటైంది. ఫాలోఆన్‌లో ఓవర్‌నైట్ స్కోరు 224/6తో ఆదివారం చివరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన అస్సాం చివరకు 82.5 ఓవర్లలో 278 పరుగులకు ఆలౌటైంది. దీంతో ఉత్తరాఖండ్ జట్టు ఇన్నింగ్స్ 42 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ చేసిన ఉత్తరాఖండ్ కెప్టెన్ కునాల్ చండేలాకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఈ గ్రూప్ నుంచి బెంగాల్, ఉత్తరాఖండ్ నాకౌట్‌కు అర్హత సాధించాయి.

పాకిస్తాన్ 'క్లీన్‌స్వీప్'

మూడో టి20లోనూ ఆస్ట్రేలియా ఓటమి

సల్మాన్ ఆఘా

లాహోర్: టి20 ప్రపంచకప్ ప్రారంభానికి ముందు పాకిస్తాన్ జట్టు అదరగొట్టింది. సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో జరిగిన టి20 సిరీస్‌ను పాక్ జట్టు 'క్లీన్‌స్వీప్' చేసింది. ఇప్పటికే తొలి రెండు మ్యాచ్‌లు గెలిచి సిరీస్ చేజిక్కించుకున్న సల్మాన్ ఆఘా సారథ్యంలోని పాకిస్తాన్... ఆదివారం చివరి మ్యాచ్‌లో 111 పరుగుల తేడాతో ఆసీస్‌ను ఓడించింది. టి20ల్లో పరుగుల తేడా పరంగా ఆస్ట్రేలియాకిదే అతిపెద్ద పరాజయం. మొదట పాకిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. సయీమ్ అయూబ్ (37 బంతుల్లో 56; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), బాబర్ ఆజమ్ (36 బంతుల్లో 50 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్‌సెంచరీలతో రాణించారు. షాదాబ్ ఖాన్ (19 బంతుల్లో 46; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో బెన్ డ్వార్‌షుయ్ రెండు వికెట్లు తీశాడు. ఛేదనలో ఆస్ట్రేలియా 16.5 ఓవర్లలో 96 పరుగులకు ఆలౌటైంది. స్టొయినిస్ (23), కామెరాన్ గ్రీన్ (22), జోష్ ఫిలిప్ (14) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. కెప్టెన్ మిచెల్ మార్ష్ (1), మాథ్యూ షార్ట్ (2), మ్యాట్ రెన్‌షా (1), మిచెల్ ఓవెన్ (8), కూపర్ కొనొల్లి (0) విఫలమయ్యారు. పాకిస్తాన్ బౌలర్లలో నవాజ్ 4 ఓవర్లలో 18 పరుగులే ఇచ్చి 5 వికెట్లు పడగొట్టగా... షాహీన్ అఫ్రిది 2 వికెట్లు తీశాడు. నవాజ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', సల్మాన్ ఆఘాకు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి.

టోగో ప్లేయర్ హాదితో శ్రీనిధి ఎఫ్‌సీ ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఐ–లీగ్ జాతీయ ఫుట్‌బాల్ సీజన్ కోసం హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) కొత్త ప్లేయర్‌ను తీసుకుంది. టోగో దేశానికి చెందిన అంతర్జాతీయ డిఫెండర్ హాది ఇద్రిసూతో శ్రీనిధి జట్టు ఒప్పందం చేసుకుంది. 24 ఏళ్ల హాది టోగో అండర్–23 జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. మొరాకోలోని దిఫా ఎల్ జదీదా క్లబ్ తరఫున రెండేళ్లపాటు ఆడిన హాది... ఆ తర్వాత యూరోపియన్ లీగ్‌లో అల్బేనియాకు చెందిన ఎఫ్‌కే బైలిస్ జట్టు తరఫున పోటీపడ్డాడు. 'హాది ఇద్రిసూకు శ్రీనిధి జట్టులోకి స్వాగతం. మొరాకో, అల్బేనియాలో ఆడిన అనుభవం జట్టుకు పనికొస్తుంది' అని శ్రీనిధి డెక్కన్ చీఫ్ ఫుట్‌బాల్ ఆఫీసర్ ఫాబియో ఫెరారీ తెలిపారు.

అంకిత అవుట్

ముంబై: భారత మహిళల టెన్నిస్ మాజీ నంబర్‌వన్ అంకిత రైనా స్వదేశంలో జరుగుతున్న ముంబై ఓపెన్ డబ్ల్యూటీఏ–125 టోర్నీలో మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించలేకపోయింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ క్వాలిఫయింగ్ చివరి రౌండ్ మ్యాచ్‌లో అంకిత 2–6, 6–1, 4–6తో పీంగ్‌టార్న్ ప్లిపుయెచ్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయింది. 2 గంటల 39 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అంకిత రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తొలి సర్వీస్‌లో 18 పాయింట్లు, రెండో సర్వీస్‌లో 18 పాయింట్లు స్కోరు చేసింది. తన సర్వీస్‌ను ఎనిమిది సార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడు సార్లు బ్రేక్ చేసింది. భారత్‌కే చెందిన జీల్ దేశాయ్, సౌమ్య విగ్, సోనల్ పాటిల్, ఆకాంక్ష తొలి రౌండ్‌లోనే ఓడిపోయారు. హైదరాబాద్‌కు చెందిన భారత నంబర్‌వన్ సహజ యామలపల్లి, భారత రెండో ర్యాంకర్ భమిడిపాటి శ్రీవల్లి రష్మిక, మాయ రాజేశ్వరన్, వైదేహిలకు నిర్వాహకులు నేరుగా మెయిన్ 'డ్రా'లో చోటు కల్పించారు.

అర్జున్‌కు 13వ స్థానం

విక్ ఆన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు నిరాశపరిచారు. ఆదివారం ముగిసిన ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో భారత్ నుంచి నలుగురు గ్రాండ్‌మాస్టర్లు దొమ్మరాజు గుకేశ్, ఇరిగేశి అర్జున్, ప్రజ్ఞానంద, అరవింద్ చిదంబరం పోటీపడ్డారు. 14 మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య 13 రౌండ్లపాటు ఈ టోర్నీ జరిగింది. భారత నంబర్‌వన్, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ 4.5 పాయింట్లతో 13వ స్థానంలో నిలిచాడు. చివరిదైన 13వ రౌండ్ గేమ్‌లో అర్జున్ 55 ఎత్తుల్లో నొదిర్‌బెక్ అబ్దుసత్తరోవ్ (ఉజ్బెకిస్తాన్) చేతిలో ఓడిపోయాడు. క్లాసికల్ ఫార్మాట్‌లో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ గుకేశ్ 6.5 పాయింట్లతో 9వ స్థానంలో, ప్రజ్ఞానంద 5.5 పాయింట్లతో 11వ స్థానంలో, అరవింద్ 4.5 పాయింట్లతో 12వ స్థానంలో నిలిచారు. 9 పాయింట్లతో నొదిర్‌బెక్ విజేతగా అవతరించాడు.

విండీస్‌కు ఊరట విజయం

చివరి టి20లో దక్షిణాఫ్రికా ఓటమి

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా పర్యటనలో భాగంగా చివరి టి20లో వెస్టిండీస్ విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన మూడో మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు 6 వికెట్ల తేడాతో (డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో) ఆతిథ్య దక్షిణాఫ్రికాపై విజయం సాధించింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో గెలిచిన సఫారీ జట్టు 2–1తో సిరీస్ కైవసం చేసుకుంది. వర్షం కారణంగా 10 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో మొదట వెస్టిండీస్ 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 114 పరుగులు చేసింది. కెప్టెన్ షై హోప్ (25 బంతుల్లో 48; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), హెట్‌మైర్ (22 బంతుల్లో 48 నాటౌట్; 1 ఫోర్, 6 సిక్స్‌లు) మెరుపులు మెరిపించారు. అనంతరం దక్షిణాఫ్రికా లక్ష్యాన్ని 10 ఓవర్లలో 125 పరుగులుగా నిర్ణయించారు. ఛేదనలో సఫారీ జట్టు నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 118 పరుగులకే పరిమితమైంది. డికాక్ (14 బంతుల్లో 28; 4 ఫోర్లు, 1 సిక్స్), జాసన్ స్మిత్ (10 బంతుల్లో 26; 4 ఫోర్లు, 1 సిక్స్) పోరాడినా ఫలితం లేకపోయింది. కెప్టెన్ మార్క్‌రమ్ (2), డెవాల్డ్ బ్రేవిస్ (117), రికెల్టన్ (15), జార్జ్ లిండే (17), స్టబ్స్ (10 నాటౌట్) జట్టును గెలిపించలేకపోయారు. వెస్టిండీస్ బౌలర్లలో గుడకేశ్ మోతీ 2 ఓవర్లలో 17 పరుగులే ఇచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. మోతీకి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', డికాక్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి.

విన్నర్స్ ట్రోఫీతో దక్షిణాఫ్రికా జట్టు

లియామ్‌ను అధికారులు నిర్బంధంలోకి తీసుకున్నప్పటి ఫోటో

పసివాడిని వదిలేయండి!

టెక్సాస్: అమెరికాలో ఇమిగ్రేషన్ అధికారులు వారం క్రితం అదుపులోకి తీసుకున్న అయిదేళ్ల బాలుడు లియామ్ రమోస్, అతడి తండ్రి ఆడ్రియన్‌ల కథ సుఖాంతమైంది. తండ్రి, కొడుకులను వెంటనే వదిలేయాలని టెక్సాస్ డిస్ట్రిక్ట్ ఫెడరల్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. మినియాపొలిస్‌లో జనవరి 24వ తేదీన స్కూలు నుంచి తండ్రితోపాటు కారులో వస్తున్న లియామ్‌ను ఇమిగ్రేషన్ అధికారులు అడ్డగించడం, వారిద్దరినీ అక్కడికి 1,300 కిలోమీటర్ల దూరంలోని టెక్సాస్ డిటెన్షన్ ఫెసిలిటీకి తరలించారు. బిక్కమొహం వేసిన లియామ్ భుజాలకున్న బ్యాగ్‌ను ఇమిగ్రేషన్ అధికారి వెనుక నుంచి పట్టుకుని, అతడిని కారు వద్దకు తీసుకెళ్తున్న ఫొటో దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. చిన్నారులను నిర్బంధంలోకి తీసుకోవడంపై ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. వారిని వెంటనే విడుదల చేయాలన్న డిమాండ్లు వచ్చాయి. ఈ కేసుపై విచారణ చేపట్టిన జడ్జి ఫ్రెడ్ బియరీ అధికారులు, ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు. లియామ్ కుటుంబం ఇమిగ్రేషన్ కేసు కోర్టు పరిధిలో ఉన్నందున మంగళవారం లోగా ఇద్దరినీ విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈక్వెడార్‌కు చెందిన లియామ్ తండ్రిని దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన వ్యక్తిగా హోం ల్యాండ్ సెక్యూరిటీ విభాగం పేర్కొంటుండగా, అతడు చట్టబద్ధంగానే వచ్చాడని లాయర్లు తెలిపారు. లియామ్ కుటుంబం 2024 డిసెంబర్‌లో టెక్సాస్‌లో అధికారుల ఎదుట హాజరై ఆశ్రయం కోసం దరఖాస్తు చేసుకుందని చెప్పారు. వారికి ఈక్వెడార్‌తోపాటు అమెరికాలోనూ ఎలాంటి నేర చరిత్ర లేదని స్పష్టం చేశారు.

ఆ బాలుడి తండ్రిని కూడా
- టెక్సాస్‌లోని ఫెడరల్ డిస్ట్రిక్ట్ కోర్టు తీర్పు
- వారంపాటు నిర్బంధించిన ఇమిగ్రేషన్ అధికారులు

చరిత్ర ప్రతిధ్వనిస్తోంది

జడ్జి ఫ్రెడ్ బియరీ ఏమన్నారంటే..ప్రభుత్వం నిర్ణయాలు అమెరికా రాజ్యాంగ స్ఫూర్తికి, మూల సూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. అమెరికా చారిత్రక స్వాతంత్ర్య ప్రకటనపై ఈ ప్రభుత్వం అజ్ఞానంతో ఉందంటూ వ్యాఖ్యానించారు. అధికార దాహం కలిగిన అప్పటి ఇంగ్లండ్ రాజుకు వ్యతిరేకంగా థామస్ జెఫర్సన్ చేసిన వ్యాఖ్యలను ఉటంకించారు. అప్పటి రాజరిక పాలనలోని పరిస్థితులే నేడు కూడా కన్పిస్తున్నాయన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న బహిష్కరణ విధానాల వల్ల పిల్లలు ఎంతో మానసిక వేదనను ఎదుర్కొంటున్నారు. రోజువారీ బహిష్కరణ కోటాలను చేరుకునేందుకు అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 'సరైన ఆలోచన లేకుండా, అసమర్థతతో ప్రభుత్వం అమలు చేస్తున్న చర్యల ఫలితమిది. పిల్లలు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నా సరే, ఆగడం లేదు'అని అన్నారు. 'ప్రభుత్వ యంత్రాంగం తనకు తానుగా జారీ చేసుకునే పరిపాలనాపరమైన వారెంట్లకు సరైన కారణం ఉండటం లేదు. దీనినే కోళ్ల గూడుకు నక్కను కాపలా పెట్టడం అంటారు'అని ఆయన తీర్పులో రాశారు. అమెరికాలోని క్లిష్టమైన వలస చట్టాల వల్ల లియామ్, అతని తండ్రి చివరికి బహిష్కరణను ఎదుర్కోవాల్సి రావచ్చు అని పేర్కొన్న బియరీ.. అయితే, ఇది మరింత క్రమబద్ధమైన, మానవీయమైన విధానం ద్వారా జరగాలని అభిప్రాయపడ్డారు. 'రెండు వారాల వ్యవధిలో ఇమిగ్రేషన్ అధికారులు తీసుకెళ్లిన నాలుగో చిన్నారి లియామ్'అని కొలంబియా హైట్స్ పబ్లిక్ స్కూల్స్ ఒక ప్రకటనలో తెలిపింది.

లియామ్‌ను ఎరవేశారు..

తండ్రి ఆడ్రియన్ నుంచి లియామ్‌ను వేరు చేసిన ఇమిగ్రేషన్ అధికారులు అతడిని ఎరగా వేసి, అతడి తల్లిని కూడా నిర్బంధంలోకి తీసుకోవాలని చూశారని కుటుంబసభ్యులు ఆరోపించారు. గర్భవతిగా ఉన్న ఆమెతోపాటు ఇంట్లో మరో చిన్నారి కూడా ఉందని చెప్పారు. అధికారుల భయంతోనే కుమారుడిని, భర్తను అధికారులు తీసుకెళ్తున్న దృశ్యాలను కిటికీలో నుంచి చూస్తూ నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయిందన్నారు. ఈ ఆరోపణలను ఇమిగ్రేషన్ అధికారులు తోసిపుచ్చారు. చిన్నారని వదిలేసి, అతడి తండ్రి పారిపోయేందుకు ప్రయత్నించాడని పేర్కొన్నారు. దీంతో, లియామ్‌ను తల్లికి అప్పగించేందుకే ఇంటి వద్దకు వెళ్లామని, ఎవరూ బయటకు రాకపోవడంతో చిన్నారి బాధ్యతను తామే తీసుకున్నామన్నారు. వెంటనే అతడిని హోటల్‌కు తీసుకెళ్లి, ఆహారం పెట్టామన్నారు. తండ్రి కోరిక మేరకే ఇద్దరినీ తీసుకెళ్లామని చెప్పారు.

అమెరికా దాడి చేస్తే.. రణరంగమే

ఇరాన్ సుప్రీం నేత ఖమేనీ హెచ్చరికలు

దుబాయ్: అగ్ర రాజ్యం అమెరికా తమపై దాడి చేసిన పక్షంలో పశ్చిమాసియా యుద్ధ రంగంగా మారుతుందని ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ(86) తీవ్ర హెచ్చరికలు చేశారు. ప్రజల నిరసనలను హింసాత్మక అణచివేయాలని చూస్తే తీవ్ర దాడులు తప్పవని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరించడం తెల్సిందే. విమాన వాహక నౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్, ఇతర యుద్ధ నౌకలు అరేబియా జలాల్లోకి ప్రవేశించిన వేళ ఖమేనీ అమెరికానుద్దేశిస్తూ సూటిగా చేసిన హెచ్చరికలతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింతగా ముదిరే ప్రమాదముందని భావిస్తున్నారు. అదేవిధంగా, దేశవ్యాప్తంగా కొనసాగుతున్న నిరసనలను తిరుగుబాటుగా ఖమేనీ అభివర్ణించారు. తమపై దాడులకు దిగితే అది ఈసారి ప్రాంతీయ యుద్ధంగా మారుతుందన్న విషయం అమెరికన్లు తెలుసుకోవాలన్నారు. 'మేం రెచ్చగొట్టే వాళ్లం కాము. మేం ఎవరిపైనా యుద్ధానికి వెళ్లాలనుకోవడం లేదు. మమ్మల్ని వేధించాలని చూసినా, దాడులకు పాల్పడినా తీవ్రస్థాయిలో ప్రతిచర్యలు తప్పవు'అని ప్రకటించారు. అదేవిధంగా, గతంలో ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా కొందరు నిరసనలకు పాల్పడుతున్నారంటూ గతంలో వ్యాఖ్యానించిన ఖమేనీ ఈసారి ఆందోళనకారులపై స్వరం పెంచారు. 'ఇటీవల జరుగుతున్న నిరసనలు తిరుగుబాటుతో సమానమైనవి. అందుకే ఆ తిరుగుబాటును అణచివేశాం. దేశాన్ని నడిపించే కీలక వ్యవస్థలను ధ్వంసం చేయడమే నిరసనకారుల లక్ష్యం. అందుకే వారు పోలీసులు, ప్రభుత్వ కార్యాలయాలు, రివల్యూషనరీ గార్డుల కేంద్రాలు, బ్యాంకులు, మసీదులపై దాడులకు పాల్పడ్డారు. ఖురాన్ ప్రతులను దహనం చేశారు'అని ఆరోపించారు.

ఈయూ సైనికులూ ఉగ్రవాదులే

నిరసనకారులపై హింసాత్మక చర్యలకు పాల్పడుతున్న రివల్యూషనరీ గార్డ్స్ విభాగం బలగాలను యూరోపియన్ యూనియన్(ఈయూ)ఉగ్రవాదులుగా ప్రకటించడంపై ఇరాన్ మండిపడింది. ఈయూ సభ్యదేశాల మిలటరీని కూడా ఉగ్ర గ్రూపులుగా ప్రకటించే విషయం పరిశీలిస్తున్నామని ప్రకటించింది. అమెరికా ప్రభుత్వం 2019లోనే రివల్యూషనరీ గార్డులను ఉగ్రవాదులుగా ప్రకటించింది. బదులుగా ఇతర దేశాల మిలటరీని ఉగ్రవాద గ్రూపుగా ప్రకటించే విషయం తాము పరిశీలిస్తామని అప్పట్లోనే ఇరాన్ తెలిపింది. రివల్యూషనరీ గార్డు విభాగం సుప్రీం నేత ఖమేనీ కనుసన్నల్లోనే పనిచేస్తుంది. అయితే, యూరప్‌లోకి ఉగ్రవాదం వ్యాప్తి చెందకుండా కట్టడి చేస్తున్న రివల్యూషనరీ గార్డులను ఉగ్రవాదులుగా ప్రకటించడం ద్వారా యూరప్ తనకంటిని తానే పొడుచుకుందని గార్డుల మాజీ కమాండర్ మహ్మద్ బఘెర్ వ్యాఖ్యానించారు. అమెరికా మాట విని ఈయూ గుడ్డిగా ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు.

మరో పరిణామంలో...వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఆది, సోమవారాల్లో లైవ్ ఫైర్ మిలటరీ డ్రిల్ చేపడుతోంది. ప్రపంచంలో జరిగే చమురు రవాణాలో ఐదో వంతు పర్షియన్ గల్ఫ్‌లోని ఈ జలసంధి ద్వారానే సాగుతోంది. తమ యుద్ధ నౌకలు, విమానాలకు నష్టం కలిగించాలని చూస్తే తీవ్ర పరిణామాలు తప్పవని అమెరికా మిలటరీ సెంట్రల్ కమాండ్ హెచ్చరికలు జారీ చేసింది.

పాక్‌లో 145 మంది ఉగ్రవాదులు హతం

మరో 17 మంది భద్రతా సిబ్బంది కూడా..

ఇస్లామాబాద్/న్యూఢిల్లీ: పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్‌లోని 40 గంటల వ్యవధిలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో 145 మంది ఉగ్రవాదులు, మరో 17 మంది భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. క్వెట్టా, సిబి, మస్తుంగ్, గ్వాదర్, నోష్కి, పాస్ని, పంజ్‌గుర్, ఖరన్ ప్రాంతాల్లో ఈ ఎన్‌కౌంటర్లు చోటుచేసుకున్నట్లు బలూచిస్తాన్ ప్రావిన్స్ సీఎం సర్ఫరాజ్ బుగ్తి చెప్పారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ముగ్గురు సూసైడ్ బాంబర్లు కూడా ఉన్నారన్నారు. మొత్తం 145 మృతదేహాలను అధికారులు స్వాధీనం చేసుకుని, గుర్తింపు ప్రక్రియ చేపట్టారని వివరించారు. శనివారం పలు ప్రాంతాల్లో పౌరులతోపాటు భద్రతా సిబ్బందిపై బలూచ్ సాయుధ గ్రూపులు దాడులకు పాల్పడటంతో బలగాలు కూంబింగ్ చేపట్టాయన్నారు. ఉగ్రవాదుల దాడుల్లో ఐదుగురు మహిళలు, ముగ్గురు చిన్నారులు సహా 18 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. శనివారం భద్రతా బలగాలు పంజ్‌గుర్, షబాన్ ప్రాంతాల్లో చేపట్టిన ఆపరేషన్లలో 41 మంది ఉగ్రవాదులు చనిపోయారని గుర్తు చేశారు. ఈ ఘటన అనంతరం ప్రావిన్స్‌లో అప్రమత్తత ప్రకటించామని చెప్పారు. అఫ్గానిస్తాన్ నుంచి కొందరు అందించే ఆదేశాల ప్రకారం ఇక్కడున్న వారు ప్రభుత్వ భవనాలను స్వాధీనం చేసుకునేందుకు పథకం పన్నారని బుగ్తి ఆరోపించారు. బలూచ్ లిబరేషన్ ఆర్మీ, తాలిబన్ వంటి గ్రూపులతో చర్చలు జరిపే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. పశ్చాత్తాప భావనతో లొంగిపోవాలనుకునే వారిని మాత్రం స్వాగతిస్తామని చెప్పారు. బలూచిస్తాన్‌లో ఉగ్రవాదుల హింసాత్మక కార్యకలాపాలతో 2024లో 787 మంది చనిపోగా, 2025లో ఈ సంఖ్య 956కు అంటే దాదాపు 22 శాతం పెరిగినట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

పాక్ ఆరోపణలను ఖండించిన భారత్

బలూచిస్తాన్‌లో అశాంతి వెనుక భారత్ హస్తముందంటూ పాకిస్తాన్ చేసిన ఆరోపణలను విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. ఇవి పూర్తిగా నిరాధారాలని పేర్కొంది. హింసాత్మక ఘటనలు జరిగిన ప్రతిసారీ పాక్ మిలటరీ అంతర్గత వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఇలాంటి ఎత్తుగడలకు పాల్పడుతుందని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వ్యాఖ్యానించారు. బదులుగా అక్కడి ప్రజల న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని సలహా ఇచ్చారు. మానవ హక్కుల ఉల్లంఘన, అణచివేతలో పాకిస్తాన్‌కు దారుణమైన రికార్డు ఉందని పేర్కొన్నారు.

సందడిగా రఫా క్రాసింగ్

- గాజా–ఈజిప్టు మధ్య నేటి నుంచి జనం రాకపోకలు
- రోజుకు 50 మందికి మాత్రమే అవకాశమన్న ఇజ్రాయెల్
- విధుల్లో చేరిన యూరోపియన్ మిషన్ బృందం

కైరో: గాజా–ఈజిప్టు సరిహద్దుల్లోని రఫా క్రాసింగ్ ఆదివారం సందడిగా కనిపించింది. పాలస్తీనా వాసులకు బయటి ప్రపంచంతో సంబంధాలకు ముఖద్వారం వంటిది రఫా బోర్డర్ పాయింట్. హమాస్ ఆయుధాలను దొంగచాటుగా తీసుకువస్తోందంటూ 2024 మేలో ఇజ్రాయెల్ ఆర్మీ దీనిని పూర్తిగా మూసివేసింది. ఇజ్రాయెల్–హమాస్ మధ్య గతేడాది అక్టోబర్‌లో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంలో రఫా క్రాసింగ్‌ను తిరిగి తెరవడం కూడా ఉంది. కాగా, తాజా పరిణామంతో ఈ ఒప్పందం మరో అడుగు ముందుకు పడినట్లయింది. గాజాకు మరో నాలుగు బోర్డర్ పాయింట్లు ఉన్నప్పటికీ అవి ఇజ్రాయెల్‌తో మాత్రమే ఉన్నాయి. ఆదివారం రఫా బోర్డర్ పాయింట్‌ను ప్రయోగాత్మకంగా తెరిచామని ఇజ్రాయెల్ ఆర్మీ ప్రకటించింది. జనం రాకపోకలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామంది. క్రాసింగ్ వద్ద పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టిన యూరోపియన్ యూనియన్ మిషన్ బృందంతోపాటు పాలస్తీనా భద్రతా విభాగం సిబ్బంది కూడా విధుల్లో చేరారని ఈజిప్టు అధికారులు తెలిపారు. సోమవారం నుంచి రెండు వైపులా రాకపోకలు మొదలవుతాయని పాలస్తీనా అడ్మినిస్ట్రేటివ్ కమిటీ వివరించింది. మొదటగా కొందరిని మాత్రమే అనుమతిస్తారని, సరుకు రవాణాకు అనుమతి లేదని పేర్కొంది. యుద్ధం కారణంగా గాజాలో వైద్య, ఆరోగ్య వ్యవస్థలు పూర్తిగా ధ్వంసం కావడం, ప్రస్తుతానికి కనీసం 20 వేల మంది చిన్నారులకు అత్యవసర వైద్యసాయం అవసరమవుతుందని అధికారులు తెలిపారు. అయితే, రోజుకు 50 మంది రోగులను మాత్రమే బయటకు వెళ్లేందుకు అనుమతిస్తామని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ తెలిపారు. ఒక్కో రోగి వెంట ఇద్దరు సంబంధీకులు మాత్రమే క్రాసింగ్ గుండా వెళ్లాల్సి ఉందని ఓ అధికారి చెప్పారు. యుద్ధం సమయంలో గాజా నుంచి బయటకు వెళ్లిన వారిని రోజుకు 50 మందిని మాత్రమే తిరిగి లోపలికి అనుమతిస్తామన్నారు. ఈ విధానం విజయవంతమైన పక్షంలో ఈ సంఖ్యను క్రమేపీ పెంచుతామన్నారు.

విమానానికి బాంబు బెదిరింపు

వారణాసి: విమానంలో బాంబు ఉందంటూ అందిన సమాచారంతో ఇండిగో విమానాన్ని అధికారులు వారణాసి విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. విమానంలో బాంబు పెట్టామని రాసి ఉన్న ఓ కాగితం ముక్క విమానంలో కనిపించడమే ఈ కలకలానికి కారణమని ఫూల్పుర్–బాటట్‌పూర్ పోలీస్ అధికారి తెలిపారు. సుమారు 220 మంది ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి వారణాసికి బయలుదేరిన ఈ విమానాన్ని బాబట్‌పూర్ విమానాశ్రయంలో అత్యవసర ల్యాండింగ్ చేశారన్నారు. సీఐఎస్ఎఫ్ సహా వివిధ విభాగాల భద్రతా సిబ్బందితోపాటు బాంబ్ స్క్వాడ్,ఫైర్ సిబ్బంది, పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ప్రయాణికులతోపాటు విమానాన్ని అణువణువూ శోధించారని చెప్పారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు కనిపించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టామన్నారు.

త్వరలో ఉక్రెయిన్‌లో సైనిక విజయం

రష్యా నేత మెద్వెదెవ్ ప్రకటన

మాస్కో: ఉక్రెయిన్‌లో సైనికపరంగా తమ విజయం ఖాయమైందని రష్యా నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ డిప్యూటీ చైర్మన్ దిమిత్రీ మెద్వెదెవ్ చెప్పారు. వివిధ అంశాల ఆధారంగా చూస్తే ఇప్పటికే ఈ విషయం స్పష్టమవుతోందని తెలిపారు. 'ఈ యుద్ధంలో రష్యా సైనికపరంగా విజయం సాధించడం చాలా ముఖ్యమైన విషయం అనేది సుస్పష్టం. ఇది అనేక పరామితుల ద్వారా ఇప్పటికే అర్థమవుతోంది. తర్వాత ఏం చేయాలనే దానిపై ఆలోచించాల్సిన అవసరముంది'అని మెద్వెదెవ్ పేర్కొన్నారు. ఉక్రెయిన్‌లో స్పెషల్ మిలటరీ ఆపరేషన్ లక్ష్యాన్ని సాధ్యమైనంత త్వరగా సాధించడం ఎంతో కీలకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో తలెత్తే మరిన్ని సంక్షోభాలను నివారించేందుకు ఈ లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. అదే సమయంలో, ఈ యుద్ధాన్ని ఆపేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిజాయతీతో పనిచేస్తున్నారంటూ ఆయన కితాబునిచ్చారు. కొన్ని అంశాల్లో ఆయన విజయవంతమైనప్పటికీ, మరికొన్ని విషయాల్లో అలా జరగడం లేదన్నారు. ట్రంప్ చర్యలతో కొంత గందరగోళం నెలకొన్నప్పటికీ ఆయన ఎంతో ఆలోచించిన తర్వాతే నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ చెప్పుకొచ్చారు.

అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం ప్లాంట్‌సిటీలోని ఓ తోటలో
ఆదివారం నారింజ పండ్లను చుట్టుకుని వేలాడుతున్న మంచు స్ఫటికాలు

రష్యా దాడుల్లో 17 మంది మృతి

కీవ్: ఉక్రెయిన్‌లోని వేర్వేరు ప్రాంతాలపై రష్యా చేపట్టిన డ్రోన్ దాడుల్లో 17 మంది చనిపోగా, 15 మంది గాయపడ్డారు. నీప్రో నగరంపై ఆదివారం రష్యా జరిపిన డ్రోన్ దాడిలో బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది చనిపోయారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. దాడి కారణంగా బస్సులో చెలరేగిన మంటలను వెంటనే అదుపులోకి తెచ్చామని ఉక్రెయిన్ ఎమర్జెన్సీ విభాగం తెలిపింది. బాధితులందరూ గని కార్మికులని పేర్కొంది. నీప్రోపెట్రోవిస్క్ ప్రాంతంలోని గనిలో విధులు ముగించుకుని వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుందని, ఇది రష్యా జరిపిన ఉగ్రదాడి అని ఆరోపించింది. అదేవిధంగా, జపొరిఝియా నగరంపై రష్యా జరిపిన మరో డ్రోన్ దాడిలో ఓ ప్రసూతి వైద్యశాల దెబ్బతిందని అధికారులు తెలిపారు. ఘటలో ఆరుగురు మహిళలు గాయపడ్డారని, చెలరేగిన మంటలను అదుపు చేశామని చెప్పారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కోరిన మేరకు ఆదివారం వరకు దాడులను నిలిపివేస్తున్నట్లు శుక్రవారం రష్యా ప్రకటించడం తెల్సిందే. అయితే, తాజా దాడులకు దారి తీసిన కారణాలను రష్యా వెల్లడించలేదు. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు రష్యా 90 డ్రోన్లను ప్రయోగించగా, చాలా వరకు కూల్చివేశామని ఉక్రెయిన్ ఆర్మీ తెలిపింది. తొమ్మిది ప్రాంతాల్లో పడిన 14 డ్రోన్లు విధ్వంసం సృష్టించాయంది. శనివారం రాత్రి నీప్రో ప్రాంతంలో జరిగిన డ్రోన్ దాడిలో ఇద్దరు చనిపోయారని స్థానిక అధికారి తెలిపారు. ఖేర్సన్‌లో ఓ మహిళ తీవ్రంగా గాయపడ్డారని యంత్రాంగం పేర్కొంది.

పాక్ మహిళలకు పౌరసత్వమివ్వాలి

కశ్మీర్ అసెంబ్లీలో ఎమ్మెల్యే తీర్మానం

శ్రీనగర్: మాజీ ఉగ్రవాదులకు కల్పించిన పునరావాసంలో భాగంగా పాకిస్తాన్ నుంచి వచ్చి స్థిరపడిన మహిళలు, వారి పిల్లలకు పౌరసత్వం కల్పించాలని కోరుతూ అవామీ ఇత్తెహాద్ పార్టీ(ఏఐపీ) నేత షేక్ ఖుర్షీద్ ఆదివారం జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో తీర్మానాన్ని అందజేశారు. ఈ విషయాన్ని అనంతరం ఆయన మీడియాకు తెలిపారు. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఎన్నో సంవత్సరాల నుంచి వారు ఇక్కడే ఉంటున్నా చట్టబద్ధ గుర్తింపు గానీ పౌరసత్వం గానీ ఇవ్వలేదని చెప్పారు. వారికి గుర్తింపు, గౌరవం, రాజ్యాంగ రక్షణలను కల్పించాలని కోరారు.

సర్ దుర్వినియోగం: మమత

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలుసుకున్న బీజేపీ రాష్ట్రంలో అమలవుతున్న ఓటరు జాబితా సర్‌ను దుర్వినియోగం చేస్తోందని టీఎంసీ చీఫ్, సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. చేతనైతే ఎన్నికల్లో ప్రజాస్వామికంగా, రాజకీయంగా పోరాడాలని ఆమె బీజేపీకి సవాల్ విసిరారు. అందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఎన్నికల కమిషన్, ఇతర విభాగాలను వాడుకోవడం మానేయాలన్నారు. ఆదివారం ఆమె కోల్‌కతా విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడారు. 'బెంగాల్, తమిళనాడు, కేరళల్లో ప్రజలు గెలుస్తారు. అస్సాంలో మాత్రం బీజేపీ ఓడిపోతుంది'అని చెప్పారు. ఢిల్లీలో సోమవారం సాయంత్రం ఆమె ప్రధాన ఎన్నికల కమిషనర్‌తో భేటీ అవనున్నారు.

సమాజాన్ని కలుషితం చేస్తోంది

ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ ధ్వజం

న్యూఢిల్లీ: దేశాన్ని విభజించాలనే కుట్రతోనే సంఘ్ పరివార్ పథకం ప్రకారం సమాజాన్ని కలుషితం చేస్తోందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. రాజ్యాంగాన్ని అణగదొక్కేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు కుట్ర పన్నాయన్నారు. ఉత్తరాఖండ్‌లోని బీజేపీ ప్రభుత్వం సామాన్యులను వేధిస్తూ, సంఘ వ్యతిరేక శక్తులకు బాహాటంగా మద్దతునిస్తోందన్నారు. ఉత్తరాఖండ్‌లోని పౌరీ గఢ్వాల్‌లో 70 ఏళ్ల వృద్ధ ముస్లిం దుకాణదారుకు మద్దతుగా దుండగులను ఎదురించిన దీపక్ అనే వ్యక్తిని రాహుల్ ప్రశంసించారు. దీపక్ మన దేశ హీరో అంటూ ఆదివారం ఆయన ఎక్స్‌లో అభివర్ణించారు. ఎవరికీ తలవంచని, భయపడని ఇటువంటి దీపక్‌లు దేశానికి అవసరమన్నారు. కొట్‌ద్వార్‌లో శనివారం ఓ ముస్లిం దుకాణదారుపై 40 మంది వ్యక్తులు దాడికి రాగాఆ దీపక్ వారిని అడ్డుకున్నట్లు మీడియాలో వచ్చిన కథనాలపై రాహుల్ పైవిధంగా స్పందించారు.

కమాండర్, 10 మంది ఉగ్రవాదులు హతం

అబుజా: ఉగ్రసంస్థ ఇస్లామిక్ స్టేట్ అనుబంధ బోకో హరాం టాప్ కమాండర్, 10 మంది ఉగ్రవాదులను అంతం చేసినట్లు నైజీరియా ఆర్మీ ఆదివారం ప్రకటించింది. బోర్నో రాష్ట్రం సంబిసా అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురు కాల్పుల్లో అబూ ఖాలిద్ హతమయ్యాడంది. సంబిసా ప్రాంతంలో ఇతడు అత్యంత కీలకంగా ఉన్నాడని తెలిపింది. కొడుంగ ప్రాంతంపై శనివారం రాత్రి జరిగిన ఈ దాడిలో పెద్ద మొత్తంలో ఆయుధాలు, ఆహార పదార్థాలు, మందులు లభించాయని వెల్లడించింది. పాశ్చాత్య విద్యకు వ్యతిరేకంగా ఇస్లామిక్ చట్టాల అమలు కోసం 2019 నుంచి బోకో హరాం హింసాత్మక ఘటనలకు పాల్పడుతోంది.

షాంఘై-ఢిల్లీ ఎయిరిండియా సర్వీసు షురూ

బీజింగ్: దాదాపు ఆరేళ్ల విరామం అనంతరం ఎయిరిండియా సంస్థ షాంఘై–ఢిల్లీ డైరెక్ట్ విమాన సేవలను ఆదివారం ప్రారంభించింది. పడొంగ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి 230 మంది ప్రయాణికులతో ఎయిరిండియా బోయింగ్ 787 విమానం టేకాఫ్ తీసుకున్నట్లు షాంఘైలోని భారత కాన్సులేట్ తెలిపింది. 2020 ఆరంభంలో షాంఘు– ఢిల్లీ సర్వీసులు నిలిచిపోయాయి. ప్రజల మధ్య సంబంధాలు, వ్యాపార కార్యకలాపాలు ఊపందుకోవడానికి, భారత్, చైనాల మధ్య సంస్థాగత కనెక్టివిటీకి దోహదపడే ముఖ్యమైన పరిణామమని షాంఘైలోని భారత కాన్సుల్ జనరల్ ప్రతీక్ మాథుర్ చెప్పారు. రెండు దేశాల్లోని వివిధ నగరాల మధ్య గతేడాది అక్టోబర్ నుంచి విమాన సర్వీసులు ప్రారంభం కావడం తెల్సిందే.

2.1 కోట్ల మంది పుణ్యస్నానాలు

మాఘ పూర్ణిమ సందర్భంగా కిక్కిరిసిన గంగా తీరం

ప్రయాగ్‌రాజ్: మాఘమేళా సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మాఘ పూర్ణిమను పురస్కరించుకుని గంగ, సంగమ ప్రాంతంలో సుమారు 2 కోట్ల 10 లక్షల మంది పుణ్యస్నానాలు ఆచరించినట్లు అధికారులు తెలిపారు. అర్ధరాత్రి నుంచే భక్తుల రాక మొదలైందని, ఉదయం 8 గంటల సమయానికి కనీసం 90 లక్షల మంది పవిత్ర స్నానాలు చేశారన్నారు. సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగిందని చెప్పారు. సుమారు 2.1 కోట్ల మంది స్నానాలాచరించినట్లు భావిస్తున్నామన్నారు. మాఘమేళా సందర్భంగా నెల రోజులపాటు కల్పవాస్ దీక్షలు చేపట్టిన వారికి ఇది చివరి పుణ్యస్నానమని జిల్లా మేజిస్ట్రేట్ మనీశ్ కుమార్ శర్మ చెప్పారు. దీక్షలు పూర్తి చేసిన వారిని వారి కుటుంబసభ్యులు వచ్చి ఇళ్లకు తీసుకెళ్లడం సంప్రదాయమని చెప్పారు. కనీసం ఐదు లక్షల మంది దీక్షలు చేపట్టారన్నారు. ఈ నెల 15వ తేదీన మహాశివరాత్రితో మాఘ మేళా ముగియనుందన్నారు.

ఇరాన్ బదులు వెనెజువెలా నుంచి భారత్ చమురు కొంటుంది: ట్రంప్

న్యూయార్క్: ముడి చమురును భారత్ ఇకపై ఇరాన్‌కు బదులుగా వెనెజువెలా నుంచి కొనుగోలు చేయనుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. వెనిజులాకు చమురు సరఫరాకు బదులుగా ఇచ్చిన అప్పులను చైనా తిరిగి వసూలు చేసుకుంటుందా అన్న ప్రశ్నకు బదులిస్తూ ఆయన.. 'మా వద్దకు వచ్చి, సరైన ఒప్పందం చేసుకుంటానంటే చైనాను స్వాగతిస్తాం. ఇప్పటికే భారత్‌తో ఈ విషయంలో ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం ఆ దేశం ఇక నుంచి ఇరాన్ నుంచి ముడి చమురు కొనుగోలును ఆపేస్తుంది. బదులుగా వెనెజువెలా నుంచి కొనుగోలు చేస్తుంది'అని చెప్పారు. ట్రంప్ వ్యాఖ్యలపై భారత ప్రభుత్వం స్పందించాల్సి ఉంది. 2019వరకు ఇరాన్ చమురు అతిపెద్ద కొనుగోలుదారుగా భారత్ ఉంది. ఇరాన్‌పై అమెరికా ఆంక్షల నేపథ్యంలో కొనుగోళ్లను తగ్గించుకుంది.

సెట్స్ ఫర్ బీటెక్

ఇంజనీరింగ్ చదవాలి. బీటెక్‌లో అడుగు పెట్టాలి. ఇంటర్మీడియెట్ ఎంపీసీ విద్యార్థుల లక్ష్యం! ఇందుకోసం ఇంటర్‌లో చేరిన తొలి రోజు నుంచే కృషి చేస్తుంటారు. ఎక్కువ మంది బీటెక్ ఎంట్రన్స్ అనగానే జేఈఈ మెయిన్ లేదా ఈఏపీసెట్ గురించే ఆలోచిస్తారు. ఈ టెస్టుల్లో ఆశించిన ఫలితం రాకుంటే నిరాశకు గురవుతున్నారు. అయితే ఇంజనీరింగ్‌లో చేరేందుకు జేఈఈతోపాటు మరెన్నో ఎంట్రన్స్‌లు ఉన్నాయి. వాటిల్లో ర్యాంకు ద్వారా ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరొచ్చు. అంతేకాకుండా జేఈఈ, ఈఏపీసెట్ ప్రిపరేషన్‌తోనే ఇతర ఎంట్రన్స్‌ల్లోనూ రాణించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో.. ఎంపీసీ విద్యార్థులకు ఉపయోగపడేలా.. దేశంలోని ప్రముఖ ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షల వివరాలు..

» బీటెక్ ప్రవేశాలకు పలు ఎంట్రన్స్ టెస్టులు
» బెస్ట్ స్కోర్‌తో ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశం
» ఒకే ప్రిపరేషన్‌తో అన్నింటికీ సంసిద్ధత పొందే అవకాశం

జేఈఈ-మెయిన్

ఇంటర్ ఎంపీసీ చదువుతున్న ప్రతి ఒక్క విద్యార్థికి తెలిసిన పరీక్ష జేఈఈ-మెయిన్. జాతీయ స్థాయిలో.. ఎన్‌ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌లలో బీటెక్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ వంటి కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్. అదే విధంగా ఐఐటీల్లో ప్రవేశానికి జరిపే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ప్రామాణికంగా నిలుస్తున్న పరీక్ష. మూడు విభాగాల్లో (ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ) ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహిస్తారు. మొత్తం 300 మార్కులకు పరీక్ష ఉంటుంది.

జేఈఈ మెయిన్ పేపర్-2తో బీఆర్క్

జేఈఈ మెయిన్‌తో బీటెక్ మాత్రమే కాకుండా.. ఎన్‌ఐటీలు, ఇతర కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంస్థల్లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కోర్సులో సైతం ప్రవేశాలు లభిస్తాయి. అయితే అభ్యర్థులు ఇందుకోసం ప్రత్యేకంగా నిర్వహించే జేఈఈ-మెయిన్ పేపర్-2లో ర్యాంకు పొందాల్సి ఉంటుంది. ఈ పేపర్‌లో స్కోర్ ఆధారంగా ఎన్‌ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, సీఎఫ్‌టీఐల్లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కోర్సులో ప్రవేశం కల్పిస్తారు. ఈ పేపర్‌లో మ్యాథమెటిక్స్; ఆప్టిట్యూడ్ టెస్ట్, డ్రాయింగ్ టెస్ట్ విభాగాల్లో నైపుణ్యాలను పరీక్షిస్తారు. మ్యాథమెటిక్స్, ఆప్టిట్యూడ్ టెస్టులను ఆన్‌లైన్ విధానంలో, డ్రాయింగ్ టెస్టును పెన్ పేపర్ విధానంలో నిర్వహిస్తారు.

- అదే విధంగా.. పేపర్-2బి పేరుతో బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశానికి మరో పేపర్‌లో పరీక్ష ఉంటుంది. ఇందులో మ్యాథమెటిక్స్, ఆప్టిట్యూడ్ టెస్ట్, ప్లానింగ్ బేస్డ్ ప్రశ్నలు అడుగుతారు. ఇందులో మెరుగైన స్కోర్ ఆధారంగా బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ కోర్సులో అడుగు పెట్టొచ్చు.
- వెబ్‌సైట్: https://jeemain.nta.nic.in

ఐఐటీలకు జేఈఈ-అడ్వాన్స్‌డ్

ఇంజనీరింగ్ విద్యా బోధనలో అంతర్జాతీయ గుర్తింపు సొంతం చేసుకున్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ క్యాంపస్(ఐఐటీ)ల్లో.. బీటెక్, ఇంటిగ్రేటెడ్ బీటెక్ +ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష. జేఈఈ-మెయిన్ పేపర్-1లో ప్రతిభ ఆధారంగా 2.5 లక్షల మందిని జేఈఈ-అడ్వాన్స్‌డ్‌కు అర్హత కల్పిస్తారు. ఈ పరీక్ష రెండు పేపర్లలో ఉంటుంది. ఒక్కో పేపర్ పరీక్ష సమయం మూడు గంటలు. ప్రతి పేపర్‌లోనూ మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే ఈ పరీక్ష జరుగుతుంది. ఇందులో స్కోర్ ఆధారంగా ఐఐటీలే కాకుండా.. ఐఐఎస్‌టీ, ఐఐఎస్‌సీ తదితర ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లలో కూడా ప్రవేశాలు కల్పిస్తారు. జేఈఈ-అడ్వాన్స్‌డ్-2026ను మే 17న నిర్వహించనున్నారు.

- వివరాలకు వెబ్‌సైట్: www.jeeadv.ac.in

ఈఏపీసెట్

- రాష్ట్ర స్థాయిలోనే బెస్ట్ ఇన్‌స్టిట్యూట్స్, కాలేజ్‌లలో ఇంజనీరింగ్ చదవాలనుకునే వారికి అందుబాటులో ఉన్న మార్గం.. ఈఏపీసెట్. రెండు తెలుగు రాష్ట్రాల ఉన్నత విద్యా మండళ్ల నేతృత్వంలో.. ఏఐసీటీఈ గుర్తింపు పొందిన యూనివర్సిటీ అనుబంధ ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశానికి ఈఏపీసెట్ నిర్వహిస్తున్నారు.
- బీటెక్ కోర్సుల అభ్యర్థులు ఇంజనీరింగ్ స్ట్రీమ్ పేపర్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లో ఉత్తీర్ణత ద్వారా బీటెక్‌తోపాటు బీటెక్(అగ్రికల్చర్ ఇంజనీరింగ్)/బీటెక్(డెయిరీ టెక్నాలజీ)/బీటెక్(ఫుడ్ టెక్నాలజీ)/బీటెక్(బయో టెకాలజీ)/బీఫార్మసీ(ఎంపీసీ)/ఫార్మ్-డీ(ఎంపీసీ) కోర్సుల్లోనూ చేరొచ్చు.
- రెండు స్ట్రీమ్‌లకు సంబంధించి 160 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లో మ్యాథమెటిక్స్‌లో 80 ప్రశ్నలు, ఫిజిక్స్, కెమిస్ట్రీలలో 40 ప్రశ్నలు చొప్పున అడుగుతారు.
- అగ్రికల్చర్, ఫార్మసీ, మెడిసిన్ విభాగాల్లో బయాలజీ(బోటనీ, జువాలజీ) నుంచి 80 ప్రశ్నలు, ఫిజిక్స్, కెమిస్ట్రీలలో 40 ప్రశ్నలు చొప్పున ఉంటాయి.

బిట్‌శాట్

- జాతీయ స్థాయిలో జేఈఈ తర్వాత అంతటి ప్రాముఖ్య కలిగిన మరో ఇంజనీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్ .. బిట్‌శాట్! ఇంజనీరింగ్ విద్యలో పేరు గడించిన ది బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(బిట్స్-పిలానీ).. బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తుంది. ఈ ఎంట్రన్స్ టెస్ట్ ద్వారా బిట్స్ పిలానీ, గోవా, హైదరాబాద్ క్యాంపస్‌లలో బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్, బ్యాచిలర్ ఆఫ్ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు.
- ఇంటర్మీడియెట్‌లో 75 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలనే నిబంధన ఉంది.
- ఈ పరీక్షను కూడా పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ విధానంలోనే ఆన్‌లైన్ టెస్ట్‌గా నిర్వహిస్తారు.
- మొత్తం నాలుగు విభాగాల్లో ప్రశ్నలు అడుగుతారు. అవి.. ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ, లాజికల్ రీజనింగ్; మ్యాథమెటిక్స్(ఇంజనీరింగ్ అభ్యర్థులకు); బయాలజీ(బీఫార్మసీ అభ్యర్థులకు). మొత్తం 130 ప్రశ్నలతో పరీక్ష ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు కేటాయిస్తారు. పరీక్ష వ్యవధి మూడు గంటలు.
- బిట్‌శాట్-2026 కు సంబంధించి తాజాగా నోటిఫికేషన్ విడుదలైంది. రెండు దశల్లో పరీక్ష నిర్వహించనున్నారు. అభ్యర్థులు మార్చి 16 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- తొలిదశ పరీక్షను ఏప్రిల్ 15 నుంచి 17 వరకు; రెండో దశ పరీక్షను మే 24 నుంచి 26 వరకు నిర్వహించనున్నారు.
- వెబ్‌సైట్: www.bitsadmission.com

నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్

- ఎంపీసీ అర్హతతో ప్రవేశం పొందే అవకాశం ఉన్న మరో కోర్సు.. బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్. ఇందులో ప్రవేశానికి నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్ పేరుతో పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలో స్కోర్ ఆధారంగా కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ గుర్తింపు పొందిన కళాశాలల్లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్(బీఆర్క్) కోర్సులో అడుగు పెట్టొచ్చు. ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ గ్రూప్‌తో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలనే నిబంధన ఉంది.
- ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే నాటాలో 125 ప్రశ్నలు (200 మార్కులు) ఉంటాయి. డయగ్రమాటిక్ రీజనింగ్, న్యూమరికల్ రీజనింగ్, వెర్బల్ రీజనింగ్, ఇండక్టివ్ రీజనింగ్, సిట్యుయేషనల్ జడ్జ్‌మెంట్, లాజికల్ రీజనింగ్, అబ్‌స్ట్రాక్ట్ రీజనింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- మార్చి నెలలో నాటా అప్లికేషన్ ప్రక్రియ మొదలవనుంది.
- వెబ్‌సైట్: https://www.nata.in

నెస్ట్

ఇంటర్మీడియెట్ ఎంపీసీ విద్యార్థులు సైన్స్ అనుబంధ విభాగాల్లోనే ఉన్నత విద్యను చదవాలనుకుంటే వారికి ఉన్న మరో ప్రత్యామ్నాయం.. నేషనల్ ఎంట్రన్స్ స్క్రీనింగ్ టెస్ట్. ఈ టెస్ట్‌లో స్కోర్ ఆధారంగా..నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైసర్)-భువనేశ్వర్, యూనివర్సిటీ ఆఫ్ ముంబై-డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌లలో అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సులో ప్రవేశం పొందొచ్చు. మొత్తం నాలుగు సబ్జెక్ట్‌లలో(బయలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్) ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు అందుబాటులో ఉంటాయి. నెస్ట్ ఎంట్రన్స్.. నాలుగు విభాగాల్లో (మ్యాథ్స్, ఫిజిక్స్, బయాలజీ, కెమిస్ట్రీ) 200 మార్కులకు ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది.

- వెబ్‌సైట్: https://www.nestexam.in

విద్య, ఉద్యోగ సమాచారం

బీఆర్ఏజీ సెట్-2026

ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్)కు చెందిన డాక్టర్.బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాలు, డాక్టర్.బీ.ఆర్.అంబేద్కర్ ఐఐటీ-మెడికల్ అకాడమీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదో తరగతి, ఇంటర్మీడియట్ (ఆంగ్ల మాధ్యమం) మొదటి సంవత్సరంలో, ఆరు నుంచి పదో తరగతి(బ్యాక్‌లాగ్) ప్రవేశాలకు బీఆర్ఏజీ సెట్-2026 నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన బాల బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపికచేస్తారు.

తరగతి-సీట్ల వివరాలు

» **ఐదో తరగతి:** 186 సీట్లు(రెగ్యులర్ అడ్మిషన్స్)
» **ఆరు నుంచి పదో తరగతి:** 186(బ్యాక్‌లాగ్ అడ్మిషన్స్)
» **జూనియర్ ఇంటర్(జనరల్):** 155 సీట్లు(రెగ్యులర్ అడ్మిషన్స్)
» **జూనియర్ ఇంటర్(ఐఐటీ-నీట్):** 10 సీట్లు(రెగ్యులర్ అడ్మిషన్స్)
» **అర్హత:** ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి నుంచి పదో తరగతి చదువుతూ ఉండాలి.
» **వయసు:** ఐదో తరగతి ప్రవేశాలకు విద్యార్థి వయస్సు ఎస్సీ/ఎస్టీ విద్యార్థులు 31.08.2026 నాటికి 13 ఏళ్లు, ఇంటర్మీడియట్‌కు 19 ఏళ్లు, బీసీ/ఇతర వర్గాల వారికి ఐదో తరగతికి 11 ఏళ్లు, ఇంటర్మీడియట్‌కు 17ఏళ్ల లోపు ఉండాలి.
» **ఆదాయ పరిమితి:** విద్యార్థి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2,50,000 మించకూడదు.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఐదో తరగతి దరఖాస్తు ప్రారంభతేది:** 20.01.2026. » **ఆరో తరగతి బ్యాక్‌లాగ్ దరఖాస్తు ప్రారంభతేది:** 22.01.2026. » **ఇంటర్మీడియట్ దరఖాస్తు ప్రారంభతేది:** 21.01.2026.
» **దరఖాస్తులకు చివరితేది:** 19.02.2026.
» **ఐదో తరగతి ప్రవేశ పరీక్షతేది:** 01.03.2026.
» **ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్షతేది:** 01.03.2026.
» **ఐఐటీ మెడికల్ కోచింగ్ సెంటర్ల ప్రవేశ పరీక్ష తేది:** 01.03.2026.
» **6, 7వ తరగతి ప్రవేశ పరీక్షతేది:** 02.03.2026.
» **8,9,10వ తరగతి ప్రవేశ పరీక్షతేది:** 02.03.2026
» **అన్ని తరగతుల ర్యాంక్ కార్డ్ విడుదల:** 25.03.2026.
» **ఐదో తరగతి ఫేజ్-1 సెలక్షన్ లిస్ట్ తేది:** 10.04.2026.
» **6 నుంచి 10వ తరగతి ఫేజ్-1 సెలక్షన్ లిస్ట్ తేది:** 10.04.2026.
» **ఇంటర్మీడియట్(జనరల్, ఐఐటీ-నీట్ కోచింగ్ సెంటర్స్)ఫేజ్-1 సెలక్షన్ లిస్ట్ తేది:**10.04.2026
» **వెబ్‌సైట్:** https://apbragcet.apcfss.in

యంత్ర ఇండియా లిమిటెడ్‌లో 3,979 అప్రెంటిస్

యంత్ర ఇండియా లిమిటెడ్ వివిధ విభాగాల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 3,979.
» **ఖాళీల వివరాలు:** ఎక్స్-ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్-2,843, నాన్-ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్-1,136.
» **విభాగాలు:** మెషినిస్ట్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, టర్నర్, వెల్డర్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 03.03.2026 నాటికి 14 ఏళ్ల నుంచి 35 ఏళ్లు ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు రూ.8,200 నుంచి రూ.9,600.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మెరిట్,ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 01.02.2026.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 03.03.2026.
» **వెబ్‌సైట్:** www.recruit-gov.com

కొచ్చిన్ పోర్ట్ అథారిటీ, కేరళలో వివిధ ఉద్యోగాలు

కేరళలోని కొచ్చిన్ పోర్ట్ అథారిటీ(సీపీఏ) వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 07.
» **పోస్టుల వివరాలు:** మెరైన్ ఇంజనీరింగ్-05, సూపరింటెండింగ్ ఇంజనీర్-01, డిప్యూటీ డైరెక్టర్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీటెక్(సివిల్ ఇంజనీరింగ్)లో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 35నుంచి 40ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు మెరైన్ ఇంజనీర్‌కు రూ.70,000 నుంచి రూ.2,00,000, సూపరింటెండింగ్ ఇంజనీర్‌కు రూ.60,000 నుంచి రూ.1,80,000, డిప్యూటీ డైరెక్టర్‌కు రూ.50,000 నుంచి రూ.1,60,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.02.2026.
» **వెబ్‌సైట్:** www.cochinport.gov.in

సాధారణ గుండె లయను నియంత్రించే విటమిన్?

మానవ శరీరానికి 13 విటమిన్లు అవసరం. వీటిని ప్రధానంగా రెండు రకాలుగా వర్గీకరించారు. అవి నీటిలో కరిగేవి, కొవ్వుల్లో కరిగేవి. ఎ, డి, ఇ, కె విటమిన్లు కొవ్వుల్లో కరుగుతాయి. ఇవి కొవ్వు కణాల్లో నిల్వ ఉంటాయి. విటమిన్ బి, సిలు నీటిలో కరుగుతాయి. వీటిని శరీరం ఎక్కువ మొత్తంలో నిల్వ ఉంచుకోలేదు. కాబట్టి ఇవి లభించే ఆహారం ఎక్కువగా తీసుకోవాలి.

విటమిన్లు

- మనిషి ఆహారంలో స్వల్ప మోతాదులో మాత్రమే అవసరమయ్యే కర్బన పోషకాలు విటమిన్లు.
- విటమిన్లు శక్తి వనరులు కాదు.
- ఒక విటమిన్ లేదా విటమిన్‌లోని ఒక భాగం లేదా విటమిన్ నుంచి ఏర్పడిన ఉత్పాదకం సహ ఎంజైమ్‌గా వ్యవహరిస్తూ రసాయనిక చర్యలో పాల్గొనే ఎంజైమ్‌లకు సహాయపడతాయి.
- విటమిన్ అనే పదాన్ని కాసిమర్ ఫంక్ ప్రతిపాదించాడు. విటమిన్లను ఆంగ్ల అక్షరాల క్రమంలో నామకరణం చేసే పద్ధతిని ప్రతిపాదించింది జె.సి. డ్రుమాన్డ్.
- విటమిన్లు ప్రధానంగా 2 రకాలు
  - **కొవ్వులో కరిగేవి:** ఎ, డి, ఇ, కె.
  - **నీటిలో కరిగేవి:** బి-కాంప్లెక్స్, సి

విటమిన్ - ఎ

విటమిన్-ఎ రసాయన నామం రెటినాల్. సాధారణ నామం జీరాప్తాల్మియా నిరోధక విటమిన్. ఆరోగ్యకరమైన దృష్టికి, సాధారణ ఆరోగ్యానికి ఇది అవసరం. ఈ విటమిన్ లోపిస్తే కంటిలోని కార్నియా దెబ్బతిని జీరాఫ్తాల్మియా సంభవిస్తుంది.

లభ్యత: క్యారెట్, పసుపు రంగులోని ఫలాలు, నారింజ, సొరచేప కాలేయం నూనె, ఆకుకూరలు, జంతువుల కాలేయంలో ఎక్కువగా లభిస్తుంది. శాకాహారంలో ఇది బీటా కెరోటిన్ రూపంలో లభిస్తుంది. పేగులోని సూక్ష్మజీవులు దీన్ని రెటినాల్‌గా మారుస్తాయి.

విటమిన్ - డి

దీని రసాయన నామం కాల్సిఫెరాల్. దీన్నే రికెట్స్ నిరోధక విటమిన్, సన్‌షైన్ విటమిన్ అని కూడా పిలుస్తారు. బలమైన ఎముకలు, దంతాలకు ఇది అవసరం. శరీరంలోని కాల్షియం, ఫాస్ఫరస్, జీవక్రియలను నియంత్రిస్తుంది. ఈ విటమిన్ లోపిస్తే చిన్నారుల్లో రికెట్స్ వ్యాధి సంభవిస్తుంది. ఎముకలు బలహీనపడి, వంకరలు తిరిగడం ఈ వ్యాధి లక్షణం. పెద్దల్లో ఈ విటమిన్ లోపం వల్ల ఎముకలు బలహీనపడి ఆస్టియోమలేసియా వ్యాధి సంభవిస్తుంది.

లభ్యత: శాకాహారంలో ఇది లభించదు. పాలు, గుడ్లు, కాడ్ చేప కాలేయం నూనె, జంతువుల కాలేయం, పుట్టగొడుగుల్లో సమృద్ధిగా లభిస్తుంది.

విటమిన్ - ఇ

దీని రసాయన నామం టోకోఫెరాల్. దీన్ని బ్యూటీ విటమిన్ లేదా వంధ్యత్వ నిరోధక విటమిన్ అంటారు. స్త్రీ, పురుషుల్లో ప్రత్యుత్పత్తి వ్యవస్థకు ఇది అవసరం. కాంతివంతమైన చర్మాన్ని ఇస్తుంది. దీని లోపం అరుదుగా సంభవిస్తుంది. ఇది లోపిస్తే పురుషుల్లో వంధ్యత్వం వస్తుంది, మహిళల్లో గర్భస్రావం జరుగుతుంది.

లభ్యత: ఫలాలు,కూరగాయలు, విత్తనాలు (బాదం, పిస్తా), చేపలు, మాంసం, చేప నూనె, కాలేయంలో లభిస్తుంది.

విటమిన్ - కె

దీని రసాయన నామం ఫిలోక్వినోన్ లేదా మెనాక్వినోన్. దీన్ని రక్తస్రావ నిరోధక విటమిన్ అని కూడా అంటారు. రక్త స్కంధన ప్రక్రియలో అనుబంధ రక్తస్కంధన కారకంగా ఇది వ్యవహరిస్తుంది. ఈ విటమిన్ లోపిస్తే గాయాలైనప్పుడు రక్తం ఆలస్యంగా గడ్డ కడుతుంది.

లభ్యత: పేగులోని సూక్ష్మజీవులు దీన్ని తయారుచేస్తాయి. కాలిఫ్లవర్, క్యాబేజి, ఆకుకూరలు, కాలేయం, మూత్రపిండాల్లో లభిస్తుంది.

విటమిన్ - సి (ఆస్కార్బిక్ ఆమ్లం)

ఇది స్కర్వి నిరోధక విటమిన్. బలమైన చిగుళ్లకు, నోటి ఆరోగ్యానికి ఇది అవసరం. ఇది లోపిస్తే స్కర్వి వ్యాధి సంభవిస్తుంది.

లక్షణాలు: చిగుళ్ల నుంచి రక్తం కారడం, దంతాలు ఊడిపోవడం, నాలుకపై పుండ్లు ఏర్పడటం ఈ వ్యాధి లక్షణాలు.

లభ్యత: నారింజ, బత్తాయి, నిమ్మ లాంటి సిట్రస్ ఫలాలు, ఉసిరి, మాంసం, కాలేయంలో లభిస్తుంది.

విటమిన్ - బి1

దీని రసాయన నామం థయమిన్. బెరిబెరి నిరోధక విటమిన్ అని అంటారు. శక్తి విడుదల, నాడీవ్యవస్థ, రక్తప్రసరణ అభివృద్ధి వ్యవస్థకు అవసరం. దీనిలోపం ద్వారా బెరిబెరి వ్యాధి వస్తుంది. చిన్నారుల్లో తడి బెరి బెరి (ఛాతీలో నీరు నిండటం), పెద్దల్లో పొడి బెరిబెరి (చర్మం పొడిబారటం) సంభవిస్తుంది. పాలీన్యూరిటిస్ అనే నాడీ క్షీణత వ్యాధి సంభవిస్తుంది.

లభ్యత: పొట్టు తీయని అన్ని రకాల ధాన్యాలు, మాంసంలో లభిస్తుంది.

విటమిన్ - బి2

దీన్నే విటమిన్-జి లేదా ఎల్లో ఎంజైమ్ అని కూడా అంటారు. కొవ్వులు, పిండి పదార్థాల జీవక్రియలో పాల్గొంటుంది. ఈ విటమిన్ లోపిస్తే అరిబోఫ్లెవినోసిస్ అనే వ్యాధి వస్తుంది. నోటి అంచున పగుళ్లు ఏర్పడటం(ఖీలోసిస్/ యాంగ్యులర్ స్టొమాటిస్), నాలుక వాపు (గ్లోసైటిస్) ఈ వ్యాధి లక్షణాలు.

లభ్యత: పాలు, పాల ఉత్పత్తుల్లో ఎక్కువగా ఉంటుంది. కాబట్టి దీన్ని లాక్టోఫ్లెవిన్ అని, గుడ్ల పచ్చసొనలోనూ అధికంగా లభించడం వల్ల ఓవోఫ్లెవిన్ అని అంటారు. కాలేయంలోనూ ఉంటుంది కాబట్టి హెపటోఫ్లెవిన్ అని కూడా అంటారు. ఎండు ఫలాలు, కూరగాయలు, మాంసంలో లభిస్తుంది.

విటమిన్ - బి3

దీని రసాయన నామం నియాసిన్. నికోటినిక్ యాసిడ్ లేదా నికోటినమైడ్‌గానూ పిలుస్తారు. ఇది పెల్లగ్రా నిరోధక విటమిన్. ఆరోగ్యకరమైన నాడీవ్యవస్థ, చర్మం, జీర్ణక్రియకు ఇది అవసరం. ఈ విటమిన్ లోపిస్తే పెల్లగ్రా వ్యాధి సంభవిస్తుంది. చర్మం ఎర్రగా కందడం(డెర్మటైటిస్), నీళ్ల విరేచనాలు(డయేరియా), మతిమరుపు (డెమెన్షియా) ఈ వ్యాధి లక్షణాలు. తీవ్రలోపం తలెత్తితే మరణించే ప్రమాదం ఉంది. అందుకే దీన్ని 4డి/3డి సిండ్రోమ్ అంటారు.

లభ్యత: మాంసం, కూరగాయలు, ఆకుకూరలు, పప్పుధాన్యాల్లో ఎక్కువగా లభిస్తుంది.

విటమిన్ - బి5

దీన్నే పాంటోథెనిక్ యాసిడ్ అని పిలుస్తారు. కో ఎంజైమ్-ఎ గానూ వ్యవహరిస్తారు. కొలెస్ట్రాల్, న్యూరోట్రాన్స్‌మీటర్ల ఉత్పాదన, శక్తి విడుదలకు విటమిన్-బి5 అవసరం. దీనిలోపం వల్ల అరికాళ్లలో మంటలు కలిగే బర్నింగ్ ఫీట్ సిండ్రోమ్ వస్తుంది.

లభ్యత: మాంసం, గుడ్లు, బ్రెడ్‌లో లభిస్తుంది.

విటమిన్ - బి6

దీన్నే పైరిడాక్సిన్ లేదా పైర్డాక్సల్ ఫాస్ఫేట్ అంటారు. ప్రొటీన్ల జీవక్రియకు ఇది అవసరం. ఈ విటమిన్ లోపిస్తే చర్మం పొడిబారుతుంది. విపరీతమైన బలహీనత వస్తుంది. మార్నింగ్ డిసీజ్ అనే వ్యాధి సంభవిస్తుంది.

లభ్యత: మాంసం, గోధుమ, మొక్కజొన్న, సోయాబీన్, వేరుశనగ, బాదంలో ఎక్కువ మోతాదులో లభిస్తుంది.

విటమిన్ - బి7

దీన్నే విటమిన్ -హెచ్, బయోటిన్ అని కూడా పిలుస్తారు. శక్తి విడుదల, అమైనో ఆమ్లాలు, గ్లైకోజన్ ఉత్పత్తికి అవసరం. పేగులోని సూక్ష్మజీవులు దీన్ని అందిస్తాయి. ఈ విటమిన్ చాలా అరుదుగా లోపిస్తుంది. ఉడికించని గుడ్డు తెల్లసొనలో ఎవిడిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది బయోటిన్ వినియోగాన్ని అడ్డుకుంటుంది.

విటమిన్ - బి9

దీన్నే ఫోలిక్ యాసిడ్ అంటారు. ఎర్రరక్తకణాల పరిపక్వత, హీమోగ్లోబిన్ తయారీకి ఇది అవసరం. పిండం అభివృద్ధి, మానసిక వికాసానికి తోడ్పడుతుంది. ఈ విటమిన్ లోపిస్తే మెగాలోబ్లాస్టిక్ లేదా మ్యాక్రోస్టిక్ అనీమియా వ్యాధి వస్తుంది. గర్భిణుల్లో ఇది తీవ్రంగా లోపిస్తే పుట్టబోయే పిల్లల్లో స్పైనా బిఫిడా అనే మానసిక వైకల్యం సంభవిస్తుంది

లభ్యత: స్ట్రాబెర్రీ, టమాట, కాలిఫ్లవర్, అరటి, క్యాబేజి, పాలకూర, నారింజల్లో లభిస్తుంది.

విటమిన్ - బి12

దీన్నే సైనోకోబాలమిన్ అంటారు. ఎర్ర రక్తకణాల పరిపక్వత, హీమోగ్లోబిన్ తయారీకి అవసరం. ఈ విటమిన్ లోపిస్తే పెర్నిసియస్ అనీమియా సంభవిస్తుంది.

లభ్యత: మాంసాహారం, గుడ్లు, పాల లాంటి జంతు ఉత్పత్తుల్లో మాత్రమే లభిస్తుంది. మొక్కల్లో లభించదు.

విటమిన్ - బి17

దీన్నే యాంటి కేన్సర్ విటమిన్ అని అంటారు. వాస్తవానికి ఇది విటమిన్ కాదు. మొక్కల్లో కేన్సర్ నిరోధక లక్షణాలున్న రసాయనాలన్నింటినీ కలిపి బి17 అంటారు.

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో బి$_{15}$ అని పిలిచే విటమిన్?
   ఎ) పాంటోథెనిక్ ఆమ్లం
   బి) పంగామిక్ ఆమ్లం
   సి) నియాసిన్ డి) ఫోలిక్ ఆమ్లం
2. ఒక గ్రాము కొవ్వు నుంచి ఎన్ని కేలరీల శక్తి విడుదలవుతుంది?
   ఎ) 4.1 బి) 4.3 సి) 9.3 డి) 8.0
3. కింది వాటిలో ఆవశ్యక అమైనోఆమ్లం?
   ఎ) అలనిన్ బి) ప్రోలిన్
   సి) సిస్టీన్ డి) ఆర్జినిన్
4. చర్మం, రోమాలు, గోళ్లు తదితరాల్లో ఉండే ప్రత్యేకమైన ప్రొటీను?
   ఎ) కెరోటిన్ బి) కెరాటిన్
   సి) అల్బుమిన్ డి) కాండ్రిన్
5. తల్లిపాలలో ఉండే ప్రొటీన్ల శాతం?
   ఎ) 2.4 బి) 3.1 సి) 6.2 డి) 0.3
6. మేక పాలలో ఉండే లాక్టోజ్ శాతం?
   ఎ) 3.6 బి) 4.6 సి) 4.2 డి) 0.7
7. అధిక నీటి శాతం ఉన్న పాలు?
   ఎ) ఆవు పాలు బి) గేదె పాలు
   సి) మేక పాలు డి) గాడిద పాలు
8. విటమిన్ బి12 లోపం ద్వారా వచ్చే రక్తహీనతను ఏమంటారు?
   ఎ) పెర్నిసియస్ రక్తహీనత
   బి) న్యూట్రిషినల్ రక్తహీనత
   సి) మెగలోబ్లాస్టిక్ రక్తహీనత
   డి) మ్యాక్రోస్టిక్ రక్తహీనత
9. మానవుడి సాధారణ జీవక్రియ రేటు(బీఎంఆర్)కు ఎన్ని కేలరీ శక్తి అవసరం?
   ఎ) 1200-1500 బి) 1500-1700
   సి) 500-700 డి) 2000-3000
10. విటమిన్-ఎ లోపం ద్వారా కంటి కార్నియా పొడిబారడాన్ని ఏమంటారు?
    ఎ) నిక్టలోపియా బి) జీరాఫ్తాల్మియా
    సి) కెరటోమలేసియా డి) ఏదీకాదు
11. పెద్దల్లో విటమిన్ డి లోపం ద్వారా ఎముకలు క్షీణించి బలహీన పడటాన్ని ఏమంటారు?
    ఎ) ఆస్టియో పోరోసిస్
    బి) ఆస్టియో మలేషియా
    సి) ఆస్టియో ఆర్థ్రైటిస్
    డి) ఆస్టిటిస్ ఫైబ్రోజా
12. సాధారణ గుండె లయను నియంత్రించే విటమిన్?
    ఎ) ఆస్కార్బిక్ ఆమ్లం బి) థయమిన్
    సి) నియాసిన్ డి) పెరిడాక్సిన్
13. ఎల్లో ఎంజైమ్ అని ఏ విటమిన్‌ను పిలుస్తారు?
    ఎ) బి2 బి) బి5 సి) బి6 డి) బి7
14. కండరాల్లో అధిక మోతాదులో ఉండే ప్రొటీన్?
    ఎ) గ్లుటెన్ బి) కొల్లాజెన్
    సి) కెసిన్ డి) మయోసిన్
15. కిందివాటిలో ఏ విటమిన్ లోపం వల్ల ఖీలోసిస్ సంభవిస్తుంది?
    ఎ) పాంటోథెనిక్ ఆమ్లం బి) నియాసిన్
    సి) పెరిడాక్సిన్ డి) రిబోఫ్లేవిన్
16. పాల చక్కెర(లాక్టోజ్)లో ఉండే మోనోశాకరైడ్లు?
    ఎ) గ్లూకోజ్, ఫ్రక్టోజ్
    బి) గ్లూకోజ్, గాలక్టోజ్
    సి) గ్లూకోజ్, గ్లూకోజ్ డి) ఏవీ కాదు
17. సగటున మనిషికి రోజుకు ఎంత మోతాదులో విటమిన్ సి అవసరం?
    ఎ) 2 మి.గ్రా. బి) 50 మి.గ్రా.
    సి) 75 మి.గ్రా. డి) 30 మి.గ్రా.
18. కింద ఇచ్చిన ఏ అమైనో ఆమ్లంలో సల్ఫర్ ఉంటుంది?
    ఎ) మిథియోనిన్ బి) హిస్టిడీన్
    సి) గ్లైసిన్ డి) ప్రోలిన్

సమాధానాలు

1) బి 2) సి 3) డి 4) బి 5) ఎ
6) సి 7) ఎ 8) ఎ 9) బి 10) బి
11) బి 12) ఎ 13) ఎ 14) డి 15) డి
16) బి 17) బి 18) ఎ.

గోల్కొండ ఏ పరిశ్రమకు ప్రసిద్ధిగాంచింది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

మాదిరి ప్రశ్నలు

1. అద్దంకి గంగాధర కవి ఎవరి కొలువులో ఉండేవాడు?
 1) సింగ భూపాలుడు
 2) ఇబ్రహీం కుతుబ్‌షా
 3) అబుల్ హాసన్ తానీషా
 4) కాకతి ప్రతాపరుద్రుడు
2. తెలుగుభాషకు తొలి వ్యాకరణం?
 1) ఆంధ్రశబ్ద చింతామణి
 2) ఆంధ్రభాషా భూషణం
 3) కావ్యాలంకార సంగ్రహం
 4) కవిజనాశ్రయం
3. 'శ్రీ పర్వత స్వామి' ఏ రాజు వంశీయుల కులదైవం?
 1) శాలంకాయనులు
 2) ఆనందగోత్రికులు
 3) ఇక్ష్వాకులు
 4) విష్ణుకుండినులు
4. బుద్ధుణ్ని దేవుడిగా ఆరాధించడం ప్రారంభించిన ప్రాథమిక శాఖ ఏది?
 1) దిగంబరులు 2) హీనాయానం
 3) మహాయానం 4) శ్వేతాంబరులు
5. తెలంగాణలో సామాజిక సాంస్కృతిక చైతన్యం తీసుకొచ్చింది ఎవరు?
 1) అఘోరనాథ ఛటోపాధ్యాయ
 2) దస్తూర్ హోషాంగ్
 3) ముల్లా అబ్దులఖియా
 4) పైవారంతా
6. తల్లి పేరుతో శాసనాలు వేయించిన ఇక్ష్వాక రాజు?
 1) రెండో ఏహబల శాంతమూలుడు
 2) రెండో వీరుపురుషదత్తుడు
 3) మొదటి వీరపురుషదత్తుడు
 4) మొదటి శాంతమూలుడు
7. పేష్కస్ అంటే?
 1) ప్రభుత్వానికి రైతు చెల్లించాల్సిన శిస్తు
 2) జమీందారుకు రైతు చెల్లించాల్సిన శిస్తు
 3) ప్రభుత్వానికి జమీందారు చెల్లించాల్సిన శిస్తు
 4) గ్రామాధికారికి రైతు చెల్లించాల్సిన శిస్తు
8. నిజాం ఉల్‌ముల్క్ మహారాష్ట్రులతో కుదుర్చుకున్న సంధి?
 1) మునిషిప్ గాంప్
 2) వార్నా సంధి
 3) దురారీ సరాయి
 4) పైవన్నీ
9. ఏ నిజాం పరిపాలనా కాలంలో వహాబీ ఉద్యమం ప్రారంభమైంది?
 1) అఫ్జల్ ఉద్దౌలా
 2) మహబూబ్ అలీఖాన్
 3) నాసిరుద్దౌలా 4) సలాబత్ సింగ్
10. మీరట్‌లో తిరుగుబాటు ఏ రోజున ప్రారంభమైంది?
 1) 1857 మే 10
 2) 1858 నవంబర్ 1
 3) 1856 డిసెంబర్ 10
 4) 1858 జనవరి 1
11. 'నిజాం రాజ్యం కల్తీలేని మధ్యయుగపు రాచరికం' అని వ్యాఖ్యానించింది ఎవరు?
 1) రావి నారాయణ రెడ్డి
 2) బద్దం ఎల్లారెడ్డి
 3) పుచ్చలపల్లి సుందరయ్య
 4) చంద్ర రాజేశ్వరరావు
12. ఇక్ష్వాకు అంటే అర్థం?
 1) చెరకు 2) పక్షి
 3) పర్వతం 4) నది
13. గౌతమీ బాలశ్రీ వేయించిన శాసనం?
 1) నాసిక్ శాసనం
 2) చినగంజాం శాసనం
 3) మ్యాకదోని శాసనం
 4) నానాఘాట్ శాసనం
14. శర్మవర్మ, గుణాఢ్యుడు ఎవరి ఆస్థాన కవులు?
 1) యజ్ఞశ్రీ శాతకర్ణి 2) పులోమావి
 3) గౌతమీపుత్ర శాతకర్ణి 4) హాలుడు
15. మొగల్ రాజపురం గుహలను ఎవరు నిర్మించారు?
 1) ఇక్ష్వాకులు 2) ఆనంద గోత్రికులు
 3) శాలంకాయనులు 4) విష్ణుకుండినులు
16. 1915లో సంఘ సంస్కార నాటక మండలి స్థాపించి, హరిజనులతో నాటకాలు వేయించింది ఎవరు?
 1) నరాలశెట్టి దేవేంద్రుడు
 2) శేషాద్రి
 3) కృష్ణస్వామి
 4) భాగ్యరెడ్డి వర్మ
17. కాకతీయుల కాలంలో మంత్రులు, సేనాధిపతులు, రాజోద్యోగులందరూ ఏ వర్గానికి చెందినవారు?
 1) బ్రాహ్మణ 2) క్షత్రియ
 3) వైశ్యులు 4) శూద్రులు
18. శాతవాహన కాలంనాటి వర్తకులు?
 1) సార్థవాహులు 2) తిలపిష్టకులు
 3) సుగధికులు 4) సేధి
19. ఇక్ష్వాకుల కాలంలో తలవర అంటే?
 1) ఒక వృత్తి
 2) రాజు సమకూర్చుకున్న సైన్యం
 3) సేనాధిపతి, సామంతరాజు
 4) నాణెం
20. 'విజ్ఞాన చంద్రికా మండలి' స్థాపన?
 1) 1906 2) 1907
 3) 1908 4) 1908
21. జస్టిస్ పార్టీ మౌలికంగా?
 1) హరిజనుల పార్టీ
 2) బ్రాహ్మణ పక్షపాత పార్టీ
 3) బ్రాహ్మణ వ్యతిరేక పార్టీ
 4) ఉన్నత వర్గాల పార్టీ
22. హిందూ ధర్మ పరిషత్తు పేరిట 1925 ఏప్రిల్ 1న మత విషయక కాన్ఫరెన్స్ జరిగింది. ఈ సదస్సుకు అధ్యక్షత వహించింది ఎవరు?
 1) కర్తుకోటి శంకరాచార్యులు
 2) రాజా ప్రతాపగిర్జీ
 3) పండిట్ శేషాద్రి 4) భాగ్యరెడ్డి వర్మ
23. 'సూత్తనిపాతం' ఏ మతగ్రంథం?
 1) జైన 2) హిందూ
 3) బౌద్ధ 4) ఏదీకాదు
24. భట్టిప్రోలులో నివసించే ఏ జాతి బౌద్ధమతాన్ని స్వీకరించింది?
 1) నాగులు 2) పుళిందులు
 3) యక్షులు 4) ద్రావిడులు
25. భట్టిప్రోలు ప్రాచీన నామం ఏది?
 1) ప్రతిపాలపురం 2) బేతవోలు
 3) ఘంటశాల 4) శ్రీ పర్వతం
26. హేతువాది ప్రాధాన్యత ఇచ్చే వాదం?
 1) ప్రతీత్య సముత్పవాదం
 2) గతి తార్కిక భౌతికవాదం
 3) కార్యకరణ వాదం 4) కర్మసిద్ధాంతం
27. శుద్ధి ఉద్యమాన్ని చేపట్టింది?
 1) బ్రహ్మసమాజం 2) ఆర్యసమాజం
 3) దివ్యజ్ఞాన సమాజం
 4) పైవన్నీ
28. 1975లో విధించిన ఎమర్జెన్సీ వల్ల ఏ పార్టీ ఆవిర్భవించింది?
 1) భారతీయ లోక్‌దళ్
 2) జనతాపార్టీ
 3) భారతీయ జనతాపార్టీ 4) ఏదీకాదు
29. శాతవాహన కాలం నాటి నిగమాలంటే ?
 1) గ్రామాలు 2) నగరాలు
 3) పట్టణాలు 4) రెవెన్యూ మండలాలు
30. బైబిల్‌ను తెలుగులోకి అనువదించిన తొలి విదేశీయుడు?
 1) బ్రేక్ 2) జెవెక్ బాక్
 3) కెప్టెన్ ఓర్ 4) ఎడిసన్
31. చౌరీ- చౌరా సంఘటనతో ఆగిపోయిన ఉద్యమం?
 1) సహాయనిరాకరణ
 2) శాసనోల్లంఘన
 3) వందేమాతర ఉద్యమం
 4) క్విట్ ఇండియా ఉద్యమం
32. ఈ కింద పేర్కొన్న ఏ గ్రంథాల్లో వరంగల్ నగరాన్ని వర్ణించారు?
 1) రాజశేఖర చరిత్ర
 2) కళాపూర్ణోదయం
 3) క్రీడాభిరామం 4) నీలాంబరి
33. శాతవాహనానంతర యుగంలో భూములను పగ్గాలతో కొలిచి ఆయకట్టును నిర్ణయించే వారిని ఏమనేవారు?
 1) హస్తికోశ 2) సెట్టి
 3) అక్షపటలాధికృతుడు
 4) రజ్జుకుడు
34. 'గుడిసెలు కాలిపోతున్నాయి' రచన ద్వారా జాతీయ పురస్కారం పొందినవారు?
 1) బోయి భీమన్న
 2) సి. నారాయణ రెడ్డి
 3) కంభంపాటి రామశాస్త్రి
 4) గుడిపాటి వెంకటాచలం
35. హరిజన్ సేవక్ సంఘ్ ద్వారా రాజకీయ చైతన్యం తీసుకొచ్చినవారు?
 1) భాగ్యరెడ్డి వర్మ
 2) కోదాటి నారాయణరావు
 3) జమలాపురం కేశవరావు
 4) మందముల నరసింగరావు
36. శాతవాహనుల కాలంనాటి పన్నెండు బృంద నాట్య శిల్పాలు ఎక్కడ లభించాయి?
 1) అమరావతి 2) జగ్గయ్యపేట
 3) గుడిమల్లం 4) కార్లే గుహలు
37. నిజాం ఉల్‌ముల్క్ అసలు పేరు?
 1) ముబారిజ్ ఖాన్
 2) చిన్‌ఖిలిచ్ ఖాన్
 3) మీర్ ఖమీరుద్దీన్ ఖాన్
 4) బహదూర్ షా
38. పర్ణిక శ్రేణి, పూసిన శ్రేణులు ఎవరి కాలం నాటివి?
 1) శాతవాహనులు 2) విష్ణుకుండినులు
 3) ఇక్ష్వాకులు 4) తూర్పు చాళుక్యులు
39. బౌద్ధ శిల్పకళలో అంగాలెన్ని?
 1) 2 2) 3 3) 4 4) 5
40. కుతుబ్‌షాహీలు ఏ సాంఘిక దురాచారం రూపుమాపటానికి ప్రయత్నించారు?
 1) వేశ్యాలోలత
 2) సతీసహగమనం
 3) బాల్యవివాహాలు
 4) అంటరానితనం
41. బౌద్ధుల ప్రార్థన మందిరం?
 1) స్తూపం 2) ఛత్రం
 3) చైత్యం 4) విహారం
42. రాజనీతిని గురించి వివరించిన గ్రంథం?
 1) రాయవాచకం
 2) ఆముక్తమాల్యద
 3) సుమతీ శతకం
 4) రామాభ్యుదయం
43. ఎవరికాలంలో నాగార్జున కొండ సుప్రసిద్ధ విద్యాకేంద్రంగా వర్ధిల్లింది?
 1) శాలంకాయనులు
 2) ఆనంద గోత్రీకులు
 3) ఇక్ష్వాకులు
 4) విష్ణుకుండినులు
44. శాతవాహనుల కాలంలో ఇత్తడి పనిచేసే వారి శ్రేణి?
 1) కమర 2) వధికి
 3) సెలవధికి 4) కాసకార
45. చాందా రైల్వే ఆందోళన ఎవరి పరిపాలనా కాలంలో జరిగింది?
 1) ఉస్మాన్ అలీఖాన్
 2) మహబూబ్ అలీఖాన్
 3) నాసిరుద్దౌలా
 4) సికిందర్ జా
46. భారతదేశాన్ని తన రెండో మాతృభూమిగా పేర్కొన్న మహిళ?
 1) మేడం బ్లావట్ స్కీ 2) అనిబిసెంట్
 3) మదర్ థెరిస్సా 4) ఎవరూ కాదు
47. గోల్కొండ ఏ పరిశ్రమకు ప్రసిద్ధిగాంచింది?
 1) కలంకారి 2) నూలు వస్త్రాలు
 3) వజ్రాలు 4) ముత్యాలు
48. మహాపరినిర్యాణం అంటే ?
 1) బుద్ధుడి ధర్మప్రచారం
 2) బుద్ధుడి జననం
 3) బుద్ధుడి తపస్సు
 4) బుద్ధుడి మరణం
49. మొదటి కర్ణాటక యుద్ధం నాటి ఆర్కాటు నవాబు?
 1) ముజఫర్ జంగ్ 2) సలాబత్ జంగ్
 3) అన్వరుద్దీన్ 4) మహ్మద్ అలీ
50. బయ్యారం శాసనం ఎవరి చరిత్రను గురించి తెలుపుతుంది?
 1) కొండవీటి రెడ్లు 2) బాదామి చాళుక్యులు
 3) శాతవాహనులు 4) కాకతీయులు



సమాధానాలు

1) 2;	2) 4;	3) 3;	4) 3;
5) 4;	6) 4;	7) 3;	8) 4;
9) 1;	10) 1;	11) 1;	12) 1;
13) 1;	14) 4;	15) 4;	16) 4;
17) 2;	18) 1;	19) 3;	20) 1;
21) 3;	22) 2;	23) 3;	24) 1;
25) 1;	26) 3;	27) 2;	28) 2;
29) 3;	30) 2;	31) 1;	32) 3;
33) 4;	34) 1;	35) 2;	36) 4;
37) 3;	38) 3;	39) 3;	40) 2;
41) 3;	42) 2;	43) 3;	44) 4;
45) 2;	46) 2;	47) 3;	48) 4;
49) 3;	50) 4.		

They act just like human beings!

BANK EXAMS

GENERAL ENGLISH

Directions (Q. No. 1-10): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error if any, will be in one part of the sentence, mark the number of that part with error as your answer. Mark (5) as your answer, if there is 'No error'.

1. When we moved (1)/ we have to put (2)/ our furniture in storage (3)/ for a while. (4) No error (5)
2. She knows that (1)/ child (2)/ had been telling (3)/ stories again. (4) No error (5)
3. The only stipulation is (1)/ that the topic you choose (2)/ must be related (3)/ to yours studies. (4) No error (5)
4. We are learning to (1)/ step back from ourselves (2)/ and identity (3)/ our strengths and weaknesses. (4) No error (5)
5. Books provides (1)/ with ideas (2)/ and a stimulus (3)/ for play. (4) No error (5)
6. Children from (1)/ certain backgrounds tend for (2)/ stereotyped by (3)/ their teachers. (4) No error (5)
7. The team coach (1)/ forced to step into stop (2)/ the two athletes from (3)/ coming to blows. (4) No error (5)
8. She stationed (1)/ at the window (2)/ to wait for (3)/ his return. (4) No error (5)
9. The procession (1)/ made it's stately progress (2)/ through the streets (3)/ of the city. (4) No error (5)
10. The remains (1)/ of the building (2)/ stood as a stark remainders (3)/ of the fire. (4) No error (5)

Directions (Q. No. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. These _____ are intended to smooth the ___ to a peace treaty.
 1) negotiations; path
 2) talks; pavement
 3) arbitration; road
 4) dialogues; process
 5) confrontations; dispute
12. We tried to contact all ___ students, but one or two ____ the net.
 1) former; missed
 2) passed; forgotten
 3) failed; overlooked
 4) previous; forgot
 5) former; skip
13. The findings of the report _____ slanted in favour of the manufacturers.
 1) are been 2) were been
 3) had been 4) has been
 5) is been
14. The rise in _____ is a clear _____ that the government's policies are not working.
 1) popularity; signature
 2) population; progress
 3) prices; signal
 4) people; symptom
 5) places; pause
15. Chest pains can be a _____ of heart problems.
 1) recurring tension
 2) warning signal
 3) mounting pressure
 4) indicator 5) pulsation

Directions (Q. No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A. As with people some monkeys are lazy, like those who sleep all day in the zoo, and some are industrious, like the little fellows who collect pennies for the organ-grinder.
B. If you invite them to dinner, they can sit quite comfortably in real chairs and use a knife and fork exactly as you.
C. As a matter of fact, Monkeys are like people, when certain kinds of monkeys are domesticated, they act just like human beings.
D. They smoke cigars, drink beer and look almost human when dressed.
E. Sometimes he even leads them in singing, first howling some weird notes, then signaling his companions to join in the chorus.
F. In speaking of monkeys which act like human beings, mention should be made of the Brazilian monkey which often balances himself on the top of a tree and makes a speech to the monkeys below him.

16. What is the LAST sentence after rearrangement?
 1) A 2) B 3) C 4) E 5) D
17. What is the THIRD sentence after rearrangement?
 1) A 2) B 3) D 4) F 5) E
18. What is the FIFTH sentence after rearrangement?
 1) A 2) C 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
 1) B 2) A 3) C 4) D 5) E
20. What is the FOURTH sentence after rearrangement?
 1) A 2) B 3) C 4) E 5) F

Directions (Q. No. 21 - 25): Which of the phrases (1), (2), (3) and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error, mark (5) No correction required as your answer.

21. When I arrived, I have the sensation that she had been expecting me.
 1) has 2) will have
 3) will be having 4) had
 5) No correction required
22. We are concrete seeking new ways of expanding our membership.
 1) evidently 2) firstly
 3) vastly 4) currently
 5) No correction required
23. You will perhaps discover, that practice does help, that success does come with effort and determination and a positive mind-set.
 1) has come 2) will come
 3) would come 4) will be coming
 5) No correction required
24. The brightest persons in a class are not always the good students.
 1) comparable2) winner
 3) best 4) active
 5) No correction required
25. I hired a cleaning lady who comes in twice a month and is now in disposable.
 1) indisposable 2) indisputable
 3) indispensable 4) incorrigible
 5) No correction required

Directions (Q. No. 26-30): Read the following passage and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

Delivering mail to small villages in India was once a difficult, **perilous** and exciting job. The postman traveled on foot, often wading through swamps or crawling through jungles in order to reach the many villages on his route.

The Indian mailman might sometimes encounter a fierce tiger or panther along the way, yet the only weapon he carried was a sharp spear. He never went to work without his bells, which he would shake in order to **ward off** evil spirits. Wild animals or evil spirits, nothing ever interrupted his work.

The Indian letter carrier was an honoured and respected person; he was treated with great courtesy. So wise he thought to be that he was frequently called upon to solve the village disputes.

It is certainly evident that only a very brave man would take a job that **compelled** him to fight off wild animals in order to get his work done. You can understand why everyone in India looked upon the man who delivered mail as a true national hero.

26. Which statement is true?
 a. Mailmen in India were considered heroes.
 b. Some people in India used to believe in evil spirits.
 1) Only a 2) Only b
 3) Both a and b
 4) Neither a nor b
 5) Either a or b
27. Which statement is false?
 a. The letter carrier was often asked to settle disputes in the villages that he visited.
 b. An Indian mailman used to carry modern weapons as protection against wild animals.
 1) Only a 2) Only b
 3) Both a and b 4) Neither a nor b
 5) Either a or b
28. The synonym of **ward off** is
 1) Encourage 2) Protest
 3) Keep 4) Deflect
 5) Depend
29. The antonym of **perilous**
 1) Hazardous 2) Bounty
 3) Terrifying 4) Harmless
 5) Detrimental
30. The antonym of **compelled**
 1) Obliged 2) Constrained
 3) Bound 4) Chained
 5) Liberated

Directions (Q. No. 31-40): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

A professor at an eastern college _____ (31) that the special sense the visually challenged people _____ (32) on is connected in some way with ___ (33) hearing. The professor _____ (34) described 1500 tests in which blind people and people with normal sight, but blindfolded, _____ (35) to avoid walking into walls. The visually challenged passed the tests with greater ____ (36) than those who could see. The blind would _____ (37) forward confidently, sensing the wall when they were as much as fifteen feet _____ (38) it. They claimed that their ears sent them a warning _____ (39) that the wall was near. This seems quite possible, for when their ears were covered so that they could not hear, they often ran right _____ (40) the wall. You can imagine how valuable this strange power must be to the blind. Do you think that it is nature's way of making up to them for their lost sight?

31. 1) believes 2) deem
 3) judge 4) accept 5) doubt
32. 1) grasp 2) depend
 3) relay 4) reel 5) realize
33. 1) there 2) they
 3) their 4) them 5) that
34. 1) lately 2) newly 3) just
 4) recently 5) freshly
35. 1) attempt 2) attempting
 3) attempts4) will attempt
 5) attempted
36. 1) ease 2) difficulty
 3) effort 4) relieve
 5) alleviate
37. 1) stepping 2) stride
 3) tramp 4) tumble
 5) amble
38. 1) through 2) thorough
 3) from 4) away 5) apart
39. 1) memo 2) letter
 3) meaning4) message5) point
40. 1) inside 2) outside
 3) inwards 4) in 5) into

Directions (Q. No. 41-42): choose the wrongly spelt word from the five options given.

41. 1) Cemetery 2) Scenary
 3) Scenario 4) Composure
 5) Predicament
42. 1) Stationery 2) Stationary
 3) Impeccabal4) Juggernaut
 5) Delicious

Directions (Q. No. 43-45): In each of the following four sets of words a set is either synonymous or antonymous, identify that set and mark your answer.

43. 1) Luscious; Sacrilege
 2) Prophecy; Luxurious
 3) Somersault; Impediment
 4) Obnoxious; Abhorrent
 5) None of these
44. 1) Atrocious; Oblige
 2) Entourage; Tourist
 3) Ensemble; Entangle
 4) Pilfer; Embezzle
 5) None of these
45. 1) Ensconce; Shelve
 2) Acrimonious; Corrigible
 3) Sanctimonious; Succulent
 4) Corrigendum; Adjudicate
 5) None of these

Answers

1) 2;	2) 1;	3) 4;	4) 3;
5) 1;	6) 2;	7) 2;	8) 3;
9) 2;	10) 3;	11) 4;	12) 1;
13) 3;	14) 3;	15) 2;	16) 4;
17) 2;	18) 5;	19) 3;	20) 1;
21) 4;	22) 4;	23) 5;	24) 3;
25) 3;	26) 3;	27) 2;	28) 4;
29) 4;	30) 5;	31) 1;	32) 2;
33) 3;	34) 4;	35) 5;	36) 1;
37) 2;	38) 3;	39) 4;	40) 5;
41) 2;	42) 3;	43) 4;	44) 4;
45) 1.			

Find the point on the X-axis which is equidistance from

TRIANGLES

1. **In the given figure, altitudes AD, CE of ΔABC intersect each other at the point P. Show that i) Δ AEP ~ ΔCDP**
   ii) Δ ABD ~ Δ CBE
   iii) Δ AEP ~ Δ ABD
   iv) Δ PDC ~ Δ BEC



Sol: Given AD, CE are altitudes of ΔABC intersected at P

i) In ΔAEP, ΔCDP
$\angle AEP = \angle CDP = 90°$
$\angle APE = \angle CPD$
(∵ Vertically opposite angles are equal)
By AA similarity criterion Δ AEP ~ ΔCDP

ii) In Δ ABD, ΔCBE
$\angle ABD = \angle CEB = 90°$
$\angle ADB = \angle CBE$ (common angle)
By AA similarity criterion Δ ABD ~ Δ CBE

iii) in Δ AEP, Δ ABD
$\angle PAE = \angle DAB$ (∵ Common angle)
$\angle AEP = \angle ADB = 90°$
∴ By AA similarity criterion
ΔAEP ~ Δ ABD

iv) In Δ PDC, Δ BEC
$\angle PCD = \angle ECB$ (common angle)
$\angle CDP = \angle CEB = 90°$
By AA similarity criterion
Δ PDC ~ Δ BEC

2. **Sides AB and BC and median AD of a triangle ABC are respectively proportional to sides PQ and QR and median PM of another triangle PQR. Show that Δ ABC ~ Δ PQR**

Sol:



Given $\frac{AB}{PQ} = \frac{BC}{QR} = \frac{AD}{PM}$

Δ ABC, Δ PQR, where AD, PM are medians
In Δ ABD, Δ PQM

$$\frac{AB}{PQ} = \frac{BC}{QR} = \frac{AD}{PM}$$

$$\frac{AB}{PQ} = \frac{\frac{1}{2}BC}{\frac{1}{2}QR} = \frac{AD}{PM}$$

$$\frac{AB}{PQ} = \frac{BD}{QM} = \frac{AD}{PM}$$

$$(\because \frac{1}{2}BC = BD, \frac{1}{2}QR = QM)$$

By SSS - similarity criterion
Δ ABD ~ PQM
Since Δ ABD ΔPQM
$\angle B = \angle Q$
(∵If tow triangles are similar their corresponding angles are equal)
Now In Δ ABC, ΔPQR

$$\frac{AB}{PQ} = \frac{BC}{QR} \text{ and } \angle B = \angle Q$$

By SAS - similarity criterion
ΔABC ~ ΔPQR

3. **A Man sees the top of a tower in a mirror which is at a distance of 87.6 m from the tower. The mirror is on the ground facing upwards. The man is 0.4m away from the mirror and his height is 1.5m. How tall is the tower?**

Sol:



In ΔABC, ΔCDE
$\angle ABC = \angle CDE = 90°$
$\angle ACB = \angle ECD = 90°$
(∵ angle of incidence and reflection is equal)
ΔABC ~ ΔEDC (∵ AA similarity)

$$\therefore \frac{AB}{ED} = \frac{BC}{CD} \Rightarrow \frac{1.5}{h} = \frac{0.4}{87.6}$$

$$h = \frac{1.5 \times 87.6}{0.4} = 328.5 \text{ meters}$$

Hence the height of the tower h = 328.5 m

4. **A girl of height 90 cm is walking away from the base of a lamp- post at a speed of 1.2m/s. If the lamp is 3.6 m above the ground, find the length of her shadow after 4 seconds.**

Sol: Let AB denote lamp post and CD the girl after walking for 4 seconds away from the lamp post.



DE is the shadow of the girl
Let DE = x meter
BD = 1.2 x 4 = 4.8m
In ΔABE, ΔCDE
∴ $\angle B = \angle D$ (Each is 90°)
$\angle E = \angle E$ (same angle)
∴ ΔABE ~ ΔCDE (AA similarity criterion)

$$\therefore \frac{BE}{DE} = \frac{AB}{CD}$$

$$\frac{4.8 + x}{x} = \frac{3.6}{0.9}\left(90cm = \frac{90}{100} = 0.9\,m\right)$$

$4.8 + x = 4x$
$3x = 4.8$

$$x = \frac{4.8}{3} = 1.6$$

∴ The shadow of the girl = 1.6 meters

COORDINATE GEOMETRY

Distance between two points

- The distance between two points $P(x_1, y_1)$, < $Q(x_2, y_2)$ is $\sqrt{(x_2 - x_1)^2 + (y_2 - y_1)^2}$
- The distance of a point P(x, y) from the origin is $\sqrt{x^2 + y^2}$
- The distance between any two points $A(x_1, 0)$, $B(x_2, 0)$ on the X-axis is $|x_2 - x_1|$
- The distance between any two points $A(0, y_1)$, $B(0, y_2)$ on the Y-axis is $|y_2 - y_1|$
- If $A(x_1, y_1)$; $B(x_2, y_2)$, $C(x_3, y_3)$ are vertices of a triangle ABC; AB, BC, CA are the sides of the triangle then
  i) Equilateral triangle if AB = BC = CA
  ii) Isosceles triangle if AB = BC or BC = CA or CA = AB
  iii) Scalene triangle if AB ≠ BC ≠ CA
  iv) Right angled triangle if
  $AB^2 + BC^2 = CA^2$ (or)
  $BC^2 + CA^2 = AB^2$ (or)
  $CA^2 + AB^2 = BC^2$
  v) Isosceles right angled if it is isosceles as well as right angled.
- Three points $A(x_1, y_1)$; $B(x_2, y_2)$; $C(x_3, y_3)$ are collinear if AB + BC = CA or BC + CA = AB or CA + AB = BC
- Given four points $A(x_1, y_1)$; $B(x_2, y_2)$; $C(x_3, y_3)$, $D(x_4, y_4)$
  i) Are the vertices of a rhombus if all the four sides are equal, diagonals are not equal. i.e. AB = BC = CD = DA, AC ≠ BD
  ii) Are the vertices of a square if AB = BC = CD = DA, AC = BD
  iii) Are the vertices of a parallelogram if AB = CD, BC = AD, AC ≠ BD
  iv) Are the vertices of a rectangle if AB = CD, BC = AD, AC = BD

SECTION FORMULA

The coordinates of the point P(x, y) which divides the line segment joining the points $A(x_1, y_1)$ and $B(x_2, y_2)$ internally in the ratio $m_1 : m_2$ are:

$$\left(\frac{m_1 x_2 + m_2 x_1}{m_1 + m_2}, \frac{m_1 y_2 + m_2 y_1}{m_1 + m_2}\right)$$

- This is known as the section formula.
- If the ratio in which P divides AB is k : 1 then the coordinates of the point P are

$$\left(\frac{kx_2 + x_1}{k+1}, \frac{ky_2 + y_1}{k+1}\right)$$

Continued on next page..

- The coordinates of mid point P of the line segment joining the points A(x_1, y_1) and B (x_2, y_2) are: $\left(\frac{x_1+x_2}{2}, \frac{y_1+y_2}{2}\right)$
- The coordinates of centroid of triangle ABC with vertices A(x_1, y_1), B(x_2, y_2) and C(x_3, y_3) are $\left(\frac{x_1+x_2+x_3}{3}, \frac{y_1+y_2+y_3}{3}\right)$
- The point of concurrence of medians of a triangle is called its centroid.
- Centroid divides each median in the ratio 2 : 1.
- The points which divide a line segment into 3 equal parts are said to be the trisectional points.
- If P and Q be the points of trisection of AB line segment then AP = PQ = QB.



- If P, Q are the points of trisection of AB line segment, then P divides AB in the ratio 1:2 and Q divides AB in the ratio 2:1.

2 MARKS QUESTIONS

1. **Write the formula to find the distance between two points. using this formula find the distance between (2, 3), (4, 1)**

Sol: Distance between two points A(x_1, y_1); B(x_2, y_2) is

$$AB = \sqrt{(x_2-x_1)^2+(y_2-y_1)^2}$$

Given A = (2, 3); B = (4, 1)

$$AB = \sqrt{(4-2)^2+(1-3)^2}$$

$$\sqrt{4+4} = \sqrt{8} = 2\sqrt{2} \text{ units}$$

2. **Where do these following points lie (0, −4), (0, −2), (0, 7), (0, 5)**

Sol. The X- Co ordinates of (0, −4), (0, −2), (0, 7), (0, 5) are zero

∴ Given points are lie on the Y-axis

(∵ In the Y-axis X-coordinate is zero)

3. **Find the distance between the points (a sinα, − b cosα); (−a cosα, bsinα)**

Sol: Given points

A(x_1, y_1) = (a sinα, −b cosα)

B(x_2, y_2) = (−a cosα, b sinα)

Distance between AB =

$$\sqrt{(-a\cos\alpha - a\sin\alpha)^2 + (b\sin\alpha-(-b\cos\alpha))^2}$$

$$= \sqrt{a^2(\sin\alpha+\cos\alpha)^2+b^2(\sin\alpha+\cos\alpha)^2}$$

$$= \sqrt{(a^2+b^2)(\sin\alpha+\cos\alpha)^2}$$

$$= \sqrt{a^2+b^2}.(\sin\alpha+\cos\alpha)$$

4. **Find the point on the X-axis which is equidistance from (2, −5), (−2, 9)**

Sol: We know that a point on the X-axis is of the form $(x, 0)$. So let the point P$(x, 0)$ be equidistant from A(2, −5), B(−2, 9)

Given that PA= PB

$$\Rightarrow \sqrt{(x-2)^2+(0-(-5))^2} = \sqrt{((x-(-2))^2+(0-9)^2}$$

Squaring on both sides

$\Rightarrow (x-2)^2+5^2 = (x+2)^2+(-9)^2$

$\Rightarrow x^2 - 4x + 4 + 25 = x^2 + 4x + 4 + 81$

$\Rightarrow -4x + 29 - 4x - 85 = 0$

$\Rightarrow -8x - 56 = 0 \Rightarrow 8x = -56$

$\Rightarrow x = \frac{-56}{8} = -7$

So, the required point is $(x, 0) = (-7, 0)$

5. **Find the coordinates of the point which divides the join of (–1,7), (4,–3) in the ratio 2 : 3.**

Sol: Given points (–1, 7), (4, –3)

given ratio 2 : 3 = $m_1 : m_2$

Let P(x, y) be the required point

Using the section formula

$$P(x, y) = \left(\frac{m_1x_2+m_2x_1}{m_1+m_2}, \frac{m_1y_2+m_2y_1}{m_1+m_2}\right)$$

$$\Rightarrow \left(\frac{2(4)+3(-1)}{2+3}, \frac{2(-3)+3(7)}{2+3}\right)$$

$$\Rightarrow \left(\frac{8-3}{5}, \frac{-6+21}{5}\right) \Rightarrow \left(\frac{5}{5}, \frac{15}{5}\right) \Rightarrow (1,3)$$

6. **The points (2, 3), (x, y), (3, –2) are vertices of a triangle. If the centroid of the triangle is origin, then find (x, y).**

Sol: Centroid of (x_1, y_1), (x_2, y_2) and (x_3, y_3) =

$$\left(\frac{x_1+x_2+x_3}{3}, \frac{y_1+y_2+y_3}{3}\right)$$

Given that centroid of (2, 3), (x, y), (3, –2) is (0, 0)

i.e. $(0,0) = \left(\frac{2+x+3}{3}, \frac{3+y-2}{3}\right)$

$(0,0) = \left(\frac{5+x}{3}, \frac{y+1}{3}\right) \Rightarrow \frac{5+x}{3} = 0 \Rightarrow x = -5$

$\frac{y+1}{3} = 0 \Rightarrow y = -1$

∴ $(x, y) = (-5, -1)$

7. **The coordinates of one end point of a diameter of a circle are (4, –1) and the coordinates of the centre of the circle are (1, –3). Find the other end point.**

Sol: Let AB be a diameter of the circle having its centre at C (1,–3) such that the coordinates of one end A are (4, –1)

Let the coordinates of other end be B (x, y) since C is the mid point of AB.

∵ The coordinates of C are $\left(\frac{x+4}{2}, \frac{y-1}{2}\right)$

But, the coordinates of C are given to be (1, –3)

$\therefore \left(\frac{x+4}{2}, \frac{y-1}{2}\right) = (1,-3) \Rightarrow \frac{x+4}{2} = 1$

$\Rightarrow \frac{x+4}{2} = 1 \Rightarrow x+4 = 2 \Rightarrow x = -2$

$\Rightarrow \frac{y-1}{2} = -3 \Rightarrow y = -5$

∴ Other end point of diameter is $(-2, -5)$

8 MARKS QUESTIONS

1. **Check whether (5, -2), (6, 4), and (7, –2) are the vertices of an isosceles triangle**

Sol: Let the given points A(5, –2) B(6, 4), C(7, –2)

Distance between two points (x_1, y_1); (x_2, y_2) is $\sqrt{(x_2-x_1)^2+(y_2-y_1)^2}$

A(5, –2): B(6, 4)

$AB = \sqrt{(6-5)^2+(4+2)^2} = \sqrt{1+36} = \sqrt{37}$

B(6, 4), C(7, –2)

$BC = \sqrt{(7-6)^2+(-2-4)^2} = \sqrt{1+36} = \sqrt{37}$

C(7, –2), A(5, –2)

$CA = \sqrt{(5-7)^2+(-2+2)^2} = \sqrt{4+0} = 2$

Two sides are equal (AB = BC)

∴ Given vertices form an Isoscales triangle

2. **Find the values of y for which the distance between the points P(2, −3), Q(10, y) is 10 units**

Sol: Given points P(2, −3), Q(10, y)

Given that PQ = 10 units

i.e. $\sqrt{(10-2)^2+((y-(-3))^2} = 10$

$8^2+(y+3)^2 = 10^2 \Rightarrow (y+3)^2 = 100 - 64$

$(y+3)^2 = 36 \Rightarrow y + 3 = \sqrt{36}$

$y+3 = \pm 6 \Rightarrow y = \pm 6 - 3$

∴ $y = 6 - 3$; $y = -6 - 3$ $\quad$ $y = 3$, or -9

Hence, the required values of y are 3 or – 9

3. **Find a relation between x, y such that the point (x, y) is equidistant from the points (−2, 8), (−3, −5)**

Sol: Let P(x, y) be equidistant from the points A (−2, 8), B (−3, −5)

Given that AP = BP, $AP^2 = BP^2$

i.e. $(x-(-2))^2 + (y-8)^2 =$

$(x-(-3))^2+ (y-(-5))^2$

$\Rightarrow (x+2)^2 + (y-8)^2 = (x+3)^2 + (y+5)^2$

$\Rightarrow x^2 + 4x + 4 + y^2 - 16y + 64 =$

$x^2 + 6x + 9 + y^2 + 10y + 25$

$\Rightarrow 4x - 16y + 68 = 6x + 10y + 34$

$\Rightarrow 4x - 16y + 68 - 6x - 10y - 34 = 0$

$\Rightarrow -2x - 26y + 34 = 0$

$x + 13y - 17 = 0$ which is the required relation

4. **Verify that the points (1, 5), (2, 3), (−2, −1) are collinear or not.**

Sol: Given points

let A (1, 5), B (2, 3), C (−2, −1)

$$AB = \sqrt{(2-1)^2+(3-5)^2} = \sqrt{1+4} = \sqrt{5}$$

$$BC = \sqrt{(-2-2)^2+(-1-3)^2} = \sqrt{16+16}$$

$$= \sqrt{32} = 4\sqrt{2}$$

$$CA = \sqrt{((1-(-2))^2+(-1-5)^2} \Rightarrow \sqrt{9+36}$$

$$= \sqrt{45} \Rightarrow \sqrt{9\times5} \Rightarrow 3\sqrt{5}$$

We observe that AB + BC ≠ CA

∴ Given points are not collinear

5. **Check whether (5, −2); (6, 4), (7, −2) are the vertices of an isosceles triangle.**

Sol: Let the points are A(5, −2), B(6, 4), C(7, −2)

$$AB = \sqrt{(6-5)^2+(4-(-2))^2} = \sqrt{1+36} = \sqrt{37}$$

$$BC = \sqrt{(7-6)^2+(-2-4)^2} = \sqrt{1+36} = \sqrt{37}$$

$$CA = \sqrt{(7-5)^2+(-2-(-2))^2} = \sqrt{4+0} = 2$$

Since AB = BC, Given vertices form an isosceles triangle

Y. Vanamraj
Subject Expert
Kurnool

Daily Quiz

సమాధానాలు రాయడానికి ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

1. **The first jute mill was set up near ___ at Rishra.**
   A) Delhi - 1789
   B) Kolkata - 1855
   C) Chennai - 1872
   D) Mumbai - 1894

2. **India stands in __ place in sugar production:**
   A) Second B) First
   C) Third D) Fourth

3. **India occupies the ____ place in the production of gur and khandsari.**
   A) Second
   B) First
   C) Third
   D) Fourth

4. **___ is required to harden the steel.**
   A) Manganese B) Limestone
   C) Silica D) Coal

5. **___ has emerged as the electronic capital of India.**
   A) Ahmadabad B) Bengaluru
   C) Chennai
   D) Delhi